

చెన్నపట్టణము, ఫిబ్రవరి ౧౯౩౦

సంపుటము ౭ | శుక్ల సంవత్సరము మాఘమాసము | సంఖ్య ౨

ఏకోపాసన

వేలూరి శివరామ శాస్త్రిగారు

౧

దేవుఁ డొక్కఁడె యెందుకీ దేవులాట - మతము లొక్కటె యెందుకీ మదము మనకు
ఉన్న మతముల నన్నియు నొకటిఁ జేసి - ఒక్కదేవుని గొలుతమం చూహఁ జేసి.

ఉపనిషత్తులను దా నొక్క యార్యుఁడు తెల్లపాల రాళ్లుగఁ జేసి పట్టి తెచ్చె
జెందవెస్తాఁ బారసీకుఁ డొక్కఁడు కాంతిమద్రత్నసమితిగా మార్చి తెచ్చె
అల ఖురానును దురుష్కాచార్యుఁ డమల మాణిక్యంబులుగను బొందించి తెచ్చె
బైబిలు నొక క్రైస్తవప్రముఖుండు తాఁ బచ్చరాలుగఁ బొందుపఱిచి తెచ్చె
తక్కుఁగల దేశములవారు తమదుతమదు - గ్రంథముల నెల్లఁ గెంపులు గాఁగ వజ్ర
ములుగ రవ్వలు గాఁగను మోచి తెచ్చె - గుట్టఁ బోయంగ నవి యొక్క కొండ యాయె.

నానారూపసమేతుఁడుగ మఱియు నానానామధాముండు తా
నైనన్ నామము లేక రూపమును లే కాయేకదైవం బొగిన్

నానా రత్నశిలాకలాపమగు నానవ్యాదలంబందు నా
సీనుం డాయెను సర్వమానవ మన స్సిద్ధాంత యోగ్యంబుగన్.

ధారుణియందుఁ గల్గిన మతంబులలోపలి సారమైన యా
చారము లెల్ల నేకమగు చాలునఁ బోఁతను బోసి యమ్మహో
దార ధరాధరేంద్రవలయం బయి యుండెడు భాతి రాతిర
స్తా రచియించి కొండకుఁ బ్రదక్షిణముం బొనరించి రెల్లరున్.

ఈశ్వరారాధనముగూడ నేకరీతి-వలయు నంచును నెల్లరు వాంఛఁ బొంది
'ఎగురు నీశ్వరు ధ్యానించు టింతనుండి-ఒప్పు' నంచును యోచించి రప్పు డెదల.

అందఱుగూడ నప్పగిది ధ్యానము నొప్పిరి కాని యింక నా
చందము నొప్పకున్న జనసంతతి యున్నెడ వారిగంతులుం
జిందులుఁ జూచి క్రోఁతులని చెప్పనొ యొప్పని దిప్పకాయలం
చుం దలపోయునో మఱియుఁ జోద్యపు దయ్యములంచు నెంచునో.

ఆపటినుండియు మొదలుగ-నాపరమేశ్వరుని నేకమగు గతిఁ గొలువం
బ్రాపనుచు నెల్ల ప్రజ యీ-లోపుగ లేకుండ నొక్క-లోపం బేసిన్.

ఒక్క-రూపముతోడ నుండఁగా నెదఁ గోరి సిగలు లేకుండఁగాఁ జేసికొనిరి
పలుకు లాడఁగ నొక్క- బాస లేకుంటచే మాట లాడుటె ముందు మానుకొనిరి
ఒక్క-వేసముతోడ నొప్పారి యుండఁగా వలువలు దాల్చుటే వదలుకొనిరి
మతవిరోధము దెల్పు మచ్చ లటంచును దిలకంబు దిద్దుట తీసివైచి
రిట్టి రూపంబు వ్యవహార మిట్టి వేస-మిట్టి మోములతోడుత నెల్లవారు
గంతులను వైచుచును భగవంతుఁ గొలువఁ-జెల్లరే కొండచుట్టు సంసిద్ధులైరి.

౨

అలవారల తొందర పా-టులు గమనింపంగఁ బో కెటులు వచ్చునో యు
ట్టులె యిం రేపును వచ్చెను;-జెలఁగునె కాలంబు జనులు చెప్పిన త్రోవన్.

అల్లి గట్టు చుట్టు నత్యంతమును వింత-వింతలైన జనులు విడిసినారు
అందు నోరు గల్గినట్టివాఁ డొక్కండు-బిట్టు లేచి నిల్చి యిట్టు లనియె.

మన మీనాఁట న్నిజముగ-జనులారా! మతము లెల్ల సమములె యంచుఁ
గనినాము కాన నీకొం-డను నూరేఁగింత మట్టి నడత ధ్రువపడఁ.

తమదు తమదైన బాసలఁ దమదు తమదు-ప్రజల కెల్లరకును బోధపడెడునటులు
అనువదించిరి కొంద ఱీయర్థములను-విశ్వమాతయు నీ మాట వినియె నంత.

అందుండి యొక్క ముదుసలి-ముందరి కేతెంచి—అయ్యో! మొదటికె మోసం
బిందామెఁ 'బలుకవల'దను-చుం దమరే పలుకు వారె? చోద్యము కాదే?

అది యటు లుండుత మీఁగ-ట్టదిరా యీప్రజలచేత నటు లేచినను
జదికిలఁబడదా? పడుచోఁ-బదములు తలలెల్ల నూఱు పఱియలు గావా?

ఆతఁ డిట్లు వల్క నందఱు ప్రజలును-అగునునగు నటంచు నాడి యాడి
చదువు వాని కన్నఁ జాకలియే యెక్కు-డన్నమాట వితగఁ జన్నె? యనిరి.

అంతం గ్రీస్తు మతావలంబి యగు నొ క్కాచార్యుఁ డల్లంతఁ దల్
ప్రాంతంబందున లేచి నిల్చి కనుఁడీ బల్ పచ్చరాకూటమే
యెంతో గొప్పది దీనిఁ దేలికగ నూరేఁగింపఁగా వచ్చు నం
చంతశ్వానములకేసి చూచుచు నుపన్యాసంబు చేసెఁ వడిఁ.

అంత మహమ్మదీయుఁ డొకఁ డాతురుఁడౌచును లేచి—ఓరి నీ
వంతట నోరు మూసికొను మంచు ఛెళేలున చెంపకాయ గ
ల్లింతయుఁ గొట్టె; నాతఁడును లీలగ రెండవ చెంపఁ జూపె; రెం
డింతల కిన్కతో మలక—యేమిర నీకిది చాలకున్నదే?

మా మహమ్మదుగా రన్యమార్గులైన-కాఫరులఁ గత్తితోడను గలుపు మనిరి
సరవి నింకను రాల్ రువ్వి చంపు మనిరి-అని శిలావర్షమును గురియంగఁ దొడఁగె.

మతమన నేమియో యెఱుకమాలిన మానిసి యొక్కఁ డేపుమై
నతని సమీప మేఁగి యగురా మతమన్నను ప్రాణ మార్పుటా?
గతమగు ప్రాణ మిచ్చు నదిగా కది. గాకయ మీఖురాను నే
కతముగ నట్లు చెప్పె మను కాంతము దాని నిజానిజంబులన్.

అని యతఁ డన్నయంత జనమంతయు నౌ నవు నౌ నటంచు వా
కొనిరి మహమ్మదీయుఁడును గొంకి నలా మొనరించి యో ఖురా
న! నిజము వల్కుమం చనియె నాపుడు నల్ల ఖురాను వాయి పో
యినగతి మాటలాడ దెటు నెందును బొత్తము మాటలాడదనే?

అందఱును నవ్వి రంత నత్యంతముగను-మలక యలుకను జెందుచు మా ఖురాను
వేఱు; మేమును వే అంచు విశ్వ మద్రువ-అఱచె నందఱు నట్టులె యఱచి రంత.

పరిశిష్టములఁ ద్రోసి పాలరాలను దీసి యూనిక మోసికొం చొకరు చనిరి
తమ రత్నములఁ బ్రయత్నముతోడఁ బై కూడఁ దీసికొం చొక్కరు పాసి చనిరి
మాటలాడని తమ మాణిక్యముల నేకముగఁ జేసి యొకరు నేర్పగను జనిరి
కొట్టినంగూడను గోపగింపని పచ్చరా లెత్తుకొని యొక్క రోలిఁ జనిరి
మిగులు వారలు మందన్న మిత్తి యగునె?-మత మనంగను మద మానె? మన కిదేల?
మనకు నా దేవ దేవుఁడే మతము గాక-పిచ్చి మతము లి వేల యం చెచ్చి చనిరి.

ఆయుత్తర నిమిషంబున-నాయెడ నాకొండ లేద యాప్రజయును లే
దేయెడ నుండెడు వారలు-నాయెడకే పోయి రొక్క యావేశముతోఁ.

బసవపురాణము వెల రు. ౨-౫-౦

గ్రంథకర్త:—పాల్కురికి సోమనాథకవి పరిష్కర్త:—వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

పండ్రెండవశతాబ్దమున వెలసిన శైవమత ప్రతిపాదకమగు ద్విపదకావ్యము. ఇందు శైలి మతోద్ధారకు డగు బసవేశ్వరునియు; తత్పూర్వులు, తత్సమకాలీనులు నగు శివభక్తులయు చరిత్రములను సరసముగను, పాఠకులు మనసుకరగి తన్మయులగునట్లుగను కవి వర్ణించినాడు. గ్రంథమున మృదుమధురము లగు జానుదెనుగు పలుకుల జాలువార్చి రచనమున ముద్దులు గురిపించినాడు. గ్రంథము భిన్నభిన్న రాష్ట్రములకు జెందిన పెక్కు తాళపత్రమాతృకలతో సరిచూచి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పు.) యిందుగలదు. ఆకాలపు టపూర్వసారస్వతచారిత్ర కవిశేష ముల లెక్కకు మిక్కిలిగ నందు పరిష్కర్త యేర్చికూర్చినారు. ఆధునిక కవికుమారుల కిది యత్యంతోపకారకము. విలాసము:— ఆంధ్ర గ్రంథమాల, 7, తంబుశెట్టివీథి, మద్రాసు.

ధర్మనిరతుడు కార్లయిలు

ప్రొ. తణికెళ్ల వీరభద్రుడుగారు, యం.ఏ., యల్. టి.

కార్లయిలు క్రీ. శ. ౧౯ వ శతాబ్దమున నాంగ్లదేశమున జన్మించిన మహాపురుషుడు. ఇంగ్లాండులో విక్టోరియా మహారాణి రాజ్యపాలన మొనరించుచుండిన కాలమున తన బుద్ధిచేతను, యథార్థపరత్వముచేతను పండితులను, తత్త్వజ్ఞానులను కార్లయిలు పరిపాలించెనని చెప్పవచ్చును. ఇతడు రాజకీయ రంగమున వేషము ధరింపకపోయినను దేశభక్తులలో నుత్తముడని చెప్పుటకు లేశమయినను సందియము లేదు. కావ్యములు వ్రాయకపోయినను కవివరుడను బిరుదమున కర్హుడని చెప్పుటకు సంశయ ముండకూడదు. ఈతనిచే వ్రాయబడినవి వచనగ్రంథములే కాని, యవి సామాన్య వచనవ్యాసములు కాక యుత్సాహపూరితము లగుటచే గద్యకావ్యములలో వన్నెకెక్కినవి. శైలి గ్రంథకారుని స్వభావమును సూచించునను విద్వద్వాక్యమున కీతని పుస్తకములు తార్కాణములు. పెక్కులగు నీతని గ్రంథములలో మహాపురుషుల జీవితములును, దేశచరిత్రలును, కవీశ్వరుల యున్నతాభిప్రాయములును జర్చింపబడినవి. వీర శిఖామణుల జీవితములు వర్ణించినను, కవిపుంగవుని కావ్యరసము వర్ణించినను, కార్లయిలు గొప్పవిమర్శకుడని చదువరికి దోచకతప్పదు. ఏ గ్రంథమందయినను సత్యప్రియత్వమును, పరతత్త్వాభిలాషయును వెల్లడింపబడుచుండును. ఈత డెన్ని గ్రంథములు వ్రాసినను, ఉపన్యాసము లిచ్చినను, వాని సారాంశ మొక్కటియే యని మనము చెప్పగలము. ఏపురుషుని జీవితమం దున్నతాశయము కలదో యాతనిజీవితము ధన్యమైనది. వేషధారణమే ముఖ్యముగా నెంచికొనిన జీవితములు వ్యర్థములు. ప్రతిపురుషుడును లోకతత్త్వమును బోధపఱచుకొనుటకు యత్నింపవలెను. దానినిగూర్చి నిరంతరమును ధ్యానింపవలెను. జీవితసారమును గ్రోలి తనమిత్రులకు యథార్థ ప్రతిబింబమును జూపి వారి నుత్తీర్ణులను జేయవలెను. అట్టి సత్ప్రయత్నమం దందఱకును ఫలము లభింపక పోవచ్చును. ఒకనికి జయము వచ్చినను, మఱియొకనికి జయము లోపించినను, సదుద్దేశముతో రణభూమియందు వీరిద్దఱును ప్రాణములను ద్యజించుటచే ఘనులే. వీరే వీరశిఖామణులు. ఇట్టి శూరాగ్రేసరులు లోకమందు వేర్వేరు వేషములతో సంచరించుచుందురు. ఒకడు సాహిత్య సీమయందు నిరంకుశ ప్రభుత్వము కలిగియుండును. ఒకడు మతసంస్కర్త యయి మతస్థాపనమునకయి ప్రాణమును గోల్పోవును. ఒకడు నాట్యరంగమున పాత్రను ధరించి, సృష్టిలోని రహస్యములను గని, వాని చిత్రవిచిత్రములను మనకు జూపి, బ్రహ్మానందము నిచ్చును. కాని లోక

ములో గణ్యత నొందినవారు వీరలే. లోకసారము వీరిలోనే యిమిడియున్నది. వీరిసందేశమును గ్రహించుటయే మన పరమావధి. ఈమహాతత్త్వమును గ్రంథ గ్రంథమందును, మాట మాటయందును అభినివేశముతో, గంభీరధ్వనితో బోధించినవాడు కార్లయిలు మహాశయుడు. ఏగ్రంథము చదివినను విషయము నూతనము కావచ్చును, కాని సార మిదియే. ఏయుపన్యాస మందైనను చరిత్ర క్రొత్తది కావచ్చును, కాని రహస్య మిదియే. ఇతడు మహాపురుషుల జీవితార్థమును వెల్లడింప సమకట్టిన రహస్యవేది. వారిసందేశమును దెలుపగల దూత. ఇతడు మహారాజ్ఞి విక్టోరియా కాలమునాటి మహాపురుషులలో నగ్రగణ్యుడని చెప్పుట యతిశయోక్తి కానేరదు. అయితే వ్యావహారికము తెలియని పిచ్చివాడని కార్లయిలును గూర్చి వాదింప సాహసించువారు లేకపోలేదు. ధనమును, దాని లాభములను గ్రహింపజాలక దేశకాల పరిస్థితులను గమనింపలేని మూర్ఖుడని యితనిని నిరసించువారును కలరు. కాని విక్టోరియారాణి కాలమున విద్యుచ్ఛక్తియుగాలమున నేమి, ధనమదాంధత చేత నేమి, యాంగ్లదేశము గర్వించియున్నప్పుడు ప్రవాహమున కెదురేగి నవీనభౌతిక శాస్త్రములను, వాని యపార్థములను బటాపంచలు చేసి, లోపములను సూచించి, భయోత్పాతము కలిగించిన ధైర్యశాలి కార్లయిలు. ఈశతాబ్దమున పాశ్చాత్య వ్యామోహములో బడియున్న ప్రాణికోటిని నవనాగరకతవలన కలుగు బాధలనుండి తొలగించి, ప్రాచీననిరాడంబర జీవనము నెలకొల్పి, వారికి సత్యాభిలాషను కలుగజేయ సమకట్టిన మహాత్ముని వలె కార్లయిలు కొంతవఱకు తనకాలమున లోకోద్ధరణమునకు బాటుపడెనని చెప్ప సాహసింతుము.

కార్లయిలు జర్మనీదేశమునందు మిక్కుటమగు నభిమానము కలవాడు. జర్మనీలోని కవీశ్వరులును, శాస్త్రవేత్తలును తనకు గురువులని గర్వముతో బలికియున్నాడు. జర్మనీ శాస్త్రజ్ఞుల యాదర్శములను తన దేశీయులకు దెలియజేసి తన 'గురుభూమి'లో నిరంతరము ప్రవహించుచున్న జ్ఞానరసమును తన యాంగ్లమిత్రులకు నించుక చవిచూపుటయే తన ముఖ్యకర్తవ్యమని పెక్కుసార్లు చెప్పియున్నాడు. గేథీ మొదలగు జర్మను మహాశయుల సంపర్కము కలుగుటచేతనే తన మనఃక్లేశములు ఖండింపబడెననియును, లోకరహస్యము తెలియక, యడవిలో దారి గానక, మతిలేక తిరుగుచున్న తనకు సరియయిన బాట చూపబడెననియును పదేపదే చెప్పియున్నాడు. ఒకానొకప్పుడు లోకాతీతమగు పదార్థ మేది కలదో దానియందు తాను నమ్మకము లేనివాడయి యుండెనట.

అరాజకత్వమను తీవ్రజ్వరము నాహృదయమును పీడించుచుండ, నేను జీవితములో సమాధానపడ లేకుంటిని.

ఈశ్వరుడు కలడా లేడా యనుసంశయము, లేడను నిర్ధారణలోనికి దింప, ఇంత కలితమగు

లోకమున్న దనువార్త లేమిచే, పని తెలియని వెఱ్ఱివానివలె నిటునటు దేశమంతటను దాను తిరుగుచుండెనట. భగవంతుని యందలి యపనమ్మకము ప్రతివస్తువునందును నపనమ్మకముగా మాఱుటచే, నాతనికి మనశ్శాంతి యెట్లు కలుగగలదు? అతని బాధ నెవ్వరు తొలగింపగలరు? ధన మేమయినను సాహాయ్య మొనరింపగలదా యని ప్రశ్నించిన, యాతడీ ప్రత్యుత్తరము నిచ్చును:—

కాదు కాదు. నీకు కలిగినకొలది నసంతృప్తి హెచ్చును. వైరనుప్రభు వాగర్భ శ్రీమంతుడు. కాని యొక్కనాడయినను సుఖపడెనా? నరు డెన్నడును సంతుష్టి పొందజాలడు. నీవు కొంచె మతనికి పెట్టితివా, ఇంకను కావలెనని మఱియుఱి నిన్ను బాధించును. కావుననే మనకాలపు నాటి యుత్తమ పురుషు డిట్లు సూచించెను: మనుష్యుడు తనయాశలను త్యజించినపుడే జీవితము ప్రారంభమయినదని చెప్పవలెను. నాయనా, సుఖపడదలచితివా, నీకోరను మానుము. కోరని దనుప మొందలిడుము!

ఈవిధమున జ్ఞానరాహిత్యమను నంధకారములో బడి, విసిగి, వేసరి, తుదకు గేతీమహాశయుని యండ దొరకి, భక్తిప్రేరేపింప జేసికొని కార్లయిలు గురుదక్షిణను కృతజ్ఞతాపూర్వకముగా సమర్పించెను. తిరిగితిరిగి, చదివిచదివి, కార్లయిలు కనుగొనిన పరమరహస్య మిది:

నమ్మకము! నమ్మకము! నమ్మితివా, అన్ని 'న' కారములను దొలగిపోవును.

ఇటులనే జర్మనీ విజ్ఞాన ప్రతిబింబమును ఆంగ్లేయులకు కార్లయిలు చూపగలిగెను. కార్లయిలునకు తనహృదయ ప్రతిబింబము తనకు జూపబడుట జర్మనీవలననే యనికూడ మఱవకూడదు.

కార్లయిలు తనకాలపునాటి సంఘసంస్కర్తలలో ముఖ్యుడని చెప్పగలము. ఆంగ్ల చరిత్రలో విక్టోరియా శకము ఘనతకెక్కిన మాట వాస్తవమే కాని కార్లయిలునకు మాత్ర మట్లు తోచలేదు. ఈశతాబ్దమందు మూడు ముఖ్యవిషయములు కలవు. ౧. భౌతికశాస్త్రము లభివృద్ధిజెంది, విద్యుచ్ఛక్తి వలనను, యంత్రబలము వలనను దేశమున కనేక సౌకర్యములు కలిగినవి. ౨. యంత్రబలము హెచ్చుటచేతను వర్తకవాణిజ్యములు హెచ్చి ప్రజలు ధనికులగుటయు, దూరదేశములందు నయితే మాంగ్లరాజ్యము స్థాపితమగుటయు సంభవించినవి. ౩. దేశమంతటను సుఖము హెచ్చినతోడనే సామాన్యప్రజలకు గౌరవము వృద్ధియయి స్త్రీపురుషాదులందు విద్యాభిమానము కలుగుటయు, రాజకీయమందు ప్రజాపరిపాలనా పద్ధతు లమలులోనికి వచ్చుటయు తటస్థించినవి. అనగా ప్రకృతి శాస్త్రము, ధనము, ప్రజాస్వాతంత్ర్యము, ఈమూడును పరిమితిలేని యౌన్నత్యమును బొందినవని చెప్పవచ్చును. కాని కార్లయిలు మహాశయునకు మాత్ర మివియన్నియు దేశారిష్టమునకే నమకూడినవని యభిప్రాయము. ధనము కూడినతోడనే స్వలాభ పరాయణత్వము పెరిగి వితరణము తగ్గినది. బీద సాదలయందు దయ యంతరించినది. దైవభక్తియు, మతాభిమాన

మును గగనకుసుమము లయినవి. దేశము మొత్తముమీఁద ధనము కూడియుండవచ్చును గాని, ధనికులకు ధన మెక్కువ కాఁగా, పేదలలో దరిద్రత హెచ్చినది. జనులు తమ సొమ్ములు వృద్ధికాఁగల మార్గములను వెదకుటయే కాని, యిహలోకము వదలిన వెనుక నెక్కడకు బోవలెనో, యేమి కావలెనో, ఉత్తరలోకమున తమగతి యేమగునో, యించుకయినను యోచన చేయరయిరి. ఇట్టి ధనాపేక్షయందు మునిఁగి తేలుచున్న తన దేశీయులను సంస్కరింపదలచి, వారిదూషణలను భరించి వారితో తీవ్రవాదము సల్పి, గొప్ప ప్రచారమును గావించి, దేశమును సంరక్షింప బూనిన మహోపకారి కార్లయి లని చెప్పగలము. వరదకాలమున ప్రవాహమున కడ్డుపడి యెదురీఁత సీఁదగలిగిన సాహసవంతుఁడనియు మనము చెప్పవచ్చును.

కార్లయిలునకు గోపము కలిగించు విషయములలో నవీనార్థశాస్త్రము మొదటిది. అతని కాలము నాడు ఆర్థికశాస్త్రప్రజ్ఞ దేశమందు వ్యాపింప మొదలుపెట్టెను గాని, యార్థిక శాస్త్రవాదులన కార్లయిలునకు తలనొప్పి. దేశమందు మొత్తముధనము వృద్ధిచేయవలె ననుసంకల్పము రాజ్యతంత్ర ప్రవీణులలో హెచ్చెను. కాని దేశధనము పెరిగినకొలదిని ప్రజలసౌఖ్యము క్షీణించుటకు ప్రారంభమయినది. ధనము పాపభూయిష్ఠ మగుటచే నెవ్వరును ముట్టుటకు గాని, యనుభవించుటకు గాని నోచరయిరి. పూర్వమందు మైదాసు అనురాజొక డుండెనట. మిక్కుటమగు ధనతృష్ణ కలవాడయి యాతడు పరమేశ్వరుని వరమడిగెనట. తాను చేతితో నే పదార్థమును దాకినను అది సువర్ణముగా మాఱవలెనట. అటులనే తుదకు వరమీయఁబడెను. కాని రాజునకు మాత్రము సుఖము లేకపోయెనట. భోజనసమయమున నాహారపదార్థములు చేతికి సోకినంత మాత్రముననే యవి బంగారమయినపు డాత డేమి తిని బ్రతుకగలడు? ఇంగ్లండు దేశములోని ధన మీ స్థితియందే యున్నదనియు, సామాన్యప్రజల కించుకయినను సుఖము కలుగుట లేదనియు కార్లయిలు గంభీరముగా వాదించెను. ఆర్థికశాస్త్రము ముఖ్యమయినదని మేధావులందఱును బరిశ్రమ చేయ మొదలిడిన కాలమున దానిని 'దుఃఖశాస్త్ర'మని కార్లయిలు నిరసన చేయుచుండెను. రాజ్యాంగ తంత్రజ్ఞులు శాసనసభలలోను, ఇతరచోట్లలోను తీర్మానము లనేకములను గావింపవచ్చును; నూతన రాజ్యాంగపద్ధతులను బ్రతిష్ఠ చేయవచ్చును; కాని యీ శాసనములును, తీర్మానములును చప్పుడు చేయగలిగినను ప్రజాసౌఖ్యమునకు నిరుపయోగములు. ఈ మార్గములన్నియు ప్రజలవలన హెచ్చుపన్నులు వసూలు చేయుటకు సాధనములు. సామాన్యప్రజలు నోరెఱుఁగని గొఱ్ఱెలమంద వంటివారు. రాజ్యాధికారు లందఱును, వీని ఉన్ని కత్తిరించి వీనిని నిస్సహాయులనుగా జేయుటకు పూనుకొనినారని చెప్పుటకు సందేహము లేదు. కార్లయిలు చెప్పిన దేమన,

నిత్యమును కూలిపని చేసికొని దారపుత్రులను సంరక్షించుకొను బీదవానికి రాజ్యాంగ పద్ధతులతో నిమిత్తము లేదు. ఏరాజే భూమి నేలినను గమనింపనివా డతడు. అతనికి కావలసినది, శాసనసభా తీర్మానములు కావు; ఆర్థిక శాస్త్రవాదములు కావు; ఆకలినేయునప్పుడు బాధ నివారణ చేయుటకు దగినయాహారమును, చలికాలమున శరీరమును గాపాడుటకు దగినబట్టయును, ఈ రెంటికిని కొదువ కలిగినప్పుడు గ్రంథ ప్రకారము దేశధనము హెచ్చినను, తక్కువయినను లాభము లేదు. ఈ యభిప్రాయమునే మహాత్మ డొకసందర్భమున రవీంద్రునితో వాదము సల్పినపుడు చెప్పియుండెను: "ఆకలిచేతను, దప్పిచేతను పరితపించుచున్న కూలివానికి కబీరుకీర్తన లయినను ఆనందము నీయజాలవు. ప్రాణమును నిలుపు భోజనముతప్ప మఱి యేవియు నాతని బాధ నివారింపజాలవు సుమా!" చూడగా కార్లయిలునకు దోచిన విషయ మిది: యథార్థముగా బీదలసౌఖ్యముకొఱకు పాటుపడుమంత్రి యొక్కడును కానరాడు:

ఈ యధికారులందఱును చతురంగ మాడువారితో బోల్పదగుదురు. రెక్కలు లేని ద్విపాదజంతువు లనేకములు భూమిమీద బోర్లపడియుండిన కాలమున నిర్భయముగా నీమహానీయులు చతురంగమందు బంట్లను ముందు వెనుకలకు ద్రోసినట్లుగా ప్రజల సుఖదుఃఖములను ముందువెనుకకు ద్రోసి యాడుచున్నారని చెప్పవచ్చును. దేశమంతయు నిట్టి దుస్థితియందుండ క్రీ. శ. 1789 సం. న కలిగిన విప్లవమువంటి సంక్షోభము లోకఘంటటను గలుగకుచ్చు ననుటలో నాశ్చర్య మేమి కలదు? పరిపాలకులు సోమరులయి సాపాటురాములను బిరుదుల కర్హులయియుండ, దేశమంతటను దారిద్ర్య పిశాచ మేల తిరుగుచుండదు? ఆకలి భరింపజాలమిచే "అన్నము అన్నము" అని యఱచుచు, కట్టగుడ్డ లేక, నోట నిప్పులు గ్రక్కుచు, లెక్కలేని శిరస్సులు కలిగి, తన నాలుకల నుండి జ్వాలలను వదలుచు, వీధులలో పరుగిడుచు, పిన్న పెద్దలకు బీభత్సరసము వెదజల్లుచు, నోరు తెఱచినంతనే రాజ్యమంతను మ్రింగివేయజాలిన దారిద్ర్య పిశాచ మేల బయల్వెడలదు?

"లాభనష్టము"లను వాదములతో గూడిన యార్థిక శాస్త్రమును నమ్మిన తర్వాత నిట్టి ఫలము కాక మఱి యేమి చేకూరకలదు?

కుర్చీలతో నలంకరింపబడిన గదియే మనకు శివాలయమయి కుర్చీలును రత్నకంబళ్లును, గలధనికుడు మహాధికారి యయినపుడు దేశము నశింపక యెట్లు జీవించును? కాబట్టి పట్టి యంత్రబలము చాలదు. యంత్రబలము పశుబలమువంటిది. దీనికంటె నతీతమగు మహాశక్తిని నమ్మనము. దానిని చూడవలెనన్న, నవీన తర్కశాస్త్రముతో జేయబడిన ముక్కుద్దములు పనికిరావు; పరమేశ్వరునిచే ప్రసాదింపబడిన మానవహృదయముతో జూడుము: నీకది గోచరము కాగలదు!


కార్లయిలు తన దేశీయులకు బోధించిన సందేశములోని ముఖ్యాంశ మిది. మనుష్యుడు తన జీవితకాలమును సద్వినియోగము చేయవలెను. జీవితకాల మనగా క్రీడాసమయమని తలచువారు మూర్ఖులు. పరమేశ్వరునిచే నీయబడిన కొలది గడువులో విషయ సుఖములను బూర్తిగా ననుభవించుటయే ముఖ్యమని యెంచువా రంధులు. అట్టి జీవితము లసత్య జీవితములు. జీవిత మనునది భావగర్భితమగు ప్రశ్నము. సామాన్యుల కలవిగాని విచిత్ర

విషయము. లోతు తెలిసికొనుటకు సాధ్యము కాని జలరాశి. అది యొక యద్వితీయమగు "బహిరంగ రహస్యము". మనుష్యజీవిత మను నది యెల్ల ప్రాణులకు దృశ్యమగుటచే బహిరంగమని చెప్పవచ్చును. దానిసారము కొలది మంది కయినను లభింపకపోవుటచే నది యెప్పుడును రహస్యమే యనవచ్చును. జీవయాత్ర నలుపుట త్రాచుపాముతో జెలగాటము చేయుట. క్రూరమృగముతో సంచరించువాడు జాగ్రతగా నుండవలెను. దానికంటె నధిక బలాఢ్యుడని దానికి తెలిసెనా, దానిపని వాడు చెప్పును. మెత్తనివాడని దానికి తోచెనా, వాని పని యది చెప్పును. థీబ్సు దేశమున నొకచిత్ర మగు జంతు వుండెనట. అది రెక్కలుగల మృగమట. దానికి శరీరము పైభాగము స్త్రీరూపమును, క్రిందిభాగము సింహరూపమును నుండెనట. ఆబాట నెవ్వరయినను నడచుచుండిన యెడల వారి నది యొకవింత ప్రశ్న వేయునట. ఈ కష్టతమమగు సమస్యకు తగిన జవా బియ్య లేనివారి నెల్లను నిమిషములో నామృగము మ్రింగివేయుచుండెనట. తుద కొక బుద్ధిమంతుడు ఒకనా డీ విషమ సమస్యను బూర్తిచేయగా, ఓడిపోతి ననుసిగ్గుచేత సీవింతమృగము గుట్టమీదనుంచి సముద్రములోనికి దుమికి యాత్మహత్య గావించికొనెనట. జీవయాత్ర కూడ నిట్టి వింతజంతువని కార్లయిలు పలుమారు వర్ణించియున్నాడు. ఒక పురుషుడు కాని, సంఘముకాని వృద్ధికావలె నన్నచో, నున్నతాదర్శము కావలెను. భగవంతునియందును, భగవదాకారమగు ప్రకృతియందును, దైవస్వరూపులగు మానవులయందును భక్తి యుండి తీరవలెను. సృష్టికర్తయందలి భక్తియే మతము; భక్తిరాహిత్యమే దుర్మతము, సామాన్యముగా మనము బుద్ధిమంతులమని తలచి మతవిషయిక సంస్థలను దృణీకరించుచుందుము. కాని కార్లయిలునకు నిట్టివి, సృష్టియంతయు నేమహాశక్తి వ్యాపించియున్నదో, దానికి బాహ్యచిహ్నములు. ఇవి సంస్థాపకుల కొకానొకనాడు పట్టిచిహ్నములు కాక యథార్థములే యయియుండెను. దేవళ మనగా ప్రాచీనులకును, పూర్వాచారపరాయణులకును భక్తి యుండెను. మన కన్ననో, దేవాలయమునకు వెళ్లువారు హాస్యాస్పదులుగా నున్నారు. కార్లయిలునకు దేవళ మనగా నుత్సాహము:

> దేవాలయమా! ఆహా! ఎట్టిపదము! గోలకొండ లోనియును, సమస్తదేశములలోనియును ధనమంతయును కలిపినను దాని విలువకు సరి కాదుకదా!

ఇట్టి భక్తిని నూతన ప్రకృతి శాస్త్రములు ప్రబలి యంతరింపజేసినవి. ప్రతి విషయమును గూర్చియు నిది నిజమా కాదా యను కువాదమునకు ప్రోత్సాహము నిచ్చినవి. ఆశ్చర్యమును, భక్తియును తఱచుగా మిళితమయియుండును. లోకాధీశుని కృత్యములం దాశ్చర్యము కలుగకపోయినచో నాతని మాహాత్మ్యమందు భక్తి యెట్లు జనించును? ఈసందర్భమున హిందూదేశస్థుల ప్రవర్తనము శ్లాఘనీయమని కార్లయిలు సూచించెను. వారి

౪౪-వ భారత జాతీయమహాసభా చిత్రములు-లాహోరు*




చిత్రము ౧



చిత్రము ౨

---

* ౧–౫ చిత్రములు జాతీయమహాసభాధ్యక్షుని యూరేగింపునకు సంబంధించినవి.



చిత్రము 3



చిత్రము ౪

చరిత్రలో నిదియే ముఖ్యాంశమని యాతని యభిప్రాయము. హిందూమత ప్రకారము, సృష్టియందలి ప్రతిపదార్థమును బరమేశ్వరుని ప్రతిబింబమనియు, కావున పూజనీయమనియు జనుల నమ్మకము. భగవంతునియంశ కలది యగుటచే ప్రతివస్తువుకూడ పవిత్రమయినదిగా భావింపబడును. ప్రాణికోటి కెల్లను నరుడే ముఖ్యమయినట్టియు, చిత్రమయినట్టియు విషయమగుటచే నట్టిమానవజీవితము పావనమైన దని కార్లయిలువాదించెను. ఆతని యభిప్రాయ మిూ గంభీర వాక్యములలో సూచింపబడినది:

భక్తితో గూడనిబుద్ధి యచిర కాలములోనే యంతరించును. జగదీశ్వరుని కృతుల జూచి యేమానవు డాశ్చర్యమును బొందుట కలవాటుపడడో (ఆశ్చర్యపడి భగవంతుని భక్తితో బూజింపడో), అట్టివాడు నవీనయుగ మందలి భౌతిక శాస్త్రజ్ఞులలో ప్రథముడయినను, నేత్రములు లేని యంధుడు ధరించిన సులోచనముల వంటి వాడు. మనుష్యునికి భగవంతునిచే బ్రసాదింపబడిన నేత్రము లుండెనా; సులోచనము లుపయోగించును, లేదా, యవి నిరర్థకములు!

పేదసాదలయందు కార్లయిలు నకత్యంత ప్రేమ. ప్రతినరుడును భగవదంశ సంభూతు డగుటచే పూజ్యుడు. నిరుపేదలను నీచులుగా భావించి వారిని జూచి యసహ్యపడువారు పశు సమానులు. నూలువడకిగాని, నేత నేసిగాని, చాటను సరిచేసి కాని జీవనోపాధి జూచికొను కూలివాడు పరమపూజ్యుడు. వాని జీవితము పవిత్రమైనది. పేదలనుజూచి హేయపడు వారి యందు కార్లయిలునకు గల యాగ్రహము దిలకింపుడు:

ఆ చినిగిన యంగీని తొడిగికొనిన పౌరుషవంతు డగు నరుని జూచి యెన్నడయినను నీవు గౌరవము జూపితివా? అతను ప్రాతచొక్కాయితో నుండినంతకాలమును అతడు పౌరుషము కలవాడని యించుకయినను గ్రహింపగలిగితివా?

ఎన్ని దేశములు వెదకినను ఒక్కటియే నిజమగు దేవళము కనుపించునట, అది మానవసోదరుని శరీరమేయట! ఒక్క శక్తిచేతనే యన్ని ప్రాణులును సృజింపబడినపుడు మన ప్రేమకు ననర్హమగు వస్తువేమి కలదు? పెద్దవయినను చిన్నవయినను, ప్రాణులన్నిటి యందును నొక్కశక్తియే ప్రవహించుచున్నదను గాఢమగు నమ్మకముతో నీమహాశయు డిట్లు తీవ్రతతో బ్రశ్నించుచున్నాడు:

నల్లనిమసితో నిండి యినుపదిమ్మ మీదికి వంగిన కమ్మరివాని కొలిమిలోని వెలుగు (దానితోనే నీగుఱ్ఱపు లాడమును మరమ్మతు చేయదలచితివి) ప్రత్యేకమగు చిన్నమంట యనియు, భూమ్యాకాశములతో నేమియు సంబంధము లేనిదనియు దలచితివా? లేక త్రెంపజాలని త్రాటితో గట్టబడి, బ్రహ్మాండముతో నేకమయియున్న దని తలచితివా? ఓరీ! మూర్ఖుడా! అది కాదు. ఆకమ్మరి కొలిమి ప్రప్రథమమున సూర్యమండలమున వెలిగింపబడినది. సృష్టికాలము నుండియు (నోవాకాలమునాటి నుండియు) వీచుచున్నగాలిచే మంటగా చేయబడుచున్నది. ....వేరా? వేరు కాదు. అట్టి ప్రత్యేకత యెన్నటికిని లేదని నేను చెప్పగలను............సరిగా నాలోచించితివా, ఎట్టి చిన్నపదార్థమయినను తుచ్ఛమని చెప్పరాదు. దానిద్వారా తత్త్వజ్ఞాని మానసికనేత్రము అనంతశక్తిని చూడగలిగిన గవాక్షమే సృష్టిలోని వస్తుజాలమని గ్రహింపుమా!

కావున కార్లయిలు బోధించిన సందేశములో ముఖ్యమయినది కూలిపని చేసి శాంత

ముతో ప్రవర్తించువాని యౌన్నత్యము. పని చేయువా డుత్తముడు. కష్టపడి పనిచేయుటయే భగవంతుని పూజించుట. మట్టిమో యుట యయినను, రాళ్లు పగులగొట్టుట యయినను, మురికిగుంటలోని నీరుబయట బారబోయుటయయినను, ఏదయినను శరీరకష్టముతో బని చేయుట యనగా భగవదారాధనము సేయుట. పని సంకల్పించుకొనిచేయ మొదలుపెట్టితిమా, సందేహములన్నియు చెల్లాచెదరయి పోవును. 'స' కారములన్నియు సదృశ్యములగును మన లను బీడించు సంశయములను దొలగించుటకు పని పూనుటకంటె వేరుమార్గము లేదు. దీనినే కార్లయిలు పలువిధముల బోధించెను:

నీ కందుబాటులో నున్న పనిని, నీవు నిర్ణయించి కొని విధియని నమ్మినపనిని చేయుము. ఇది చేసితివా, నీవిధియగు రెండవపని యేదియో నీకే స్పష్టము కాగలదు..................చేయుము! చేయుము! ఎంత స్వల్పమయినను, అణుమాత్రమే యయినను, చేయుము! భగవంతుని స్మరించి చేయుము. నీలోనున్న యావచ్ఛక్తియు నీస్వల్పమే యనుము. అయినను దానిని వెలిదీయుము! లెమ్ము! లెమ్ము! నీచేతి కేపని దొరకునో, దానిని పూర్ణముగ నుత్సాహముతో జేయుము. 'నేడు' అని చెప్పుట కవకాశము చిక్కినప్పుడే కృషి జేయుము. వేలయన, రాత్రి సమీపించి, చీకటి ప్రవేశించెనా, మనుజు డేమియు పనిచేయజాలడు సుమా!

కావుననే నూలు వడకుట యను సల్పవృత్తి కూడ పవిత్రమైనదని కార్లయిలు చెప్పుచుండెను. నూలు వడకి జీవించు పురుషుడు మహాత్ముడన దగును. లోకములో నిద్దఱుపురుషులు ఘనులని కార్లయిలు తలచుచున్నాడు: శరీరమున కత్యావశ్యకమైన తిండికై పాటుపడు వాడొకడు; పొట్టకై కృషి చేయుచు, మనస్సున కత్యావశ్యకమగు జ్ఞానమునుగూడ నియ్యగలిగినవాడు మఱియొకడు.

వ్యవసాయదారుడగు యోగీశ్వరు డెవ్వడయినను దొరకెనా, అతనికంటె మహనీయుడు లోకమందెయు వెదకినను లేడని చాటింపగలను. అట్టి పురుషుడు లభించుట దుర్లభమే. నే వానిని చూడనలేనన్న, 19 శతాబ్దములు దాటి నాజరెతు వెళ్లవలెను.

కాని యిన్ని శతాబ్దములు వెదకివెదకి నాజరెతు వఱకరిగిపోదరుని సబర్మతీ నేతగాని యందు లోకులు గాంచగల్గుట హిందూదేశ మహాభాగ్య మని చెప్పుట యతిశయోక్తి కానేరదు.

(సశేషము)

తొలకరి

పెమ్మరాజు లక్ష్మీపతి గారు

అర్కతప్తంబౌ మహాబ్ధి మధ్యమునుండి యాకాశవీథి కంతంత లేచి,
యిటు ప్రాకి యిటు ప్రాకి యాశాంతముల దాకి యంబరంబంతయు నావరించి,
బారలలో బారలు దొంతరల దొంతరలునై నీలనీలంబులై నిలిచి నిలిచి,
పశ్చిమ యామ్య దిగ్భాగద్వయంబుమధ్యంబు పెందెరువుగా దరలి తరలి,
లోని తేజంబు తళుకు తళుక్కుమనుచు-మెరిసి పైబడ దిగ్దిగంతరము లెల్ల
దద్దరిల్లంగ నురిమి, యుత్సాహజృంభ-ణమును, నున్నత గగన యానంబు దనర.

అడ్డమై నిల్చు సహ్యాద్రిపంక్తుల కల్గి యురుముపై నురుముగా హుంకరించి,
పెళలు పెళిల్లను బిడుగుల నయ్యద్రి మూర్ధంబు పిండిగా మొత్తిమొత్తి,
ఎలగోలు వర్షించి యేకోదకంబుగా మలయాళమును జలమయము జేసి,
పెనుగాలిజత గూడి వినువీథి నడయాడి యాపర్వతాగ్రంబు లంత దాటి,
నీలగిరి శృంగముల ప్రోల నిగిడి పఱచి-ద్రవిడ కర్ణాటకంబులు దాటిపోయి
భరతభూమికి భూషణప్రాయమైన-యాంధ్రరాష్ట్రి మధ్యంబున కరుగుదెంచి,—

తొలకరి మేఘముల్ చదల దోచె, నభస్తరుణీ వినీలకుం
తలములు జీరుకాడెడు విధంబున, భూస్థలికిన్ డిగున్ మహో
జ్జ్వలమగు స్వర్గజీవనము; జాల మికేటికి లెమ్ము లెమ్ము నీ
హలము ధరించి రమ్ము సమయం బరుదెంచె నిదే కృషీవలా!

ఆహిమాచలము లక్ష్యంబుగా నవె కొన్ని యరుగుచునుండె నీలాంబుదములు;
పూర్వాభిముఖములై పోవుచున్నవి కొన్ని బ్రహ్మదేశమునకు వార్ధి దాటి;
పాయలు పాయలై పరుగెత్తు నొకకొన్ని తీరుగా నుత్తరదిశకు సాగి;
మెలికలు తిరిగి చుట్టలుజుట్టుకొని కొన్ని దొరలుచున్నవి వసుంధరకు డిగుచు;
తరళసౌందర్య లీలావిధాన మొనర-నవ్యమోహనమగు గగనాంగణమున
సహజ చాంచల్య లలిత స్వేచ్ఛావిహార-సంభృతంబైన వాయుసంచాలనమున;
కనుచూపుమేర దిగంతమం దవె కొన్ని పర్వతశ్రేణి నా బరిఢవిల్లు;
ఆకసంబున నీదు లాడు నోడలభంగి యవె తేలు నొకకొన్ని యంబుదములు;
మీదిమీదికి బోయి మిహిరమండలము నాచ్ఛాదించు నవెకొన్ని జలధరములు;

ఆసూర్యకాంతు లంతందు సంచుల వెల్ల నింగి మధ్యంబున నిలుచు కొన్ని;
గగనముననుండి భూమికి దిగుచు కాళ్లు-సాచె నవె కొన్ని యపరదిశాంచలమున
నచట వర్ధిల్లు ధరణీరుహ వ్రజంబు-వాన తెలిముసుగునందు కప్పంగబడియె.

ఇవె వ్రాలుచున్న వీ యింద్రకీలాఖ్యధరాధరాగ్రమున ధారాధరములు;
అవె కొండవీటిపై నవె మంగళాద్రిపై నల్లని పొగమబ్బు లల్లుకొనియె;
అటు పాపికొండలం దిటు కోరు కొండపై నల్లాడె కొన్ని నీలాంబుదములు;
భద్రశైలము సింహపర్వతంబును దాకి వర్షించె నొకకొన్ని వారిదములు;
గ్రీష్మ మది యంతరించెను మృగశిరా ప్ర-వేశమై యొప్పె నాంధ్ర పృథ్వీతలమున
తప్తమగు భూమి వర్షాన దడిసి యునికి-కమ్మనగు మట్టివాసనల్ కలయు బర్వె.

అరుణ భూరజము నొయ్యన దాల్చి శోణవాహిని యయ్యె నల్లదే కృష్ణవేణి;
నిండుజీవనమును, నెలజవ్వనము దాల్చె వృద్ధగౌతమియు విజృంభణమున;
కృష్ణరాజ్యము సంస్మరించెడునోజ యుప్పొంగు చున్నది యదే తుంగభద్ర:
తిప్పలన్నియు ముంచి తెప్పల దేలించి యలలతో పెన్న తూగాడుచుండె;
నాటవికజృంభణంబున నడ్డమైన-కొండల బగిల్చి, యడవుల గూల్చివైచి;
యడవి కోయదొరలయింటి యాడుబిడ్డ-యెర్రకాలువ యత్తింటి కేగసాగె.

అనుకొన్నారొకో యెవ్వరైన మునుపి ట్లనంచు? నా చండ శా
సను రాజ్యంబును బోలె మాడ్చినది గ్రీష్మం బింతకాలంబు; నూ
తన చైతన్యము నవ్యధర్మవిజయోత్సాహంబు శోభిల్లుచ
ల్లని వర్షాగమముం గనుంగొనుము కాలం బెంతలో మారునో!

కడలి గర్భమునందు కరడుకట్టిన కారుకటికచీకటి గొంతకాల మలసి,
యటునిటు ద్రొక్కి- తూ గాడెడు కెరటాల నడకలలో గొన్నినాళ్లు నలిగి,
తీర్చి కాసెడు నెండదెబ్బకు గొన్నాళ్లు మెసరుపొంగును బోలె మసిలి మసిలి,
మెలయించి వినువీథి కెగురవైచెడు గాలి దేలి తూలుచు కొంతకాల ముండి,
ఆకసము నంటియున్న నైల్యంబునందు-కొన్ని దినములు పైకి రాకుండ కరగి,
యిన్ని చిక్కులు కడదాకి యిపుడు చూడు-మంబుదంబులు మిన్నంటి యాడ దొడగె.

పాయల్ పాయలుగాగ నల్లవె నభోభాగంబునం దేలి బల్
తోయంబుల్ గురిపించుచున్, బ్రబల సంతోషంబు నిండార న్వే

చ్ఛాయానంబున నత్యుదాత్తగతి సంచారంబుఁ గావించు తా
మీ యానందము నెందు దాచుకొనెనో యిందాక నీ మేఘముల్!

అల్లిబిల్లిగ జడలల్లిన మొయిళుల కురుల సందులను చిక్కులు వదల్చి,
తరులజొంపము వోలె దళమైన మబ్బుల వలుద చీకటుల లోపలకు బోయి,
తళుకు తళుక్కున బెళుకారు మెరుపుల సోలపు చూపులలోని వలపు లెఱిగి
తెలిమబ్బుగుబురుల తెరలలో నురుములు పలికించు పలుకులు తెలుగు జేసి,
శిశువు గని యంత క్రొంబాలచేపుదాల్చి-యుబ్బి తొలుకాడు మాతృపయోధరముల
కరణి పొలుపారు నీవానకారు సొరు-విప్పి చెప్పరె భావముల్ విప్వకవులు!

(సశేషము)

దీర్ఘనిశ్వాసము

జి. జాషువకవి గారు

తెలుఁగుంబాసకు వన్నె దెచ్చిన జగద్వీరుండు, మాకృష్ణరా
యలు కట్టించిన వజ్రదుర్గముల శుద్ధాంత ప్రదేశంబులన్
దలక్రిందై తప మాచరించెడిని సంతానార్థమై, గబ్బిగ
బ్బిలపుం గుబ్బెత లక్కటా మొయిలు గప్పెం బూర్వ మర్యాదలన్.

పన్నీటం దలసూపి కాఁపుగొను రంభామల్లికా వాటికల్
చిన్నాదేవి గులాబితోఁటలు నశించెన్ గ్రచ్చ లున్మత్తలన్
గన్నేరుం బాద లావులించినవి రంగత్తుంగభద్రానదిన్
బన్నుండె న్మనమోహనాంగికవితాప్రాగల్భ్యసౌరభ్యముల్.

నాయకురాలి మాయకదనంబున మా పలనాటి పౌరుష
శ్రీ యడుగంటె, గడ్డి మొలిచెం బులిచారలగద్దెమీఁదఁ, గెం
జాయ మొగానఁ గ్రమ్మ జలజప్రమదామణి, నాగులేటిపై
వ్రాయుచునున్న దిప్పటికి, బాలునిశౌర్యకథా ప్రబంధముల్.

వాసినిఁ గన్న రెడ్లపరిపాలన, కొండలదండల న్శిలా
శాసనసంగతి న్నిలిచి చచ్చియుఁ జావదు, రెడ్డిరాణి, మైఁ
బూసిన కుంకుమంబు పసుపుంబస లంటిన కన్నెతొండ నేఁ
డూసరవెల్లియై నవయుచున్నది, పండువెదుళ్ల సందులన్.

వసురాయ చాటుప్రబంధము

బండారు తమ్మయ్యగారు

(వెనుకటి సంచిక తరువాయి)

వానకారు

సహజశక్తి సమేతుండగు వరవరుండు నిజపరాక్రమమును బూత్తిగఁ గన్పఱచు నక్కఱ లేకయ శత్రురాజులను శాసింప నేర్చుట లోకప్రసిద్ధము. ఇందులకు దృష్టాంతము:

గీ. సన్న చినుకు రాల్చి చల్లార్చె రోహిణి
మిన్ను ముట్టు మంట మృగశిరస్సు
కన్ను బొమ్మ సన్న గడగడ లాడించు
శక్తి యున్న యన్న శత్రువులను.

వానకారున నేలపైఁ జలిచీమల బారులు చెలరేఁగుట ప్రకృతిసిద్ధము. భూమణీ అలంకరణమున సపత్నులనోన్యతిరస్కరణ మొనర్ప నెంచుట గూడ స్వాభావికము. దివిభువులకు సాపత్న్య మారోపించి పయిని జెప్పిన ప్రకృతి సిద్ధవిషయము నుత్ప్రేక్షించు చాటువు:

ఉ. శ్రోవలు నల్లపూసలను గ్రుచ్చిన సోగవి దాల్చెనో నిజ
గ్రీవను భూమిదేవి బహురీతుల నీలపయోదమాలికల్
శ్రీ విలసిల్ల నింగి నలు గ్రేవను వేలుట గాంచి యంచనల్
ద్రోవదోలంగఁ జుంచనదరుం జలిచీముల బారుల తోల్కారిన్.

జలద మయూరములకు బాంధవము భగవన్నిర్మితము. పరమమిత్ర బంధుదర్శనమున సహ్యాంగు సత్పురుషునివలె మేఘోదయమును గాంచినంతనే మయూరము లత్యంత హర్షమున నృత్యమొనర్చి కేకారవంబులతోఁ గేరుచుండు స్వాభావికవిషయమునకు మనకవి యుత్ప్రేక్షించు కారణములు:

క. మారుత శిక్షను వారిద
ధారలు నాట్యంబు సేయఁ దడనూయఁ బలేక
ప్రారంభించె నటింప మ
యూరతతుల్ వాని మించనో యన మించుల్.

క. "ఎప్పుడుమఁ గనఁబడు కన్నుల
నొప్పెడు మా విప్పుపింఛ మొక్కొక్కరొయడ
గప్పుడు నీ తారకాలిలను
నుప్పరమును నిక్కి మెడ మయూరము గేకన్.

దానము సత్పాత్ర వినియుక్త మయినప్పుడే యుభయతారకమయి పరస్పరాత్యుత్కృష్టమును గూర్చును. అందులకుఁ బ్రకృతినుండి మనకవి చూపు దృష్టాంతము చాల సరసముగ నున్నది:

గీ. తామరాకులం దుదకబిందువులఁ గంధ
రుండు రాల్చ మణుల రూపుఁ దాల్చె
నవ్విధంబు, దివ్యఁ దనుదాత మహిమంబొ
పావనాత్మపాత్ర పరమహిమమొ.

ఋతువు లన్నిటిలో వర్షర్తువును, హేమంత ఋతువును విరహుల కత్యంత దుర్భరములు. ఈవిషయమును బురస్కరించికొని చెప్పిన యీ క్రిందిపద్యము మన భవ రసికులకు హృదయంగమముగ నుండఁ గలదు:

సీ. శ్రావ్యమర్దళవృష్టిస్వనమనోహరములై
యుప్పరంబున మొయిల్ గ్రుమ్మచుండఁ
జిమ్మచీకటిలోనఁ గ్రొమ్మించు లెడనెడఁ
దోతెంచి, కిటికీలఁ దొంగిచూడ
మర్మరధ్వనులతో మబ్బుపైగాలిక
మ్మనివానతావి నున్ననుచు వీవ
ముత్యాల జాలరుల్ ముసుఁగు వేసినదారి
నుదకధారలఁ జూరు లొప్పుచుండఁ
గీ. బట్టెమంచమ్ముఁ, బానుపుఁ బందిరియును
జాలరును, దోమతెర, పూలు, మేలుకట్టుఁ
బచ్చడము, నడపముఁ గల్గు పడుకటిల్లు
ముదిత దవ్వుల నుండిన ముల్లు గాదె?

సీతుకారు

శారదవేళను మేఘములు నిర్మలములయి ప్రకాశించుట ప్రకృతి సిద్ధము. అప్పుడు జలములు, కొల్లలు విమలము లగుటగూడ స్వాభావికము. సహజములగు నీ

సంఘటనలకుఁ గార్యకారణ సంబంధము నారోపించు చాటువు:

క. శరదములఁ జెరఁగు మన కా
శరదములనె యనుకరింపఁ జనునవుచు, నదీ
శరములఁ దత్పరిసరమున
శరములు విపులంబులయ్యె శారదవేళన్.

మంచుఁదుంపురులతోడి గడ్డిచే నాచ్ఛాదితమగు భూపతిని జరతాక్రాంతగా నుత్ప్రేక్షించు పద్యము:

ఉ. శారదరాత్రి పైని సర
సంబుగఁ జందురు మామ చిల్కు స
న్నీరవఁ బోల్చు పల్చనియ
శీయపు మంచువ మించు దూర్వలం
ధారిణి వేషమం దగె, స
నాతన కావున సంధిజర్ఝరా
భారవశంబునన్ బలిత
పాండుర కేశ కలాపయయ్యె నాన్.

పతికి సతి యర్ధాంగియను నార్యోక్తికివి రూఢి పలుచు చమత్కృతి:

క. "ఓస లోకదె పతికిఁ బతి"కను
మడికిం దొలకరియు సీతుమ ప్రమాణంబుల్
నడివేసఁగి వేర్వేఱని
నెఱుకునెడ నది లేకపాత్య మెటు గ్రాహ్యమగున్.

పైయార్యోక్తికిఁ గారణభూతులయి జగజ్జనకు లయిన పార్వతీపరమేశ్వరు లర్ధనారీశ్వరు లగుటకుఁ గారణము నిత్యహిమాలయ వాసులవుటఁ జలిబాధ నోర్వలేక గాఢాశ్లేషము నభిలషించుటయే యను చమత్కారము కూడఁ జూడఁదగినది:

ఉ. జంపతులార! మీనదుమ
సం దిసుమంతయుఁ దోఁపనీసఁ డీ;
కంపిలఁ జేయు మిమ్ము నవ
కాశము లేశము చిక్కనేని యుం;
గొంపలఁ దూఱితూఱి వెద
కుం బోలయల్కల వారి సీతు; చిం
తింపుఁడి పార్వతీ ధవుల
నిత్య హిమాలయ శృంగధాములన్.

సాధారణముగా వృక్షములన్నియు వసంతాగమమునకే యాకులు రాల్చుచుండ వేఁపచెట్టు సీతుకారణంబే యట్లొనర్చుటకుఁ గారణమారయఁ దగినది:

గీ. పుష్య మాఘ ఫాల్గునములు మూఁడు నెలలు
వ్యవధి యుండఁగనే వసంతాగమమున
కేమిపుడె యాకు రాల్చు నీవేము? తెలిసెఁ
బూవుగాదికి సిద్ధంబు గావలెఁ గద!

శిశువు; వృద్ధు

మానవునకుఁ గలుగు నాలుగవస్థలలోన ప్రథమ చరమావస్థలు రెంటినిగూర్చి మనకవికూర్చిన చాటువులు చాల మనోహరములుగా నున్నవి. మచ్చునకుఁ గొన్ని: పొత్తుల బిడ్డఁడు గాళ్ళేతులు కదల్చు శైశవచేష్టను, దానికముందు సంసార సాగరము నీఁదుట కభ్యాస మొనర్చు రీతిగా వర్ణించిన పద్యము:

క. తలిమంబునఁ బొత్తుల వెలి
కిలి వెనుకకు ముందరకును గేరుచుఁ గాళ్ళే
తులఁ గదలుచు నిసు వీథిన
జలధిని నీఁదంగ నభ్యసము సల్పునకన్.

మఱియు శిశువులు వ్రేలిని మాటిమాటికి నోటియం దుంచికొని చప్పరించుచు నానందించు చందమును నిస్సారమగు సంసారమునకయి సంతసించు పామరప్రకృతితోఁ బోల్చిన పద్యము:

గీ. సారహీనమయ్యు సంసారము ప్రియం బ
దేమొ కాని మిగులఁ బామరులకుఁ
బాలు గీలు లేని వ్రేలుంచుకొని నోరఁ
జాలమల్ల పిల్లఁ జంటి నిసుఁగు.

జిలిబిలి పలుకులతోఁ గూర్చిన యీక్రిందిపద్యములు నిసర్గమనోహరములయి కవిస్వభావోక్తిరమణీయతను ప్రకటించుచున్నవి:

చ. జిలిబిలి తేనెపల్కులను
జిల్కెడు కమ్మని ముద్దునోరుఁ గం

పుల తులకింపు సన్నసెన
 వుల్ జిగిదంతపుఁ జాలుబుగ్గలుఁ
గలువల సేలు కజ్జలపుఁ
 గన్నులు నల్లని చుక్కబొట్టు నుం
గల విరిదమ్మి వంటి పసి
 కందు మొగంబు బలరింపదే మదిన్.

గీ. పాలతల్లి కన్నఁ బటికబెల్లము కన్నఁ
బక్వఫలము కన్నఁ బప్పుకన్నఁ
బాదరక్ష యన్నఁ బసిపాపలకుఁ బ్రీతి
కుఱ్ఱవాఁడ్రబుద్ధి పక్కిబుద్ధి.

క్రొత్త వింత, ప్రాఁత రోఁత యను సామెతకుఁ జక్కని దృష్టాంతము:

గీ. శిల్పములు సృష్టి శిశువుల నలరించు
శిశువుచేష్ట లలరఁజేయు మనల
నేవి వీనిలోన హృదయంగమంబులు
క్రొత్త వింత ప్రాఁత రోఁత యంతె.

బాలుర ముగ్ధ వాక్యములు కొన్నియెడల నత్యంత భావగర్భితములయి యవ్యక్తము, ననిర్వాచ్యమునగు కవితాసంపదతో నిండారుచుండును. అందుకుఁ గొన్ని దృష్టాంతములు:

గీ. దేవు నలమారు తలఁపులు దెలివియుండ
నర్చకుఁడు మాయుచోఁ దండ్రి యాఁగ వాఁడు
"మాయకున్న దేవుఁడు పాఱిపోవు" ననియె
ముగ్ధ తావ్యక్త మధురముల్ బుడుత మదులు.

గీ. మఱిక పసరుటాకుఁ గొఱుకుటఁ గని మేఁక
తమ్ములమ్మ నేయునమ్మ! యనును
గాగితమున గీఁతఁ గని దార మను బాల
కందు మదులు భావగర్భితములు.

చ. కనుఁగొని బాలుఁ డాఁడుఁ బసి
 కందును "వీనికి మూడకుండ గోఁ
చి నెవరు కట్టిరో" యనియె
 స్త్రీపురుషాకృతి గుర్తెఱుంగమిన్;
మును, వని బుఱ్ఱుఱ్ఱంగుఁడు "త
 పోధనులార! యొకండె నాకు మో
మును, మఱిరెండు కొమ్ములెద
 మొల్చెను మీ" కనలేద పేశ్యలన్.

షష్టిపూర్తి మహోత్సవము లిప్పుడు శ్రీమంతులలో నాచార మయినవి. ఈ యుత్సవమునకుఁ గారణముఁ దెలుపు చాటువు:

గీ. బలిమి చెలువములకుఁ బదునాఱు, నఱువది
తద్విరుద్ధములకుఁ దనువు మార్పు;
మంత్రశక్తిఁ గలుగు మరలఁ దొల్లిటి దని
షష్టిపూర్తి మహము జరుపుకొంద్రు.


వార్ధక్యమునఁ బల్లూడిపోవుటయు, బాల్యమునఁ బోలె నవి మరల రాకుండుటయు నను స్వాభావిక విషయములకుఁ గారణముల నాపాదించు పద్యములు:

గీ. అఱువదేండ్ల ప్రాయ మప్పుడు, మానవుల్
మృదుపదార్థములను మెసఁగ వలయుఁ;
గఠిన మఱుగఁ జేయఁ గడు పోపదని, యప్డు
ప్రాయికముగ ప్రకృతి పండ్లు డుల్చు.


గీ. పాలపండు లూడి, పదును పండులు వచ్చు;
ముదుక పండ్లు రాల మొలవు వెండి
కోడెకాని జవర కోశంబు కడు బలి
ష్ఠంబు; దుర్బలంబు జరను కుక్షి.

నిద్రా మరణములకు సాధర్మ్యమును గూర్చిన పద్యము:


చ. మరణము నిద్ర రెండును స
 మంబులు; నిద్రకు రేయివంటిదే
జర మృతి; కందు షష్టికడ
 పంజ; శతం బురు నిద్రవేళ; యా
శ్వరుఁ డది జీవిత శ్రమము
 సర్వము దీఱఁగ నేర్పరించె; న
త్తఱుణమునందుఁ గోరుదురు
 తప్పక తొందర దాని నందఱున్.



చిత్రము ౫



చిత్రము ౩ స్త్రీసేవాదళము




చిత్రము ౨ మహాసభా మంటపము

సభాధ్యక్షుడు, సర్దార్ మంగళసింగ్
మొదలగు నాయకులు



చిత్రము ౧

జాతీయపతాకారోహణము



చిత్రము ౯



చిత్రము ౧౦

వార్ధకమున బలము తగ్గుట సర్వజీవులకు స్వాభావికము; కాని యీధర్మము వృక్షములలోఁ దాళము నందును, మానవులలో భారతవీర శ్రేష్ఠుఁడగు భీష్ము నందును విపరీతమయినది. భీష్ముఁడు తాళధ్వజుఁడౌట యీయసాధారణ ధర్మసామ్యమును బట్టియేయఁట:

చ. చాల ముసల్లి కంగమున
 సత్తువ సన్న మగుంగదా, వసూ
త్తాలపుఁ దాళమందుఁ బలెఁ;
 దద్విపరీతత దోఁచు భీష్మునం
దాలములోన వాని కడి
 యాలము తప్పటుసాల మోటకున్
మూలము, చేవఁ బట్టి యగు
 పోలికయే యనుచుం దలంచెదన్.

పొలములు, పిట్టలు మున్నగునవి

వివిధ సస్యవిలసిత మగు లంకపొలమును గూర్చి యొనర్చిన యీ క్రిందివర్ణనము స్వాభావిక రామణీయకమునకుఁ జక్కని దృష్టాంతము కాఁగలదు:

సీ. పూవుపిందెల, ప్రేలు పొడవుఁ గాయలఁ గొమ్మ
 లొరగి పచ్చగ నున్న మిరెపచేలఁ
దెల్లపూగొలలతేఁ దీఁగె లొండొంటితో
 సెనసి వాసనగొట్టు సనుపచేల
గవ్వగుత్తులవంటి పువ్వగుత్తులఁ బూచి
 గమగమ వలచుకొ త్తిమిరిచేల
మొక్కలై రెక్కని మదిరి తేఁ బాకాన
 మిగుల గమాయించు మెంతిచేల
గీ. వలరు జడగట్టి కాచిన యావచేల
వట్టనము గింజవిన్న ను వరగచేల
వలుఁద దుబ్బులఁ బెనగొన్న యులవచేల
లక్ష్మి! నా నోయనుచు నుండె లంకపొలము.

పన్నీరుబుడ్డితోఁ బోల్చిన యుల్లికోడు వర్ణనము:

గీ. తలను సన్నపెజ్జములరవపూఁ జెక్కి—
నట్టు మరకతంపు గొట్ట మున్న
చిన్నితమ్మికంపుఁ బన్నీరుఁ గొప్పె, నా
బొప్పె దుంపతోడి యుల్లికోడు.

మశకమత్కుణములవలన మానవునకుఁ గల బాధ వర్ణనాతీతమయినది. మత్కుణ బాధగూర్చి గీర్వాణకవి యొకఁడిట్లు చమత్కరించినాఁడు:

శ్లో. రవి రంబరమధ్యస్థః శేతే శేతే హరి స్తథా,
 గిరౌచ గిరిశ శ్శేతే మర్త్యే మత్కుణ శంకయా."

దీనినే యాంధ్రకవి యొకఁడు

క. "శివుఁ డద్రిని శయనించుట
 రవిచంద్రులు మింట నుంట రాజీవాక్షుం
 డవిరళముగ నబ్ధి(శేషు)పయిని
 బవళించుట నల్లి బాధ పడలేక సుమీ!"

యని యనువదించినాఁడు. వీనిని దొంగలతోఁ బోల్చిన వసురాయని చాటువులుగూడఁ జూడఁదగినవి:

ఉ. పాములు దేళ్లు జెఱ్ఱులిటు
 వంటివి దాఁగి చరించుఁ జీఁకటిన్
దా మెరుఁగ లోలికిం జనవు
 త మ్మలిగింపక యున్న నక్కటా!
దోమలు బందిపోటు గజ
 దొంగలు; చొచ్చి మెలంగులో నెయి
ల్లెమిత్రలంక కార్చుచుఁ బ
 యిం బడి దొమ్మి సారించు రక్తముల్.

చ. పెలపున నింటివా ర్నిదుర
 మేల్కొనకుండఁగ గ్రొచ్చి గోడలం
గలుముల దోఁచి పారుదురు
 కన్నపు దొంగలు రాత్రులందు; న
ల్లులు శయనాసనాదుల క
 లుంగుల లోన నె డాఁగి నిద్రవే
ళ్లొకలిపిరెు వింతతస్కరతఁ
 గ్రోలు నొడల్లున నల్లరేవగల్.

ఎంతపదిలముగ దాఁచినను ద్రవ్యపదార్థములను జీవుల బారినుండి కాపాడుటయందుఁ గల కష్టములు గృహస్థుల కెల్ల ననుభవ వేద్యములు. అమృతము భూలోకగతము కాకుండుట కీచీమల భయమే కారణమను పద్యము చాల హృద్యముగ నున్నది:

క. చీమలకడలి, పయోనిధి
లో మెండలం దాఁగి, దైత్యులుఁ సురలె త్రన్
భూమిఁ గనకభయ మమృతం
బామరలోకమున కరిగె హాయిగ బ్రదుకన్.

వృక్షాదికములు

సృష్టిలోకెల్ల మానవజన్మ మత్యుత్కృష్టమని పెద్దలు వాక్రుత్తురు. కాని స్వార్థపరుండయి, స్నాయువసాదిపంకిల శరీరుండగు నరునికంటె నిలువెల్ల నాజన్మము పరోపకారములకు తరురాజముల జన్మమే యుత్తమమని నేను బలుమాఱు తలంచుకొను చుందును. "పరోపకారార్థ మిదం శరీర"మ్మను పవిత్రధర్మము సృష్టిజాలములో వృక్షములయెడఁ జెల్లినట్లు మఱి యేనిదెసను నెఱవేఱినట్లు గానరాదు. కావున సత్కవుల దృష్టికీ భూమిజములు దయాసముద్రుఁడగు పరమేశ్వరుని ధర్మపురుషార్థకశాలలుగా గోచరించు టొక వింత గాదు. ఇందుఁ గూర్చిన వసురాయని చాటువు:

ఉ. వేడుకఁ దూఁగుటూయెలల
వేకువ నూఁగుచు గాలిపాటలం
బాడు శకుంత దంపతుల
పచ్చని మెచ్చుల దొంతి సౌధముల్
నీడ నొసంగి, యధ్వగవ
నీపకతిర్యగనీక మెప్డుఁ గా
పాడు విధాతృ ధర్మపురు
షార్థకశాలలు, వృద్ధసాలముల్.

మఱియు నేఁ జెప్పిన పయివిషయమున కీక్రింది వృత్తాంతము దృష్టాంతము గాకమానదు. ట్రెయినింగు కాలేజీలోఁ బనిచేయు కాలమున నారోగ్యము చెడి మన కవి యొకపుడు సెలవు కోరఁగా నప్పటి వైస్‌ప్రిన్సిపల్ నిరాకరించెనఁట. అప్పు డతికష్టమునఁ గాలేజీకిఁ బోయి పనిచేయుచు నొక నాఁటి మధ్యాహ్న మధికారినిర్దయకుఁ జింతించుచు శ్రమమునఁ గిటికీవద్ద నిలువఁబడి యుండఁ సమీపమందలి యొబ్బదిరిసెనచెట్టు మందమలయానిలాదికము చేఁగన్నులకుఁ జల్లఁదనమిచ్చి యాయనకుఁ దాపోపశమనమును గలిగించెనఁట. అప్పు డావృక్షముపై చెప్పిన చంపకమాలిక ప్రకృతికి నీకవికిఁగల యనోన్యన్య ప్రేమమున కాదర్శకమై స్వార్థపరులగు మానవులకు నీతిబోధక మగుచున్నది.

అందలి కొన్ని పాదములు చిత్తగింపుఁడు.

....

నరులకు నున్నతస్థితి న
న న్నుపలం బగుఁ బ్రాయికంబుగం
దరువర! యెప్డు నీదు కుసు
మ స్మృతి పేశల; మీవసంతపుం
సిరులను నిట్లు వర్ధిలుచు,
నీదను దర్శనమాత్రఁదీర్తు కన్
దిరిగెడు నాకు; నీజనకు
దీనదయాళుత నిమ్మఁ గెంచెనో;
"నరులకు భావ వేఱుపడి
నం గనుపట్టదు సానుభూతి" యం
దురు; తరు వీవు నే నరుఁడ;
దుస్సహబాధ మదీయ మేగతిం
గరఁచెనో నీయెదం...............

....

దిరిసెన! నీదు సచ్చరిత
దిద్దునుగా నుపకారశూన్యులన్.

ఆంధ్రగ్రంథములలో సంస్కృతభాషనకుఁ బరివర్తింపఁబడు భాగ్యము పాల్కురికి సోముని బసవపురాణ, పండితారాధ్య చరిత్రములకు, రామరాజభూషణుని వసుచరిత్రమునకు మాత్రము గలిగినది. అట్టి గౌరవము వసురాయని యీక్రింది చాటువునకుఁ గూడ నబ్బుట ముదావహము. దీనికి స్వయముగ మన కవియు, సమకాలీనులగు శ్రీ ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రులుగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు, కస్తూరి శివశంకరశాస్త్రులుగారు రచించిన శ్లోకములు గ్రంథమునఁ గాననగును:

మ. అకటా! నేరెడులార! మీదెసకు నే
నత్యంతముం గుందెదన్
నికటం బందలి యీముసిండి గమికిన్
మీపాటు లేఁ; జౌఁగదా,

యకృతజ్ఞుల్ ఫలదానశీలురను మీ
మ్మస్మాదులం గొట్టిరే?
సుకృతుల్ కష్టము పాలు కావుటకు యీ
క్షోణీస్థలిం బుట్టుటల్.

ప్రకృతికిని నీకవికిని గల పరస్పరానురాగ మీ ప్రకరణమున మాటిమాటికి వ్యక్తమగుచుండును. కాలేజీలోఁ బనిచేయు వసారగదియందు పంకా లేక తపించునప్పు డప్పటి నీయుచింత లవ్యాజ ప్రేమముతో నాలోపమును దీర్చి శ్రమ మడంచెడివఁట:

గీ. శ్రమికిఁ గాలేజి వెనుక వసారగదిని
లేదు పంకా యటన్న దెత్రిని దొలంచి
నాకు వవీవనలు వీచు మీకు నేని
శాంతముఁ గృతజ్ఞుఁడను నీమ చింతలార!

సృష్టివైచిత్ర్యమునకు గోరింట యొకదృష్టాంతము. దానిని గూర్చిన చాటువు:

గీ. పచ్చనాకు నూఱి పాణి వెట్టిఁ
గెంపు జాయ పట్టి యింపుఁ గూర్చుఁ
బచ్చలోనఁ గెంపుఁ బ్రకృతి యేగతి దాఁచె
సృష్టి నెఱిఁగి యెవఁడు చెప్పఁగలఁడు?

క్షీరనీరవిభాగ నిపుణంబగు మరాళంబును గవులు మెచ్చుట స్వనామపక్షపాతము చేనటఁగాని యంతకంటె నరంటియే శ్లాఘ్యతరమఁట!

ఉ. పాలను నీళ్ల మిశ్రమగు
పాత్రను నీరముఁ ద్రోసి క్షీరముం
గ్రోలు మరాళముం గవివ
రుల్ కడు మెత్తురు; కశ్మలంపుఁగీ
లాలమునం గ్రహించి విను
లంబును రుచ్యఫలమ్ము నైశ మీఁ
జాలు నరంటి కంటె నది
శ్లాఘ్యమె? యౌర! స్వనామ పక్షతల్.

ప్రకృతియెడ నరుఁడు చూపు దౌష్ట్యమున కొండు రెండుదాహరణములు:

క. నామద్దఁ గాన్పుఁ బూని
మోమ్ముం దుమ్మెదలు నెమ్మి ముద్దాడుఁగదా!
తా మెఱిఁగి నరులు ధర్మము
హా! మెడఁ దునిమెద రిదేమి? యనుకొమ్మనో లతల్.

క. "గోముఖ శార్దూలంబులు
మా మానవు లస్మదీయ మానుల నకటా!
మాముంద చీల్చి తిం" డ్రని
భూమిజలత లేడ్చుఁ జిన్నవోయి సొనమిషల్.

తింత్రిణీ వృక్షమన్న మనకవి కభిమానము మెండు. అందులకుఁ గారణములు చాలఁ గలవు. (ఒకప్పుడది యాయనకుఁ బ్రాణదాతయూడ నయ్యెనఁట.) స్వవిషయ ప్రకరణమందలి క్రింది సీసములో నవి సూచింపఁబడినవి. ఇందుకు సంబంధించిన గాథావిశేషములు గ్రంథమునఁ గానవగును. బహుభంగులఁ జింతానదంబగు దీనికి భాషావికృతిచేఁ గలిగిన "చింత" యను నామ మీయనకుఁ జింతాకర మగుచున్నది.

సీ. బడికేఁ గొంపోవచ్చు బంట్రొతుఁ గనుఁ బ్రామి
పినవాఁడు ననుఁ జంకఁ బెట్టుకొంటి
కంఖాణకకటవేగంబు నాఁగి యనేక
హాళ్య సార్థముగఁ బ్రాయమున మనిచి
తడుగు కాదల శారదా తప మేర్వ నా
తిథ్య మిచ్చితి నేద దేర మదిమి
నమదివ మహు డిష్వు దనక జిహ్వకేఁ జారు
భావంబునను దుష్టి పఱచుచుంటి

గీ. నవ్యకోరంగి; రామచంద్రపుర దక్షు
వాటికారథ్య; గోపూరి బాహ్యసీమ;
నచట నిచటన కల్లెడ నామ్లభూజ
నీఁగు వసురాయఁ డేదారి నీలుగాంబు.

శా. గొం తెండల్ శరదాతపంబునను వ
ద్గుల్ వోక్కఁగా, వంతెవల్
శ్రాంతిల్ గాల్నడదాఁటి గౌతమిని శే
రల్ రాఁగఁ గోపూరు, త
త్ప్రాంతంబందు వసించి సల్పితివి శా
సం బాఱ నాతిథ్యముం;
జింతాహంత్రికి నీకుఁ బెట్టఁ దగునే
చింతాభిదం? బింత్రిణీ!

క. యాతాయాత జనుల కీ
తాతపవర్షార్తిఁ బాపు సత్త్యాగమ! యీ
యాతిథ్యఫలము నీదో?
భూతదయ న్నిన్నుఁ బెంచు పుణ్యాత్మునిదో?

జగన్నాథ పండిత రాయలు వృక్షములన్నిటిలో రసాలమున కాధిక్య మొసంగియున్నాఁడు. కాని మన కవి తన యభిమానముకలిమి నీ తింత్రిణికి దానికంటెఁ గూడ నధికత నొసంగుచున్నాఁడు:

క. పూవునకుం జివురున కం
తో వైరము మాని; నుండ వొకచో రెంటన్;
గోవెల తేఁటుల కిడెదవు
నీవే సహపంక్తిఁ దింత్రిణీ, వేసంగిన్.

బంధుమిత్రుల యిండ్ల కేఁగునపుడు వారొనర్చు విందుల కంటె మన కవి కచ్చటి ప్రకృతి రామణీయకమే మఱింత విందొనర్చుచుండుట గూడ నీయన ప్రకృత్యభిమానమునకుఁ బ్రబలదృష్టాంతము కాఁ గలదు. చూడుఁడు:

ఉ. పాలను బంచదార యిడి
పాయసముం బొసరించి క్రోలుచో
నాలుక పొందు సంతసము
నాసికకుం ఘటియిల్ల కేయిన
ల్లాలును, మాలతీసుమ
సౌరభమిశ్రితపుహోస్న హోన(నైటుక్వీను)పూ
బాళులకమ్మతావులను
[1] బాలెపు సత్కవి తోఁటలోఁగిటన్.
(ప్రకం. ప్ర. ౧౬౯.)

చ. కుచకుచఁ గూయుకోయిలల
కూఁతలచేతను వీనువిందుఁ గ
మ్మ వలపుఁ గ్రమ్మించు కుసు
మమ్ములజృంభల నాస విందు; వే
కువను ఘటిల్లు విందు లిటు
కొల్లలు వేంకటరామయా[2]! భవ
ద్భవనమునన్ వసంతమునఁ
బొంకులకున్ వసురాయపాత్రిపయా.
(స్వ వి. ప్ర. ౭౬.)

గోదావరి యడుగున బురద యుండుటకు సరసమైన కారణము:

గీ. జనుల దేహాత్మమాలిన్య మనుదినంబు
నీవు లోఁగొనుదానవు గావె? జనని!
గౌతమీ! దాని కతమునఁ గాఁదలంతు
నడుగునను దాపకీనతోయముల కసలు.

ప్రకృతియందుఁ గలుగు నపూర్వ సంఘటనలను, వింతమార్పులను దాత్కాలికముగ నబ్బురముగ విలోకించిన జనసామాన్యము వాని నంతలోనే మఱచిపోవుచుండును. ఇట్టి విషయముల మనకవీశ్వరుని హృదయ మొక దిన చర్యాపుస్తకమని (diary) చెప్పనొప్పును. లోకము శాశ్వతముగ గుర్తించుటకీయన యెప్పటికప్పుడే వానిని చాటు పద్య నిబద్ధములుగఁ జేయుచుండును. ఇందుల కొండు రెండు దృష్టాంతములు:—

క. ఖరదుర్మతి నామక వ
త్సరముల నైదాఘతీవ్రతమతాపంబున్
ధరియించి, ప్రజలు మర్త్యులు
పరకుగొనరు ద్రావిడశార్క సప్తరసనలన్.

గీ. నభము చిల్లులువడినట్లు నాలుగేను
నాళ్లు లఱుమని మెఱుమని గాలివాన
కార్తికంబునను రుధిరోద్గారిఁ బట్టెఁ
బంట లవి నోటిరావవి నంటఁ గలియ.

క. వహవా! విరోధికార్తిక
బహుళైకరపక్షదశమిఁ బంగుదినమునన్ (2-11-1889)
బహుళశలభసైన్యంబులు
విహాయసముఁ గప్పె జనులు వింతగఁ జూడన్.

పయిని జెప్పిన ఖర సంవత్సరమున (౧౮౯౧) ఖరకర తైక్ష్ణ్యముతో గ్రీష్మర్తు వతిభీష్మముగ వర్తిల్లిన

1. శ్రీ పాలెపు వేంకట మార్యగోపాలముగారు, అమలాపురము.
2. శ్రీ చెలకువాడ వేంకటరామయ్యగారు, చెలకువాడ.

పిమ్మట వర్షర్తుప్రారంభమునఁ దగినంతవాన లేకయే గౌతమీనది బ్రహ్మాండమును నిండు వెల్లువతోఁ బొంగిపొరలి వచ్చి దేశమును నాశమొనర్చినదఁట. అప్పు డా మహాప్రవాహముపయి వసురాయఁడు కూర్చిన "గౌతమీ మహాజల మహిమానువర్ణనము" అను ౩౦౮ పాదములు గల చంపకమాలిక భాషాభిమాను లవశ్యము పఠింపఁ దగినది. మనోహరభావసంపదకుఁ దోడు, వఱదకుఁ గొట్టుకొనివచ్చిన వివిధవన్యమృగ వస్తుగృహోపకరణాదుల వివరణముతోఁ గూడిన వర్ణనము కవికిఁగల విశేష లోకానుభవమును బ్రదర్శించి హంసవింశతికారునిఁ దలఁపించుచుండును. విస్తరభయమున నచ్చటచ్చట కొన్ని పాదములమాత్ర మందుండి యుదాహరించి యీప్రకరణప్రశంసను ముగించుచున్నాను.

....

అలమటఁ జెంది యట్టుడికి
 నట్టుడికెక్కె వెడగొట్టు సర్వభూ
వలయము; శాలిపాలికల
 వాలఁ గనుంగనుండి తక్కె నే
పాలమున మింటనుండి యొక
 బొట్టు పొటుక్కు న రాలదయ్యె;.........

....

పాలుపున నైంద్ర చాపమును
 బూని శిఖండి యఖండతాండవం
బలర నవీననీలజల
 దాగ్రముఁ జొక్కి మొగిళ్లు మహాశరా
వళి గురియింపఁ జాపకయ
 ప్రాలు వివృద్ధతిపత్తు భీష్మమై
నోలికకనురక్తబిందువులో
 కో యన, నెజ్జగ శక్రగోపముల్
వలఁగడచొచ్చె.....................

కలిగిన యంతలో నిమిలి
 కన్నులు మూరెడు బండఁ బేదుమూం
డులు బులిగోళ్లఁ గస్తురి పు
 నుంగగలం గొటికొమ్ము లద్రికి

మ్ములు గురువెందపూసలును
 బువ్వుల గుత్తులఁ దాండ్రశెత్తులున్
చెల పొడుగైన జాలవురు
 వేళ్లును జిల్లలు జీడిగింజలున్.......
 ...మఱియు
 మట్లురు లుగ్గిలు లుట్లు బందముల్
పలుపులు మోకు సిక్కెములఁ
 బగ్గము లాదిగఁ ద్రాళ్లు త్రోళ్లు కోఁ
కలులును గుందులుం బిడులఁ
 గాములు బండలు దుడ్లఁ దెడ్లు నాఁ
గళులును మేఁడు లేఁడులును
 గాఁడులు గొర్గలు దబ్బి చిప్పలున్
ములుగరగొఱ్ఱుకఱ్ఱలును
 బుఱ్ఱలు మూటలఁ గారెముల్ తలం
బులు సిడిమాకు లాకులును
 బోలిరు పడ్డలు బండ్లుగండ్లు గా

....

ప్రాస్తావిక ప్రకరణము

ప్రస్తావవశమునఁ బ్రసక్తములయిన విషయములఁ గూర్చిన చాటువులును, కొన్ని యన్యాపదేశములును నిందుఁ గూర్పఁబడినవి.

ఎల్ల రాడుమాట కల్లయైనను నిజముగనే పరిగణింపఁబడుటకుఁ గారణము:

గీ. ఏఱు దాఁటి తెప్ప నెవ్వరుఁ గాల్పరే
 పాతెత్తియ్యో నద్ది యేమికతమొ?
 చింత్రు పత్తు వ్రాసి చిత్తెత్త రా మాట
 యెల్ల రాడుమాట కల్ల నిజము.

మర్త్యలోకమును భగవంతుఁడు దుఃఖభూయిష్ఠముగా నొనర్చుటకుఁ గారణము:

ఉ. తప్పులు సల్పువారి కను
 తాపము గల్గి క్రమ క్రమంబుగా
 "నొప్పుగ సంచరింపవల
 యుం మన విం" కను పేర్తలంపు లో

సుప్రతిలంగఁ జేయుటకు
  నుండవలెం జెఱసాల; యందుకై
యప్పరమేశ్వరుండు బహు
  శక్తినిధాన మొనర్చె మర్త్యముల్.

మానవశరీరము నూటకలముతోఁ (fountain pen) బోల్చిన పద్యము

గీ. ఊటకలముతోడ నుపమింపఁ దగుఁ దను;
వోడుమషిగ నూపి రాడి యూడి
యంతమొందు నంత నక్షర వ్యాపార
మడఁగుఁ గట్టె మిగులు నాశ యుండును.

అతిపరిచయ మవమతికారణ మనుట కొక తార్కాణము:

గీ. బుట్ట బొమ్మలోన నట్టు వొక్కఁడు దూతి
చేయు గంతు లెంతొ వింతఁ గంద్రు
బొందిఁ జొచ్చి నలుపు పురుషు చేష్టలు మెచ్చ
రవమతికి నిమిత్త మతిపరిచితి.

ఆంధ్రదేశ దౌర్భాగ్యమునకు నేడు కారణమగుచున్న బ్రాహ్మణాబ్రాహ్మణ వైరస్యములకు వగచి యిరు జాతులకు సౌభ్రాత్రమును బ్రబోధించుపద్యము:

గీ. కాయగసరులు మెసవు చిల్కలును గీట
కక్రిములఁ దినుగోరువంకలును నైక
మత్యమున మాట పొందిక మాన బ్రదుకు
బ్రాహ్మణాబ్రాహ్మణేతరుల్ వానిఁ గనరె.

నోరుగలవానిదే రాజ్య మనుటకు సరసమయిన నిదర్శనము:

ఉ. జీవులలోనఁ జేరుపని
  చెట్టుల గట్టులఁ జెప్ప నేల? స
ర్వావయవంబులుం గల మ
  హాబలశాలుల సింహముఖ్యసా
నావనజంతులం బలుగ
  ణంబులమానిసి పట్టిరే లెవుం;
భావ మిదేమొ "నోరు గల
  వానిది రాజ్య" మటన్నమాటకున్

అట్టులే నోరు గలట్టిదే ప్రాణి యనుటకు:

ఉ. క్రన్నన ముక్కునం గఱచి
  కాకము పిచ్చుకఁ గొంచుఁబోవ నా
పన్నతదార్తవాదమున
  బిగ్గమనున్ మన; పట్టి పిచ్చుకే
యెన్నియొ పుర్వులం గమిచి
  యిట్టటుఁ ద్రోటి విదుర్చుచుండ ను
త్పన్నము గాదు జాలి యటు
  వాయి గలట్టిదె ప్రాణి సృష్టిలో.

ఇట్లని, చైతన్యరహితములుగఁ దోఁచు స్థావరములకుఁ గూడఁ బ్రాణ మున్నదను ప్రకృతితత్త్వపరిశోధకుల నూత్నసిద్ధాంతమును మనకవి యంగీకరింపక పోఁడు:

గీ. పర్వతంబునకును బ్రాణంబు లేకున్న
నెట్లు దానిపైని జెట్లు పెరుఁగు?
బ్రతికియున్న వాని పైఁ గాక బొంద్రుకల్
కుణపమం దెదుగునె గొఱగి చూడ?

ప్రజలకు బాధకరమయినది రాజుయొక్క పరిపాలనము గాక యందుఁ గుదిరిన దుష్టసేవకు లనుటకు సాదృశ్యము:

గీ. గాలివలన జనుల కనులు మండునె? దానఁ
గలియు కొన్ని రేణువులనె కాని;
పాలనంబు కాదు బాధకం; బద్దాన
నమరు కుజనులు విబుధార్తికరులు.

బ్రహ్మవ్రాసిన వ్రాఁత తప్ప దనుట కొకమనోహరోదాహరణము:

ఉ. అంబుధి బాడబానలశి
  ఖావళితాపము దప్పు నంచు ము
త్తెంబు పయోజగంధి జగ
  తీసుతనాసిక నాశ్రయించె; హా
యంబుజ సూతివ్రాఁత వితథ
  యౌనె? దపప్రతిమాన విప్రయో
గంబున మాఁడ్చె నామె నిడు
  గాలుపుటూరుపు·టగ్గి వేఁడుముల్

భార్య యమకూలవతి యైననే యర్ధాంగి గాని లేనిచోఁ బ్రక్కలోని మృత్యువేయఁట:

క. కానిదని తెలిసినపు డర
మే ననుకో కాలిఁ బక్క మిత్తిగఁ గనుఁగో;
మ్మేమంగు వంటి మానిసి
పేనుం గగుటయు ఘటిల్లు విటఖడ్గహతిన్.

అన్యాపదేశములకుఁ గొన్ని యుదాహరణములు.

గీ. నీలకంఠ ద్యుతికిఁ దోడు నిటల మందు
భూతి చెలువంబుఁ దాల్చితి పోతుఁబిచిక!
చిత్తమున శివసాదృశ్య చింత యున్న
వేషముల కేమి లే కామ విజయి వగుము.

క. విడిచిన తామరపూవా!
తడ వేటికి పలికె దీవు? త్వత్సన్నిధికి
ప్పుడు వచ్చిన యీతుమ్మెదఁ
గడుపు తినియఁ గ్రోలనిమ్ము కమ్మని తేనెన్.

గీ. ఎంతదొడ్డవాఁడే యిందిరావల్లభు
బొడ్డుఁదమ్మికన్న ముద్దుబిడ్డ;
కనుల నీరు గాఱఁ గటకటా! పడసైచె
ములు కంపమీఁద మల్లెపూవు.

ఉ. అంటినఁ గందిపోదెద వ
టంచును నల్లము తల్లడిల్లు; ని
న్నంటనిచో నవజ్ఞ యను
వంచును జంకు జనించుఁ; గావ నీ
రెంటికిఁ దప్పుకొంటను ని
రీక్షణభృంగకులంబుచేత ని
న్నంటియు నంటకుంటి; మది
నల్గకుమీ నవకుందమాలికా!

గీ. పువ్వుపై పుట్టి జనులఁ నిట్ల బ్రువ్వఁదిట్ట
బ్రదుకుచున్నావి నీ! కోఁత బ్రదుకి దేల?
చెంతఁ గరవీరమును జూచి సిగ్గుపడవు;
నీచబాదము! దుర్గంధ ధామ మైతి.

ప్రకీర్ణకప్రకరణము

వివిధవిషయ ప్రసక్తములయి పయిప్రకరణముల క్రిందఁ జేరని చాటువు లిందుఁ గూర్పబడినవి. మఱియుఁ గొన్ని సంస్కృతచాటువులు, ఉత్తరరామచరిత్రనాటకమందలి కొన్ని యంకములలోని శ్లోకములు, శంకరాచార్య కృత భజగోవిందాది శ్లోకములు మున్నగువాని కీయన యొనర్చిన యాంధ్రీకరణములును, బంధుమిత్రుల యొక్కయు, వీరేశలింగకవి, వేంకటరత్నకవి మొదలగు సోదర కవులయొక్కయు, విక్టోరియారాజ్ఞి, ఎడ్వర్డు చక్రవర్తి మున్నగు వారియొక్కయు నిర్యాణములను గూర్చి వ్రాసిన పద్యములును నిందుఁ జేరినవి. మొదటి తరగతి చాటువులను మాత్రమే కొన్నిటి నుదాహరించుచున్నాము.

కవిత్వమును మన పెద్దలు చిత్రకళలలోఁ బరిగణించిరి. కేవల చిత్రకళ, కవిత్వము నను రెంటిలో నేది యధికతర మను సంగతి చాలఁగాలమునుండి తేలని విషయము. ఏకళాభిమాను లాకళకే ప్రాశస్త్యము నాపాదింతురు. ఈ విషయకమయిన వసురాయని చాటువు భావగర్భితమయి యాయన యభిమానవిషయగు కవిత యెడనే పక్షపాతమును సూచించుచున్నది.

మ. కవితాచిత్రకలా విలాసవతు ల
క్కాసెల్లి యందైన జా
హ్నవితోఁ బార్వతితోడఁ బోల్పఁదగు గ
న్యల్; చక్కనైవట్టియ
క్కవయుం దెక్కువ తక్కువల్ దెలిసితోఁ
గష్టంబయా; నైన, మ
క్కువయాంత్రం బయిఁ బ్రక్కఁ
దాల్చు నిటలాక్షుండౌనొ దక్షుండటన్.

కవితకిని, గర్భిణీస్త్రీకిని సాధర్మ్యము చూపు పద్యము.

క. మూలాలితనముఁ బిదపను
జాలెంతతనంబుఁ దెచ్చి ప్రసవక్రమముం
దూలించి, కందు, తల్లిం
దేలించు సుఖాబ్ధిఁ; గృతియు గవినట్లే.

శృంగారరసశీర్షికక్రింద నీప్రకరణమునమున్న పద్యములన్నియు శృంగారరసప్రియులు తప్పక చదివి యానందింపఁ దగినది.

వాల్గంటుల శ్రీగంటిమాద్కూల వాఁడితనముఁ గూర్చిన చాటువు.

సీ. వాఁడిగోళ్లనొసంగి వ్యాఘ్రసింహములకుఁ
గొమ్ముచీటెయు లేనుఁగుల కమర్చి
దృఢవిషాణంబులు వృషభంబులకునిచ్చి
ఖరఖురంబులు ఘోటకములకునిచి
కుంభీనసములకుఁ గోఱలు దయచేసి
వృశ్చికములకిడి విసపుఁగొండి
నీడోద్భవములకు నిశితచంచువు లుంచి
తొండముల్ ఘటియించి తుమ్మెదలకుఁ
గీ. ప్రకృతి ప్రజలకుఁ దనపగ్గ బయలు పఱుప
నట్టి వుడిగి ప్రసాదించె నబలలకును
గలికిచూ; పదియామె శ్రీగంటఁ బఱపు
మాత్ర, మూర్ఛ మునుంగని మగలుగలరె?

"నానాసూన వితానవాసనల..." అను వసుచరిత్రకారుని పద్యమాంధ్రవాఙ్మయమున సుప్రసిద్ధము. దానికంటె గుణాతిశయముగల వసురాయని చాటువు చిత్తగింపుఁడు:

చ. కనకము తున్నలోపలు సు
గంధము లేనిది యంట కెంతయుం
గనలుచుఁ జంపకాకృతిని గైకొన
నప్పుడు కూడ, దేటియుం
టని దిది యేటిపూవనఁ, బ
డంతుక మేనయిపుట్టె, సర్వభూ
జన నయనాళి కెంతయును
సంతసిలం గొఱలేక భాసిలున్.

చెన్నపురిని దర్శించి నపుడచ్చటి విశేషములఁ గూర్చి యాకవి వ్రాసిన పద్యములుగూడ నాసక్తితోఁ జదువఁదగియున్నవి. అందొకటి:

చ. టకటకధావదశ్వఖుర టంక
పుటాంచల ఘట్టనార్భటిన్
జెకుముకిఁ బోలె రాకటికి
నేలను జెల్లడరన్ మిడుంగురుల్
నికట ధరాతలం బనర నేమి
పరిభ్రమణంబులం బృహ
చ్ఛకట ఘటావిహారములు
సాగును సాగరవేల సంజలన్.

పోస్టుకార్డువిలువ యరణా యేసంవత్సరమున నైనదని ప్రశ్నించినచో మనలోఁ బెక్కుమంది వెంటనే చెప్పజాలమనుకొందుము. అందుల కీక్రిందిపద్యము వల్లించుట మంచిది.

క. ఏఁబది రేడులరాజ్ఞీ
జూబిలి పద్యములనంటెఁ జొక్కుచు "ఐమ్నుం
జాబొక్క నేబుతో" నని
దూఁబరయుంధుభిని "రెంటితో" ననవలెన్.

రైలుబండిని గూర్చిన చాటువులుకూడ మెచ్చుకోల్పుచున్నవి. ఉదయమయిన తరువాతఁగూడఁ గలువపూలు పూర్తిగా ముకుళింపకుండుట సాజము. అందులకుఁ గారణము రైలురొదయాయని కవి ప్రశ్నించుచున్నాఁడు.

గీ. కలువతీఁగెలార! కాంతునితో రేయి
సలుపు జాగరంబు చాలదొక్కొ
కన్ను మోడ్పరేమికత? మింత ప్రొద్దెక్క
రైలురొదను నిదుర రాదొ మీకు?
లేవుస్టీమరును గర్భిణీస్త్రీతోఁ బోల్చినపద్యము:
గీ. లేవుడాఁకెడు ప్రజలు లోఁ గిక్కిఱియఁగ
నదికి నెదురెక్కనేరక నడక యేట
మందగతి నేఁగుచున్న స్టీమరును జూడఁ
బూర్ణగర్భాలసాంగనా స్ఫురణమయ్యె.

కాకినాడ రాజమహేంద్రవరములఁ గూర్చిన చాటువు:

గీ. ఈడునకు జిన్నదై కాకినాడనగరి
యొమ్మెలను మీఱు రాజమహేంద్రపురిని
బడుచు బోగపుఁ జానకుఁ బనులు మెండు
ముసలి ముత్తైదువకు నింత పసుపుఁ బొందు.

ఆంగ్లపరిపాలమునఁ గలిగిన నాగరకతా విశేష


౪౪-వ అఖిలభారత జాతీయమహాసభ-లాహోరు-చిత్రములు




లజపతిరాయి నగర ద్వారము



లజపతిరాయి నగరములోని దృశ్యము



లజపతిరాయి నగరమునందలి దృశ్యాంతరము



జాతీయపతాకము-జాతీయాంజనము

ముఁ బట్టి త్రిశంకు వారిని సృష్టికి బ్రతిసృష్టి యొనర్చిన విశ్వామిత్రునితోఁ బోల్చిన పద్యము.

సీ. శైలఘనోష్మకు జంకి మూలమూలలదాఁగె
బంగరడ్డల గూఁటి పల్లకీలు;
బ్యాండుమేళము కంటఁ బసిగ్గి పడెఁ బెండ్లి
తోరణా లదరించు వీరణాలు;
మాయమై పోయెముద్రాయంత్రముల దాడిఁ
దాళపత్త్రాలు గంటాలు నోటులు;
నగ్గిపుల్లలపెట్టె యలయార్చుటకే విచ్చు
మొగ్గలయ్యెను జేకుముకులు జాలు;
గీ. నాటకలముల పాళీల పోటికోడి
చాతుకెమెలీక లంగళ్లు పాసిపోయెఁ
జల్పఁ బ్రతి శిల్పమును బూర్వ శిల్పమునకు
నబ్బురంపు విశ్వామిత్రు లాంగ్లజనులు.

వడ్లుదంచెడు స్త్రీలను గూర్చినపద్యము స్వభావోక్తి రామణీయకమున కొక నిదర్శనము.

ఉ. రోఁకటి తోడ దోర్లతలు
రోజములాడ నతోన్నతంబులౌ
మోఁకనడల్చు పోటులకు
హుంకృతులారఁగఁ గాళ్లు ముందుకుం
దూఁకను వీఁకఁ జూచి యను
కుల్ పలయంబుగఁ జాడుచుం బదా
లూఁకున వడ్లుదంత్రు చెమ
టోడికలన్ జిలకట్లు వావఁగన్.

కాల్వనీటిలోఁ బ్రతిఫలించు తాడిచెట్లను బాములతోఁ బోల్చెడి పద్యము:

క. అలలమడుంగుచు సాగునఁ
దలక్రిందుగఁ గాల్వనీటఁ దాళంబుల నీ
డలు, పాతాళమునకుఁ జను
పలువలలవిశేషయముల పగిదిఁ దనర్చున్.

ధీమణిపత్త్రికాధిపతులగు బ్రహ్మశ్రీ పుల్లెల శ్రీరామశాస్త్రిగారి సాధ్వీమణి శ్రీమతి వెంకట సుబ్బమ్మ గారి మరణ మత్యంతవిషాదకరమును వీర రసప్లుతము నయి లోకమునకుఁ జిరస్మరణీయ మగుచున్నది. సహజధీరురాలగు నీసతీతిలకము రాక్షస సంవత్సర భాద్రపద శు 9 గురువారము నాఁటి నడురేయిఁ బుత్త్రప్రేమము మెయిఁ బురుషులకుఁగూడ నసాధారణంబగు నప్రతిమ సాహసమును దెచ్చికొని యొక్క ఘోరకాకోదరముతోఁ బోరాడి వీరవిహారమొనర్చి పుత్త్రులకొఱకుఁ బ్రాణదాన మొసంగి వీర స్వర్గమలంకరించినది. తల్లియాత్మార్పణమువలనఁ బ్రాణములు దక్కిన యాబాలు రిరువురు నిప్పు డున్నతవిద్యావంతులయి వర్ధిలుచున్నారు. ఇట్టి వీరమహిళలచరిత్రములు కవులకు గేయములగుటలో నాశ్చర్యము లేదు. ఈ వృత్తాంతము జరగిన వెనువెంటనే కొందఱు కవికుమారు లీయమ యనిర్వాచ్యపవిత్రపుత్త్రప్రేమోజ్జ్వలితములగు నద్భుతధైర్య సాహసములను గాన మొనరించిరి. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారు భారతిలోఁ బ్రకటించిన "కడుపుతీపు" అను రసవత్ఖండకావ్యమున కీనారీరత్నము చరిత్రయే యితివృత్తమయి యుండునని తలంచెదను. ఈ వీరాంగన మరణమునుగూర్చి మన వసురాయని చాటువు:

ఉ. పెల్లిన తోల్కరిన్ వఱద
పెల్లునఁ గొట్టుకవచ్చి, యేటి ప్ర
క్కల్లెగఁ బ్రాఁకి, దాఁగి పగ
లెల్లను గప్పున, మాపు క్రిందికిం
జల్లగజాఱి, ప్రక్కల ద
సంజను ప్రాఁచును బట్టెఁ జేతితోఁ
బిల్లలతల్లి; హా! కడుపుఁ
బ్రేమునఁ బ్రాణము గడ్డిపోఁచగా.

జరగిన సంగతు లిందు సరిగా వర్ణితమయినట్లు తోఁచదు. పాముపయినుండి పడుటలోనే ప్రక్కలదిసఁగాకసరిగా శ్రీవేంకటసుబ్బమ్మగారిమీఁద నేపడెననియు, నామె యందుపై నిద్రనుండి దద్దిల్లి లేచి చూచునంతలో నది పిల్లలున్న వైపునకుఁ బ్రాకిపోవుచుండుట గాంచి యామె మహాసాహసముతో లంఘించి దానిని బట్టుకొని యెన్నికాట్లు వేసినను బట్టు విడువక పెనఁగులాడెననియు శ్రీశాస్త్రిగారు నాతోఁ జెప్పియుండిరి. ప్రకృతిప్రకరణములో వృక్షాదిక ప్రశంసాసందర్భమున

స్వార్థపరుఁడగు నరుని జన్మముకంటెఁ బరోపకారపరములగు తరురాజముల జన్మమే యుత్తమమని నేను వ్రాసియుంటిని. ఇటుకావముల కయి నఱకఁబడు ఫలభూజములను గాంచి మనసు కరఁగి మనకవి పలికిన చాటువులు నా యీయభిప్రాయమునకు సాయపడుచున్నవి.

మ. ఫలభూజాతములార! యెక్కడను మీ
పాలింటికిన్ వచ్చె నీ
వలచెండాటలు నిట్టుకావము లహో!
వజ్రప్రహారంబులన్
కులభూధ్రంబులు వోలెఁ గూలెదరిటుల్
గొడ్డండ్రఘాతంబులన్
నిలుచున్ మీబహులోపకార సుకృతుల్
నిచ్చల్ రసజ్ఞాత్మలన్.

మ. జననంబన్నను మీదె జన్మము
మహీజాతంబులారా! జగం
బున; జీవంబుననున్న యప్పుడది త
మ్ముంబాసి చన్నప్డు మీ
తనువుల్ లోకహిత క్రియార్థవినియు
క్తంబుల్; మిమ్ముం గన్న దే
జనయిత్రీమణి; మాతృయోనవ
వన స్వాహోధవుల్ దుర్భవుల్.

స్వవిషయ ప్రకరణము

కవి తనజీవితమందలి స్వవిషయములకు సంబంధించిన చాటువుల నిందుఁ జేర్చుటచే దీని కీ పేరు గలిగినది. వసురాయని సాంసారికజీవితము చాలవఱకు దుఃఖభూయిష్ఠమే యన నొప్పును. ఈయనకుఁ గలిగిన కళత్రవియోగము లనేకములు. అందులకు సానుభూతిఁ దెలుపుచు నొకరిట్లు వ్రాసియున్నారు.

చ. వరకవి తాలతాంగినన
వద్యమతిన్ గని గూడి కేవల
చిరతరసౌఖ్య కీర్తులను
జెందుచుఁ దమ్మొకరీతిఁ జూడ నీ
సురుచిర గాత్రలందఱది
చూచి సహింపఁగలేక గాదె దు
ర్భరతర చింతతోడ నెడఁ
బాసిరి నిమ్ముల నిట్లు మిత్రమా!

తనకు వాటిల్లిన జాయా వియోగములఁ గూర్చియుఁ దృతీయ కళత్రమువలనఁ గలిగిన ప్రహ్లాదకుమారుని మరణముఁ గూర్చియు నీతఁడు వ్రాసిన కరుణారసపూరితములగు చాటువులు "సతీస్మృతి, సుతస్మృతి" యను పేర నిదివఱకే ప్రత్యేకపుస్తకరూపమునఁ బ్రకటింపఁబడినవి. అవి యిప్పుడిందుఁ జేర్పఁబడలేదు.

రాజమహేంద్రవరము చేరిన తరువాతఁ జాలఁగాల మద్దెయిండ్లలోఁ గాఁపురము సేయుచు మనకవి పడిన కష్టము లనేకములు. తరువాత స్వగృహము కట్టినప్పుడీతఁడు వ్రాసిన చాటువు లీదృశానుభవము గలవారి కింపు నింపఁగలవు. అందొకటి రెండు:

సీ. స్వాతంత్ర్యభూతల స్వర్గసౌఖ్యావహా
మిలు కేఁడులకు సొంత గృహము సూవె
పరగేహవాసోగ్ర నిరయదుఃఖాపహా
మిలు కేఁడులకు సొంత గృహము సూవె
పృథుగృహచ్ఛిద్ర గుప్తిస్నేహ ధూర్వహా
మిలు కేఁడులకు సొంత గృహము సూవె
కాయయాత్రాకష్ట కంటకోపానహా
మిలు కేఁడులకు సొంత గృహము సూవె
గీ. మధుర సంపత్సరోరుహా మధులిహమ్మ
నిల్లు కేఁడులకును సొంతగృహము సూవె
సైకదివ్యఫలామరానోకహమ్మ
నిల్లు కేఁడులకును సొంత గృహము సూవె.

సీ. "గ్రాసమున్నుల దైవ వాసంబు శివది గా
వలె" నన్నలోకోక్తిఁ దలఁచి తలఁచి
"యిల్లు లేనమ్మకా హీనతపడు" నన్న
యాఁడుపాటెల పాట కరసి యరసి
"పరగృహావాసంబు నిరయ కల్పం" బను
పండిత వాక్యంబుఁ బట్టిపట్టి
పిల్లిపిల్లలఁ బోలెఁ బిల్ల సంసారంబుఁ
దరలించి యిల్లిల్లుఁ దిరిగి తిరిగి

గీ. యూపడంబులు పడిపడి యిఱికి యిఱికి
విసిగి వేసారి యీశ్వరు వేఁడివేఁడి
యిరువదేండ్లుండి రాజమహేంద్రనగరి
నిపుడు మన్మథ వసురాయఁ డిల్లుఁ గట్టె.

* శ్రీనాథుఁడు తనచేతి గోరొకటి విఱిగినప్పుడు చెప్పిన చాటువని యీమధ్య శృంగార గ్రంథమాలా సంపాదకులు ప్రకటించిన క్రీడాభిరామము (ద్వితీయ ముద్రణము)లోఁ బత్రికా కర్తలొక పద్యము నుదాహరించిరి. అందలి నిజము పరమేశ్వరున కెఱుక. పది రూపాయల రొక్కముతోఁ బ్రమాణపత్రిమర్పించు పండితులకుఁ గాని మొంగము చూపనేరని యాకృతిలలామమందలి పద్యమును జనులకెల్ల సుఖముగ నందు బాటుగ నీపత్రికలోఁ బ్రకటించి గ్రంథ ప్రకాశకులకు నష్టము గలిగించు నిష్టములేక దాని నిందుదాహరింప జాలకున్నాను. తనదంత మొకటి యూడినపుడు మనకవి పల్కిన చాటువులుగూడఁ జదువరులకు వినోదముఁ గూర్పఁగలవు గాన వానిలో రెంటి నుదాహరించెద.

చ. ఎడలఁగ బాలపండ్లు మొల
కత్తితి వెన్నఁడో పిన్ననాఁడు, నేఁ
గుడిచెన నిష్టమా బిఱుసుఁ గూడును
గూరలు నర్వ లప్పడాల్
వడెములు వేఁగభక్ష్యములు
వావిరిగింజలు నీబిగిం; గటా!
యుడిగము సేఁబనే శ్వలిపి
యూడితివే వసురాయ దంతమా!

చ. తెలిసి ప్రకాశమానముగ
దేహబలంబునఁ జేసి; దేహపుం
బలము ప్రవర్ధమానముగ
మర్త్యున కిష్ట పదార్థ భుక్తిచే
వలయు పదార్థముల్ దినుట
త్వత్పటిమంగద; యింతయేల? నీ
చెలిమిన భక్ష్య భోజ్యరుచి
జిహ్వ కలంతివె నీవునంతమా!

నఖదంతముల స్థానభ్రంశము గూడఁ గొన్ని యెడల గారవమునే గాంచు ననుటకు దృష్టాంతము.

క. స్థానభ్రంశము నొందిన
చో, నఖములు దంతములను శోభిల; వైనం
గానమె గారవ మెనయం
గానవి వ్యాఘ్రములవైన గజములవైనన్.

శ్రీమూర్తి వసుప్రకాశ మండలి యొక్క పద్యము యొక్క పూర్వార్థమునకు లోక దృష్టాంత సమన్వితముగు నుత్తరార్థము కుదురక లోక మంతయు నాలించి యాలోచించుచుఁ గంటికిఁ గూర్కులేక యొకరే యెల్ల గడపినప్పుడు చెప్పిన పద్యము కవితామృతములకుఁ గల సౌభాగ్యమును సరసముగా నెలకొల్పుచున్నది.

క. అమృత కవనంబులకు సా
మ్యము కేవల మొక్క మధురి మనెకాదుసుమీ
సుమనో జీవనములునై
యమరత్వము ననిమిషత్వ మని యొదవించున్.

వసురాయఁడు తనతండ్రి కంకితముగా రచించిన విశ్వరూప స్తవమను తారావళియు, మంగళాద్రి నృసింహస్వామిని దర్శించినపుడు భక్త్యావేశములో నుడివిన పంచాశకయు నిదివఱకుఁ బ్రత్యేకముగా ముద్రింపఁ బడినను నిందుఁగూడఁ గూర్పఁబడినవి. వానిలో నొండు రెండుమాత్ర ముదాహరించెద.

చ. ఇముడుచు శక్తినీద పర
మేశ్వర, యద్భుత గోచరంబు; వి
శ్వము భవదీయ దేహమున,
స్వల్పపు బీజమునన్ వటావనీ
జము బలె సంతరించి; తెది
సాగదు నీవెడ నెంచ! నాదునే

* వ్యాసమున కింతయైన సంబంధింపని యిట్టి విషయములను అనావశ్యకముగ నవకాశము గలిగించుకొని యిరికించుట సమంజసము కాజాలదని తలతుము.—సంపాదకుడు, భారతి.

త్రమున నజాండమెల్లఁ జేరదా?
వరదా! మురదావ నీరదా!

క. కానిక నీకుం జెల్లఁ బుఁ
బొవక మే యనఁగ నేల? భక్తులుకల దే
వానికఁ దర్పింతురు; కొను
మా, నాకవనంబు; మంగళాద్రి నృసింహా.

క. నీనామము కలకండము
గా, నాకవనంబు విమల కమలము గాదా?
పానకమే తత్స్మరణ;
మానుము చెవులార; మంగళాద్రి నృసింహా.

మహాశయులారా! మంగళాద్రి నృసింహ స్తవముతో మంగళముపాడి యీవ్యాసము నింతటితో ముగించుచున్నాను. మొదటఁ జెప్పినట్లు నేనిందుఁ జేర్కొనిన పద్యములు స్థాలీపులాకన్యాయగృహీతములే గాని యిందలి రసవత్తరపద్యము లింతమాత్రములే కావు. ప్రతిపద్యము నేదో యొకతీరునఁ జవులూరుచునే యుండును. కావున నాంధ్రమహాజనులెల్ల నీప్రబంధము నాదరించి యందలి కవితామృతమును గ్రోలి యానందింతురు గాక యని ప్రార్థించుచున్నాను.

విటచపేటము

ఎం. వేంకటశర్మ గారు

పువులే వేశ్యల మేనుదీవె లనుచుం బూదేనలే మోవిలో
చవు లంచున్ సరసంబె స్వర్గమనుచున్ శ్లాఘించెదే సారె కా
నవులే పైపయి వన్నెలన్ గనియె మోహంబందగా వచ్చునే
పవులే వారల చిత్తముల్ వినుము నా పల్కుల్ భుజంగాగ్రణీ!

వెలకాంతల్ పచరించు వింతవగలున్ విన్నాణముల్ వేడుకల్
కులకాంతల్ రచియింప నేర రని వాకోబోకు మాచిత్రముల్
కులుకుల్ కూర్ములు కాసుకోసమె సుమీ! కొన్నాళ్లబుల్పే సుమీ!
కలకాలంబని నమ్మబోకుమి భుజంగగ్రామణీ ధీమణీ!

జిలుగుల్ వల్వలు జూచి మోము మెరుగున్ సింగారముం జూచి బల్
................జూచి సోగకనుదళ్కున్ బెళ్కులుం జూచి తె
క్కలిపల్కున్ పస జూచి వేశ్య వల జిక్కన్ బోకుమీ గూటిలో
జిలుకన్ జేసి హరించివేయుజుమి నీస్వేచ్ఛన్ భుజంగాగ్రణీ!

సొగసున్ దాపుల జిల్గుదువ్వలువలున్ సొంపౌ నలంకారముల్
వగలున్ సైగలు మందహాసములు మవ్వంపున్ విలాసాలు మ
చ్చిగలున్ రాగములున్ సరాగములు బల్ శృంగారపుం జావళుల్
సొగియన్ జేయును గాక వేశ్యలకడన్ జోద్యంబు వే రున్నదే
నగుబా టీతగులాటముల్ విడువు మన్నా పల్లవగ్రామణీ!

అరుణపల్లవ కోమలాధరంబును గన్న, మదిలోన రాగ సంపద జనించు
నవనీలకుంతల నైగనిగ్యము గన్న గాఢాంధకారంబు కనుల ముంచు
మదమరాళమనోజ్ఞమందయానము గన్న దశముగా మతికి మాంద్యము ఘటించు
లోలంబులగు వాలుగ్రాలుగన్నులు గన్న తలపు సంతత చలత్వము వహించు
ప్రసవసుకుమారతనుసౌరభమును గన్న-మరులువేదురు తల కెక్కి మగత బెంచు
గాలి సోకియు బ్రతికిన ఘనులు లేరు-చనకు మా వేశ్యచాయ భుజంగరాయ!

నలుగురు నిన్ను జూచి మది నవ్వ టెరుంగవు నీదుమిత్రులే
చులుకదనంబు నీయెడల జూపు టెరుంగవు నీదు భృత్యులే
యలుసుదనంబు జేయు టది యైన నెరుంగవు నీకులంబులో
పలుచదనం బెరుంగ వహా పాప మిదేమి ? భుజంగపుంగవా!

పదరా చెప్పెడు బుద్ధులన్ వినవు నీబాగోగు లూహించుకో
గదరా! నీ కిది పెద్ద యంగదర; నీకర్మంబుచే నీకు నా
పద రా నున్న దెరుంగ వే మనెదరా బాగాయె చా లింటికిన్
పదరా! రోమదిరాక్షియి ల్విడిచి యిప్పాటన్ భుజంగాగ్రణీ!

సత్యహరిశ్చంద్ర-జీవితాదర్శములు

ఏ. వి. రత్నము గారు

సత్యహరిశ్చంద్ర కథను విమర్శించుటకు పూర్వము, అవతారికా పూర్వకముగ భారతీయ పూర్వ నాగరకతను గురించి యించుక ప్రసంగింప నవసరమయ్యెడిని.

మహాభారత మహిమాతిశయమును గూర్చి యర్థవంతమగు నొక చిన్నకథ గలదు. మున్నొకప్పుడు నైమిశారణ్యమున గూడిన మునిబృందము మహాభారతము నొకవైపునను, శిక్షాంగల సకలవేదవేదాంతేతిహాసాది పారస్వత సంభారము నొకవైపునను తులనిడి తూచగ, మహాభారతమువైపునకే ములు మొగ్గినదట. అందుచే, నది యంతి మహత్తరంబయిన భారము కలదగుటచే, దానికి మహాభారతమను పేరు సుప్రసిద్ధమయ్యెనని.

అట్టి వరప్రశస్తం బైనట్టి, మహోవర్ష భారవహంబగు మహాభారతమును, "అనేకవిధ పదార్థప్రపంచ సంచితంబును, సపపర్వ మహాపర్వ శోభితంబును, సప్తద్వీప మహాద్వీపసంభృతంబయిన భువనంబు నజుండు నిర్మించినట్లు, కృష్ణద్వైపాయనుండు నిఖిలలోకహితార్థంబు నిర్మించెను." ఇట్లు నిర్మింపబడిన మహాభారతము, కృష్ణద్వైపాయనోద్యానజాత పారిజాతము," వేదవేదాంతార్థ ప్రతిబోధకమగు నొక గొప్పధర్మసంహిత, ఒక ఆమ్నాయము మాత్రమే కాదు; కొండొకకాలము నాటి మిగుల ప్రాచీనమయిన ఆర్యుల నాగరకతను, సభ్యతను, వైభవమును, ప్రతిపాదించు చరిత్రము, ఇతిహాసముకూడను. అది అతిప్రదీప్త ప్రజ్ఞాప్రభావములచే ప్రకాశించిన వీరయుగము యొక్క చారిత్రము, ఆ నాగరకతా విశేషములు, ఆసభ్యతా పరిమాణములు, ఆ వీరయుగము మహాభారత యుద్ధముతో భరతవర్షమున నంతరించెను. అంతనుండియు స్థిరత్వమును నిశ్చలత్వమును నొంది, యనుపహతముగ నేటివరకు నొకేతీరున, భారతవర్షమునం దంతటను వ్యాప్తమయి భాసిల్లుచున్న యొక విశిష్టనాగరకతా సభ్యతలు, సాధనారాధనములు, సంకల్పములు, జీవితధర్మములు, పెంపొంది యుండుట గానవగును. * ఈ సాంఘిక జీవితము నాదర్శప్రాయముగ, ఒక రాజచరిత్రమును గైకొని యథాతథముగ, ఉదాత్తకావ్యగుణంబుల నభివర్ణించునట్టి యితిహాసము రామాయణము. హిందూసమాజమున నేటివరకు సవ్యయముగ నిలిచియున్న ఆ నాగరకతను, ఆ వర్ణాశ్రమ ధర్మములను నేర్పున ప్రతిబింబితము చేయు విమలమణి దర్పణము రామాయణము. రామాయణము నాటికే ఒక ప్రామాణిక జాతీయ జీవితధర్మపథము, నీతినిబంధనము భరతవర్షమున నాటుకొనెను. రామాయణమున నేగృహస్థధర్మములు, ఏ సంకల్పములు, ఏ సామాజిక జీవితధర్మములు చిత్రితములయ్యెనో, అవియే నేటికిని భారతజాతీయ జీవితమునందు వ్యక్తమగుచుండును. కావుననే ఒక పాశ్చాత్య పండితవర్యుడు, "రామాయణము నెఱిగినవాడు హిందూదేశము నెఱుగు" నని యథార్థము వచించెను. అనగా, హిందువుల సాంఘికనిర్మాణమును, జీవితవ్యవహారములను తెలిసికొనగోరువారు హిందూదేశమునకు ప్రయాణమై పోనక్కరలేదు, రామాయణము చదివిన గ్రహింపనగునని.

భారత రామాయణములిట్లు కావ్యరూపమును గొన్న భారతీయుల యితిహాసములు, సాంఘికచరిత్ర

* ఆర్యనాగరకత భారతదేశమున పుట్టినదాదిగ నేటివరకు నవిచ్ఛిన్న సంతతధారావాహినిగ వచ్చుచున్నదని చెప్పెడి వారి నుడివిని కొన్ని విశేషములతోడను, నిపాతములతోడను గ్రహింపవలసి యుంటుంది. ఆ నాటి కర్మకాండ, ఆవైదిక ధర్మములే నేటికిని హిందూసమాజపు కట్టుబాటుల ననుశాసింపవచ్చును. కాని, జీవితసరణియందు, సాంఘికవృత్తమునందు చాలవ్యత్యాసముగలదు. అప్పటికి నిప్పటికి మహాభాగతముపలనవ్యతకమగు నీవ్యత్యాసమును గాంచదగియున్నది. సూక్ష్మముగ ఒకమాటలో చెప్పుచో, ఒకటి తేజోవంతము; ఒకటి తేజోహీనము.

ములు, ధర్మకావ్యములు. అందు రామాయణముయొక్క ప్రత్యేకతయేమి? అది యొక యపూర్వకావ్య వస్తుసంపత్తితో వలరారు సమగ్రమహాకావ్యము, ఆదికావ్యము. రామాయణము బొమ్మలతో గూడిన కావ్యానంద మును నొసగూర్చు నొక దేశకాల పాత్రముల చరిత్రమే కాదు; భారతీయుల జాతీయ జీవితచరిత్రమే కాదు. అది ఒక దేశమునకే చెంద దక్కుడులేదు. అది జీవితము మీద నొక మహోన్నత విమర్శనమువలె కూడ నుండును.

రామాయణము బోధించునది, వినిపించునది, "విధి విలసితములు మానవుల కనుల్లంఘ్యములు, అప్రతిహతములయి, మానవు డెంతటి మహిమాన్వితు డైనను, విధిముందర నిష్క్రియుడయి పోవుననియూ, లేదా తన జీవిత రేఖానిర్మాణమునకు తానే కర్తయనియూ, మానవుల మహోద్యమముల నిష్ఫలత్వమువా, ఆదర్శ జీవితము దుర్లభమనియూ, ధర్మము స్థానమును జీవితముతోనే చెల్లింప వలసియుండుననియూ, న్యాయప్రధానదేవత (Nemesis) యొక్క దండమువా, జీవితము దుఃఖమయ మనియూ, జీవితనిస్సారతవా,—ఏద్దియో యపూర్వము, అశ్రుతపూర్వము, అగాధము, హృదయ సంవేద్యమునగు ప్రతి బోధమును వెనుకనుండి వినిపించు చుండును. రామాయణఫలశ్రుతి, ఐహికమో, ఆముష్మికమో, అపవర్గపదసౌఖ్య ప్రాప్తియో, బ్రహ్మానంద సంధానమో, ధర్మాన్వేషణమో, అఘమర్షణమో, అపదుద్ధరణమో, పరమపురుషుని తెలిసికొనుటయో, లేక రామభక్తియో, ఇదియేమోగాని మానవుని నిర్విణ్ణునిచేసి చేతులుమోడ్చి, 'నమో నారాయణాయ' యనునట్లుచేయును. ఈశ్వరుడే తాసృజించిన సృష్టిశృంఖలములకు కట్టువడి, గాలమునకు పడిన చేపవలె, ఆత్మనిముక్తికై గిజగిజ కొట్టుకొనుచున్నాడో యనునట్లుండును. ఇది రామాయణగానము యొక్క భారమువలె గన్పట్టును.

వాల్మీకి రామాయణమున శ్రీరాముడు వేదవేద్యుడగు పరమపురుషుని యవతారమూర్తిగ నుండలేదు. శ్రీరాముడు కేవల మొక మహాసత్త్వసంపన్నుడును, ధీరోదాత్తుడునగు మానవునివలె కన్పట్టును గాని, దేవతా మహిమగల వానిగలేను, తానొక యీశ్వరావతార మనెడి దివ్యజ్ఞానముతో ప్రవర్తించినట్లును లేదు. శ్రీకృష్ణ లీలలవంటి మహిమాద్భుతములు శ్రీరాముని చరితమునందు లేవు రాముడు పరిపూర్ణుడును కాడు; స్థితప్రజ్ఞుడును గాడు. రాము డర్కకుల శీలనిధి; మహిత గుణాభిరాముడు; కర్తవ్యపరాయణుడు; రాజధర్మానువర్తిపరుడు; యుగధర్మపరిపాలకుడు; జగద్వీరుడు. ఇట్టి మహితగుణములచే తేజరిల్లు రాముడు, ధీరోదాత్తుడు, రామాయణ మహాకావ్యమునకు కథానాయకుడు.

వాల్మీకి ఆకస్మికా విర్భూత శబ్దబ్రహ్మ ప్రకాశము గలవాడై, తన కుదయించిన మహాకవిత్వ తేజముతో సర్వలక్షణ సమన్వితుడగు నొక్క మహాపురుషుని జీవితము ప్రకాశింపజేయ సంకల్పించియుండ, విధాత ప్రత్యక్షమై, "మునివరా, వాగ్దేవిచే ప్రబుద్ధుండవైతివి. నీవు కవిచంద్రుడవు. రాముడు నరచంద్రుడు. నీవాక్యరత్నములచే ఇనకులాన్వయరత్నము లోకమునందు దీపించునట్లు రామచరితమును కీర్తింపు" మని చెప్పి యంతర్ధానము నొందెనట. బ్రహ్మకు రామచరిత్రమే కాని మరే దియును గన్పట్టలేదు! పోనీ! దాని నావేశపూరితుడగు వాల్మీకి కవిచంద్రుని చెవిని వడవేయవలెనా! మహోక్కుడను తవకవిత్వధారకు తగిన కథ లేదన్నట్లుగ, వాల్మీకి రామాయణము నెత్తికొనెను. నరచంద్రుడగు రామచంద్రుని చరిత్రమును కీర్తింపవలెనన్న, రామునికడ నెన్న దగిన ప్రథితగుణంబు లెన్ని లేవు? ఒక్కవాని కీర్తనములో రామచరితమును ముగించిన నెంత బాగుండెడిది! కాదు. అట్లుకాదు. అట్లయినచో రామాయణ మొక యుత్తమోత్తమ కావ్యము కాజాలదు. రామాయణమున నీగుణగాన మొక యెత్తుగను, రాముని యంతరంగమును బహిరంగము చేయుట యొకయెత్తుగను నున్నది. ఇందే వాల్మీకి మహర్షి తన ఆర్షదృష్టిని, నిరతిశయ కవితా మహిమంబును ప్రకాశింపజేసెను. ఇందే వాల్మీకి దివ్యవాణి అమృతత్వము నందెను.


రాముడా, ఇనకులతిలకము. వంశమా, ఇక్ష్వాకుల నాటనుండి జగద్విఖ్యాతిం గాంచిన అర్కవంశము.

కోసలరాజ్యమా, సకలరాజ్య రమాసంపదలతో తుల తూగు మహామహీరాజ్యము. అయోధ్యానగరమా, అతులనాగరిక భోగవిలాసములకు నిలయము. ఈ యభ్యుదయ పరంపరా శుభోదయము దశరథక్ష్మాపాలుని నాటికి, మధ్యందినదినమణిమండలమున, గగనమధ్యస్థమై, అర్కకులప్రతిష్ఠపరాకాష్ఠ నందినది. అట్టి మహోన్నత స్థితిలో అర్కకుల క్షీరాబ్ధిచంద్రుడగు శ్రీరామచంద్రుని యుదయముతోడనే హాలాహలము, బడబానలముకూడా ఉద్భవించినవి. ఇది యొక మహాద్భుతవిషయము. లోకవృత్తమునం దట్లగుట సహజమేమో! ఇక్ష్వాకువంశంబున చిరకాలాగతమగు శుభాశుభకర్మఫలభారము రాముని నెత్తిమీద మోపబడినదో యన్నట్లయినది. ఆమహాభారము క్రింద రాముని దుఃఖమయజీవితమై, అగ్నితప్తంబగు సువర్ణమువలె సంలక్షింపబడినది. రాముడు రత్నాకరునివలె ఆ బడబానలమును తన హృదయాగాధమున ధరించును. కైలాసేశునివలె ఆ హాలాహలమును కంఠస్థము చేయును. మేరువువలె నిలబడును. వాల్మీకి మహాకవి రాముని హృదయాగాధమును జొచ్చి యా బడబానలమును బయట పెట్టును. ఆ మేరుపర్వతమునందలి రత్నకందరములను వివరించును.

మానవుల యాశలను భగ్నము చేయుచు, క్రూరవిధి వెనుకనుండి మానవుల ప్రయత్నములను వెక్కిరించుచు, విషమహాస్యము చేయుచుండునో యనునట్లయినది రాముని కథ. ఎం దనిర్వచ్యసౌఖ్యముయొక్క పరసీమను, స్వర్గధామమును కనుగొన జాలుమో, యదియే దుర్విధిచేతికందిచ్చి గోల్పోవునట్లు చేయునో యనునట్లుండును రామచరితావృత్తము. రాముడు సింహాసనాసీనుడు కాబోవుచు, అడుగులోనే పడిపోవును. దశరథక్ష్మాపాలుడు భూమినిపడి దొర్లును. అంతఃపురములే అల్లకల్లోలమగును, రాజనగరులే వెలవెలబోవును. అయోధ్యానగరము మీదనే ముసురుపట్టును. ఎక్కడ జూచినను నశ్రుబిందువులే. రాముడిందుల కేమియు తొణకడు, బెణకడు. కంటతడి పెట్టలేదు. మహామహీరాజ్యము నొక్క త్రుటి పటాంతరలగ్న తృణకణమువలె పరిత్యజించును. నాగరికసౌఖ్యములే విడిచిపుచ్చి, జనావాసములే విడిచిపోయి, భీకరారణ్యవాసమునే చేసికొనును. ఈదుర్విధి కించుకయు చలింపడు; వికారము నొందడు; విచారపడడు. అగ్నిపర్వతము బ్రద్దలయిననేగాని, భూగర్భము విచ్చిననేగాని, "క్షుద్రనిర్ఘాతపాతాభిఘాతమునకు వసుంధర చలింప" యట్లు మహావీరుడగు రాముడు వీటికి వేటికిని కంపింపడు. అట్టివీరుడు సీతాకాంతా వియోగమున ఆకసము విరిగి మీదపడినట్లు నిర్వీరునివలె విలపించును. పక్షులే అలకించును. మృగములే చేష్టలుడుగును. వాయువులే స్తంభించును. ప్రకృతియే దుఃఖాశ్రువులను నిశ్శబ్దముగ విడుచును. పాషాణములే కరగును. వజ్రహృదయములే ప్రక్కలగును. ఈ ఆగర్భశ్రీమంతుడు, ఈ మహారాజు, ఇద్ధోరుచరిత్రుడు, అరణ్యముల పాలయి, దిక్కులేని పక్షివలె, అట్లనస్వశముగ విలపించునపుడు బ్రద్దలవనిదేది? కరగనిదేది? కన్నీరుకార్చనిదేది? అలకింపనిదేది?......... అయింది, యింతటితో సరి,- ఆయినకుల తేజః ప్రసారప్రాభవములు. ఆ అయోధ్య రాజనగరునందలి వైభవవిస్ఫురణములు, కళాకాంతు లింతటితో నిరస్తమయ్యెను. అయోధ్యారాజ్యరమ, కాంతిహీనయయి రామరాజ్యముతో కోసలదేశమునుండి నిర్గమించును. అటుపైని కోసలరాజ్యము నామమాత్రావశిష్టము.


రామునిచరితము రామాయణముతో ముగిసేట్లయితే రాముడు ధన్యుడే. లేదు, రామాయణము ఉత్తరకాండయందు పర్యవసన్నము కావలెను. రామునిచిత్తవృత్తి, హృదయము, పరిస్థితులు లెస్సగ పరికించిన మహాకవి రామాయణముతో రామునిచరిత్రమును ముగింపడు. * రామాయణారోపణ బీజము ఫలవృక్షమై ఫలించినదే ఉత్తరరామాయణము. రాము డిప్పుడు రాజ్యపరిపాలనము చేయు మహారాజయి యున్నాడు. రాము

* ఉత్తరరామాయణమునందలి యసందర్భములను, ప్రక్షిప్తములను గాంచినచో, నియ్యది వాల్మీకిమహాకవి రచించియుండునా యని శంకించుట కవకాశ మొదవును గాని, అవి విడిచి కథాసరణిని గమనింపవలెను. బహుశా దీని ననుకరించియే ఉత్తరార్థములుగల ఉత్తరహరివంశము మున్నగు కృతులు పుట్టియుండునేమో యని తోచెడిని.



చిత్రము ౧. డీ హావిలన్ కమాను

౧–౫ చిత్రములు 'ఇండియన్ పిక్టోరియల్ ఎడ్యుకేషన్' అను పత్రికనుండి గైకొనినవి.



చిత్రము ౨. టిప్పుసుల్తాన్ గోరీలోని శిల్పము

నికేక రాజ్యభోగముల కేమికొదవ? ప్రాసాదములా, రమ్యహర్మ్యములా, కాసారోపవనంబులా, తతహంస తూలికా తల్పములా, దివ్యాంబర భూషలా, దాసదాసీ జనంబులా, కవిగాయక ప్రసంగములా......ఎన్ని? ఈ అన్నింటి మధ్యను దగ్ధహృదయుడై రాముడు దురంత విషాద వేదనానలమున మ్రగ్గిపోవుచున్నాడు. ఇవన్నియు రామునియం దణగియున్న బడబానలమును మరింత ప్రజ్వలింపజేయుటకే సహకారమగుచున్నవి గాని, చల్లార్చుటకు గాదు. ఈమహాభాగుడు యావజ్జీవము దుఃఖభాగుడగుటయే రామచరిత్రముయొక్క విచిత్రము. రావణుడు మహాపాపుడో, మహాపుణ్యుడో—ఆసృష్టికర్తకే ఎఱుక. నిద్రాహారములులేక ఒకసంవత్సరమో, అర్ధసంవత్సరమో, మహా మనస్సంక్షోభము ననుభవించినాడు. అంతటితో సర్వము శాంతినొందినది. పౌలస్త్యుడిప్పుడు నిర్వాణసుఖము, బ్రహ్మైక్యము నొందియున్నాడు. రావణుడే ధన్యుడు. కాని, శత్రుసంహారము గావించి జీవించియున్న రామునిమాట యేమి? ఇప్పుడా ఆయుధములనే తనమీదకు ప్రయోగము చేసికొనుచున్నాడు రాముడు. తనఆయుధములను తీసికొని తానే కుమ్మికొనుచున్నాడు. రామునిదుఃఖము నిరవధికము, అశరణము, అప్రతివిధేయము, అహర్నిశముదహించునదయిపోయినది. రాముడు లోకమునకు మహాభాగ్యవంతుడే. కాని, రాము డరణ్యమున, "నాకంటె నిర్భాగ్యుడు లోకంబున లేడు," "నాయభాగ్యమ్మెటువంటిదో, చూచితే, లక్ష్మణ, కాల్పఁగనోపుఁ గ్రావము నైనియుక్" అని విలపించినట్లుగనే రాముడు, జగదీశ్వరుడు, నిఖిలలోక శరణ్యుడు, దుఃఖభాజనుడయి పోయెను.

రామాయణమును మథించి యందలి సారమును గ్రహించి, రామాయణాధారమున, "ఏకోరసః కరుణ ఏవ" అని శ్రుతి గావించిన భవభూతి ఉత్తరరామ చరిత్రమునందు రాముని శోకమూర్తిని ప్రత్యక్షము చేయుచున్నాడు: రాముని యీ యంతర్గూఢఘనవ్యథ, అనిర్భిన్నగభీరత్వముచే, పుటపాక ప్రతీకాశమయినది. దుఃఖసంవేదనము కొఱకె రామునియందు చైతన్యము పోసంగ గట్టిగ, హృదయమర్మములను ఛేదించునట్టి ప్రాణములచే, 'వజ్రతాపటము' చేయబడినది......... రామునియందు చైతన్యము నశింపకుండా అన్నది.... రాముడు చచ్చిపోయినా చేసేదిలేదు......అనియీ ప్రకారము శ్రీరాముడు శోకించుచున్నాడు. ఇట్లు శోకాగ్ని సంతప్తహృదయరక్తధారలందు తనహృదయము నుడికించుకొని తినునట్టి లోకోత్తరుడైన రాముని విధి విపాకమునుగూర్చి యేమనుకోవలెను? అయ్యో! రాముడు తాపడినపాటెల్ల వ్యర్థమయిపోయింది. "యత్రకపీంద్ర సఖ్యమపి మేవ్యర్థం......" అనిరాము డీలాగున తన హృదయమును త్రవ్వుకొనుచున్నాడు. ఆర్తశరణ్యుడగు రామునకు దుఃఖమే శరణమయినది. రామోదంతము దిగంత విశ్రాంతమయినదికాని, రామునకు దిక్కులేక శూన్యమయ్యెను. ఇట్టి నిరవధిక మహా దుఃఖము, ఇట్టి లోకోత్తర చరిత్రము ఒక్కచో సమావేశమగుట విశ్వవాఙ్మయమునందు మృగ్యము.

జీవితసత్యములే దొర్లిపోవునపుడు, నిరస్తమగునపుడు, సమసిపోవునపుడు మహాకవులు మేల్కాంచి విక్రోశింతురు. రామాయణావతరణ మూలకందమగు ఛందస్సునందే వాల్మీకిమహర్షి ఛందము నిమిడియున్నది. "అవ్యాహతజ్యోతి రార్షం తే చక్షుః ప్రతిభాతు" అని బ్రహ్మ వచించినట్లు, ఆర్షదృష్టితో రచించిన యీ మహాకావ్యము, శాశ్వతబ్రహ్మకల్పము, హృదయచైతన్యముగల మానవలోక మున్నంతకాలము మహాజ్యోతివలె వెలుగును. కవి బ్రహ్మలు, సృష్టికర్తలగు కవులు గలరుగాని, ఆర్షదృష్టిగల కవిద్రష్ట లెక్కడనో,—కనబడుటరుదు. సంస్కృత కవితా సామ్రాజ్యమేలిన వారిలో ద్రష్టలని పేర్కొనదగిన వారు, ఒక్క వ్యాస వాల్మీకి మహర్షులే. వీరికి సత్యదృష్టియొక్క మహాప్రభలే కాని, యితర కవితిలకులవలె జీవితసత్యముల యెడ భ్రమవిభ్రమములకు భాషిత్వము లేదు.

రామునివంటి వీరులు, దృఢవ్రతులు, పుణ్యచరిత్రులు మహాభారతమునందును గలరు గాని, రామునివంటి దుఃఖితరచరిత్రులు మాత్రము లేరు. రామాయణ

మహాభారత కథలకు గల అంతరములో నిదియొక్కటై యెన్న దగిన ముఖ్యవిశేషము. ఈయంతరము రామాయణ భారతములందు ప్రతీయమానములగు జీవితవ్యాపారమునందును, సామాజిక సభ్యతయందును గానవచ్చును. రెండింటికి గల విశేష తారతమ్య మేమన, రామాయణ స్త్రీపురుషుల చరిత్రములు, అందు ముఖ్యముగ స్త్రీలవి, మహాభారత స్త్రీపురుషుల చరిత్రములకు వ్యతిరేకముగ నడచును. మహాభారతసభ్యత కేసి, ముఖ్యముగ నందలి స్త్రీలోకము కేసి ఒకమారు దృష్టిని ప్రసరింపజేసిన నంతయు విశదమగును. ఈ మధ్య నేమియాపతితమయినదో తెలియవచ్చును. మహాభారతపు స్త్రీలు పురుషులకు ప్రజ్ఞావంతులగు నర్ధాంగులు. రానురాను రామాయణకాలము నాటికి అర్ధాంగు లంధప్రాయులగు వ్యర్థాంగులగుట గానవచ్చును. మహాభారత స్త్రీలు ధీరమతులు, వివేకవతులు, దూరదృష్టులు, చతురోపాయులు. వారి యెడగల ప్రజ్ఞాప్రభావము, వైదుష్యము, ఇంగితజ్ఞానము, సదసద్వివేకము అద్భుతము గొలుపును. జగన్నాటకరంగమున పురుషులు వారికి వెనుకపడిపోయుందురు; అందు ప్రధాన వ్యాపారము, పాత్రము స్త్రీలదనే చెప్పవచ్చును. అటువంటి ప్రజ్ఞాప్రదీప్తమగు వీరవనితాలోకము మరల భరతధాత్రిని తలయెత్త లేదు. ఇది మహాభారతప్రతిపాదిత నాగరకతయందు గుర్తింప దగిన ముఖ్యవిషయము.

మహాభారత కాంతారత్నములు విక్రమస్ఫూర్ణంబున కదలిపోవునపుడు వేదములే లేచి నృత్యము చేయును. సరస్వతియే వచ్చి వారిముఖాంభోజమున నాసీనయగును. దివ్యవాణియే పలుకును. గంధర్వులే పాడుదురు. కిన్నరులే ఆలకింతురు. ప్రకృతియే పరవశమగును. పంచభూత మహాపదార్థములే సాయపడును. దేవతలే దిగివత్తురు. దిక్పాలురే ఆశీర్వదింతురు. వనదేవతలే పాలింతురు. దైవమే పరాభూతమగును. మృత్యువే జయింపబడును. శ్రీయే వారి నాశ్రయించును. లోకములే విస్మయమునందును. ఇట్లు:

ధర్మనిరతిని, స్వకార్యతత్పరమతిని, సురాసురలోకవంద్యుడగు ధర్మప్రతిష్ఠాతవలన స్వధర్మామోదమును బడయు గురుపుత్రిక యొకతె. ధర్మాధర్మవివేకశూన్యుడై కాపంబీనున్న మునికోటకుని వాటకపు శకుంతలవలె విహ్వలగాక, ప్రతిఘటించి ధర్మవ్యాధుని యొద్దకు పంపునారీలలామ యొకతె. తనకొరకై ఋషికుమారుడు జీవితమునే యర్పించునట్లు ప్రేమయొక్క విశుద్ధసత్త్వస్వరూపమును పరీక్షించు కన్యారత్న మొకతె. మహారాజాస్థానమునకు వచ్చి, వేదములే మూర్తీభవించి మ్రోయుచున్నవో యనునట్లు, విశ్వశ్రేయస్కరమయిన తనగంభీరసత్యవాణిని ప్రకాశింప జేయురామామణి యొకతె. లోకపాలుర చేతనే భర్తకు వరములిప్పించి, కలిపురుషుని ప్రయత్నములను భగ్నము చేసి, దిక్కులేక పరిభ్రమించు వానిని లోకము విస్మయ మొందునట్లు తిరిగి తెచ్చుకొను ప్రత్యుత్పన్న ఉజ్జ్వలమతి యొకతె. లోకోత్తరప్రేమ మహిమంబున, ప్రియునిమృత్యుముఖమునుండి విడిపించి తెచ్చుకొను ధీరమతియొకతె. అత్యుదార బుద్ధిసంపన్నతచే "మహానుభావురా"లని సన్నుతిగన్న వీరమాత యొకతె. దిగ్దంతులవంటి ఋషులు, మహావృద్ధులు, ధర్మవేత్తలుగల విపులసభాంతరాళమున ప్రవేశించి, వారు తలవంచుకొనునట్లు మాట్లాడు "పండిత" బిరుదమునుగొన్న మహాప్రాజ్ఞురాలొకతె. ఇట్లెందరో యనన్యసాధారణప్రజ్ఞా వైభవంబున నలరారు వరవర్ణినులు మహాభారతలోకము నలంకరించుట గానవచ్చును. ఎవరోవీరు, ఎచటనుండి వచ్చిరో,—ఈ మహానుభావురాండ్రు, ఊర్జిత, ఉజ్జ్వల, మనోహరచరిత్రలు. మర్త్యభామినులే వీరు, కాక దివ్యలోకమునుండి మర్త్యలోకము నుద్ధరింపవచ్చిన దివ్యాంగనలా యన్నట్లుండును. వీరి చరిత్రములు, * —కృష్ణ ద్వైపాయనోద్యానజాత పారిజాత ప్రసూనములు.

* ఇట్టి యపూర్వస్త్రీలోకమును వీక్షించినమీదట, పురుషునకు స్త్రీ తప్పనిసరియైనఅనర్థమని, చపలతయే స్త్రీయని, కల్లలకుపుట్టినిల్లని, స్త్రీలు పశుప్రాయులని, పరభృతములవంటివారని, "నరక ద్వారము...దుస్తరమాయాశతపేట...,దంభనిధి, ...పురుష గళోద్బంధక్రియాపాశ"మని, యుద్విగ్నంబుగ లోకమునగల కవులు, మనీషులు, తత్త్వజ్ఞులు స్త్రీజాతినిగురించి చేసినపరిభావనములతో నేకీభవించుటయెట్లని? ఏకీభావ మెట్లు? వ్యాసభగవానునిముందర మాకీభావము వహింపవలసి వచ్చుచున్నది. వాస్తవస్త్రీలోకమువైపునకు తిరిగివిచారపడవలసి వచ్చుచున్నది. అంతే యథార్థము.

ఇట్టి స్త్రీలోకదృశ్య మిక మీద నదృశ్యమగును. ఇక వచ్చేది దీనికంతయు విపరీతము. అదంతా ఒకటే మాదిరి. ఒకే అచ్చున పోతబడినపోత. ఒకే ప్రతిమానము. ఒకేపూర్పు కొంచె మెచ్చుతక్కువగ నది భారతజాతీయ జీవితమునందేమి, వాఙ్మయమునందేమి స్థిరీభూతత్వము నొందినది. ఇట్టి స్త్రీత్వమునకు కేంద్రస్వరూపిణిగ, ముఖ్యోపమానముగ, నిదర్శనముగ—Typeగ నున్నది రామాయణసీత. పాపము! పట్టిముగ్ధ సీత; అమాయకురాలు. ముందువచ్చేది, వెనకవచ్చేది యేమీ తెలియదు. రమ్మంటేవస్తుంది, పొమ్మంటేపోతుంది. మధ్యమధ్య కొంత తర్కిస్తే సొమ్ములున్నా, అవి యెరువుసొమ్ములు, సొంతసొమ్ములు గావు. సీతాకాంతారత్నము భారత కాంతారత్నములలో నొక్కరిని పోలియుండినా, రామాయణకథ వేఱుగా నడచేది. యావజ్జీవ దురంతదుఃఖవేదన కవకాశముండెడిది కాదు. సీత రామునితో కాననములకు వెళ్లకపోయినను బాగుగ నుండిపోయేదే అనిపించును. ఇంట్లో ఉండమంటే రామునినెందుకు కనుసరించినట్లు? ఏమీ లేదు,—అంతఃపురాలలో ఉగ్గుపాలనుంచి సీతకు మారిపోసినారు పతివ్రతాధర్మము. చంద్రిక చంద్రునివలె, భార్య భర్తనుఛాయవోలె ననుసరింపవలెనని, రాముడు తనవెంట రావలదన్నప్పుడు, ఆనేర్పినవిద్యయే చిలుకపలుకులవలె అప్పచెప్పుతుంది. అట్లుచేయుట పతివ్రతాధర్మము, ఐహికాముష్మికసౌఖ్యప్రదము. అది తనకర్తవ్యము,(Duty). అంతే సీతభావము. అంతకంటె మరొక విశిష్టభావము, దృష్టి లేదామెకు. (అంటే సీతకు మంచిప్రేమ లేదనికాదు; ఆమె రామమయ జీవితయే.) సీతయేమి, సత్యవతా, దమయంతా?—వారివలె నడువుటకు, నడచు కొనుటకు? *. మహాభారత కాంతలకు నీతులు నేర్పేవారెవ్వరు లేరు. వారొకరియొద్ద నీతినేర్చుకో నక్కరలేదు. తామేనీతినిధులు. తమకుతామే ధర్మవులు. సమస్తలోకము వారియొద్దనే నేర్చుకోవలెను. సీత కట్లా కాదు. తనవద్దసెలవు పుచ్చుకొనుటకు వచ్చినప్పుడు, సీత పుట్టినింట నేర్చుకొన్నది మఱచిపోవునేమోయని చెప్పి, అత్తగారుకూడా నీతులు, పతివ్రతాధర్మము బోధిస్తుంది.§ దుఃఖస్థితిలో నున్న రాముని బాగామాడమని ఆ—బాగుగనే కనిపెట్టింది రాముని! దించ ఎత్తరాని

*"సావిత్రి సత్యవంతున, కేవిధ మావిధమటంచు నీమది నన్ను నూహింపు" మని సీత రామునితో నంటుంది, తన్ను వెంట రావలనన్నపుడు. (మా. ఆం. వా. రా.) సీత తానొక స్వతంత్ర బుద్ధిమంతురాలయితే, ఒకరిసాటి తన కేటికి? ఒకరి నాదర్శముగ తనయెదుట నెందుకు పెట్టుకోవలె? ఎవరిదారి వారిది; ఎవరిచిత్తవృత్తివారిది. ఒకరివిధముగ ఒక రెందు కయ్యేదరు? సావిత్రివిధముగ తాను రామునకు కాగలిగినదా? అదిగాక, ఒకరినిచూచి మనము నేర్చుకోవలెనా? మనలను చూచి యొరులు నేర్చుకొనేటట్లుండవలెనా! మహాభారతకాంతారత్నములలో నెవరయినను తమకాదర్శముగ నేకాంతారత్నము పేర్కొన నెత్తెదరేమో చూడండి! సావిత్రి సత్యవంతునివరించినట్లే వరించినదా! తానురాముని అట్లా సావిత్రి చేయగలిగెనదా! సావిత్రి మృత్యువునే జయించింది. తానో? తనకేమిజయము లేదు, అంతాపరాజయమే, పాపము!

§ సీతకు స్త్రీస్వభావము వర్ణించుచు కౌసల్య యిట్లంటుంది:—

"పొంకుల పుట్టినిండ్లయి స్వపూరుషు గెలిగ నెక్కిరించుచున్
గొంకక దుష్టచింతవలకున్ నిధులై భృశగూఢ చిత్తలై
మంకుతనంబునన్ వయసుమంపున రోయఁగఁజేయుచుందు రే
శంకయులేక నిమేషమునఁ బ్రాణమువోలెను జాముకారినేన్." (మా. ఆం. వా. రా.)

అప్పుడు సీత, "అత్తా, మీమాట కడ్డువచ్చానుగాని, మీ రెప్పుడయినా మీ ప్రాయంపు వయస్సులో అట్లా వున్నారా యేమిటి?" అంటే, అత్త యింకాయేమి ధర్మోపన్యాసము సాగించునో! పాపము, అమాయకపుసీత! కోడలిధర్మము వహించి ఊరకట్టుతుంది. స్త్రీలు, అందులో నుత్తమఇల్లాండ్రు తమజాతినిగురించి తామే యిట్లింత

గంపెడు దుఃఖభారము రాముని నెత్తిమీద తెచ్చి పెట్టింది. బ్రతికి నన్నాళ్లు అనుభవించింది; అనుభవింప జేసింది. * సీతమ్మ శోకములో విశేషము, వింత యేమీ లేదు; ఒకటే సన్ననిమంట— రాముడు లేడని. అది కూడా వాల్మీకాశ్రమము చేరిన తర్వాత రాముని జీవత్ ప్రతిబింబములను చూచుకొంటూ వుంటే, ఆమంట చల్లారిచల్లారక కొంతసేపు సుఖము, కొంతసేపు దుఃఖము అనుభవిస్తూ కాలక్షేపము చేస్తుంది. ఇక రాముడో! రాముని దంతా కార్చిచ్చే. ఆసహ్య కర్కోటకుడొకడు లేచి ఒకకాటు వేస్తూవుంటాడు. ఆవిషానల కీలలతో వేదన మరింత యెక్కువవుతూవుంటుంది. అరణ్యావాసమున, కాకాసురునిలోనే వెంటపడ్డాడు కర్కోటకుడును. అదివరకు స్ఫటికమువలె స్వచ్ఛమయిన రాముని యంతరాత్మకు రంగు, సంపర్కము కలుగుతుంది యిక్కడనుండే. రాముని మానససరోవరము కలతనొందుతుంది. రామునకు సీతవుంటే ఒకదుఃఖము, లేకపోతే ఒకదుఃఖము. దేనిని రాముడు తనజీవిత మహాపవిత్రపదార్థముగా జూచుకొని, యందు లీనమై తన ఆత్మను సమర్పింపదలచుకొన్నాడో, అట్టి దానినే పరులు స్పృశించుట కలిగినది. ఇంకేమిటి! ఎవడో ఒకడు వచ్చి యెత్తుకు పోతూవుంటా డీమహాపవిత్ర పదార్థమును, ఈజాతిపూతను. సీత కాత్మరక్షణము చేసికొనే సంస్కారము గలదా యంటే, అదేమిలేదు. ముద్దరాలగు సీత యేమి గ్రహింపగలదు రామునియొక్క యీహృదయ విషాదమును? 'ఓరామా, పరుడు నన్ను ముట్టుకొన్నాడంటే, అందుకు నేనేమిచేయను?.........నావల్ల దోషమేమీ లేదు. చిత్తియొక్కమందువా, యెక్కడను.' అని రామునికేసి చూస్తూ ఏడుస్తుంది, పాపము,—గుండె నీరయిపోయేటట్లు. పరులబారినుండి తన్నుదా నెట్లు కాపాడుకోగలదు? అంతఃపుర నాగరకతలో పుట్టి పెరిగి బాల్యముననే రాముని కొసంగబడిన సుకుమారి సీత కేమి చేతవును? సత్యభామవలె, రుక్మిణివలె విల్లు చేతపట్టగలదా? రథము నడుపగలదా? కేవలము పాతివ్రత్య ధర్మము మూతగా గొని వెళ్లింది అడవులకు. ఆపాతివ్రత్యము తన్ను రక్షింపలేకపోయింది యొంటరిగానున్నపుడు. అటువంటప్పు, డంత అబల యయినప్పుడు, చపల కాకుండా వుండి రామునికొంగున ముడివేసికొని కంటికి రెప్పవలె కాచుకొనేవా వుండవలసింది—సావిత్రిలాగున. ఆతెలివితేట లేకపోయింది. అదివుంటేనా, సీతారాములజీవితనౌక అట్లా ముక్కలయిపోయేదికాదు. కాంతాశిరోరత్నములనదగు సత్యవతి, దమయంతులు, చూడుడు, ఎట్లుముక్కలయిపోయేనావను దరిజేర్చి తరింతురో! పాపము, సీత కాయోడ నడపడ మేమియుచేతనయిందికాదు. ముద్దరాలు సీతను చూస్తే జాలివేస్తుంది. హిందూస్త్రీలదుఃఖపాటు అంతా సీతనెత్తిమీదవేసారో యన్నట్లుంటుంది సీతమ్మవారి శోకచరిత్రము. అగ్నిపరీక్ష కీలోకమున ఫలితమేమీ లేదో యన్నట్లుకూడా వుంటుంది. ఇదంతా అంతఃపుర నాగరికతయొక్క

చులకనగావించుకొంటే,యింకా సభ్యతనుగూర్చి యేమనుకోవలెను? సీత అనసూయతో తన వివాహవృత్తాంతమును చెప్పునపు డిట్లనును:—

"కూఁతులఁగను నాతఁడు కా-రూక్షలు విను వియ్యమాడి కొలఁదులచేనో
లాఁతులచేనో-కన తల్లవాఁతకొలఁది..." (ఆం. వా. రా.

చూడుడు: దీనినిబట్టి సీత యెటువంటి సభ్యత కలవాటుపడినదో! ఎట్లు తలలోని కక్కించినారో! కూతులనుగన్న తండ్రుల తల్లవాతి అట్లువ్రాలిపోవుటకు, కూతులము మేమేమి పాపము చేసినామని చెప్పి సీత ఒకనిట్టూర్పువిడునను! ఈవిషయమునను మహాభారతస్త్రీలను విచారింపుడు, ఎవరయిన నట్లు బుద్ధి దలంతురేమో!

* "ప్రత్యాసన్న విపత్తిమూఢ మనసాం ప్రాయో మతిః క్షీయతే" అని బుద్ధితలంచువారికి గాని, రామాయణమున కంతరార్థములు, అర్థాంతరములు చెప్పజూచేవారికిగాని నాయీవ్యాసముకాదని మనవిచేయుచున్నాను. రామాయణ పరమార్థమును యథామతి గ్రహించి వ్రాయుచున్నానని మనవి.

ఫలితము. సౌకర్యములకు, స్వార్థములకు బాగా ఉపయోగించేటట్లు శాసనములమీద నిర్మింపబడిన సభ్యతా సౌధముయొక్క పాటిదంతయు! ఆయంతఃపుర నాగరిక సంస్కారమునకే అర్పించింది జాతపూతయగు సీత తన జీవితమును! దానికే బలియయ్యెను నిక్షేపమువంటి రాముడు. రామరాజ్యమున రామునకే వచ్చింది గత్యంతరములేని దుఃఖస్థితి, యీ యంతఃపుర నాగరికతమూలమున. ఎక్కడ స్త్రీలు పూజింపబడుదురో అక్కడ సంపదలు రమించునని మనుధర్మశాస్త్రము. ఓ! బాగనే పూజింపబడినారు, హిందూస్త్రీలు, గుడిలో విగ్రహములలాగున! అందుచే, హిందూదేశచరిత్రమున శత్రువులవల్ల గుళ్లో విగ్రహాలకు భంగపాటుపూజ, స్త్రీలకు చితిపూజయో, లేక సాహెబుల యంతఃపురాలపూజయో మాత్రము తప్పిందికాదు. భారతవీరుల పాదధూళిచే, పవిత్రముకాబడిన పుణ్యభూమి, కర్మభూమియగు ఆర్యావర్తమునకు గలిగిన పాటుసొంపిది.

ఇంకా రంగుదిగుతుంది సత్యహరిశ్చంద్ర కథకు వచ్చేటప్పటికి. బానిసలతో జీవిత భాగస్వామిత్వము చేసుకొనేవారు కూడా బానిసలవుతారనే సత్యమునకు నిదర్శనము సత్యహరిశ్చంద్ర చరిత్రము. సత్యవాక్పరిపాలనమున నీకథయందుగల యనుపపత్తి నటుండనీండు. భారత రమణీమణులు జీవితమహాసత్యముల నిమిత్తమై దైవముతోనే ప్రతిఘటింతురు. వాటికి కలిగే ఆపత్తులనే ఉపరోధింతురు. ఇక చంద్రమతి సత్యము పేరు చెప్పి, అసత్పరిపాలనమునకు, భర్తనే ప్రేర పెట్టుతుంది. విపత్తులనే అనుమోదిస్తుంది; అందుకు దైవమునే పిలుస్తుంది; ఊర్జితసత్యమునే పరుండబెట్టుతుంది; జీవిత మహాపవిత్ర సత్యపదార్థమునే విక్రయించి యొకమిథ్యాసత్యమును పోషింపమంటుంది. "భార్యనైన విక్రయించి భర్తకు నుపద్రవమును చెడబాయగాదగు" నంటుంది చంద్రమతి. భర్తకు నుపద్రవమంటేయేమిటో తనకు తెలియదు! వేదములు భర్తకు భార్య ఆత్మయటంచు మొరయుచుంటే, ఆ ఆత్మనే విక్రయము చేయుమంటుంది! ఇది చంద్రమతి బుద్ధి. కాకుంటే, దాసీలుగా చేయబడి, పురుషుల వినోదార్థము, పంజరములో చిలుక పిట్టలలాగున పోషింపబడేవారికి, మరొకఉదారబుద్ధి యెట్లుకలుగుతుంది? సూత్రములచే నడిపింపబడేవారికి సొంతహృదయము, సొంతబుద్ధి యెటనుండివచ్చును? దాసిగా విక్రయింపబడినపుడు, ఊర్జిత జీవితసత్యమునే పోగొట్టుకొన్నపుడు, తనకు పాతివ్రత్యముమాత్ర మెట్లు నిలుస్తుందని యనుకొంటుంది? ముదుసలి కొనుక్కొన్నాడనా? లేక, విశ్వామిత్ర సృష్టియని ముందుగానే తెలిసికొని యీకపట నాటకము నాడుచున్నారా చంద్రమతీహరిశ్చంద్రులు? స్వాభిమానధన యగు సీతకడగల అమాత్రపు ఆత్మగౌరవమయినా లేదేమి, అర్కకులమువారి కోడలనని చెప్పుకొను చంద్రమతియందు! జీవితమహాసత్యములనే పోగొట్టు వ్రతనిష్ఠలు, సత్యవ్రతములు, ఆదర్శములు, ధర్మములు సత్యములుగావు, అవి భ్రాంతి సత్యములు.

జీవితమహాపవిత్రసత్యములనే పొరకడబెట్టి యంత్రము లాగున తూచా తప్పకుండ, ధర్మపదవిని నడిచే సత్యహరిశ్చంద్రుని పాత్రము విచారింప నక్కఱలేదు. ఇట్టివారికడ ధర్మాభిజ్ఞతయే (sense of duty) కాని, ధర్మజిజ్ఞాస (conception of duty) కన్పట్టదు. ధర్మముయొక్క అక్షరత్వమేగాని, ధర్మముయొక్క సత్త్వము వీరిబుద్ధియందు మృగ్యము. ఇందుకు నిదర్శనముగ, సంస్కృత మార్కండేయ పురాణమున చంద్రమతిని వధించు సందర్భమున హరిశ్చంద్రుడు, "అహో! స్వాధీనవృత్తు లెంతధన్యులో కదా, అస్వాధీన వృత్తుల కాత్మహత్యకైనను వీలులేదు." *అనికార్యమునకు గడంగుచు తనధర్మాభిజ్ఞతను వ్యక్తపరచును. ధర్మముతో సహకారము చేయుట అంటే యిట్టిదిదే కాబోలు.

*ఇట్టి ప్రశస్త్యాంశమయిన దొక్కటి మారనమార్కండేయపురాణమునగాని, శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానమునగాని కానరాదు, వట్టి పదాల ప్రాశస్త్యమేగాని. తెలుగు కవుల భాషాంతరీకరణధోరణి కిదియొక యుదాహరణము.—రసపట్టులు జారిపోతాయి.

స్వామి కార్యతత్పరమతిని, నిరపరాధిని భార్యను వధించు సత్యవ్రతరతు లౌకరు! నిష్కారణ పితృభక్తి పరాయణత్వమున, "మాతృదేవోభవ" యను శ్రుతివాక్యమునకు విరుద్ధముగ మాతనువధించు స్థితప్రజ్ఞులౌకరు! నీతిబోధ పేరున ఇహపరములకు దూరముచేయు నిట్టి కట్టుకథల కేమి విలువ యున్నవలెనో తెలియదు.

శ్రీరాముడు తన జీవితప్రకాశము, సత్యము, సౌందర్యము పోగానే అంధకారబంధురుడై "సైపగరాని యారాత్రిచే నదీతటమ్మునవలెఁ గూలిపోవును." సత్యహరిశ్చంద్రుడు తనజీవిత మహాపవిత్ర సత్యమునే చేతులార విక్రయించి, సత్యధురంధరుడై ధర్మప్రకాశముచేయును. ఇది దీనికి దానికి జీవితాదర్శములలో గల భేదా; ధర్మతత్త్వములో గల యంతరము. సత్యహరిశ్చంద్రుని కథయందు ప్రీతివిశ్వాసములు గలవారింకొక సంగతిని గమనింపవలసి యుంటుంది. రామాయణమున వశిష్ఠునకు కైక సత్యమును గురించి బోధించుపట్ల యెన్నిసార్లుదాహరణముగా నెత్తినను, 'the devil quotes the scripture' అన్నట్లు, ఉదారచరిత్రులగు శిబిచక్రవర్తి, అలర్కుని పేర్లె యెత్తుతుండిగాని, తనభర్తవంశములోని వాడగు త్రిశంకు పట్టిపేరె యెత్తదు. ఇది చారిత్రకముగ, నైతికముగ పాఠకులు గమనింపవలసిన యంశము. వసిష్ఠుడు శ్రీరామునకు పూర్వరాజవృత్తాంతమును చెప్పుసందర్భమున త్రిశంకుని పేరు వినబడుతుంది గాని, యీప్రసిద్ధపురుషుడగు త్రిశంకుపట్టి హరిశ్చంద్రుని పేరు వినబడదు. ఆంధ్రనాటక రంగధాముడు, ఆంధ్రుల కత్యంత ప్రీతిపాత్రుడగు నీసత్యహరిశ్చంద్రు డెవ్వరో విచారింప దగియున్నది.

"కవితా యద్యస్తి రాజ్యేనకిం?" అని అంటారు కొందరుకవులు. అదికాదు సత్యము. మహాకవులదృష్టి వేఱు. అదియెంతో భావగర్భిత మయినది. "కాంతా యద్యస్తి రాజ్యేనకిం, కింవా త్రైలోక్యాధిపత్యేన?" అనేది సత్యం. రాముడీసత్యమును చూచుకొనే, అందుకొఱకే పడరానిపాట్లుపడి బ్రతికచూస్తే, హతవిధి మరొకలాగున చూసింది. రాముని బ్రతుకు కాలా అయిపోయింది. ధీరుడగురాముడు రాజ్యము కావలెనన్నాడా ఎన్నడయినను? ఈ కిరీటాధిపత్యము లేకపోయిననే బాగుండిపోయేదే యని విచారించువాడు.

మహాభారతకవి విశ్వశ్రేయములగు జీవితమహాసత్యములను ప్రతిష్ఠించును. రామాయణకవి ఆపవిత్రజీవితసత్యములు తొలగిపోవునపు డాక్రోశించును.

"అసతో మాగమయ సత్" అనే శ్రుతికి వ్యతిరేకమయినది సత్యహరిశ్చంద్ర. ఈకథ యిట్లు రసములేక నీరసముగా నుండుటచేతనే కాబోలు, ఆసేతు హిమాచలము చాలాకాలము నుంచి వ్యాప్తమయియున్నను, ఏసత్కవియు దీనిని కావ్యరూపమునగాని, రూపకముగగాని వ్రాసియుండలేదు.

మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్న సైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు, 'భారతి'

భ్రమర గీతము

ఎండఁ బడి వచ్చుటను నొకయింతసేపు
బడలికలు వాయ విశ్రాంతిఁ బడయఁగోరి
"పేలసు లయిబ్రరీ"* యందు పెద్దమేడ
మీఁద పేముకుర్చిలోన మేను వాల్చి,
పుస్తకము విప్పి యిటునటుఁ బుటలఁ ద్రిప్పి
కొనుచు నేమేమొ యోచించుకొనుచు నుండ;
శ్రుతికి నింపొనఁగూర్చు ఝూంకృతులతోడ,
మిసమిసలఁ గ్రక్కు నెమ్మేని పసిమితోడ,
నధిక లావణ్య మొప్పఁగ నతిముదమ్ముఁ
గూర్చు చిఱుతెక్క లల్లార్చికొనుచు,
జాలకమ్ముల సందుల జాడనుండి
వచ్చె లోనికి నొక మధుపంభరంబు.

* * *

భ్రమరమా! యేమి పని గొని వచ్చినావు?
వచ్చినావు సరే! నీకు స్వాగతంబు.

మించిపోయెడి కార్యంబు కొంచెమేని
నవల లేకున్నచో క్షణ మాఁగిపొమ్ము,
మంచిచెడ్డల మాటాడ నెంచెదేని,
ముచ్చటల నాడికొన నీకు ముచ్చటేని.

* * *

నిగనిగల నీదు తెక్కల నిగ్గుతోడి
త్వన్మనోహర రూప సౌందర్యగరిమ
తనివి తీఱఁగ నద్దాల తలుపులందుఁ
జూచికొన నెంచి యీమేడఁ జొచ్చినావొ!
శ్రమను బడియున్న ననుఁ గాంచి జాలి నొంది
త్వన్మనోహర మధుర గీతమ్ము లనెడు
జోలపాటలచే నిద్రఁ జొనిపి నన్ను
సేద దేర్పగ నిటు దయచేసినావొ!

తరుల తాగుల్మపుష్పసంతతులచేతఁ
జిత్ర మలరించు నారామసీమలందు
సంతతానంద సంచార సరణి విడని
యతుల సౌభాగ్యశాలివి యైన నీవు;

బహుళ బహువిధ పుస్తకప్రతతిచేతఁ
జారుతరమైన పుస్తకాగారమందుఁ
బ్రవిమలామోదయుతుఁడ "శ్రీరాజపుస్త
కాలయపరిరక్షకుఁడ"† నే నగుదుఁజుమ్ము.

పుష్పవనమందు నుండఁగ బుద్ధి నీకుఁ,
బుస్తకాలయమం దుండ బుద్ధి నాకు;
నన్నిగుణములఁ గాకున్నఁ గొన్నిగతుల
నీకు నాకును బోలికల్ లేకపోవు.

పలురకంబుల పుష్పముల్ గలుగు నీకు,
పలురకంబుల గ్రంథముల్ గలుగు నాకు;
పుష్పములఁ గాంచి యుప్పొంగిపోదు వీవు,
పొత్తములఁ గాంచి యుప్పొంగిపోదు నేను.

పూలలోపలఁ దిరుగుచుఁ బూలపైని
వ్రాలుచును లేచుచుండెడి పట్టులందుఁ
బుష్పాడుల నీవు మునిఁగెదు చొప్పుగానె,
గ్రంథభాండారమున నేను గ్రంథములను
బైకిఁ దీయుచు నుండెడి పట్టులందు,
బీరువాలందు నుంచెడి వేళలందు,
దుమ్ము రేఁగఁగ మునుఁగుదు దూళులందు.

* Palace Library.
† Palace Librarian.

పుష్పచయమున మకరందపుష్టి గలుగు,
గ్రంథవితతిని రసపుష్టి గలుగుఁ జుమ్ము;
పుష్పపుటములలోఁ దూఱి పూవుఁదేనె
తనివి తీఱఁగ మఱిమఱి త్రాగు దీవు;

గ్రంథపుటములపై దృష్టి కడఁక వ్రాల్చి
కవితలోఁ గల్గు రసమును గఱవు దీఱ
నిత్య మాస్వాద మొనరింతు నేను గాన
నీకు నాకును బోలికల్ లేకపోవు.

ఎన్నిపూలను వెదకిన, నెంతశ్రమము
పడిన మధురస మొక్కటే పడయు దీవు;
గ్రంథములలోన నాహ్లాదకరములైన
నవరసంబులు లభ్యముల్ నాకు, వినుము.

పుష్పములలోని తేనియ బొట్టులట్టు
లుండి యుండని యట్లుండకుండుఁ జుమ్ము;
పట్టి యాకర్షణము సేయునట్టి శక్తిఁ
గలిగి యోలల నాడింపఁగలుగుఁ జుమ్ము,
నవనిధుల మించఁజాలెడు నవరసములు.

తీయనైనట్టి విరితేనె తేటలందు
మరులుకొని నీవు సర్వంబు మఱచునట్లు,
చదువ మొదలిడి యట్లె చదువుకొనుచుఁ
బోవఁగా రసస్ఫూర్తిని బొంది, నేను
తన్మయత చెందుచుందును దఱచుగాను.

అతిమనోజ్ఞంబులై లోక మాదరింప
నలరు వస్తువుల్ రెం డిలఁ గలవు సుమ్ము:
గంధఫలియును, విను మఱి కామినియును;
పటుతరంబైన వలపులఁ బర్వఁజేసి
వనరమకు వన్నెగూర్చు సంపంగి పూవు
మాటనైనను దలఁప వదేటిబుద్ధి?

దవ్వుదవ్వులనే నిల్వఁ దలఁతు కాని
దరియ వెప్పుడు, వాహ్యాళి మఱచియైన:
భయమొ, ద్వేషమొ, క్రోధంబొ, పలుకరాదె?
శాశ్వతవిరోధ మిది యేల సంఘటిల్లె?

భ్రమరమా! విను నైష్ఠికబ్రహ్మచారి
పటుతరంబైన వలపుల బ్రమయఁ జేసి
చిత్తము హరించు కామినిఁ జేరఁడేమొ,
దవ్వుదవ్వులనే నిల్వఁ దలఁచునేమొ;
దరికిఁ జేరుట యనఁ గడు వెఱచునేమొ;
ధైర్యముగఁ జూడఁగానైనఁ దలఁపఁడేమొ;
భయమొ, ద్వేషమొ, క్రోధంబొ, పలుకఁడేమొ:
యిందు మీ కిర్వురకు సామ్య మేమి కలదొ!

తమ్మిపూఁ దేనెసోనల తమినిఁ దగిలి
కాలగతి నీవు తెలిసికోఁజాల వకట!

ప్రొద్దుపోవఁగ గమలంబు తద్ద ముడుఁగఁ
దమ్మిపువుగర్భమున నీవు తగులుఁ జెంది
యెంతగాఁ దల్లడిల్లుదో యెవరి కెఱుక!
కోరి కష్టంబు పైవేసికొనఁగ నేల?

సంపెఁగకుఁ దోడు నీ వంబుజమును గూడ
విడిచి తేనియ దినములు గడవవొక్కొ?
ఆఁకలిని దీర్చుకొనఁగ నాహార మొదవి,
దప్పిఁ దొలఁగింప మంచితీర్థంబు దొరకి,
చదువుకొనుటకు గ్రంథముల్ చాలఁ గలుగ,
నింతకంటెను భాగ్య మింకేమి వలయు?
కాని హృదయంబు సంతుష్టిఁ గాంచఁబోదు,
కోరికలె కోరి మిగిలిచికొనును గాని.

భ్రమరమా! యింక నొకమాట పలుకఁదలఁతు:
నిన్నిసదుపాయములు నాకు నున్న, నిట్లు
సౌఖ్యయుతముగ దినములు జరుగుచున్న,
భ్రమరమై నేను సతతంబు వనములందుఁ
దను లతా గుల్మ పుష్పసంతతుల నడుమఁ
దనివి తీఱఁగ విహరించు తలఁపు గలదు;

కోరకంబులఁ బరికింపఁ గోర్కె గలదు;
విఱియు పూవుల దర్శింప వేడ్క గలదు;
పూవుపూవున వ్రాలఁగా బుద్ధి గలదు;
ఉద్ధతిని పుష్పాదుల మున్గ నూహ గలదు;
మధుర మధురస మానఁగా మనసు గలదు;
వాసనలఁ దృప్తి నొందఁగా నాస గలదు:
కోర్కె లున్నవి, నెరవేర్చుకొనుట యెట్లు!
భ్రమర మగు టెట్లు!! వీనిని బడయు టెట్లు !!
నీవె దీని కుపాయంబు నిర్ణయింపు.

* * *

పసరుపురుగును నెచటనో పట్టి తెచ్చి
ఝమ్మనుచు రేఁచు ధ్వనులచే సొమ్మసిలఁగఁ
జేసి, చుట్టును నృత్యంబుఁ జేసికొనుచు
మధురగీతంబులనో, లేక మంత్రములనో
గ్రుక్క త్రిప్పక జపియించి యొక్క మొగిని
భ్రమరముగ మార్పఁజాలు నీప్రజ్ఞ యంట;
ఏది చూతము, నీప్రజ్ఞ యెట్టిదియొ,
భ్రమరముగ నన్ను మార్పఁగా రమ్ము! నీకు
నేను గూడను సాయంబు నెఱపుకొఱకుఁ
గన్నులను మూసికొందు నాకరయుగమునఁ,
జిక్కఁబట్టుదుఁ జిత్తంబు చెదరనీక,
నిన్నె ధ్యానించుచుందును నియతితోడ.

నీవు దీనిని సాధింప నేర్తువేని—
అగును మన కెంతొ యానంద మపుడు తేటి!
మిత్రభావంబు మనకు సమృద్ధి గాఁగ
నొక్కరొకరికి సాయమై యుండవచ్చు;
బాలపవనుండు పూఁబీవనల విసరఁ
దీఁగయుయ్యాలలం గూడి యూఁగవచ్చు;
దట్టమైనట్టి పొదరిండ్ల నిట్ట నూత్తి
గూడి దాఁగుడుమూఁతల నాడవచ్చు;
కంఠముల నెత్తి శ్రుతులను గలియఁజేసి
మృదుల గీతాళి వన మలరింపవచ్చు;
క్రమతరమైన పుష్పాది గంధములను
కొల్లలుగ మేనులకుఁ బూసికొనఁగవచ్చు;
నవనవోత్సాహభరిత మానసుల మగుచు.

నీవు దీనిని సాధింప నేర్తువేని—
భ్రమరకీటకన్యాయంబు ప్రబలినట్లు
భ్రమరమానవన్యాయంబు బ్రబలఁ గలదు;
నీకు యశ మబ్బుఁ, గోరిక నాకుఁ దీఱు.
అళిరో! క్షణమని చాలసే పాఁపినాఁడఁ,
దప్పు క్షమియింపఁగాఁ దగు చొప్పు గనుము.
నిన్ను పీడిన వనలక్ష్మి చిన్నవోవుఁ
గాన నీ వింక మరలుటే కర్జమేమొ;
ఏరొ పేర్వెట్టి పిలుచుచున్నారు నన్ను
దిగువనుండి, యదెట్టిదో తెలిసికొనఁగఁ
బోయి వత్తును, నీవును బొమ్ము; కాని
యళిరో! మఱువకు, దయయుంచు; పంతెచాలు.
చిన్నవిషయము నొక్కటి చిత్తగింపు
మిట్లు గా నుంటి మిక్వర మింతవఱకు;
నన్నిప్రాణులయందును నెన్నొగతులఁ
బ్రకృతిలో మార్పె సతము గన్పట్టుచుండ,
నెపుడు నిట్లుండుమని చెప్ప టెటులు తేఁటి!
ప్రకృతిశాస్త్రానుగుణ్యమై భావియందు
మార్పు లేవేవి రావచ్చు మనలఁ గూడ,
భావములయందొ! జీవితపథమునందొ!!
తనివి దీఱఁగ నుద్యానవనములందు
వేడుకం తోడ దినములు వెళ్లఁబుచ్చి,
కొంతకాలంబు చన్న యనంతరంబు
మఱచిపోవక దయ యుంచి మఱల రమ్ము;
మార్పు గలుగుటయే సంభవంబు గాన,
మంచిచెడ్డలు మాటాడ వచ్చుఁ గాన,
ముచ్చటలఁ జాల నాడికోవచ్చుఁ గాన.

అభినవ శ్రీకృష్ణుడు

విమర్శనము

పెద్దిభొట్ల వీరయ్యగారు, బి. ఏ., బి. యల్.

హిందూమతమునకు వేరుపురుగు లగు ఆర్యసమాజ బ్రహ్మసమాజపు దివ్యజ్ఞానసమాజ మతములు కొంతకాలముగ మనదేశమున ప్రబలుచున్నవి. అందు దివ్యజ్ఞానసమాజము ఆంగ్లేయ రాజకీయసంబంధముతో ప్రారంభింపబడి మనలో ఆంగ్ల విద్యాధికులు దేశము కొరకు పాటుబడుటలో వెనుకంజవేయుటను నుద్దేశింపబడిన పెడత్రోవయని కొందరు తలంచుచున్నారు. ఇంతకు దివ్యజ్ఞానసమాజము మతమా యనుసందియము గలదు. నామిత్రులగు శ్రీవక్కం భోగప్పయ్యశాస్త్రిగారు వంశపారంపర్యముగ పూర్వాచారసాంప్రదాయమునకు జెందియుండి బంధువులలో కొందరు దివ్యజ్ఞానసామాజికు లుండుటచేత కాబోలు వారి సాంగత్యమువల్ల వీరికి దివ్యజ్ఞానావేశము కలిగి యిటీవల 'అభినవ శ్రీకృష్ణుడు' అను చిన్న పుస్తకమును ప్రచురించియున్నారు. అందు శాస్త్రిగారు మతమతము నాచారములను చాలవరకు ఖండించుచు కృష్ణాజీగారి యందు తమకుగల అభిమానమును పూర్తిగ వ్యక్తపరిచియున్నారు. ఇప్పుడు శాస్త్రిగారి పుస్తకమును విమర్శించి అందలి సంగతులను గొన్నిటిని చదువరుల కెరుకపరచుచున్నాను.

దివ్యజ్ఞానసామాజికుల దృష్టిలో జిడ్డు కృష్ణమూర్తిగారు లోకగురువుగ నున్నారు. అంతమాత్రముగాక భోగప్పయ్యశాస్త్రిగారు లోకదృష్టి నానాటికి కృష్ణాజీగారిదెస దిరుగుచున్నదనియు, వారి ఉపదేశరత్నములను సాక్షాత్తుగ విన సర్వమానవు లభిలషించుచున్నారనియు, ప్రాగ్దేశీయులు మతసిద్ధాంతములన్నింటికిని జన్మస్థానమగు దేశమే తమ జన్మభూమియని విశ్వసించుచున్నారనియు, వారికిని కృష్ణాజీగారిని వినవలెననెడి కుతూహలము వృద్ధినొందుచున్నదనియు వ్రాయుచున్నారు. లెడుబీటరు గారికి 'యోగి' బిరుదమును తగిలించినారు. కృష్ణాజీగారిని బాల్యమున బిసెంటమ్మగారు లెడ్బీటరుగారి శిక్షణములో నుంచిరనియు, ఆయన హూణవిద్యాశిక్షణమేగాక ఆహారవిహారప్రవర్తనమునందుగూడ శిక్ష నిచ్చుచుండెననియు, మహర్షి దేవాపిగారికడకు కొన్ని దినములు ప్రతిరాత్రియు కృష్ణమూర్తిగారి స్థూలదేహము నిద్రించువేళ సూక్ష్మశరీరముతో యోగీలెడ్బీటరుగారు తీసికొనిపోవుచుండెడివారనియు, అత్తరి పదిపదిహేను నిమిషములు శ్రీమహర్షులవారు కృష్ణమూర్తిగారికి సాధనచతుష్టయమును బోధించుచుండిరనియు, ఏ రెండుమూడు వాక్యములో తప్ప వారిమాటలతోనే "పరమగురు చరణసన్నిధి" అను పేరుతో నాంగ్లమున నొక గ్రంథరాజమును శ్రీ కృష్ణాజీగారు రచించి దానిని లోకహితార్థమై ప్రకటించిరనియు శ్రీశాస్త్రిగారు తమపుస్తకములో వ్రాసియున్నారు. దివ్యజ్ఞానము లేనివారి కీపై కథ విశ్వాసానర్హ మని వేరుగ వ్రాయనక్కరలేదుగదా.

బిసెంటమ్మగారు శ్రీ జగద్గురువులగు శ్రీ మైత్రేయమహర్షులు కృష్ణమూర్తిగారి శరీరము ద్వారా ఆవేశించి ధర్మస్థాపన జేయుదురనే సంగతి జగద్గురువుల వారివల్లనే వింటిమనియు, కృష్ణమూర్తిగారికి తగు విద్యాబుద్ధుల నిచ్చు బాధ్యత తమయందును, లెడ్బీటరుగారియందును ఉంచిరని ప్రపంచమునందు వెల్లడిజేసిరనియు శ్రీశాస్త్రిగారు వ్రాయుచున్నారు. ఇది రెండవకథ. పరకాయప్రవేశబోధ కిది యాధారము కావచ్చును. కృష్ణాజీగారి యొక్క శరీరము శ్రీ జగద్గురువుల యవతరణమునకు తగిన యుపాధియే యని అనేకమందిసభ్యులు నమ్ముచుండిరట. అనగా నమ్మనివారును కొందరు గలరుకాబోలు! కృష్ణాజీగారి తండ్రి నారాయణయ్యగారికి తారకసంఘోద్దేశములందును, వానిప్రచారమునందును నమ్మకము పోయి పిల్లలస్వాధీనమునకై హైకోర్టులో దావా తేగా వ్యాజ్య

పర్యవసానమును ముందుగనే (గ్రహించి పదరు కోర్టువారి తీర్పు అమలుజరుప వీలులేకుండునట్లు ఇండియాదేశము నుండి కృష్ణమూర్తిగారిని బెసెంటమ్మగారు మన్న శ్రీ కృష్ణుని కంసుని బారినుండి తప్పింప గోకులబృందావనమున కుబంపినట్లు ఇంగ్లాండుదేశమునకు బంపిరని శ్రీ శాస్త్రి గారు వ్రాయుచున్నారు. ఆహా! ఏమిసాహసము! అమా యకుడైన నారాయణయ్యగారిని కంసునితో పోల్చుట యా! పాశ్చాత్యదేశములందు నిరుపమానమగు అనుభవ జ్ఞానమును సంపాదించి సహోదరులతో గలిసి మెలంగుచు తమయభిప్రాయములను అర్పించుచుండిన కృష్ణాజీగారు గతకాలమందు సామాన్యముగనేయుండి, పట్టపరీక్షలలో కృతార్థతబొంద ప్రయత్నించినట్లు గానరాదని శ్రీ భోగప్పయ్యశాస్త్రిగారు వ్రాయుచున్నారు. వీరి సహచ రులెవరోగదా! వీరికి గలిగిన అమోఘజ్ఞాననిధానములు తెలి సిన బాగుగనుండెడిది.

ఇక మాదివకథయొకటి గలదు. హాలండుదేశము లో ఓమెను పట్టణమున జరిగిన వార్షిక తారకసంఘ సమావేశ సందర్భమున శ్రీ జగద్గురువులు త్వరలో నవత రించుదురనియు, వారికి పన్నిద్దరు శిష్యు లుందురనియు, అందులో శ్రీసూరివి శేషానిరనియు బిసెంటమ్మగారు ప్రకటించిరట! వీరికి శ్రీ నే మనకెలెదో తెలియుటలేదు. గా౧౨౫ లో అడయారుసభలో కృష్ణమూర్తిగారి ఉప న్యాసము విని శ్రీ జగద్గురువులు కృష్ణమూర్తిగారి నావేశించి మాట్లాడినట్లుకొందరని శాస్త్రిగారు వ్రాయు చున్నారు. దయ్యము లావేశించుట కని వినియుంటిమి గాని గురువు లావేశించుట ఒక పిల్లకథగా నున్నది. పూర్వోత్తర సందర్భములు పెక్కులు తెలిపియున్న వేమి అతిపరిచయమునకుమున్కలిగి పత్నిగ్రహణమున కాలం కమునదని శ్రీ శాస్త్రిగారు వ్రాయ సాహసించుచు న్నారు. మానసికారణ్యములో నూతనోపదేశబీజములు వృద్ధికిరావని శాస్త్రిగారే విపులముగ చర్చించుచున్నారు. చెల్లనివనుపు బీజములు నాటక ఏమికాగలవు? అట్టి ఉపదేశము లరణ్యరోదనములు కాగలవు. "పూర్వపు శాస్త్రజ్ఞానములతోను, అభిమానములతోను, పూజల తోను, ఆచారములతోను, నమ్మకములతోను నూతనోప దేశములను సంకీర్ణముచేసినయెడల తత్త్వము పాడగుట్టును" అని శాస్త్రిగారు వ్రాయుచున్నారు. ఇది బ్రహ్మంగారి తత్త్వము మించినట్లు లున్నది. పూర్వాచారములు నూత నోపదేశములవల్ల సంకీర్ణమగుటకు మారుగా నూతనోప దేశములే పూర్వాచారములవల్ల సంకీర్ణములగుట కడుం గడు సాహసము.

పూర్వాభిప్రాయములే నిత్యసత్యము లని నిశ్చ యించుకొని వానితో నూతన సందేశములు ఎంతవరకు సరిపోవునాయని విమర్శచేయబోవుట యథార్థము చిక్కు- నట. అటు నొకకాలము, ఇటు నొకకాలము నుంచు వారికి మతియొసద్బ్రహ్మక్యము కూడ లేటుకుండు నని శ్రీ భోగప్పయ్య శాస్త్రిగారు వ్రాయుచున్నారు. ఒక శ్రేష్ఠస్యము నుస్వీకరించి వందులకు వారికి మనము కృతజ్ఞులమై యుండవలెను. అభినవ శ్రీ కృష్ణసందేశ యథార్థమును గ్రహింపవలె నన్న వట్టి ప్రమాణముకై దృఢ సంకల్పము చేయవలె నట ఇష్టానిష్టములను కొంతవరకైనను కట్టిపెట్టవలె నట.— "మన విద్యావిశేషము చాలనట్టుడ ఎరువు సొమ్ము. అది మనదికాదు. మనయర్థములు, తాత్ప ర్యములు మనవి కావు. ఇతరులవి" అని విద్యాజ్ఞానసమా ఖ్యలను శాస్త్రిగారు వ్రాయుటలో వింతలేదు. వారి యనుభవ మట్టిది. ఆంగ్లేయాచారమును గ్రహించువారికి గీతాశాస్త్రార్థము లట్టు విపరీతము తోచుట సహజము. కృష్ణాజీగారి సందేశగ్రహణసామర్థ్యమును సంపాదించుకొ నక వృథాసందేహములతో తంటాలుపడుచున్నారనుట— అంతట శాస్త్రిగారు మనలకు నాల్గవ కథను బోధించు చున్నారు. "జన్మసాఫల్యమైనవారనియు, కృతకృత్యుల మనియు, ఆప్తకాములమనియు, తమ ప్రియాతిమని తమ లోకీ కమగాని ప్రియతముతో నైక్యమైతిమనియు, సర్వులలోని ప్రియతముల తామేయనియు, జీవన్ముక్తుల మనియు, పరిపూర్ణులమనియు, అపరిచ్ఛిన్నులమనియు అద్వితీయులమనియు, సత్యం దైకరసానంద స్వరూపుల మనియు శ్రీ కృష్ణాజీగారే విస్పష్టముగ ననువుచుండ- ఇతరుల వాక్యములు ప్రమాణమై మన సందేహములను

భోగొట్టగలవా!" అని శాస్త్రిగారు తెలియజేయు కథను చదువరు లెంతవరకు విశ్వసింపగలరోకదా. ఏలెక్చరరుగారి సహాయములేనిదే దీనిని గ్రహించు టెట్లు? సంసారమునుండి తప్పించుకొనవ నిశ్చయించితివేని అభినవ శ్రీ కృష్ణ సందేశ మురళీగానమాధుర్యపానము చేయవలెనని శాస్త్రిగారు బోధించుచున్నారు. ఘోరజలమిశ్రితమాపోదకపానము చేయుట కలవడిన శాస్త్రిగారివంటి వారి కీకవట్టిపానీయము లవణఃరమని శాస్త్రిగారియొక్క యభిప్రాయము.

శ్రీ కృష్ణాజీగారి సందేశము గూడ ప్రాచీనోపదేశములకంటె భిన్నమనియే చెప్పవలసియున్నదని శ్రీభోగప్పత్యశాస్త్రిగారు వ్రాయుచున్నారు. నూతనోపదేశము లగ్రాహ్యములనుట వివేకశూన్యలక్షణము అని శాస్త్రిగారు చాటుచున్నారు. శ్రీ కృష్ణాజీగారును పిన్నవయసులోనే దేవాపి మహర్షులయొక్క యుపదేశ పాత్రు లయిరని మనము నమ్ముటలేదా యని శాస్త్రిగా రడుగుచున్నారు- మిగిలినవా రపాత్రులు కాబోలు! ఎవరు కృష్ణాజీగారి సందేశమున కర్హులో వారే నిర్ధారణ చేసికొనవలెనట! శాస్త్ర లోకజ్ఞానాధిక్యము లిందుకు పనికిరావట! కృష్ణాజీగా రవతారపురుషులైనను పూర్వపు అవతారపురుషులవలె మహిమల నేమియు జూపుట లేదట! ఏసుమహిమలను కన్నులార జూచినశిష్యులే వారిని త్యజించిరనియు, ముప్పదిసంవత్సరములకు ముందటికథయను దివ్యజ్ఞానసమాజస్థాపకులలో నొకరగు మేడం బ్లవాట్స్కీ అమ్మగారు కొన్ని యద్భుతములజూప అప్పుడు నమ్మినవా రందరు తరువాత అవన్నియు అబద్ధములని త్రోసివేయు లేదా యనియు శాస్త్రిగా రడుగుచున్నారు- అప్పుడే అవి కల్పనలని పత్రికలలో ప్రచురింపబడినది-అప్పటి హాటుహాహామీ లిప్పుడు లేరు కాబోలు! జర్మనీదేశపు పసిబాలుడొకడు తన తల్లి ప్రక్కను కూర్చుని శ్రీ కృష్ణాజీగారు ఆంగ్లమున నిచ్చిన యుపన్యాసమును విని ఆంగ్ల భాష బొత్తిగా తెలియకున్నను ఆ యుపన్యాససారమును తనభాషలో నడివెనట! చేపలు చెట్లెక్కు కథవలె నున్నది. ఇట్టిమహిమలు కొన్ని కృష్ణాజీగారియం దున్నటుల శాస్త్రిగారు వ్రాసిరి.

అభినవ శ్రీ కృష్ణుడు సార్థకనామధేయుడట. "మనకినీవర కెవరును 'నేనుముక్తుడను' అని ముఖతః చెప్పినవారు లేరుకదా. ఇది మనకు నూతనభాగ్యము కాదా" అని శాస్త్రిగారు వ్రాసియున్నారు. అభినవకృష్ణలీలల నన్నిటిని దీపక సార్థ నామధేయుడనుచున్నారు. ఆ వివరములు శాస్త్రిగారికే తెలిసి యుండవలెను. మనము పూర్వాచార్యుల యభిప్రాయములను స్వానుభవ జన్యవివేక జ్ఞానముతో బరిశోధింపజాలకున్నామట! అభిమన్యునిభంగి మన శాస్త్ర సిద్ధాంత సంప్రదాయాచారములలో మునిగి వానిబంధములనుండి బయటపడజాలకున్నామట! శాస్త్రిగారి యభిప్రాయములో సన్యాసులు బైరాగులు హరిదాసులెల్ల బూటకులని ధ్వనించు వాక్యములు వ్రాయుచు చిన్న సెలయేళ్లలో స్నానముచేయుచు రాళ్లను బూజించుచు యాత్రలుసలుపునట్టి అభ్యాసముగలమనకు నిరంజనము కృష్ణాజీగారి సందేశమే రాజబాట విడుసుపుట్టింపకమానదుగదా యని యనుచున్నారు. మోక్షమార్గములను గురించి క్రైస్తవులు మొదలగు మతస్థులందరు తమదే రాజబాటయనుట మిషనుపాఠశాలలలో జదివిన శాస్త్రిగారికి దెలిసినవిషయమై యున్నది. కర్మలుగాని, బాహ్య ప్రమాణములుగాని మోక్షమునకు సహకారి కానేరవను శాస్త్రిగారు ఎవరికి వారే ప్రమాణము కావలెననుచున్నారు. ఒక ప్రమాణమునందు విశ్వాసము తగ్గగా మరొక ప్రమాణము నన్వేషించుచు కప్పవలె గంతులు వేయుచున్నామట! బాహ్యప్రమాణము లనేకములు గలవు. ఏదని అంగీకరింతుమని భోగప్పత్యశాస్త్రిగారు శంకించుచున్నారు. కృష్ణాజీగారి వాక్యములందైనను గుడ్డినమ్మకము గూడ దనుచున్నారు. అది స్వబుద్ధికి యుక్తమని తోచవలెనట. పరమార్థవస్తువు కర్మలవల్ల లభ్యమగునట్టిదికాదనియు, విద్యాగంధముగలవారు సహితము పూర్వాచారములను వదలలేకున్నారనియు, ఈశ్వరుడు పక్కమాంసము తినుదారిలో నున్నాడని తెలిపి మానవులలో విమతత్వమును జూపుచు ప్రవర్తించు మనకు ఈశ్వరపూజ లెట్లు ప్రయోజనము లగునని ప్రశ్నించుచున్నారు. దేవాలయములయొక్క ప్రయోజనము కొంతకాలము క్రిందయుండినను ఇప్పు

డది శీర్షించినదట. సంధ్యావందనములు వదలి మరొకజపమునం దాసక్తి లగుచుంటిమని శాస్త్రిగారు వ్రాయుచు మోక్షార్థికి కర్మ లాటంకములని, పరాశ్రయబుద్ధిని విడిచి స్వాశ్రయపరులు కావలెనని బోధించుచున్నారు. ఇట్టిదే మెట్టవేదాంతము. దివ్యజ్ఞాన సమాజము నాశ్రయించుటలో వీరికి పరాశ్రయబుద్ధి లేదు కాబోలు! వీరు సర్వసంగ పరిత్యాగమును బోధించుచున్నారు. త్యజింపవలెనన్న పారవేయుమని కాదని నిర్వచనము చేయుచున్నారు. కోరికలనుండి, అనుభవములనుండి తప్పించుకొన నెవరికి సాధ్యము కాని శాస్త్రిగా రడుగుచున్నారు. పరానుభవములను అనుసంధానము చేయవలెననియు అట్లుచేయుట సామాన్యులకు సాధ్యము కాదని శాస్త్రిగారనుచున్నారు. పరశత్వము లేని మనస్సు దేహశాస్త్రమత కులాభిమానములలోను, కుతర్కములలోను, గురువులలోను, కర్మకలాపములలోను తగులుకొని చిక్కుపడి లక్ష్యము నంటుదట! కృష్ణాజీగారికి లెడ్బీటరుగారు గురువుగ నేల కావలసెనో గదా! వాసుదేవ పరబ్రహ్మమే తానని సాక్షాత్కారము గలిగిన ముక్తుడగునని శాస్త్రిగారు బోధించుచున్నారు. ఇందుకు దివ్యజ్ఞానసమాజ మవసరము లేదుగదా!

చిత్తశుద్ధి, సత్వశుద్ధి, అహంకారశుద్ధి కలిగిన సాక్షాత్కారము కలుగుననియు, అటుల ముక్తిబొందిన మానవుడే ఈశ్వరుడనియు, స్వయంతీర్ణుడుగాని మనుజుండు నితరులకు మార్గజ్యోతిగ నుండజాలడనియు, సంఘము మున్నగు బాహ్యములు జీవితమును ఆధ్యాత్మికముగ మార్చజాలవనియు "అందుకనియే శ్రీ కృష్ణాజీగారు సుమారు ౨౦ సంవత్సరములనుండియు తమఅధ్యక్షత క్రింద పనిచేయుచుండిన తారకసంఘమును తీసివేసి"రట! భళిర—ఈస్వల్పవిషయము తెలిసికొనుట కవతారపురుషుడనే వారికే ౨౦సంవత్సరములుపట్టిన సామాన్యులసంగతి ఎట్లుండునో చదువరులే తెలిసికొనగలరు. లోకభయము, శాస్త్రభయము వీడి కృష్ణాజీగారి ఉపదేశముల ననుష్ఠింపవలెనట! మార్జాలకిశోరన్యాయకాలము గతించిన దని మర్కటకిశోరన్యాయకాల మస్తమించుచున్న దనియు సింహకిశోరన్యాయకాల ముదయించినదని భోగప్పయ్య శాస్త్రిగారు బోధించుచు ఎవరికి వారే గురువుగా నుండవలెనను చున్నారు.

ఇంతవరకు శ్రీ శాస్త్రిగారు కృష్ణాజీగారి ఉపదేశముల సారమును తమవాక్యములలో తెలియజేసియున్నారు. సాధ్యమైనంతవరకు శాస్త్రిగారి మాటలనే యనువదించియున్నాను—ప్రతిమతము బోధించుసంగతుల కంటె శ్రీకృష్ణాజీగారు నూతనముగ విశేషముగ బోధించిన సంగతులు లేకపోగా పూర్వాచారములు మొదలగు వానిని, గురువులను త్యజించి ఎవరికి వారే లక్ష్యమని, అనుభవమే ప్రధానమని చేయుబోధ కలికాలములో నెంతవరకు కార్యకారికాగలదో గదా. దివ్యజ్ఞానసమాజమునకు జెందిన కట్టుకథలను వివరించి వానియందు శాస్త్రిగారికి గల నమ్మకమును దెలుపుటచూడ కామిర్లు గలవానికండ్లకన్నియు పచ్చగానుండునటు లున్నది. శాస్త్రిగారికి గల దివ్యజ్ఞానదృష్టివల్ల కొన్నిదృశ్యములు వారి మనఃఫలకమున జేరియుండవచ్చును. అది 'సంగదోష'ఫలితము కావచ్చును—అందుకు కొంత శుద్ధిసంస్కార మవసరము. శ్రీభోగప్పయ్యశాస్త్రిగారు మిక్కిలి శ్రమనొంది తాము త్రికరణశుద్ధిగ నమ్మిన సంగతులను లోకభయము, శాస్త్రభయము లేకుండ దెలియపరచినందులకు నాకు సంతోషముగ నున్నది. లోకములో అభిప్రాయభేదము లెన్నో యుండగలవు. నామిత్రునితో, వారి దివ్యజ్ఞానసమాజకవృత్తాంతముతో గాని, కథామంజరితో గాని, ఉపదేశభాగములతో గాని యేకీభవించకుండినను, శ్రీ శాస్త్రిగారి యెడ నాకు బాల్యమునుండి గల గౌరవమును, విశ్వాసమును వెల్లడించుచు వారిపుస్తకమును గురించి వారి యభినవ శ్రీకృష్ణునిగురించి నాకు దోచినవిధంబున విమర్శించియున్నాను. ఇంతకన్న విపులముగ వ్రాయునెడల వ్యాసబాహుళ్యమగునని, సంక్షేపముగ నాయభిప్రాయములను, సందేహములను వివరించి శాస్త్రిగారి గ్రంథమునందలి ముఖ్యవిషయములను వారిమాటలలోనే సాధ్యమైనవరకు విశదపరచియున్నాను.

విశ్వనాథ సత్యనారాయణ గారు, యం. ఏ.


(వెనుకటి సంచిక తరువాయి)

౫


కుట్టాన్ వీరభూపతి భుజముపై చేయి వైచి, 'వీరా! సరే! నా హృదయము మండుచున్నది నిన్న సాయంతనమున నీవుగూడ నీకేదో మహాభార మున్నట్లు చెప్పితివి. అది నాతో చెప్పవా?' అని యడిగెను. వీరభూపతి కొంచె మాగి, 'మరల నాకథ నా కేల స్మృతికి దెచ్చెదవు? ఈ జన్మ కింతియే. అవివాహితుడనుగా నీజీవితాంత ముండవలసిన స్థితియున్నను నాశరీరము మీద నాకే యధికారము లేకున్నది. వివాహ మేమో చేసికొనక తప్పునట్లు లేదు.' అని సాలోచనాత్ముడై చీకటు లుమియుచున్న పడమటి దిక్కువంక నదే విధముగ చూడ మొదలిడెను. కుట్టాన్ లేచి నీటిపాయ వద్దకు బోయి పాదక్షాళన మాచరించి, బొడ్డులోనున్న కత్తి తీసి పదును సరిగా చూచి మరల నొరలో నమర్చి, నీరు పుక్కిలించి యుమిసి వీరభూపతి యొద్ద కూర్చుండెను. వీరభూపతి 'సేతూ! నీవు మహారాజుల బిడ్డవు. నేను మిక్కిలి బీదవాడను. మన మిరువుర మొక్క తరగతి చదువుకొనుచుండుట మాత్రముచేత మన కిట్టి స్నేహ మెట్లొడగూడినది? ప్రాణపదములైన రహస్యములు నీ వేమో నాకు చెప్పితివి. నేను నీ కెట్లు చెప్పకుండగలను?' అని తన చేతితో నిరుపాయలుగా తీయబడియున్న సేతుపతి తలవెండ్రుకల నిమురుచు, స్నిగ్ధములైన తనచూపు లతని మొగమున నిలిపి, 'సేతూ! నీవు నీభార్యతో నివసించుచుంటివి. మీ యిరువురికి సుఖము లేదని నాతో చెప్పితివి. పాప మాపిల్లను చక్కగా ప్రేమించుము. మహారాజుల యింటిబిడ్డ పేదగుడిసెలో నివసించు పిల్లకన్న నందకత్తె కాకపోదు. కాదుపో! అంత సౌకుమార్యము పేదవారి కెక్కడనుండి వచ్చును? నా మనఃపూర్తిగా నిన్ను నీభార్యను ప్రేమించుమని యడుగుచున్నాను. నీ భార్యను నీవు ప్రేమించెదవని గట్టిగా నాతో చెప్పిన గాని నా కానందము లేదు. రేపు నేను వివాహము చేసికొన బోవుచున్నాను. నేను ప్రేమించిన స్త్రీ యేమో నాకు దుర్లభ. వివాహము చేసికొనకా తప్పదు. ఏమి చేయు మందువు? ప్రాణము పోయినను వివాహము చేసికొనని పట్టుపట్టనా? ఇట్లని నాపైన నే యాశలన్నియు పెంచుకొన్న తల్లిదండ్రుల యాత్మలకు ముసలితనములో నెంత యావేదన తీసికొని రమ్మందువు? వివాహము చేసికొందును. అనంతరము వచ్చినభార్యతో విముఖుడనై యుండి యేమిసంపాదించుకొందును? ఇహమా! పరమా! ఈజన్మ లెత్తినది సుఖము లనుభవించుటకు గాదు. కావున సేతూ! నీభార్యను నీవు ప్రేమింతువని వాగ్దానమిమ్ము! అట్లొసం

గినచో నాకథ నేను చెప్పెదను.' వీరభూపతి యిట్లు చెప్పుచుండగా కుట్టాన్ కనులవెంట నీరు కార్చుచుండెను. వీరభూపతి కొంచె మాగి, 'తమ్ముడా! నిన్ను నే నిటుల సంబోధించుటకు నీవే యింత చన విచ్చితివి. కన్నులవెంట నీరు దేకుము. నేను నీకన్న నేవిషయములోనను పెద్దవాడను గాకపోయినను వయసులోనైన పెద్దవాడను. అయ్యో! ఇ ట్లేడ్చెదరా!' అని వీరభూపతి తన యుత్తరీయపు కొంగుతో కుట్టాన్ కన్నీళ్లు తుడిచెను. వీరభూపతి మరల, 'ఏమి! వాగ్దానము చేసెదవా! అది నీమేలుకో సమే చెప్పుచున్నాను. నీయందు నాకు గల స్నేహము నీవలన నీవాగ్దానము తప్పక పుచ్చుకొమ్మని నన్ను వేధించుచున్నది. ఇకముందు నీభార్యతో నీవు సరిగా నుందువని నాచేతిలో చేయి వేయుము!' అని కుట్టానును బలవంత పెట్టెను. కుట్టాన్ మాటలాడలేదు. వీరభూపతి మరల 'నీభార్య యందకత్తెయేనా' యని యడిగెను. కుట్టాన్ మారు పలుకలేదు. వీరభూపతి 'సేతూ! ఈప్రశ్న వేయగూడదని నేనె యుగుదును. నీయంతఃపురమును గురించిన నాయీప్రశ్న నాయందు నీ కింత నెయ్యము లే నియెడ నాశిరస్సును మొండెమునుండి విడిగా చూచియుండును. నీ వామె సౌందర్యవతియని యనుకొంటివేని యామెకుగూడ నీ ప్రేమలో కొంత పంచిపెట్టుము.' కుట్టాన్ మాటాడ లేదు. వీరభూపతి—'సౌందర్యవతి కాద యేని కాదని చెప్పుము.' కుట్టాన్ పెదవులు కదలినవి. వీరభూపతి-'సేతూ! బిగ్గఱగా చెప్పుము. నాగొంతులో ప్రాణ మున్నంతవఱకు నీరహస్యమును బయటకు పోనిచ్చువాడను కాను. నీకు నాయం దంత నమ్మకములేదా!' కుట్టాన్ నెమ్మదిగా, 'ఇదివరకు నే నామెను పరిశీలించి చూడలేదు గాని గడచినరాత్రి చూచితిని. ఆమె యందకత్తెయే యగును' అన్నాడు. వీరభూపతి 'అయిన నీకే నేమి? నీ వసుందరమైన వస్తువును ప్రేమించుట లేదుకద, ఇది గృహస్థధర్మము. ప్రతివాడును చేయతగినవిధి. నేను నిన్ను ప్రార్థించు చున్నాను.' వీరభూపతి కన్నుల నీళ్లు గ్రమ్మినవి. మరల వీరభూపతి యిట్లన్నాడు: 'నాకు వచ్చుచున్న దుఃఖమును ప్రయత్నముచే నాపుకొనుచుంటిని. నాయనా! నా కీవాగ్దాన మిమ్ము! కలకంఠికంట కన్నీ రొలుకరాదట. శ్రీ యింట నుండ నొల్లదట. నా కీ వాగ్దాన మిచ్చినగాని నేనిందుండి లేవను.' అని వీరభూపతి కుట్టాన్ పాదములపై బడుటకు సంసిద్ధుడైనాడు. కుట్టాన్ తొట్రుపాటునంది, 'వీరా! ఎంతమంచివాడవు. ఇన్నాళ్లనుండి యేమో వట్టిస్నేహితుడ వనుకొంటిని గాని నేను నీవుగా నూహించుకొను నంతటి ప్రేమ నాయందు నీకున్నదని తెలిసికొనలేకపోతిని. నిజముగా నింత ప్రేమకు నే నసర్హుడను. నే నాస్త్రీని ప్రేమించలే కున్నాను. నీకోసమని ప్రేమించుమందువా! ప్రేమించెదను. ప్రేమించెదను. వీరా! ప్రయత్నము చేసెదను. కాలము పట్టునట్లున్నది. క్షమింపు' మని కుట్టాన్ వెక్కి వెక్కి యేడ్వ మొదలుపెట్టినాడు. వీరభూపతి యతనిని గాఢముగా కౌగిలించుకొని

యతనిశిరస్సును మూర్కొని, 'కాలము పట్టి నంత మాత్రముచేత నేమియు తొందర లేదు. సూక్ష్మగా విచారించి చేయుము! పదిసారులు నేను చెప్పవలసిన దేమున్నది? వాగ్దాన మిచ్చి తివి జ్ఞాపక ముంచుకొమ్ము.' 'ఆ. ఇచ్చితి'నను నర్ధకంఠస్వరములో కుట్లాన్ శిరస్సు అంగీకా రార్థ చలనము గనపరచినది. తరువాత నర్ధ ఘటికసే పెవ్వరును మాటాడలేదు. కుట్లాన్ తల యెత్తి వీరభూపతివంక చూచెను. ఆచూ పు వీరభూపతి నతనిగాథ చెప్పుమని యడుగు నట్లున్నది వీరభూపతి కన్నులలో మెఱుపు మెఱసినట్లయినది. అతడుతలవంచి,కుడిచేతితో వ్రేగై యిసుక గుప్పిళ్లుగా దీసికొనుచు వద లిపెట్టుచు, 'సేతూ, ఈరహస్యము నే నెవ్వరి కిని చెప్ప దలంచుకొనలేదు. ఎవ్వరికిని చెప్ప నని యొట్టు పెట్టుకొంటిని. ఆయొట్టునుకూడ నిర్లక్ష్యముచేసి నీకు చెప్పించుచున్న యీశక్తి యేం దున్నదో నాకు తెలియుటలేదు. నీవు నీ రహస్యములు నా కంతగా చెప్పుటచేత నాహృ దయము నీసెడల కరగి నీరైనది. నీవంటి వాడు నాతో నంత చనవు, నంత ప్రేమ చూపిం చుటచేత నాహృదయమునకు లేనిమార్దవము వచ్చినది. ఉన్నపట్టుదల సడలినది. కాని, సేతూ! నాకథ చెప్పెద ననుకొనుము. చెప్పి ఫలితము లేదు. నాజన్మలో నాకోరిక సఫలము కాదు. అగుటకు వీలు లేదు. అది నాకు తెలి యును. అయినను దానివలన నాహృదయము బాధపడుచునే యున్నది. ఆవిషయము నామ నస్సు మఱువలేకున్నది. నిజముగా నీసంగతి చెప్పదగినవా రెవరైన నున్నారా యనినచో, నీవుతక్క నిం కెవ్వరును లేరు. కాని నా దొక ప్రార్థన. నే నాకథ చెప్పుచుండగా నీవు న న్నే మియు నడుగవద్దు. ఎంత చెప్పవలయునో యంత యు చెప్పెదను. ముఖ్యముగా నూరిపేరులు మాత్రము దాచెదను. అవి చెప్పుట నా కిష్టము లేదు. అవి తెలిసినంతమాత్రమున నాకు లాభ మును లేదు. అయినను చెప్పెదను. మాది రాజ వల్లిపురము; తెలుగు దేశము. మా తాత తండ్రి విశ్వనాథ నాయకులవారి వెంట నీదేశ మునకు వచ్చినాడు. యుద్ధసమయములయందు మాపూర్వులు కత్తులుగూడ పూనిరి గాని, వా రెక్కువభాగము వ్యవసాయదారులు. మా తాతలు ముగ్గు రన్నదమ్ములు. మాతండ్రులు నల్గురు. మాతండ్రికి మేము ముగ్గురము. విశ్వ నాథ నాయకులుగా రిచ్చిన భూమియంతయు మావంశముక్రింద పంపుళ్లయిపోయినది. నేటికి నే నుద్యోగము చేయవలసివచ్చినది. నా కిప్పు డిరువది యెన్మిదేండ్లు. మా యన్నదమ్ములు నేము పంచుకొని సంవత్సర మైనది. మావారు పూర్తిగా వ్యవసాయము చేసికొనుచున్నను యుద్ధవాంఛ మాయింట పూర్తిగా చావ లేదు. అవసరము వచ్చెనేని యప్పుడైనను దేశక్షేమమునకై రక్త మోడ్చుటకు మాయిం ట పసిపిల్లకూడ వెనుతీయదు. నాయిరువది నాల్గవయేట, నేటికి నాలుగేండ్ల క్రింద, నే నొక కారణాంతరముచేత నొక యూరు పోతిని. ఆ యూరిపేరుగాని, యాపనిగాని న న్నడిగి నామ నస్సు కలత పెట్టకుము. ఒకనాడు నేను స్నానము



చిత్రము ౮. మైసూరు సంస్థానమునందలి శ్రీరంగపట్టణమున గల కోట



చిత్రము 3. యమునానదిపై రైలు వంతెన

చేసి తెల్లని మడుపులు ధరించి యాకూరి వెంట వాహ్యాళిపోయితిని. ఆత్మస్తుతి యను కొనకుము. అప్పుడు నేను చాలఅందముగా నుండెడివాడను. గృహసంబంధ మైనవియు, నా మనోజనిత ములనవియు ననేక కష్టముల చేత నాయందమంతయు పోయినది. ఇప్పుడు నాకనులలో దూరాలోచన యేర్పడినది. అప్పుడు నానేత్రములు దుఃఖ మెఱుగని జీవి నేత్రములవలె, సాయం వికసిత నీలకైర వమ్ములవలె నుండెడివి. నా కాయూరు క్రొత్త. పోవుచుండగా నూరిబయట నొక వీథియందు పెద్ద సౌధ మున్నది. ఆ సౌధగవాక్షమునుండి యొక జగన్మోహనాకృతి నావంక చూచుచుం డెను. నే నామెవంక చూచితిని. ఆహా! ఆ యం ద మేమని చెప్పుదును! అది సాయంకాలము. శిశిరర్తువు వెనుకబట్టుచున్నది. వసంత మేతెంచు చున్నది. వసంతము తన వెంట తెచ్చిన యన్ని కుసుమములలో గూడ నంతసౌందర్యము లేదు. నేను చూచితినో లేదో, యామె తల వెనుకకు తీసికొన్నది. ఏమి చేయుదును? కదలిపోవుటకు కాళ్లాడలేదు. వెళ్లిపోవుద మనుకొంటిని. కన్నీ ళ్లు వచ్చినవి. చూచినచో నాసౌధ మెవ్వరిదో గొప్పవారిదివలె నున్నది. నే నెక్కడ? ఆ సౌధ శ్రీ యెక్కడ? నాహృదయమున నాశా తంతువులు ఇది తలచుకొన్న కొలది భిన్న భిన్నము లయ్యెను. ఇంతలో గవాక్షముమీద నొక పట్టుతెర దిగిపోయినది. ఆ తెర నాప్రేమ జ్యోతి నార్పివేసిన ట్లున్నది. వదలలేక వదల లేక, కాలు పెగుల్చుకొని బసకు పోతిని. ప్రొద్దు గ్రుంకలేదు. తెల్లవార లేదు తెల్లవారులు నిదురలేదు. తెల్లవారక ముందె కాల్యకృత్య ములు నెఱవేర్చుకుని, మరల స్వచ్ఛదుకూల ములు ధరించి, తల దువ్వుకుని, బసలో నిలువు టద్దమున్నది—దానివద్దకు పోయి చూచు కుంటిని. తెల్లవారులు నిదుర లేక కన్నులు జోతులవలె నెఱ్ఱగా నున్నవి. చెక్కిళ్లు తోసుకు పోయినవి. కనులు మూతలు పడుచున్నవి. కాని యెంత యందముగా నుంటి ననుకొం టివి! నన్ను చూచి నేనే మోహపడి పోయి తిని. అది యంతయు మనసులో నున్న దేమో తెలియదు. సుఖదుఃఖములు గాని, సౌంద ర్యా సౌందర్యములు గాని మనస్సు ననుసరించినవే కదా. సరి; మరల నావీథినే పోయితిని. పోయి యేదో పని యున్నటు లందు తిరుగుచుంటిని. కొంత సేపటికి గవాక్షముపైని తెర చిలుక తెక్కవలె ముడుచుకున్నది. లోనుండి యా జగన్మోహనవదనము నా కనులయెదుట కనం బడినది. నేతూ! అది కనంబడినదో లేదో నేనే నమ్మలేకుండ నున్నాను. అది యేదో బహుపుణ్యరాశియగు నక్షత్రము, ఏ పాపలేశ ముచేతనో భూమిమీద వచ్చి పడినది. ఒక్క నిమేషము మే మిర్వురము పరస్పర దృక్ప్రసార ప్రవాహములో మునిగిపోతిమి. మరల నెమ్మ దిగా తెర దిగినది. ప్రొద్దెక్కిన కొలది నాకు ధైర్యము సడలినది. నే నం దున్నంత సేపు మాటిమాటికి తెరనుండి యామె నావంక చూచుచునే యున్నది. అది మొదలు నేను నా యాయూరు పోయినపని మరచి, యుద

యము సాయంతనము నా వీథికి పోవుట, యామెను చూచుటతోడనే గడపితిని. ఆమెయు నాయందు సాభిప్రాయవలెనే మెలంగినది. ఇట్లొకవారము రోజులు గడచినవి. ఆమె యినుపకోటలో నున్నది. బయటకు వచ్చుటకు వీలు లేదు; నేను లోనికి పోవుటకు వీలు లేదు. ఏమి చేయుదును? ఈవారము రోజులలో నామె యెప్పుడప్పుడు గవాక్షమువద్ద కనుపించుటకు వీలు లేకుండెడిది. ఒకనాడు సాయంకాలమున నామె నావంక కనుఱెప్ప వాల్పక చూచి, కనులు గట్టిగా మూసికొని, కొంచెము సేపుండి తెరచి లోనికి పోయినది. మరల రాలేదు. అది యేదో సంకేతమని యనుకొంటిని గాని నాబుద్ధి దాని నిజమ్ము గ్రహింపగలిగినంతగా పోలేదు. బసకు పోయి భోజనము చేసి, యా రాత్రి—చీకటి రాత్రి—రెండుజాముల వేళ నా సౌధగవాక్షముకడకు పోయితిని. గవాక్షమునుండి వెలుతురు కనంబడుచుండెను. నేను గవాక్షమునకు కొంచెము దూరముగా నిలుచుండి దగ్గితిని. ఆమె యది గ్రహించి లోనుండి యొకవస్తువు విసరివైచి లోనికి పోయెను. గవాక్షము చీకటి యై పోయినది. నేను చీకటిలో వెదకికొంటిని. వీథియంతయు గుమ్మున బరిమళించుచుండెను. వెదకుచున్న వస్తువు దొరకినది. అది పెద్దజాజులు, మల్లెలు కూర్చి కట్టిన చెండు. ఆసువాసన నేను పట్టలేక పోయినాను. బసకు పోయి యీ పూలచెండు నెదుఱొమ్ముపై నుంచుకొని కనులు మూసుకొని పండుకుంటిని. మనసు నిలువలేదు. నిద్ర యెక్కడనుండి వచ్చును? అది పూలచెండు మాత్రమే కాదనుకొంటిని. మనసులో దేవతలుకూడ వాంఛించని కోరికలు నిర్మించుకొంటిని. అందరు నిద్రపోవుచుండిరి గాన దీపము దగ్గరకు పోయి చెండును ముద్దుపెట్టుకొంటిని. ఎదుఱొమ్మున నాన్చుకొని యాప్రియురాలి హస్తము తాకినట్లు సంతసించుచుంటిని. నా యొడలు గగుర్పొడిచినది. నవ్వుకొనియెదవా? ఏమి చేయను? అన్నియు నీతో జెప్పుచుంటిని. ఏదో బుద్ధి పుట్టి పూలచెండు చిదిమివేసితిని. ఆశ్చర్యమైపోయినది. లోన నొక యుత్తరమున్నది. భూర్జపత్రమునిండ నక్షరములువిస్పష్టముగా గనంబడుటకు కస్తూరియు, పునుగును నలంద బడియున్నవి. ఆవాసన లిల్లంతయు గ్రమ్మివేసినవి. ఆవాసనలచేత దీపము పోవునేమో యనుకొంటిని; ఇంటిలోనివారందఱు మేల్కొందురేమో యనుకొంటిని. ఉత్తరము చదువుకొనకముందే దాచుకొనవలయు ననుపించినది. ఎచ్చట దాతును? హృదయము చించి లోన దాతునా? హృదయము చించుకొనుటకు పజ్జకత్తి లేకపోయినది. ఆవారము దినములనుండి నాబాకు బొడ్డులో లేకుండగనే నేను తిరుగుచుంటిని. మరల నావేళ మాపుకుని యుత్తరమును చదువ మొదలుపెట్టితిని. ప్రత్యక్షరమునందును నూత్నస్వర్గములు నిర్మింప బడియున్న యాయుత్తరము పూర్తిగా చదువుట నాచేత కాలేదు. తక్కినది రేపు చదువవచ్చునులే యని పోయి పండుకుందును. ఎట్లు పండుకొనగలను? మరల దీపమువద్దకు పోదును; కొం

చెము చదువుదును. ఎవ్వరైన లేచెద రేమో యని భయము. ఆరాత్రి నాజీవితములో పరమమైన కాలము. అంతే యానంద మారాత్రి యనుభవించితిని గాన తరువాత నీనాటివరకు దుఃఖము వారడి యనుభవించవలెనని వ్రాసి నాడు కాబోలు విధాత. నేను నిద్రపోవు వరకు కోడి కూసినది. నిద్రపోవువరకు కాదు, మఱల శయ్యపై బండుకొనబోవు వఱకు. తెల్లవారు సరికి నేను వచ్చిన కార్య మాలస్య మయినదని నాతండ్రిగారు వచ్చిరి. నేను వెళ్లిన కార్యము చాల తొందరమైనది. నే నాపని చేయక పోవుటలో నా కెంతయేనియు తప్పే. కాని నే నేమి చేయగలను? మరునాడు పని మైనది. ఇంటికి పోవలెను. నే నాయూరు వదలి పెట్టలేను. మా తండ్రితో వెళ్లితీరవలెను. దారిలో బండి నెక్కి మాయూరు పోవుచున్నాము. మాతండ్రి నాకట్టను మాయూరికి జేర వేయుచున్నాడు. నన్ను సహస్రనాగములు తోకలతో మెలివేసి వెనుకకు లాగుచున్నవి. ఆయుత్తమమైన కస్తూరి తావులు మానాయనను సమాకర్షించినవి; నన్నడిగినాడు. నేను చెప్పలేదు. ఇంటికి పోవువరకు రహస్య మంతయు మాతండ్రికి తెలిసినది. మాయమ్మ గారికి నాయనగారు చెప్పినారు. ఉత్తరములో నామె యెవరో, నే నెట్లామెను కలసికొనవల యునో, సర్వము వ్రాయబడియున్నది. ఇంక నెన్నివిషయము లున్నవి? అవి నేనుదక్క నింక నెవ్వరు చూడరాదు; వినరాదు. అవి మాతల్లియు, తండ్రియు నెఱింగినపుడు నామనోవ్యథ యెట్లున్నది? త్రాచును పైనుండి పక్షులు పడగమీద తన్నుచు బాడుచుచు నుండిన దాని కెంతవ్యథయో యంతనరకబాధ యనుభవించితిని. కాని వారు నాతల్లితండ్రులే కదా! ఆరహస్యము నాల్గవనోట బడలేదు. తక్కిన నాసహోదరులు నెరుగరు. నాజననీ జనకులు నన్ను గడ్డము పుచ్చుకుని బ్రతిమాలిరి; ప్రార్థించిరి; మహాపద నెత్తిపైకి తెచ్చుకో వద్దనిరి. జొన్నచేనులో మంచెయే కాని సౌధము కూడ దనిరి; అనేక వారములు కన్నీరు పెట్టుకొనిరి. సేతూ! ఇటు మనస్సులోని కోరిక చంపుకొననా? ఫలోన్ముఖ మైనది. ఎదుట స్వర్గములు స్పష్టముగా కాన్పించుచున్నవే! కనులు మూసికొన్న నామె తక్క నింక నే యాకృతియు లేదు. అటుల తల్లిదండ్రుల మనస్సున కానందము గలిగించనా! ఆరోజులలో నాకు భోజనము లేదు. నిద్ర లేదు. పిచ్చివానివలె చూచుచుంటిని. నా తల్లియు తండ్రియు నొక్కనిమేషముకూడ నన్ను వదలి యుండలేదు. రెండు నెల లైనతరువాత నాతల తిరిగినది. ప్రపంచకములో పడినాను. ఆరోజులలో నా స్వప్నములు, కన్ను మూసిన కనంబడు ఘోరదర్శనములు నేమని చెప్పుదును. చివరకు తల్లితండ్రులమీది ప్రేమయే జయించినది. తరువాత సంవత్సరము వరకు కనులు మూసినచో నాప్రేయసి కనంబడు చుండెడిది. ఇప్పు డామె నాకలలోనికికూడ వచ్చుట మాని వేసినది. నే నది మొద లాయూరు పోవుటకు వీలు లేకుండ చేసినారు నాతలిదండ్రులు. నే

నాయూరు వెల్లినచో నాతలిదండ్రులు చని పోవుదురని నాకు భయము. వార ట్లన్నారు. నే నా గ్రామమువంక చూడనని నాతల్లికి, దండ్రికి వాగ్దానము చేసితిని ఈరీతిగా నాప్రేమ యెడారిలో తినంత దానదృశ్యమైన నదివోలె మాయమైనది.'

తరువాత నిశ్శబ్దత; అంధకారము.

౬

దినములు యథాస్థితిగ చనుచున్నవి. కుట్టాన్ మనస్సు కల్లోలము వీరభద్ర భట్టకు నకు గొంచెము తెలిసినది. కారణము తెలి యలేదు. రామనాథమున కుత్తరము పోయెను. ఒకరోజున కుట్టాన్ వీరభద్రభట్టరులు రాజ నీతి పాఠశాలకు పోయిరి. మధ్యాహ్నమున సూర్యుడు తీక్ష్ణాంశువులను చిమ్ముచుండెను.

ఏకవీర భోజనము క్రమక్రమముగా తగ్గి పోవుచుండెను. ఆమె శారీరకముగా రోజురోజు కు క్షీణించిపోవుచుండెను. మాంసలములైన యామెనేత్రములు గుంటలుపడినవి. కపోల ములయందు రక్తమాంసములు క్షీణించి, పాత్రు రాయిపిట్ట పొట్టవలె మృదువై తళతళలాడు నామెవదనము తేనెప ట్టూడిపోయిన వృక్ష శాఖవలె శోభాహీనమైనది; చిక్కిపోయినది. దినదినము సంస్కారము లేక యామె కేశ ములు సంస్కృతములైనపుడు స్నిగ్ధము యయ్యు, తక్కిన వేళల నరమ్యముగా నుండెను. వచ్చినక్రొత్తలో తలమాయనీయక,వలువమా యనీయని ఆయెలనాగ శ్రద్ధ క్రమముగా వాని పైనుండి తొలంగి పోవుచుండెను. ఈరహస్య ములు దాసీజనములనుండి యెట్లు తప్పించుకొ నగలవు? ఏకవీర మిగుల ధైర్యము కలది. దిట్ట మైన గుండె కలది. పరమములైన రహస్య ములు జీవితాంతము తనమనస్సులోననే దాచి యుంచగల మనోదార్ఢ్యము గలది. ఆమెరహ స్యము బ్రహ్మదేవునికిగూడ తెలియదు.

తిరుచునాపల్లి మండలములో 'అల్వారు కురుచ్చి' యను నొకగ్రామ మున్నది. ఆగ్రామ మునే యంబాసముద్ర మనియు వ్యవహరిం తురు. అంబాసముద్రము తిరుచునాపల్లి మం డలములో పెద్దయూరు. తిరుచునాపల్లి యంత కాకపోయినను కొంచెము తక్కువగా నైన నుండును. తిరుచునాపల్లి మండలాధిపుని క్రింద పదిమంది పాళెగాండ్రుండిరి. మధురనాయకు లకు మండలాధిపు లెట్టివారో మండలాధిపు లకు వీ రట్టివారు. అంబాసముద్రముపాళె గాని క్రింద నారువందల గ్రామము లున్నవి. ఈనూరువందల గ్రామముల మీద నతడే యధికారి. అతని క్రింద నైదువేల సైన్య మున్నది. తిరుచునాపల్లి మండలాధిపుని పాళె గాండ్ర యందరిలోనను నంబాసముద్రాధిపతి మిక్కిలి ధనవంతుడు; బలశాలి. అంబాసము ద్రములో నతనికోట యున్నది. చిన్నపాళె గాండ్రు కోటలు కట్టరాదు. అయినను నితడు కోట కట్టినపుడు మండలాధిపు డేమియు నన లేక యూరకుండెను.

ఏకవీ ర యాని కూతురు. ఏకవీరకు తమ్ము లిద్ద రున్నారు. ఆమె తండ్రి కామె

యొక్క తెయే స్త్రీసంతానము. చిన్నప్పటి నుండియు నేకవీర గొప్పయింట బుట్టినది గాన తక్కిన రాజభోగముల ననుభవించినది గాని తండ్రి వాత్సల్య మెఱుగదు. తండ్రి యొక రాక్షసుడు; మిక్కిలి క్రూరుడు. అతడు తనపాళెములో పన్నులు పోగుచేసినపుడు కాని, తక్కిన యేరాచకార్యమందుగాని మిగుల కఠినుడు. భార్యయందు గాని, బిడ్డలయందుగాని ప్రేమయన నేమో యతనికి తెలియదు. అతని వదనము విలోకించిన రాక్షసుని చూడనక్కఱలేదు. కాని యేకవీర తల్లి సుగుణాలవాల. సామాన్యముగ ప్రపంచమున దుర్జనునికి సుగుణవతిని సుజనునకు దుష్ట యగు భార్యను, కురూపికి సుందరకత్తెను సుందరగానికి కురూపయయిన యువతిని సంతరింపజేయు భగవంతునియుద్దేశ మేమో యెవరికి తెలియును? ఏకవీర తండ్రి యెంత దుర్మార్గుడో తల్లి యంత సన్మార్గ. తండ్రి యెంత రాక్షసుడో తల్లి యంత భూదేవత. తండ్రి యెంత వికృతస్వరూపుడో తల్లి యంత సౌందర్యవతి. ఏకవీర సౌందర్యమునందు మూడుమూర్తుల తల్లినిబోలి పుట్టినది.

ఉదయన్ సేతుపతి తన కుమారునకు నేకవీరను చేసికొన్నందువలన నతనికి పది గ్రామములు వచ్చినవి. ఏనుగులు, గుఱ్ఱములు, ధనము తగినంత ముట్టినవి. వివాహము ఆల్వారుకురిచ్చిలో నే జరిగినది. వివాహము మూడురోజులు పెండ్లికూతురునకు జబ్బే. పెండ్లికుమారునకు జబ్బే. ఆ మూడురోజులు పెండ్లికుమార్తె యేడ్చుచున్నది. అందరు పసిపిల్ల భయపడిన దనుకున్నారు. కొంతవరకు మాధ్గ్య మనుకున్నారు. పెండ్లిలో కుట్టాన్ స్థితి చిత్రముగా నున్నది. అతడు తండ్రికి భయపడి యేమియు మాటాడలేదు. తండ్రి లేనపుడు అందరిమీద విసుగుకొనుచుండెడివాడు. పెండ్లిలో నొకరు కోరికిన తములపాకు లొకరు కొరుకలేదు; ఒకరి పేరొకరు చెప్పలేదు. చివర దినమున నేకవీర చెప్పినది. కుట్టాన్ నోట మాట రాలేదు. అందరికి భయమైనది.

ఏకవీర కిపుడు పదునెనిమి దేండ్లు. ఆమె సౌందర్యమునకు పోలిక నిండుగా ప్రవహించు నది; కంకె విడిచి మురువులొలుకు పంటచేను. ఆమె ద్రావిడభాషలోని చక్కని గ్రంథము లన్నియు జదివినది. తనతండ్రియింట నొకపుస్తకమైన లేదు. తల్లితో చెప్పి పురోహితుని వద్ద నుండి తెప్పించుకుని చదివినది. ఆమె మనస్సు చక్కని గ్రంథములు చదువుటచేత చిగిర్చి, ఫలములు గాచి, పరిపక్వమైనది. ఆమె సుకుమార భావములకు పుట్టినిల్లు.

ఆ మధ్యాహ్నమున సూర్యుడు తీక్ష్ణాంశువుల చిమ్ముచుండెను. ఏకవీర గదిలోనికి పోయి పండుకున్నది. తన పెట్టె తీసి అందులో నుంచి 'అవ్వయ్యార్' వ్రాసిన 'కొండ్రైవెందన్', 'ఆతిచ్చూడి' అను రెండు చిన్న పుస్తకములను తీసి చదువుచుండెను. అవ్వయ్యార్ అఱవదియేండ్ల వృద్ధస్త్రీ. సరస్వతీదేవి యవతారము. ఆయమ వ్రాసిన గ్రంథములు

మిక్కిలి సులభములై, యర్థవంతములై, యారంగ్రభాషలోని భీమకవి సుమతీశతకమువలె పిల్లలకు పాఠయోగ్యములుగా నుండును. ఏకవీర 'అతిచ్చూడి' గ్రంథము తీసి మొట్టమొదటనే 'అరంజేవిరుంబు' (ధర్మము చేయుము), 'ఆరవదుశినం' (కోపపడకుము) అని చదువుకుని పుస్తకము మూసెను. పుస్తకములు రెండును మరల పెట్టెలో పెట్టెను. ఆమె మనస్సులో మాటిమాటికి 'అరంజేవిరుంబు', 'అరంజే విరుంబు' అను ధర్మమూరకే మ్రోగుచున్నది. ఆమె కనులు మూసికొని తనసెజ్జపై పండుకున్నది. పండుకున్నది హఠాత్తుగా లేచి తలుపు దగ్గరకు పోయి యెవరో వచ్చిరనుకొని చూచి, పొరపాటుపడితి ననుకుని పోయి మరల పండుకున్నది. వేసగి. ఒడలంతయు దుకతుకలాడిపోయినది.

సౌధ పశ్చాద్భాగమున కుడ్యమున వసారాలో నొక చిన్నగోడ చదరముగా కట్టబడియున్నది. దానినిండ నెల్లపుడు నీరము నిండియుండును. గచ్చుతో గట్టబడియుండుటచేత నందులోని నీర మెల్లవేళల చల్లగా నుండును. ఏకవీరనగ లన్నియు దీసి, సేలువ దూరముగా నుంచి, బంగారపు పనిగల తనచీర విప్పకుండనే యానీటి దగ్గరకు పోయి నీటిలో మునిగెను. ఆనీర మామెకు నెదుఱొమ్మువరకు వచ్చెను. శిరస్సు పూర్తిగా నీటిలో ముంచెను. అంతకుముంద సేవకురాలు మల్లికాపరిమళభరితమైన తలనూనె రాచి సంస్కరించిన యామె కేశములు జడముడి యామె యూడతీసి వదలి పెట్టుటచేత నాచిన్ని నీటిగుంటలో నాచువలె మెఱసెను. ఆమె తలనూనె వాసనచేత నీరమంతయు గుమ్ముమని పోయినది.

ఒకపనికత్తె యిది చూచి, 'అమ్మా! ఇదియేమి? ఒడలు తోముకునా?' అన్నది. ఆజ్ఞాబద్ధమైన యేకవీరబొమముడికి బెదరి యది మాటాడకుండ పోయి ద్వారము వెనుకనుండి యామెవంక తొంగిచూచుచుండెను. ఏకవీర కొంచెము సేపైన తరువాత లేచి తనగదిలోనికి బోయినది. పోయిన దారి యందు నీరు ప్రవాహము కట్టినది. గదిలోనికి పోయి తలుపు వేసికొని, తడిబట్ట విప్పకుండనే నేలమీద చదికిలబడి, యెడమ పిడికిలి యెడమ చెక్కిలి కాన్చి కూర్చుండెను. ఎదురుగా గోడమీద మీనాక్షీదేవి వస్త్రము శ్రీసుందరేశ్వరుడపహరించుచున్నట్లుగా చెక్కబడిన విగ్రహము లున్నవి. అవి గోడలోననే గచ్చుతో చేయబడినవి. వానివంక చూచుచుండెను. 'ప్రభూ! సుందరేశ్వరా! యోగీశ్వరేశ్వరుడవగు నీకుగూడ నీమోహపాశములు వదలలేదా? తన మనస్సంతోషమునకై మనుష్యుడే నిన్నిట్లు వ్రాసినాడు!!!' ఏకవీర నిలుచుండి చీరకొంగులు చేతిలో పిండినది. నీళ్లు నేలమీద కాలువకట్టినవి. ఏకవీర యాచీర విప్పి తలయు, నొడలు శుభ్రముగాఁ దుడుచుకుని పెట్టె తీసెను. పెట్టెలోనున్న అన్ని వస్తువులు తీసి క్రింద పరచెను. పెండ్లినాడు తనమేనమామ తన కొక చీర పెట్టెను. ఆ చీరమీద నేకవీరకు మిక్కిలి ఇష్టము. అది తీసి కట్టు

కున్నది. భూషణము లన్నియు నమర్చికొన్నది. నిలువుటద్దమువద్ద నిలుచున్నది. తన సౌందర్యమునకు తానే వగచినది. ఏదో భావ మంతలో నేకవీర మనస్సులో మెఱుపువలె మెఱసినది. ఏకవీర ప్రక్కనున్న సెజ్జపై పడిపోయినది; ఏడ్చి యేడ్చి నిదురపోయినది.

౭

రుద్రమూర్తియై కుట్టాన్ పూలదండ విసరి త్రెంచిననాటనుండియు నతడు తేల నేకవీరతో నిదురించుటకు పోవుటలేదు. దేహమస్వస్థతగా నున్నదని చెప్పి తనగదిలోననే నిద్రించుచున్నాడు. సరిగ పాఠశాలకే పోవుట లేదు. వీరభద్రభట్టరునకు కారణము తెలియ లేదు.

వెనుకటి ప్రకరణములోఁ జెప్పినవిషయములు జరిగినమఱురోజున కుట్టాన్ పగలెల్ల నేమియుతోఁచక తిరుగులాడి సాయంకాలమున స్నానముచేసి శుభ్రవస్త్రధారియై సాయంవాహ్యాళి పోయి యింటికి పెందలకడ తిరిగివచ్చెను. ప్రొద్దు క్రుంకబోవుచున్నది.

చదువుకొను గదిలో కుట్టాన్ తనసెజ్జపై పండుకొనెను. అతనికన్ను లెఱ్ఱగా నుండెను. కుట్టాన్ కన్నులు మూతపడెను. మూతపడిన వెంటనే యతనిప్రేయసి మొగము కనంబడి మరల కానరాకుండెను. కుట్టాన్ కనులు తెరచి మరల మూసికొనెను. వీరభూపతి దీనములైన కనులతో తన్ను తనభార్యను ప్రేమించుమని బ్రతిమాలుచున్నట్లు కనంబడెను. కుట్టాన్ లేచికూర్చుండెను. అతడిట్లాలోచించెను: 'వీరభూపతి నన్నేల నాభార్యను ప్రేమించుమని యడుగవలెను? అతనికి నాభార్యకు నేమి సంబంధ మున్నది? నేను నాభార్యను ప్రేమించిన నతనికేమి? ప్రేమించకున్న నతనికేమి? నేను నాగృహవిషయము లతనికేల చెప్పితిని? అయ్యో! అంతఃపురవిషయము లతనితో చెప్పునంతటి బుద్ధిహీనుడ నైతినే.' కొంచెముసేపు నిశ్చలమైన చూపుతో గవాక్షమునుండి బయటనున్న పోకచెట్లవంక కుట్టానొకచేరీతిగా చూచెను. అంతలో మరల శయ్యపై బండుకొనెను. మరల నతని మనస్సాలోచనచేయ మొదలుపెట్టెను: 'వీరభూపతి నాకు మిక్కిలి నెచ్చెలికాడు. చెలికానితో జెప్పగూడని రహస్యము లేముండును? వీరభూపతి కీరహస్యములు చెప్పినందున తప్పేమియు లేదు. అతడుమాత్ర మతనిరహస్యములు నాతో చెప్పలేదా? అయ్యో! ఎంత దుఃస్థితిలో నుంటిని. నానీడను చూచుకొని నేనే బెదరుచుంటిని. నేను మిత్రుడను గనుక నాక్షేమము కోరి నాకు హితముచెప్పెను. ఇంతమాత్రమునకు నాభార్యకు నాతనికి సంబంధమేల యుండవలెను? మనస్సుమిక్కిలిచెడ్డది. దీనికీభావము రావచ్చును, ఈభావము రారాదు అని లేదు. ఆస్త్రీమొగము చూడలేకున్నాను. ఆమెతో మాటలాడుటెట్లు? ప్రేమించుటెట్లు?' కుట్టాన్ లేచి వ్రాతబల్లవద్దకు పోయెను. బల్లసొరుగులోనుండి యొకభూర్జపత్రము దీసి కలము, సిరాబుడ్డియు దగ్గర నుంచుకొనెను. ఎవరికో

యుత్తరము వ్రాయవలెనని సంకల్పించినాడు. ఉత్తరము వ్రాయుట మరల నంతలో సంక్షేపించి శయ్యపైపోయి పండుకున్నాడు. కనులు మూసికొన్నాడు. అసందర్భములైనభావములు లక్షలు వచ్చెను. 'ఈపాటున నేను చనిపోయినచో నే మగును? ప్రొద్దుపోవువరకు నెవరికి తెలియదు. భోజనమువేళకు వీరభద్రభట్టరు వచ్చును; నన్నుచూచును; కేకలు వేయును. అందరు వత్తురు. రాజుకూడ నన్నుచూచుటకు వచ్చును. రాజుగారి రెండవ కుమారుడు తిరుమలనాయకుడు నాకుపరమమిత్రుడు. నేనుచనిపోతినని విన్నచో నత డేమగునో? ఈ వార్త విని మాతండ్రియు, తల్లియు వత్తురు. మాతల్లి బ్రతుకదు. అయ్యో! నేను చనిపోవుటకు గారణమిది యని యెవరికి తెలియగలదు. నా ప్రేయసి నేను చనిపోతి ననువార్త వినినచో నేమనుకొనును? ఇప్పటి నా భార్య యేమి చేయును. ఏడ్చునా? ఏడ్వదు. నాకు నామెకు నేమి సంబంధము? అయిన నేమి?జీవితాంతము విధవాత్వ మనుభవించవలదా? కొంత ప్రేమ యుండకపోదు. లేకున్న నారాత్రి పూదండ నామెడలో నేల వేయును?' కుట్టాన్ భావవాహిని యాగలేదు. ఆప్రవాహము ప్రవహించి ప్రవహించి కొంతదూరము పోయి యాగినది. కుట్టాన్ లేచికూర్చుండెను. కుట్టాన్ ప్రాణము నెమ్మదివడినట్లుండెను. వ్రాతబల్లవద్దకు పోయెను. ఇట్లు వ్రాయ మొదలిడెను: 'ప్రాణేశ్వరీ!' యని సంబోధించెను. అతని మన స్సభ్యంతర పెట్టెను. అది కొట్టివేసి, 'కులకామినీ!' అని సంబోధించినాడు. ఆపత్రము చింపివేసి వేఱొక క్రొత్తపత్రముతీసి దానిపై 'కులకామినీ'సంబోధనము వ్రాసినాడు. తరువాత తన పూర్వ ప్రేమవిషయము వ్రాసినాడు. ఇది యంతయు నెందుకనుకొని పత్రము మరల చించివేసెను. ఇంటిలో నున్నదానికి లేఖవ్రాయుట యెందులకు అని తోచినది. వెల్లి యేకవీరతో మాట్లాడుదమనుకొన్నాడు. మరల 'యేమని?' అని ప్రశ్న వచ్చినది. ఆలోచన తెగలేదు. ఇంతలో తలుపుచప్పుడయినది. అటు చూచినాడు. వీరభద్రభట్టరు తలుపు తెరుచుకొని లోనికి వచ్చి యొక లేఖ యందిచ్చినాడు.

కుట్టాన్— 'ఏమి టిది?'

భట్టర్—'తమ నాయనగారివద్దనుండి వచ్చినది లేఖ.'

కుట్టాన్— 'ఏమని?'

భట్టర్— 'చిత్తగించుడు.'

కుట్టాన్— 'మీరు చెప్పుడు.'

భట్టర్— 'తమరికి మనస్స్వాస్థ్యము లేకున్నదని వ్రాసితిని.'

కుట్టాన్— 'ఏల లేదు?'

భట్టర్— 'కొంచెము జబ్బుగా నున్నదనుచుంటిరిగా నాల్గునాళ్లనుండి.'

కుట్టాన్—'అవును. లేనిది దేహస్వాస్థ్యము.'

భట్టర్— 'వైద్యులు నాడిలో నేదోషము లేదన్నారు గదా?'

కుట్టాన్—'తరువాత?'

భట్టర్ — 'అమ్మగారు "పరమేశ్వర సముద్రములో" తమమేనమామగారి యూరిలో నున్నారట. మిమ్మచటి కేగి నాల్గురోజులుండి విశ్రాంతితీసుకుని రమ్మన్నారు.'

కుట్టాన్— (ఆలోచించినట్లు నటించి) 'మఱి వెళ్లవలసినచో నెప్పుడు-'

భట్టర్ —'ఇప్పుడే భోజనము చేసి బండి కట్టించుకుని బయలుదేరినచో నెల్లుండి తెల్లవారు వరకు చేరవచ్చును'

కుట్టాన్—'మీరు ప్రయాణమునకు సిద్ధముచేయుడు.'

౮

ఆరోజులలో నెద్దుబండ్లకు నాల్గుచక్రములుండెడివి. రాజశకటములయినచో వానిపైన కొప్పెరలుకూడ నుండును. శకటమని కాని రథమని కాని దానిని వ్యవహరింతురు. రాజశకటములుచూడ ముచ్చటగా రంగులతోడను, గంటలతోడను నెసంగుచుండును. మార్గములు చక్కగా నేర్పడియుండెను. ప్రధానములైన పెద్దపట్టణములకు మార్గములు శిలానిర్మితములుండెను. తక్కినచోట్లకు రథచక్రముల యరవడులచేత గల్గినవే మార్గములు. మార్గముల యందు దొంగల భయ మెక్కువగా నుండెను. తిరువత్తూరు మధుర కీశాన్యముగా నున్నది. పరమేశ్వరసముద్రము తిరువత్తూరు మధురలకు మధ్య నున్నది. ఆరోజులలో నూరుపేరులకు చివర"నాడు""సముద్రము""మంగళము" మొదలగునవి యుండెడివి. మధురకు పరమేశ్వర సముద్రమునకు పదునేనామడ యున్నది. పది యామడలు దాటిన తరువాత దొంగలభయమున్నది. మధుర సమీపములో దొంగల భయము లేదు.

మధురలోనుండి యెక్రపాణి బయటకు పోవుచున్నను, క్రొత్తవారు పట్టణములోనికి వచ్చినను నధికారులకు తెలియజేయవలెను. దానికి వేరేయధికారి యేర్పడి యుండెను. ఆ సాయంతనముననే వీరభద్రభట్టరు తదధికారి సమీపమున కుట్టాన్ సేతుపతిమహారాజు పరమేశ్వర సముద్రమునకు వెళ్లుచున్నాడని తెలియజేసెను.

ఏకవీర వచ్చినతరువాత కుట్టానచ్చటికైన పోవుట కిదియే మొదటిసారి. ఆమెను కూడ వెంట దీసికొనిపోవుటా, పోకుండుటా యనుప్రశ్న వచ్చినది. భట్టరు వినయముతో 'ప్రభూ! తీసికొనిపోవుటయే మంచిది' అనిచెప్పినాడు. కుట్టాన్ 'దారిలో దొంగలు. రెండు రోజులు ప్రయాణము. ఆమెనుకూడ తీసికొని వెల్లినచో పరివారము దాసీలు చాలమంది బయలుదేరవలసి వచ్చును. నాల్గురోజుల పనికింత యెందుకు' అన్నాడు. అందరు తలలూచినారు.

రాత్రి జామున్నర ప్రొద్దుపోయిన తరువాత ప్రయాణమైనారు. అయిదు శకటములు. మధ్యశకటములో మెత్తనివిలువగల పరుపులు పరచినారు. అందులో కుట్టానొకడు విశ్రమించినాడు. ఈబండికి వెనుక రెండుబండ్లు. ముందు

రెండుబండ్లు. ఈనాలుగు బండ్లలోను బండికి నలుగురు చొప్పున బంటులు కూర్చున్నారు. ఈపదునారుగురు కాక యయిదుగురు సారథులు. అందరును సాయుధ హస్తులే. అందఱికి తల కుట్టాన్. కుట్టాన్ కుఱ్ఱవాడయ్యు నతని బాహుబలము, వివేకము మధుర రాజ్యములో విస్తృతి పొందినవే. బండ్లు బయలుదేరినవి. వీరభద్రభట్టరు తక్కిన సేవకులతో నంతఃపుర రక్షణకై మధురలోననే యున్నాడు. బండ్లు కోటతలుపులవద్దకు పోయినవి. కోటతలుపులు మూయబడినవి. తలుపులు తెరువలేదు. దళవాయి యూర లేడుగాన ప్రధాని యాతనిపని చూచుచుండెను. ప్రధానియాజ్ఞ లేనిదే కోట తలుపులు బ్రహ్మవచ్చినను తెరువరు. రాజకుమారులైనను తీయుట కాజ్ఞలేదు. ఒకసేవకుని వీరభద్రభట్టరువద్ద కుఱికించిరి. భట్టరా రాత్రిపోయి ప్రధానినుండి యాజ్ఞ తెచ్చినాడు. కోటతలుపులవద్ద రక్షకసైన్యము మిగుల జాగరూకతతో నిలచియున్నారు. తలుపులు తెరచిరి. అయిదుబండ్లును నొకనిమేషములో బయటకు బోయెను. వీరభద్రభట్టరుని 'అయ్యా! సెలవు' అన్నమాటలు గభాలున మూయబడిన కోటతలుపులధ్వనిలో మునిగి పోయెను.

చీకటిలో బండ్లు పోజొచ్చెను.

మెత్తని దూది పరుపులమీద కుట్టాన్ పండుకున్నాడు. దారి మెత్తగా నున్నది. కుట్టాన్‌కు నిదురపట్టుట లేదు. కుట్టాన్ భావనాశక్తి విజృంభించెను: 'నేను ప్రేమించిన యువతి యున్నచోటికి మాతండ్రి నేను వెళ్లుట కెట్లనుమతించినాడు? ఆమె యిష్టపడచ్చట లేదా? లేక యేమగును? భార్యతో సంసారము చేయుచున్నవాడు మరల నట్టి భావము లేల తలపెట్టుననుకున్నాడా? ఏకవీర యీ మూడు నెలలనుండి యింట నొంటరిగా లేదుకదా? నేను వచ్చివేసిన తరువాత నెట్లుండునో? నేను లేనని యామె యేడ్చునా? నేను పరమేశ్వర సముద్రమునకు పోయిన తరువాత నాప్రేయసి నాకు కన్పించునా? నాకు కన్పించనీయరేమో? ఆమెకు వివాహమై యామె భర్తయింటికి పోయెనేమో? ఆమె నన్ను వదలిపెట్టి యింకొకని పెండ్లిచేసుకొనునా? ఏలచేసికొనదు? నేను చేసికొనలేదా? నేనస్వతంత్రుడను కదా? ఆమె స్వతంత్రయా?' మొదలుతుదలేని యీ యాలోచన తెగలేదు.

కుట్టాన్:—'ఎంతదూరము వచ్చితిమి?'

సారథి:—'ఒక క్రోశము వచ్చితిమి.'

కుట్టాన్:— 'క్రోశము వచ్చితిమా? నిద్దుర పట్టుటలేదు. ఆళ్వారును పిలువుము కథ యేమైన చెప్పనేమో.'

వెనుక బండిలో నున్న యాళ్వారు వచ్చెను. బండివెంటనే నడచుచు చిన్నతనములో తనకు తన నాయనమ్మ చెప్పిన కథలన్నియు చెప్పెను. కొంతదూరము పోయిన తరువాత నాళ్వారునకు తెలియకుండగనే కుట్టాన్ నిదురపోయెను. కొంత సేపయిన పిదప నాళ్వారు తన బండిలోనికి పోయి

పండుకొనెను. వంతులుగా సేవకులు మేల్కొని యుండిరి. తెల్లవారువరకు శోళాపురముచేరిరి. శోళాపురము చెరువు కలువలచేతను, తామరలచేతను శోభాయమానముగ నున్నది. అందరును బండ్లుదిగి కాల్యకృత్యములు తీర్చుకొని మరల పయనమైరి. బండ్లు జాముప్రొద్దెక్కువరకు తిరువెంగడనల్లూరు చేరినవి. ఆ యూరిలో పాండ్యరాజులు కట్టించిన పెద్ద సత్రమున్నది. మధురనాయకులు పాండ్యరాజులు చేసిన ధర్మసంస్థలన్నియు జరుపుచుండిరి. బండ్లు సత్రము ముందాపిరి. సత్రములో నొకగదిలో కుట్టాన్ సామానంతయు జేర్చి యా గదిలో పరుపులువేసి సిద్ధముచేసిరి. తక్కినవారు భోజనాదికములు సమకూర్చు పనులమీద నున్నారు.

కుట్టాన్ గదిలో తలుపు వేసుకొని కూర్చుండి తనపెట్టె తీసి యందులోనుంచి యొక మంచిగందపు కొయ్యతో చేసిన చిన్న చందుకాయపెట్టెను తీసెను. ఆపెట్టెలో నాలుగరలున్నవి. ఒకయరలో వాడివత్తలైపోయిన మల్లెపూవు లున్నవి. రెండవయరలో మన్ను న్నది. తక్కిన రెండరలలోను కస్తూరియున్నది. వెనుక కుట్టాన్ తన ప్రేయసిని కలుసుకొన్నపుడొకరోజున నుదయమున నామెను వెంబడించి వారి యింటివరకు వెళ్లెను. దారిలో దొందరగా వెళ్లుచుండుటచేత నామె తలలోని మల్లెపూవులచెండు జారి పడిపోయినది. ఆచెండు కుట్టాన్ బహుభద్రముగా దాచుకొన్నాడు. అవే ఆ మొదటి యరలోని వాడివత్తలైన మల్లెపూలు. మఱొకనాడు సాయంకాలము కుట్టాన్ ప్రేయసి దేవాలయములో ముందు పూలతోటలో కూర్చున్నది. ఆమె లేచిపోయిన తరువాత కుట్టాన్ అచ్చోటి దుమ్ము కొంచెము తెచ్చుకుని దాచుకున్నాడు. అందులో మరికొంచెము మంచిగందపు పొడి కలిపి యది రెండవయరలోనుంచినాడు. (ఇట్టి రహస్యములు బయలుపెట్టినందులకు, మమ్ము కుట్టాన్ను, పాఠకులుకూడ క్షమింతురు గాక.) మూడవది కస్తూరి. కుట్టాన్ తన ప్రేయసి కొకనాడు కొంతకస్తూరి పంపించెను. ఆమెయందులో సగముంచుకొని సగము మరల నతనికి పంపించెను. అది యిది.

కుట్టాన్ పెట్టె కన్నుల కద్దుకొని దుమ్ము కొంచెము నొసటనుంచుకుని కస్తూరి పెదవుల కంటించుకున్నాడు. అతని కనులవెంట నీరు కారి యందులో పడెను.

కుట్టాన్‌కు భోజనము సయించలేదు. కొంచెము ప్రొద్దువాటారినతోడనే బండ్లుకట్టిరి. ఎండలో పోయిపోయి బండ్లు ప్రొద్దు గ్రుంకువరకు తిరుత్తణి జేరినవి. అచట మరల భోజనములు చేసిరి. ఇంతవరకు బండ్లు పదియామడ వచ్చినవి. ఇకముందుదొంగలభయము. రాత్రి పెందలకడనే బండ్లు కట్టిరి. అందఱును జాగరూకతతో నుండిరి.

ఆంధ్రభృత్యవంశమురోజులలోను, చోళచాళుక్యుల కాలములలోను దక్షిణదేశపు రాజులు సముద్రపురేవులు, వర్తకము, ఇతర

ద్వీపములతోడను, దేశములతోడను సంబంధము వదలుకొనలేదు. చాళుక్యుల నాడును, తత్పూర్వమును తెలుగులు సముద్రముమీాద పోయి యితరద్వీపములను జయించుచు కూడ వచ్చిరి. తరువాత కా క తీ యు ల నా డు వారి రాజధాని సముద్రమునకుగాని నదికిగాని సంబధములేనిచోట కట్టబడి తత్పూర్వనౌకాజీవనము బాగుగా కుంటుపడినది. కొండవీటి రెడ్ల కాలమున మరల వర్తకము విజృంభించినది. శ్రీకృష్ణదేవరాయలు వారుకూడ నౌకాజీవనము గురించి యెక్కువశ్రద్ధ తీసికొనలేదు. మనశాస్త్రములైన చతురంగబలములో నౌకలు కలుపలేదు. అందుచేత భారతరాజులు సముద్ర విషయము లెక్క చేయ లేదు. వచ్చినయాపదయు నచటినుండియే వచ్చినది.

మధురరాజులును సముద్రవర్తకమును గురించి యాలోచించలేదు రేవులన్నియు పోర్చుగీసువారికిని, యితర దేశీయులకును వదలిపెట్టి. అందుకని యితర దేశీయులుకూడ మన వారిని తక్కువగా చూచుచుండిరి. దయావంతులగు మనరాజు లితర దేశీయులు వచ్చినతోడనే వారి నతిథిధర్మప్రకారము గౌరవముచేసి వారికి కావలసిన పనులు చేసిపెట్టుట, వారు తిన్న ఇంటివాసముల లెక్కపెట్టుట తటస్థించినది.

ఇతర దేశముల నుండి నానాజాతివారును వచ్చి దేశములోనన్నివిధములనశాంతినెలకొల్పుచుండిరి. రేవుపట్టణములన్నియు మధురరాజుల చేతిలోలేవు. దొంగలు దేశముమీాద దోచుకొని రేవుపట్టణములలో తల దాచుకొందురు. దొంగ లెక్కువభాగము విదేశీయులే. యూరపులో బ్రదుకలేనిజనమంతయు వచ్చి యితర దేశములమీాద పడుచుండెడిది. అది సరియే. సాహసించి భారత దేశమున తనమతవ్యాప్తి మొదలుపెట్టినది. ఇన్ని సంవత్సరములైన తరువాతనైనను తమమతములెట్టివో, భారత దేశ మతములెట్టివో తెలిసికొనలేని యితర దేశీయుల యజ్ఞత విచార్యము.

రాత్రి రెండుజాముల ప్రొద్దు పోవువఱకు బండ్లు పెద్దయడవిగుండ పోవుచుండెను. అందఱును శ్రద్ధగా నుండిరి. ఒక పెద్ద తటాకము. దానిచుట్టు దట్టముగాచెట్లు. అచటి కేగువరకు దొంగలగుంపొకటి బండ్లపై బడెను. అందఱును కత్తులుదూసి నిలంబడిరి. కుట్టాళ బండిలో నుండి సింగపుకొదమ వలె దూకి దొంగలను నరికెను. దొంగలందఱును పారిపోయిరి. కత్తి దెబ్బతగిలియొకడు మాత్రము నేలనుండి లేవ లేకయుండెను. కరదివ్వె వెలిగించి యాతని జూచిరి. సేవకులందఱు 'పరంగి, పరంగి' యని కేకలువేసిరి. అతని కాలుచేతులుకట్టి వెనుక బండిలో నెక్కించిరి. ఈ యాలస్యముల వలన మఱునాడు పరమేశ్వరసముద్రము చేరువరకు బండ్లకు ప్రొద్దెక్కినది.

౬

తెల్లమనిషి కనబడుటతోడనే పరమేశ్వర ప్రజ లొరిగిపోయిరి. పరమేశ్వర సముద్రము

పల్లెటూరు. తిరువత్తూరుకు పోవుమార్గములో లేకపోయిన నీయూరునకు శిలానిర్మితమార్గము నుండెడిదికాదు. తిరువత్తూరునుండి మధురకో మధురనుండి తిరువత్తూరునకో పోవు గుఱ్ఱముల నేనుగులనే గుంపులుగుంపులై వచ్చి చూచు పరమేశ్వరసముద్ర జనులు తెల్ల మనిసిని వింతగా జూతురనుటలో నచ్చెరువు లేదు. మూడువందల సంవత్సరము లైన తరువాత ముప్పతిప్పలుపడ్డ తరువాత ఇప్పటికే తెల్ల మనిసి మొగము క్రొత్తవదలలేదే దేశమునకు, అప్పటికెట్లు వదలును? అందఱు భోజనమున కేగిరి. పిల్లలు మాత్రము బండి చుట్టును మూగియే యుండిరి.

కుట్టాన్ మేనమామ కుమారుడు అతి వీరవర్మ. అతనికి పాతిక యేండ్లుండును. మొగ మున రాజకళ తెరుముకొని వచ్చుచున్నది. అత డుత్సాహపురుషుడు. తనయింట చావ డిలో గూర్చుండి, 'ప్రొద్దువాటారినది,ఫరంగిని తీసుకుని ర'మ్మన్నాడు. తెచ్చిరి. ఫరంగి వినయ ముతో లోనికివచ్చెను. అతివీరవర్మ 'యతనికి భోజనము పెట్టించినారా' యని యడిగెను. పెట్టించితిమనిరి. 'గాయమునకు కట్టుకట్టించిరా' యనెను. సేవకులుకట్టించితి మనిరి. ఊరమంగ లిని పిలిపించి కుట్టాన్‌మామ యతనిగాయము కట్టించెను.

అతివీరవర్మ అతనిని 'ద్రావిడభాష వచ్చు నా'యని యడిగెను. అతడు వచ్చునని చెప్పెను.

వీరవర్మ—'బాధ తగ్గినదా?'

ఫరంగి—'తగ్గినది.'

వీరవర్మ—'మీ దేశములో నిట్టి వైద్యు లున్నారా?'

ఫరంగి—'లేరు.'

వీరవర్మ—'మీ దే దేశము?'

ఫరంగి—'ఇటలీ.'

వీరవర్మ—'నీకీదొంగవృత్తి యెందుకు?'

ఫరంగి—'మేము క్రైస్తవులము. మా ఫాదిరీ "దక్షిణ హిందూ దేశములో దోచుకొన వచ్చును. హిందువులు చాల ధనవంతులు. దోచుకొన్నచో తప్పులే"దన్నాడు.'

వీరవర్మ—'అబద్ధములుచెప్పకుము. మీ క్రైస్తవమతము చాల మంచిదట కదా. మీ మతమునుగురించి నీ కేమైన తెలియునా?'

ఫరంగి—'ఏసుక్రీస్తు రక్షకుడు.'

వీరమర్మ—'మీ మతమును గురించి నీ కెక్కువ తెలియదు.'

ఫరంగి—'తెలియదు.'

వీరవర్మ—'ప్రతిమాటకు తల యూపెద వేమి?'

ఫరంగి—'తెలియ కేమి, తెలియును. ఏసు క్రీస్తును నమ్ముకొన్నచో మోక్షము వచ్చును. ఇంక నేమి తెలియవలెను.?'

వీరవర్మ—'మీ దేశములోమీమతమును గురించి నీకువలెనె తెలిసినవా రెందరుగదురు.'

ఫరంగి—'చాలమంది యున్నారు.'

వీరవర్మ—'ఈ దేశములకుబోధచేయుదు మని వచ్చువారందఱు మీ యందఱకు చెప్ప రాదా? ఇక్కడి కేల వచ్చెదరు?'

ఫరంగి—'తిండికోసము.'

అందఱును పకాలున నవ్విరి. సేవకులు ప్రజను వెనుకకు త్రోయలేక చచ్చిపోవు చుండిరి. వారికి ఫరంగిచేయు నభినయములు, మాటలు నన్నియు చాల చిత్రములుగా నుం డెను.

అతివీరవర్మ యాళ్వారును పిలచెను. ఆళ్వారు వచ్చెను.

వీరవర్మ—'ఇతని నేమి చేసెదరు?'

ఆళ్వారు— 'మధురకు తీసికొనిపోయి రాజపురుషుల కప్పగించెదము.'

వీరవర్మ—'పాపము వదిలిపెట్టరాదా?'

ఆళ్వారు మాటాడ లేదు. మఱునాడు ప్రొద్దుటికి ఫరంగినివదలిపెట్టిరి. అతని కాయూ ళ్లన్నియు పరిచితములే. ఊరిబయిటకు పోయి తనవెంట వచ్చినజనముతో 'మా దేశము పోయి సైన్యమును తెచ్చి మీ దేశము కొల్ల గొట్టెదను చూడు' అన్నాడు.

పిల్లలు నవ్విరి. ఒక పెద్దవాడు 'అవును, దుర్గాతిలకుఁణము' అనెను.........

(సశేషము)

మా చందాదారులకొక మనవి

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందా దారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారుల సంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముం దున్నది. చందా దారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము.

మేనేజరు, 'భా ర తి.'



పశ్చాత్తాపము

శ్రీమతి గుమ్మిడిదల దుర్గాబాయిగారు

౧

నేను మిక్కిలి చిఱుతప్రాయముననే యత్తవారింట నడుగిడితిని. అజ్ఞానమింకను నన్ను పూర్తిగ వీడలేదు. ఇతరులతో మాటలాడు టెట్టులోగూడ నాకు తెలిసెడిది కాదు. తలయెత్తి యొరులను చూడజాలకుండెడిదాన నిక భాషించు టెట్లు! స్త్రీలయొద్దకు వెళ్లునపుడు కూడ సిగ్గునందెడిదానను. నేను కొలదిగ తెలుగుమాత్రము చదివితిని. ఉపన్యాసములు, నవలలు మొదలగువాని యందణుమాత్రము నిష్టముండెడిది కాదు. తీరిక యున్నపుడెల్ల రామాయణము చదివెడిదానను. రామాయణ పఠనమన్న నాకు మిక్కిలి ప్రేమ. రామాయణము మనుజకృతమని యెంచెడిదాన కాను. ఏ దేవతయో దాని రచియించి యుండెనోపునని నానమ్మకము. పగలంతయు నేనింటియం దేదేని యొకపని చేయుచునే యుండుదానను. పనిలేనప్పుడు రాట్నముమీద నూలువడకెడిదాన. అత్తమామలయెడ మిక్కిలి భయభక్తి విశ్వాసములతో మెలగెడుదాన. ఒకనాడు మామగారు కూరలో నుప్పు కొంచెము తక్కువగా నుండవలె ననిరి. ఆమాట వినుటతోడనే నాహృదయము కంపించె. మిన్నువిరిగి మీదబడినట్లాయె. ఇంతకన్న నెక్కుడు వేదన నిక నే భరింపజాలనని భావించితిని.

ఈ నా యజ్ఞానము నాభర్త కిష్టముండెడిది కాదు. వారు న్యాయవాదివృత్తికి గడంగి యొన్నోదినములు కాలేదు. వారు గొప్పగొప్ప చదువులుచదివి యొన్నియో బిరుదము లందినారు. నన్ను వారు మిక్కిలి ప్రేమించెడివారు కాని వారిప్రేమయందు విశేషభాగము జాలి. స్త్రీవిద్యాభ్యుదయమన్న వారికి మిక్కిలి మక్కువ. వారి మనోనుకూలముగ నే మెలగజాలకుండుట చూచి వారు విచారమానసులై యుండువారు. అది నా యపరాధము కాదనియు, హైందవజాతి యాచారవ్యవహార ప్రభావమే యనియు నెంచువారు. వారికి నాతో ప్రేమాలాపములు సల్పుటలో నిసుమంతేని యానందముండెడిది కాదు. రాత్రి నిద్రింపబోవునపుడే ఇంగ్లీషునవలనొకటిగొనివచ్చి నిదురించునంతవరకు దాని జదువుచుండువారు. ఎప్పుడేని నేను "ఏమిచదువుచున్నారు?" అని ప్రశ్నింప కరుణారసమొల్క నన్ను జిలకించి "యిది 'ఆస్కార్ వయిల్డ్' అను నాంగ్లగ్రంథకారుని సర్వోత్కృష్టమగు నవల" యనిమాత్రము చెప్పెడివారు. ఆమాటలు వినినంత నేను నా యయోగ్యతను నిందించుకొనుచు, "విద్యాప్రవీణుడగు నిట్టి పురుషవతంసునకు దగుయోగ్యత నాకడ లేదాయెనే" యని విచారించెడిదానను. "ఏమూర్ఖునకో పత్నిగ నుండవలసినదాన" నని తలపోయుచుండుదాన. నాభర్త నన్ను దయార్ద్రదృష్టి గనుచుండువారు. అయ్యదియే నా సౌభాగ్యము.

అది సంధ్యాసమయము. ఇంటిముంగలివసారాయందు కూర్చుని నేను రామాయణము చదువుచుంటిని. రాముని రాజ్యమునకు మరలి రమ్మని కోరుటకు భరతుడు వెడలెనని యా కథాసందర్భమున జదివితిని. భరతుని కరుణాలాపములు, దీనభాషణములు భ్రాతృవాత్సల్యము నా మనసును కరగించి వైచినవి. నేత్రముల నుండి యశ్రుధారలు స్రవించుచుండెను. ఇంతలో నాభర్త గదిలో నడుగిడెను. వెంటనే నేను పుస్తకము మూసి వైచితిని. వారి ముంగల నా యీ యజ్ఞానము ప్రకటము కాకుండు నట్లు ప్రయత్నింప సాగితిని. వారు నాచేతనున్న పుస్తకమును గాంచి "రామాయణమా?" యని ప్రశ్నించిరి.

అపరాధినివలె జూచుచు,

నేను—"ఆ! అవును, ఏదో కాలక్షేపము" అంటిని.

నాభర్త—పుస్తకము మంచిదే; అందులో సందేహము లేదు. సద్భావములు కొల్లలుగ నుండును. అయిననేమి? ఇంగ్లీషు భాషయందు వర్ణింపబడి యున్నంత బాగుగ మనపుస్తకములలో పాత్రలు వర్ణింపబడవు. నీకు నేను చెప్పిన ఆశ్చర్యముగ నుండును. ఆంగ్లకవులు మనోభావాధిక్యము నెంతో చక్కగ చిత్రించెదరు. మన కవులో పదపదమునకు పూర్వజన్మములనియు, నీతియనియు జెప్పి రేమేమొ చొప్పించుచుందురు. అందుచే మనవారి భావములస్వాభావికములై కన్పట్టును.

నేను—ఇంగ్లీషుపుస్తకముల జదివి వాటిభావముల గ్రహించు టెట్లు?

నాభర్త—అంత దుష్కరము గాదు. అనుదిన మొకగంట చొప్పున చదివినచో కొలది దినములలోననే ఆంగ్లభాషయందు మంచి జ్ఞానము లభించు కొనగలవు. అట్లు! నీవు నామాట వినకుండుటకు నిశ్చయించుకొంటివిగా? నాయొద్ద సిగ్గేలని యెన్నియో మారులు చెప్పితిని. నీవు చెవియొగ్గనైన లేదు. శుద్ధముగ నుండు మనియు, పరమాత్ముడొసగిన సౌందర్యము వమ్ముచేసి కొనకు మనియు నెన్నియో సారులు బోధించితిని. నా మాటలు నీకు లెక్కలేదు. నాబోటి కురూపికి భార్యగా నున్న పు డెట్లుండిన నేమి యని యాలోచించుచుంటివా? దివారాత్రములు పరిశ్రమజేసి యింటికి వచ్చుసరికి నీ క్రేగంటిచూపులు, నీ మృదులహాసమును, నీ ప్రేమాలాపముల నాశ్రమ వాయునని యెంచెదను. కాని నీ మౌనము నాయాశల నడియాసల నొనర్చుచున్నది. స్త్రీలు జన్మించుట వంటవండుటకు, బిడ్డలగని పోషించుటకు, భర్తృసేవ సేయుటకు, ఏకాదశి మొదలగు పర్వదినముల నుపవసించుటకునే కాదు. వారి పుట్టుకకు మహోత్కారణము కలదు. ఆమెది భర్త సాంఘిక, మానసిక విషయముల నన్నిట పాల్గొనుట కధికారిణి. పురుషునివలె ఆమెకును స్వాతంత్ర్యమున కధికార మున్నది. నీయస్వతంత్రత గాంచ నాకు జాలి వొడమచుండును. స్త్రీ పురుషున కర్ధాంగి యని మన పెద్దలసుద్ది. కాని నీవు నా మానసిక సామాజిక విషయములలో పాల్గొన జాలవు. సాధరములు లేరు, నీ తూలోగినలు లేరు. సుఖసంతోషములా లేవు. నీవలన నాకే విధమగు సహాయము, సానుభూతియు లేదు. ఇట్టి పరిస్థితులలో నానందాబ్ధి నోలలాడదగు నాజీవితము నెట్టి నిరానందముగా గడపుచున్నానో నీవే యోచింపుము.


నాభర్త చెప్పినది యథార్థము. నేను వారి స్వేచ్ఛాజీవితమునం దొక కంటకము వలె నుంటిని. "ఇక నేటినుండి మావారు చెప్పినటుల నడచుకొందు" నని దృఢప్రతిజ్ఞ గావించు కొంటిని. నాభర్త నప్రసన్నచిత్తుని చేయగల్గుదునే!

౨

నగలన్నను, బట్టలన్నను మొదట నాకు మిగుల నిష్టముండెడిదికాదు. నాపుట్టినింట ఆబాలవృద్ధము స్వయముగ నూలువడకి బట్టల నేయించి ధరియించెడి యాచారము. విదేశవస్త్రముల వాడెడివారము కాము. నేనెన్నడేని గ్లాసుగోళ్లు అద్దకములను మున్నటపడిన మాయమ్మ వారించుచుండెడిది. సింగారించు కొనుటకు మనసుపడిన 'మనకిట్టి పలోక శృంగారములు తగవమ్మా' యని బోధించెడిది. అంతవర కెందుకు?

ముకురమున గాంచుటనిల్చి ముంగురులు సవరించుకొనబో విసువుకొనెడిది. ఇప్పుడు భర్తను సంతోష పెట్టుటయే నావిధి యనుకొంటిని. నాహావభావవిలాసములు మా అత్తాడుబిడ్డలకు కష్టముగ నున్నవి. వారియందు నాకొక యులక్ష్యభావ మేర్పడ జొచ్చెను. మెల్ల మెల్లగ భార్యాభర్తల మనోభావములు కలియుచున్నవి. మావారి యందు పూర్వవిచారము లేదు. మిగుల సంతోషముతో గనబడుచు వారు నాకు విలువగుచీరెలు, అందముగు "జాకెట్లు", సున్నితములా "స్లిపర్సు" కొని తెచ్చుచున్నారు. కాని వానినే ధరించి వల్లురిలోనకు వెళ్లుట కింకను జంకెడిదానను. వానిని కేవలము నాభర్త యొద్దకు బోవునపుడే ధరించుకొనుటకు నిశ్చయించుకొంటిని. నాశృంగారము జూచి నాభర్త యెంతయో సంతసించెడివారు. తన భర్త సుఖమునకు స్త్రీ యెట్టి శృంగారముల నొనర్చుకొనదు! ఇక నింటికార్యములందు నాచిత్తము చొచ్చుటలేదు. నాసమయమంతయు నన్ను నే, సింగారించుకొనుటలోను పుస్తకావలోకనమునందును వెచ్చింప దొడగితిని. నవలలయందు రుచి మిక్కుటమాయె.

ఇంతవరకు నా అత్తమామల నేను మిగుల గౌరవించెడిదానను. వారికి క్రమముగ 'జాకెట్లు' 'స్లిపర్సు' తో వెళ్లుటకు భయము సంకోచము నుండెడివి. "ఇక నాభర్త నందలకొలది రూప్యములు సంపాదించుచుండ నింట దాసినై యెంతకాల మిట్లు నేనుండుట!" అను అభిమానము హెచ్చ జొచ్చెను. "ఇంటి యజమానురాలైన నేనుండ అత్తమామలెవ్వరు నన్నాజ్ఞాపింప" అను అహంభావము వృద్ధికాదొడగె. అత్తగారేదేని పనిచేయుమని చెప్పిన ఆమాట చెవి జొనిచ్చెడుదానకాను. "ఫలహారము నేడేమేని చేయుము" మని యొకనాడు అత్తగారు చెప్ప ఆమాట విని విననట్లూరకుంటిని. కొంతవరకామె నారాక కెదురుచూచి సుదకు ప్రాణము విసిగి గట్టిగ కేకలు వేయ నారంభించెను. ఆమె చాల కోపిష్ఠిది. చిఱ్ఱుగొట్టు స్వభావము కలది. మరికొంతసేపటి కామె నాగదిలోనికి వచ్చి, "నేను ఫలహారమున కేమైన చేయుమని చెప్పితినే, చేసితివా" యని గద్దించెను.



క్రోధారుణితనేత్రనై నేను—"తీరిక లేనందున చేయ లేదు." అని ప్రత్యుత్తర మిచ్చితిని. అప్పు డామె "—ఏమి? దిన మంతయు కూర్చుండియుండుట తప్ప నీకు వేరుపని యేమున్నది? ఇంత గర్వమా! 'నా భర్త సంపాదించుచుండ నేనేలపనిచేయవలయు' నని విఱ్ఱవీగుచుంటివేమి! అట్టి పొరపాటు పడకుము. నీభర్త లక్షలు సంపాదింపనిమ్ము, ఈ యింట నా యధికారమే చెలాయించుత. నేను నాల్గుశబ్దాలు గడించు నంతనే యావద్వర్గములకు నే యజమానురాల నైతినని కులుకుచున్నావేమి! విద్యాబుద్ధులు గఱపి పెంచి పెద్దవాని జేసిన మేము మన్నుకొట్టుకొని పోవలసినదేనా! ఎంత గర్వించుచున్నావే! ఆహా! కాలవైపరీత్యము! నిన్న మొన్నటి పిల్లల కెట్టి స్వతంత్రాలోచనలు!—" అని నన్ను తూలనాడెను.

నే నేడ్వసాగితిని. నానోట మాట రాలేదు. నా పెనిమిటి వారి కచ్చేరీగదిలో కూర్చుని వార్తాపత్రిక చదువుచుండిరి. ఈ మాటలు వారి చెవినిబడె గాబోలు. రాత్రి నిదురింప వచ్చినపుడు నన్ను చేరబిలిచి, "చూచితివా మా అమ్మగారి క్రోధపూరిత వాగ్బాణ పరంపరలు! స్త్రీ జన్మ యిట్టి కఠోరవాగ్బాణముల సహించుటకేనా! ఇట్టి మాటల నాలకించినపుడు నే బొందు మనోవేదన

దుస్సహము. జీవితము భారముగ దోచును. హృదయము కంపించును. జలవాయు ప్రకాశములు లేక శుష్కించు మొక్కవలె మనుజుని విద్యాజ్ఞానము లడుగంటు చున్నవి. ఇంతేల! నే నామె ముందు నోరెత్తనేరనైతి. తలిదండ్రులు నాయెడ సర్వాధికారులై యుండుటచే నానోట మాటేని రాలేదు. నావలన నీకు నట్టిగతియే కల్గుచున్నందులకు విచారముగ నున్నది. నీవు వారిమాటల వినజాలక ప్రత్యుత్తర మొసగుదేని నాకు మిగుల కష్టముగ నుండును. విషపాన మొనర్చి ప్రాణత్యాగ మొనర్చుకొనవలె నను బుద్ధి వొడమును. సరే, ఇప్పుడు మనకు రెండే మార్గము లున్నవి. ఒకటి వారి నూదిపోటుమాటల నన్నిటి విని సహించి యూరకుండుట, రెండవది మన మార్గము మనము స్వతంత్రముగా జూచుకొనుట. చెప్పుము, ఇందేది నీకిష్టమో. అమ్మగారి స్వభావ మిక నెన్నటికేని మాఱునని యాశకొనుట మాత్ర మిక అసంభవము. నీ యిష్ట మేమి?"

నేను భయపడుచు భయపడుచు "మీ కేది సమ్మతమో నాకు నదియే సమ్మతము. ఆమె నన్ను చదువు వలదనిన మానినైనను. నే నెటుల ప్రవర్తించిన నామె ప్రసన్నచిత్తయగునో యటులనే ప్రవర్తింతును. నేను చదివి యేమి చేయవలయు" నని ప్రత్యుత్తర మిచ్చితిని.

నాభర్త—"నీవు చెప్పునది నా కంతమాత్రమును నచ్చలేదు. అవిద్యాంధకారమున బడి యెంతకాల మిట్లీనులాడుట? అమ్మ నేడు దూషించుట ప్రారంభించినది. అనుదినము దూషణము హెచ్చునే కాని యిక తగ్గదు. నేను నిన్నెంత విద్యావతిగ చేయదలచిన నన్నామె యంత యడ్డును. చిన్ననాటి పరిస్థితులు మారినవనియు, నేడు భారతమాతకు సత్పుత్రికారత్నముల యవసరము ముఖ్యమనియు, స్త్రీలు చేతగాని పిరికిపందలవలె నింట గూర్చుండి చెఱనుండవలదని యాలోచన మెఱుంగక, దేశస్థితి దెలియనేరక వృథాలాపముల కాలముపుచ్చు సమయ మిది కాదనియు నామె యెన్నటికి దెలియ నేరదు. కావున నామాట బాగుగ నాలోచింపుము. మన మే పట్టణమునకైన బోయి యొకరి యొత్తిడి లేక స్వతంత్రముగ జీవింతము. 'ఇక్కడ ప్రాక్టీసు బాగుండదే' యను మిష మీద ఇంటనుండి మెల్లగ దాటిపోవచ్చును.

నా పెనిమిటి పలుకులన్నియు విని నేను వారికి విరుద్ధముగ నేమియు జవాబు నీయలేకపోతిని. ఒంటరిగ నుండవలయు నే యనుజంకు కల్గెను కాని అచ్చట నే పోరు లేక సుఖముగ కాలయాపన మొనర్పవచ్చునను నుద్దేశ్యము మదీయమానసమును వికసింపజేసెను.

3

నాటినుండియు నాయత్తగారు నాతో మాటలాడుట మానివేసినది. ఇరుగుపొరుగు అమ్మలక్కల పరిహాసములకు నే గుఱియైతిని. ఇదంతయు నాకు మిగులకష్టముగ నుండెడిది కాని వారందఱిమాటల సహించి యూరకుండుట కంటె నాయత్తగారి తిట్లే మేలనితోచెను. ప్రపంచమునకు నాభర్తగారియెడ గూడ గౌరవమర్యాదలు తగ్గ నారంభమయ్యెను. నేను నాభర్తను మందుమాకుల వశీకరణ మొనర్చుకొంటినను వదంతి ప్రబలెను.

శ్రావణమాసము, కృష్ణాష్టమి, లోకరక్షకుడగు కృష్ణభగవానుని పుట్టుకదినము. నాకు మా యింట నందఱు ఉపవాస ముండిరి. నేను నుపవసించితిని. పరాత్పరుడగు మాధవుడు రాత్రి పండ్రెండుగంటలకు జనించెను. మేమందఱ మొక్కచో గుమిగూడి యా సర్వేశ్వరుని మీద పాటల పాడుచుంటిమి; ప్రార్థన సేయుచుంటిమి. నాభర్త యిట్టి మూఢాచారములన్న మండిపడువారు. ఇట్టిదినముల వారు స్నానముకూడ మానెడువారు. ఆనాటిరాత్రి యుత్సవమంతయు ముగిసినపిమ్మట నిదురించుటకు నేను గదిలో కాలిడితిని. అప్పుడు వారు—"ఎందుల కిట్లు శరీరము శోషింపజేసికొనెదవు? కృష్ణుడు కప్పక మహానుభావుడే. ఆతని పూజించుటయు మనకర్తవ్యమే కాని యిట్లు పస్తుండుటవలన కల్గు లాభమేమియో నాకు తెలియకున్నది. ఇదియొక నటన. భక్తియన పవిత్రత, విశ్వాసము, సత్యము." అని బోధింప దొడగిరి.

నాభర్త భగవద్గీతల విశేషముగ కొనియాడుచుండువారు. పఠించు టెప్పుడు నే గనలేదు. ఉపనిషత్తుల ప్రశంసించునపుడు నోట పుప్పొళ్ళు కురిసెడిది. వారు పనిషత్తుల నుచ్చరించుట నాచెవుల నెన్నడు బడలేదు. వేదాంతమే భారతదేశ దౌర్భాగ్యమునకు మూలకారణమని వారి ప్రబలవిశ్వాసము—"భారతదేశ పునరుద్ధరణమునకు నేడు శౌర్యనిధులగు పుత్రపుత్రికా రత్నముల యావశ్యకత యెక్కువగా కలదు. ఇది ముక్కు మూసుకొని కూర్చుంట కదనుగాదు."

నాభర్త వాక్యములకు ప్రత్యుత్తర మొసంగు సామర్థ్యము నాకెక్కడ? వీరు కేవలపాశ్చాత్యమార్గానుసరణులై యుండిరే యని తలపోసితిని.

౪

మేము చెన్నపురి జేరితిమి. రెండంతస్థుల మేడ నొకదాని బాడుగకుతీసి యందు వసింప నారంభించితిమి. ఆభవన మెంతయో శృంగారముగ నుండెను. విద్యుద్దీప ప్రకాశమున తద్భవన శృంగారము ద్విగుణీకృతమగుచుండెను. ఇరుపార్శ్వముల నున్న తరులతాగుల్మాదులు పథికులకు తమ నీడచే విశ్రాంతి గలుగజేయుచు సృష్టివైచిత్ర్యమును విశేషముగ జాటుచున్నవి. మాయొద్ద అయిదుగురు నౌకరు లుండిరి. స్త్రీలిద్దరు, ముగ్గురు పురుషులు. ఎల్లప్పు డొకనవల చేతగొని పడకకుర్చీలో పరుండి చదువుచుండుట దప్ప యింట పనియేమియు నాకు లేదు. కంచు, ఇత్తడి మొదలగు పాత్రలింట మచ్చుకేని గానవచ్చుట లేదు. గాజుప్లేట్లు, సాసర్లు, కప్పులు మొదలగు విదేశవస్తు సామగ్రి వాటిస్థాన మాక్రమించెను. భోజనము సేయురీతియు పాశ్చాత్యదేశజులనే యనుసరించితిమి. అట్లు తినుటయందు మావారి కెంతేని యానందము. కొలదిదినములవరకు నాకట్లు తినుట సిగ్గుగ నుండెడిది. క్రమేణ నేనును ఆ పద్ధతికే యలవడితిని.

మాయొద్ద నొక మోటారు, జోడు గుఱ్ఱముల బగ్గీయు కలవు. కాలినడక బొత్తుగ మఱచితిమి. ఎవరినేని చూచుటకు పదియడుగుల మేరపోవలయు నన్న బండి సిద్ధముగ నుండవలె. నాభర్త "అప్ టూ డేట్ ఫేషన్ అన నిదే" యనెడి వారు.

మెల్లగ మాకు రాబడిదినములు తగ్గె. ఇంటిఖర్చు గూడ సరియగు మార్గము త్రొక్కలేదు. మధ్యమధ్య వారి ముఖమండలము విషాద మేఘాచ్ఛన్న మగుట గనెడిదాన. రాబడి తక్కువగ నున్నపు డీవ్యయమేల తగ్గింపరాదు? ఇంత పెద్ద భవనము మనకేల? ఏచిన్న యిల్లో తీసికొన్న మనకు చాలదా? అయిదుగురు నౌకరు లవసరము మనకేమి! ఇద్దఱున్న కాలక్షేపమగునే! యని యెన్నియో సార్లు వారికి చెప్పుచుండెడిదాన. నా మాటలు విని పరిహసించుచు, "మనము దరిద్రులమని డప్పువాయించి చాటుకొందుమా? దారిద్ర్యప్రకటనము దారిద్ర్యానుభవముకన్నను దుఃఖకరము. మనము నిర్ధనుల మనుమాట మఱచిపొమ్ము. లక్ష్మీ యనతికాలముననే మనయెడ ప్రసన్నయగు. వ్యయము వృద్ధియగుట, అవసరములు పెంపొందుట ద్రవ్యోపార్జనమునకు ప్రథమ సోపానములని నమ్ముము. కష్టములకు కించపడుచు నొక్కచో గూర్చున్న నడుగు ముందుకు పడునే! సుఖానుభవమునకు యోగ్యుల మగుదుమే!"

ఏది యెటులైనను మావ్యయము దైనందినాభివృద్ధి నందుచునే యుండె గాని తగ్గుదల నూపలేదు.



"క్రమేణ నేనును ఆపద్ధతికే యలవడితిని."

మేము వారమునకు నాలుగైదు మారులు "సినీమాలకు", నాటక ప్రదర్శనములకు వెళ్లెడివారము. వారమునకు రెండు మూడు పర్యాయములైన మా యింట మిత్రులకు విందు జరుగుచుండెడిది. జీవిత ముఖ్యాదర్శము సుఖభోగానుభవమే యనుభావము నాకుగూడ పొడకట్టెను. మన మనుభవింపనే భగవంతుడు ఉత్తమ వస్తుజాలముల ప్రసాదించినాడు. అనుభవింపమె మనవంతు."

ఒకక్రైస్తవస్త్రీ నాకు నాంగ్లభాషను నేర్పను, సంగీతము చెప్పను వచ్చుచుండెడిది. "పియానో" నొకటి కొంటిమి. ఈకృత్రిమ మహదానంద సాగరమున మునిగి నేను రామాయణ భారత భాగవత పఠనమునకు స్వస్తి చెప్పితిని. ఇప్పుడు నా కాపుస్తకములన్న మిగుల నేవగింపు జనించె. దేవతలయందు నాకుండెడి భక్తివిశ్వాసములు తొలగ దొడగె.

నా నాట ఇక్కడి పెద్దమనుష్యులతో స్నేహము కుదిరె. నూతనముగ స్త్రీసంఘమొకటి మేముండు ట్రిప్లికేనులో స్థాపింపబడె. ఈసంఘసభ్యురాండ్ర నడకలు, పోకడలు నాకు మొదటిలో ఆశ్చర్యము గొల్పెడివి. ఈసంఘమున నేను చాలదినములవరకు కేకి మూకమధ్య కాకివలె నుంటిని. ఈసంఘస్త్రీలు గుఱ్ఱపుస్వారి, టెన్నీసు ఆటలు, ఈతలు నేర్చి నేర్చుచు కేరింతలు గొట్టుచుండువారు. స్త్రీవిద్యాభివృద్ధి, స్త్రీస్వాతంత్ర్యములగూర్చి చర్చలు, వార్తాపత్రికలు ముందిడుకొని యందలివ్యాసముల దోషాదోషముల చర్చించి నిరూపించుకొను వారు చూపు బుద్ధికుశలత, చాకచక్యము, వాగ్వాదపటిమ నాకచ్చెరువు గొల్పెడివి. వీ రపరసరస్వతులవలె నాకుదోచెడివారు. సంకోచసంభ్రమములవీడి వీధి యందున పురుషులతో చేతుల గల్పి యటునిటు నడయాడుచుండుట గాంచి మొదటిలో వారి సాహసమునకాశ్చర్యపడుదాన. వారు నన్ను తమవెంట రమ్మనెడివారు. నేను లజ్జావశమున వెళ్లజాలకుండెడి దానను. ఆస్త్రీలమోము లెప్పుడు సంతోషవికసితములై యుండెడివి. వ్యాకులచిత్తలై వా రెన్నడు నాకు కానరాలేదు. మిస్టర్ కృష్ణారావ్ జబ్బుగా నున్నప్పటికి మిసెస్ రావ్ మోమున చింతారేఖ కానరాదు. మిస్టర్ రావ్ హృద్రోగమునకు లండను నగరమున చికిత్సనందుచున్నను మిసెస్ రావ్, మిస్ పూర్ణ నిత్యము టెన్నిసుఆటలకు వచ్చుచునే యుండిరి. ఇట్టి నాగరికతామూర్తుల మధ్య నా యవస్థ యెట్లుండెనో నాకే యెఱుక.

ఈస్త్రీల సంభాషణముల కెట్టి యాకర్షణశక్తి కలదో కాని, మెల్లమెల్లగ నాకుగూడ వారి ఆమోదప్రమోదములలో పాల్గొనవలయునను కోర్కి జనింప మొదలిడెను. వారివలె స్వాతంత్ర్యము గలిగియుండవలయునను నిచ్ఛ ప్రబలమగుచుండె. ఇంగ్లీషున వారు భాషించుకొనుచుండ నెన్నడు నాకట్టిభాగ్య మబ్బునా యని తలచుచు సుఖస్వప్నముల గాంచుచుండుదాన.

ఇట్లుండ నాస్థితి క్షేమజనకమగుచువచ్చె. నాభర్త నన్ను "మైలవ్", "మైడియర్" "మైడార్లింగ్" అని సంబోధించువారు. ఆమాటలు హృదయమునుండి వచ్చినవికావనియు, నందు కృత్రిమత యున్నదనియు తెలిసియుదాన. వారికి నాయెడ నున్న స్నేహములో హార్దికభావములకు మాఱు అలంకారము లెక్కువగా నున్నటుల కన్పట్టుచు వచ్చినది. అన్నిటికంటె నెక్కుడు నాకుగూడ నాభర్తయెడ నుండు శ్రద్ధాభక్తులు తొలగిపోనారంభించె. వారికి శిరోవేదన కల్గిన తొల్లిటి యట్లు నాకిపుడు హృదయవేదన కల్గుటలేదు. నాయందు ఆత్మాభిమానము, స్వార్థపరత హెచ్చె. ఇప్పట్టున నేను సింగారించుకొనుట కూడ నాకర్తవ్యమునకే గాని నాభర్త నానందింప జేయుటకు గాదు. నాసౌందర్యమందు నాకు గర్వము. నేను జీవించుట యొరులకొఱకు గాదనియు, నాకొఱకే యనియు భావింప దొడగితిని. త్యాగము, సేవ హృదయము నుండి దూరము లయ్యె.

నల్గురిలో మాత్రము తిరుగుటకు నా కింకను సంకోచముగనే యున్నది. పలువుగనోట నాసౌందర్యాధిక్యము వినవలయునని కుతూహలము. ఒకనాడు మిస్టర్ రావ్ ప్రభృతులతో మా వారు కూర్చుండిరి. నాకును వారికిని మధ్య కేవలమొక తెఱ యడ్డు. నేను వారియెదుట స్వేచ్ఛగా కూర్చుండలేదని నాభర్తకు కష్టముగా నుండెను. నే నిట్లుండుట వారి గొప్పతనమున కేమి లోపమని నాభర్త భావించువారు. "నాభార్య

వస్త్రభూషణ సౌందర్యాలోపమాలమునగాదు ఈవలకు రాకుండుట, లజ్జావశేషము" అని వారలకు చెప్పువారు. నానగలు, నాబట్టలు, నాఅందము వారికి కనబడుటకు మాటిమాటికి నన్ను తెఱయొద్దకు పిల్చువారు. ఎట్టకేలకు నాభర్త యిష్టమే నెరవేరెను. రెండుసంవత్సరము లగునరికి నేను సంభ్రమసంకోచముల వీడి నాభర్తతో కలసి "షైర్" చేయ మొదలిడితిని. ఆ "షైర్" వెనుక "టెన్నిసు" వంతు వచ్చెను. "క్లబ్బులో మెంబరు" నైతిని. మొదట నాకీ "టెన్నిసు" "క్లబ్బు"లన తలనొప్పిగా నుండునవి.

క్లబ్బునందు ఇంతకన్నను చిత్రము. జనులు ఇంగ్లీషుమాటల తమభావములో దొర్లించుచు వెకిలినవ్వుల నవ్వుచు, సారహీనసంభాషణముల కాలము బుచ్చువారు. స్త్రీల యానిర్లజ్జత, పురుషులభావశూన్యత మొదటిలో నాకాశ్చర్యము గొల్పెడివి. నలుదెసల నీపాశ్చాత్యపద్ధతులు హాస్యజనకములుగ నుండెను. ఏమైననేమి? నేనను వారి ననుసరించితిని. నాకిప్పుడు నిత్యము క్రొత్త క్రొత్త దుస్తులు, సింగారములు. క్లబ్బునందు టెన్నీసు ఆడునపుడు అందఱిదృష్టులు నామీద ప్రసరింపవలయునను ఉత్సాహము. నాభర్తకు జేయు సేవాసత్కారములందుండు శ్రద్ధకన్న నాయలంకారములందు నాకెక్కువ శ్రద్ధ కలుగజొచ్చెను. అంతేకాదు, పరులనోటినుండి నాసౌందర్య ప్రశంస వినవలెనను కుతూహలము. ఏసౌందర్యమున్న, నెట్టి శృంగారములన్న నాశరీరమున రోమరోమము హేయభావమున కంపించుచుండెడిదో, యెట్టి హాస్యకటాక్ష వీక్షణములు విషతుల్యములై నన్ను మృత్యుముఖమున జొర ప్రేరేపించెడివో యట్టి యిహలోకసౌఖ్యములందు నాకిపుడొక యనిర్వాచ్యపూర్ణమాహర్షము కలుగుచుండెను. కాని యెన్నడేని నాపూర్వస్థితి దలచుకొన్న మనమున మాత్రి మొకవిధమగు భీతి జనించుచుండును. ఈ నావ యేయొడ్డున జేరునో యను తలంపు. కొన్ని సమయముల క్లబ్బునకు పోగూడదనియు, స్వేచ్ఛాపరలగు నీయువతులతో స్నేహము వలదనియు ననుకొనుదాన. అయిననేమి, సమయ మగుటతోడనే క్లబ్బునకు సిద్ధపడుచుంటిని. నేను నావశమున లేను. మనమందలి సత్సంకల్పములన్నియు మంట గలియుచుండు. సద్భావములన్నియు నశించు.

నాభర్త స్వభావమున మార్పు కల్గుచుండెను. వారు విచారమానసులై కనబడుచున్నారు. ఏదో కఠినమగు చింతచే కృశించుచున్నట్లు కనబడుచు వచ్చిరి. ముఖము పాలిపోయె. తఱచు సేవకులతో పోట్లాడ నారంభించిరి. బయటకు వెళ్లుటకూడ తగ్గించిరి.

ఇంతకొకమాసము క్రితము నాకెన్నిపను లున్నను క్లబ్బునకుమాత్ర మవశ్యము వెళ్లువారు. క్లబ్బునకు వెళ్లని దినమున వారికి మతిపోయినట్లుండెడిది. కాని వారిప్పు డధికముగ వారి గదియందే పడకకుర్చీమీదనో పరుండి వార్తాపత్రికనో, పుస్తకమునో చదువుకొనుచుండు వారు. ఇట్లుండుటకు కారణ మేదియో మాత్రము నేనూహింపజాల కుండుదాన.

ఒక దినమున వారు జ్వరపీడితులై యెట్లున్న వారట్లనే స్మృతిలేక మంచముమీద పడియుండిరి. వారి యొద్దకు బోవలెనను బుద్ధియే నాకు కలుగలేదు. సభలు, ఉపన్యాసములు వీనియందు నామనస్సు తగిలియుండెను. వారియొద్దకు వెళ్లుచుండుదు; క్షణములో మరలి వచ్చి, "టెన్నీసునకు టైమ్‌అయ్యెను. వెళ్ల నా, వద్దా" యను సంశయములో మునుగుచుంటిని. తుదకు "ఎక్కడనున్న నేమి లాభము? నే నిచ్చటనున్న మాత్రాన వారిజ్వరము తగ్గునా? ఆగుటవలని ప్రయోజన మేమి? వెళ్లిననే బాగుండు"నని నిశ్చయించుకొంటిని. నేను దుస్తుల తొడిగికొని "రేకెట్" తీసుకొని క్లబ్బునకు వెళ్లితిని. అక్కడి చెలికత్తెలు మిసెస్ రంగనాథఅయ్యర్, మిసెస్ రాస్, మిస్ పూర్ణలతో నాభర్తయవస్థ జెప్పి సజల నయనములతో కూర్చుంటిని. టెన్నీసుకోర్టునకు మిస్ పూర్ణ నన్ను కేకవేయ నొక దీర్ఘనిశ్వాసము మాత్రము వదలి వారివెంట వెళ్లి యాడితిని.

నేటికి మూడుసంవత్సరములకు పూర్వము! నా భర్త యిట్టి విషజ్వరముచే పీడితులై యున్నపుడు,

రాత్రి యంతయు నిద్రలేక వారికడ కూర్చుని విసరుచునే యుంటిని. వ్యాకులహృదయనైతిని. "వారి కేల రావలె ఆజ్వరము, నాకేల రాదు" అని తలపోసితిని. ఆహా! కాల వైపరీత్యము. ఇప్పు డా హృదయము స్నేహశూన్య మయ్యె; పాషాణప్రాయమయ్యె. నే నెప్పటివలె రాత్రి తొమ్మిది గంటలకే యిల్లు జేరితిని. నాభర్త మంచిస్థితిలో నన్నట్లే కాన్పించిరి. వారు కేవల మొక్కపరి దీన దృక్కులు నాపై బఱపి యటు ఒత్తిగిలి పరుండిరి. నేను భోజన మొనర్చి పరుండు నెడ నా యంతరాత్మ నా స్వార్థపరత్వమునకు, ఈ లీలావినోదములకు నన్ను నిందించె.



"నేను దుస్తులతో డిగికొని......క్లబ్బునకు వెళ్లితిని."

ఇప్పుడు నేను ఆంగ్లోపన్యాసములను, నవలలను అవలీలగ గ్రహించుచున్నాను. మాసంభాషణ కెలుచు ఇంగ్లీషునందే. మా కన్న తక్కువ వారితో మాటాడుట హేయముగ భావించుచుంటిమి. హైందవస్త్రీలు నాగరికతాశూన్యలని తలపజొచ్చితిమి.

మరుదటి దినమున గూడ నా భర్త జ్వరము తగ్గలేదు. నేను క్లబ్బునకు వెళ్లలేదు. కాని మూడు దినములవరకు జ్వరము తగ్గకుండుట చూచి మిసెస్ కే. ఎన్. రావ్ 'డాక్టర్ తిరుమల్‌కు కబురు పంపరాదా' యని సలహానిచ్చెను. నే నట్లుచేయ నంగీకరించితిని. మరునాటి నుండియు డాక్టర్ వచ్చుచు పోవుచుండెను. నాభర్త సేవాశుశ్రూషలకు "నర్సు" ఒకతె నియమింపబడెను. నాకు గూడ భర్తకు సేవచేయు అవసరము తప్పెగదా యను సంతుష్టికల్గెను. రెండుదినములు నేను క్లబ్బునకు వెళ్లుట పడకపోయినప్పటికి మనస్సు అక్కడనే యుండెను.

ఒకనాటి మట్ట మధ్యాహ్నమున నేను పడకకుర్చీలో కూర్చుని యింగ్లీషునవల నొకదాని చేతగొని చదువుచుంటిని. ఆకస్మికముగ నామనమున 'నాభర్తరోగము తిరుగుట దుస్సాధ్యమయిన నెట్లు?' అను భావము జనించెను. ఈశోకమయ కల్పనవలన నాకు దుఃఖముకల్గుటకు మాఱు ఆనందము కల్గెను. 'మిసెస్ రావ్, మిసెస్ రాస్, మిస్ పూర్ణనాయుడు సానుభూతి ప్రకటింతురు. వారిని చూచుటతోడనే నే నశ్రుపూరితనేత్రనై నిలిచి, 'సోదరీమణులారా! నా జీవన మిప్పుడు ధీయానకళ్మకాన దీపమువలె క్రుంగి యంధకారభూయిష్ఠమై పోయినది. నన్ను జూచి జాలి నందరేల?...' అని మనమందొక శోకపూరితమగు నుపన్యాసరచన గావించుకొంటిని. పాపము శమించుగాక! శవమువెంట పోవునపు డెట్టిబట్టల కట్టుకొనవలయునో యనునిర్ణయము కూడ మనమున చేసికొంటిని. వీరి మృత్యువార్త పట్టణమెల్లెడ వ్యాపించును. ప్రతిసంఘము నుండియు, పరిచయముగల ప్రతివ్యక్తికడ నుండియు నాకు సానుభూతిలేఖలు కొల్లలుగవచ్చును. వానికి నేను ప్రతియుత్తరమునకు ప్రత్యుత్తరమీయ నవసర్థము. శోకసంతప్త హృదయునకు నాకు సమయ మెక్కడ? "అందఱకు కృతజ్ఞురాల. మృతాత్మశాంతికి సర్వేశ్వరుని ప్రార్థింప మిమ్ము వేడెద" నని పత్రికాముఖమున ప్రకటింతును." ఇట్టి యాలోచనలలో మునిగి తేలుచుండ నర్సు వచ్చి—'అమ్మా! అయ్యగారు పిల్చుచున్నారు—'అనెను.

ఆది నాకు క్లబ్బుటైము. వారప్పుడు నన్ను పిలచుట నా కాటంకము. ఏమిచేయుదునే! ఎటులనో వెళ్లితిని. నాభర్తమంచము నెక్కి నేటికి రమారమి మాసము దినములు కావచ్చినది. వారు నావైపు దీననేత్రముల

చూచుచుండిరి. ఆకనుల నీరు నిండియుండె. వారినిచూడ నాకును జాలిపొడమె. కూర్చుని ధైర్యము చెప్పుచు, "ఏమి చేయుదు? మరియొక డాక్టరును బిలతునా?—"

"నే నిప్పుడున్న నాకీరోగము మరలదు. నన్ను మాయమ్మ యొద్దకు గొంపొమ్ము."

"ఏమి! ఇక్కడకన్న నెక్కువ చికిత్స జరుగునా యక్కడ?"

"జరుగనిమ్ము, జరుగకుండనిమ్ము. నామనసేమిలనో మాతృదర్శనముగోరి వేగిరపడుచున్నది. ఔషధసేవవలన గాకున్నను మాయమ్మ దర్శనముననే జీవింపగలను అను ధైర్యము నాకు కల్గుచున్నది."

"ఇది వట్టి భ్రమసుమండీ."

"భ్రమే కానిమ్ము—నా ప్రార్థన నాలకింపుము. ఈ రోగమునవలన గాదు. మన ప్రస్తుత జీవితమార్గమునుండియే నాకు దుఃఖము కల్గుచున్నది."

ఆశ్చర్య చకితనై నేను నాభర్తను తిలకించితిని.

నారంత—"ఈ జీవనమునుండి నేను మిగుల విసిగితిని. నిర్మలజలప్రవంతులచే పవిత్రమగు భూమి మన మాతృభూమియేయని నే నీనాడు గుర్తింప గల్గితిని. నే నింతకుపూర్వము ఈ హేయజీవనమును మిగుల ప్రేమించితిని, ఇప్పుడు నాకు దాని యాంతరంగికావసలు బాగుగ బోధపడినవి. అద్యంతము కంటకాన్వితమైన జీవితమందు నేటివరకు తిరుగాడుచుంటిని. ఈ జీవనమున హృదయానందముగాని, యాత్మకు శాంతిగాని లేదు. ఇది యొక యున్మత్త, అశాంతిమయ, స్వార్థపూరిత, విలాసయుతమా జీవితము. దీనియందు నీతి, ధర్మము, సహానుభూతి, సహృదయత శూన్యములు. పరమాత్మ ప్రీతికొఱకైన నీవు న న్నియ్యెడనుండి రక్షింపుమా! ఉపాయాంతరమేమియు లేనిచో మాయమ్మకొక లేఖనైన నంపుము. ఆమె తప్పక వచ్చును. ఆమె మమతాపూర్ణదృష్టి, ఆప్రేమయుతహస్తము. నా కమృతోపమములగు. నే జీవింతును. ఆమెవచ్చును. ఆమె తప్పక వచ్చును. వచ్చి యీనిర్భాగ్యుని యవస్థ గాంచును. ఈనీచాతి నీచమగు నవనాగరకతాసంఘముల గాలి ఆమె కింకను సోకలేదు. ఆమెవచ్చును; వచ్చును; తప్పక వచ్చును. నాకన్నులు ఏప్రకాశమాన పవిత్ర దివ్యజ్యోతికై తహతహలాడుచున్నవో ఆజ్యోతి యింకను ఆమె మొగమందే తాండవమాడుచుండును ఆమె హృదయమున స్నేహము, సత్యము, విశ్వాసము పొదుకొనియున్నవి. ఆపవిత్ర మాతృమూర్తి యంకముననే చనిపోయినను నాయాత్మకు శాంతికల్గును. మోక్షము కరతలామలకమగు, స్వర్గలోక సంతోషమును గల్గును."

జ్వరతీవ్రతచే వాగ్ధోరణి హెచ్చెనేమో, 'టెంపరేచరు' తీసి డాక్టరుయొద్దకు బోదునని 'నర్సు' 'థర్మామీటరు' తీసికొనివారియొద్దకు వెళ్లెను. నాభర్త యామె చేతిలోనుండి యీ జ్వరమానయంత్రమునుదీసి నేలగొట్టిరి. అది ముక్కముక్కలయ్యెను. వారు నన్నంత హాస్యమయదృష్టి నవలోకించి "దుష్టుల బాపితిని. క్లబ్బునకుపోదువు గాబోలు. ఆదారిని పోవునపుడు డాక్టరుగారిని కలసికొని—మావారి టెంపరేచరు తుడిడిగ్రీకి యెక్కెనని మాత్రముచెప్పుము" అనిరి.

నేనంత భయభీతనైతి. హృదయమున కరుణావిచారములు ముప్పిరిగొనె. కంఠము రుద్ధమయ్యె. నాభర్త తమనేత్రముల మూసిరి. వారి యుచ్ఛ్వాస నిశ్వాసములు తీవ్రములయ్యె. డాక్టరును పిలుచు తలంపుతో నేను ద్వారముకడ కేగునంతలో వారు లేచి కూర్చుని నావైపు దీనముగ జూచుచు "కమలా! నేను నీతో కొంచెము నేపుమాటాడవలెనని చాలాకాలమునుండి యోచించుచుంటిని. కాని సాహసము కలుగదు. నేను తప్పక నాహృద్గతములను నుద్దేశముల చెప్పివేయదలచితిని.—పూర్వజీవనమునందే సుఖమునందవలయునని యోచించుచున్నాను. ఈ జీవితమున్న నా కసహ్యము కల్గుచున్నది. ఇదే నారుగ్మతకు ముఖ్యకారణము. శారీరకష్టమున కాదు—మానసికకష్టమున కృశించిపోవుచున్నాను. నిన్ను తిరుగ అజ్ఞానత్రివిగ, భగవదారాధనా తత్పరవుగ, రామాయణ పఠనాసక్తవుగా గాంచవలెనని యూహా. గృహకార్య

నిర్వహణమున శ్రద్ధాభక్తులుకల్గి, రాత్రిపరిశ్రమ మొనర్చుచు పరమేశ్వరసంసేవను కాలముగడపు నీయానాటి మూర్తి మరల గాంచవలెనను నాయాశ వ్యర్థ కాజనదు. నన్ను నీదానివిగా స్వీకరింపుము; నీవు నాదానవు కమ్ము. పరదారహితమగు నాపతిశుద్ధజీవితమందే వాస్తవిక సుఖముకలదని నేనీనాడు గ్రహింపగల్గితిని. చెప్పుము. నీకేది యంగీకారమో? నీ వెన్నడు నామాట జవదాట లేదు. నాముద్దు చెల్లింపకున్న ఈనికృష్టజీవన మెట్లు పరిణమించునో! ఏమి? కమలా! నాముద్దు చెల్లింపవా? చెప్పుము—చెప్పవా? —"యని బ్రతిమాల దొడంగిరి.




"నిన్ను తిరుగ ఆజ్ఞానువర్తినిగ.........రామాయణ పఠనాసక్తవుగా గాంచవలెనని యాశా."

వెంటనే నేనేమియు ప్రత్యుత్తర మొసగ జాలనైతిని. ఈ స్వాతంత్ర్యజీవితమందున్న సుఖమునుగూర్చి యాలోచింప దొడగితిని. ఈయానందమెక్కడ దెక్కడ! ఇన్నిదినములు స్వతంత్రరాజ్యమునందు స్వేచ్ఛాభ్రమణ మొనర్చిన పిదప మరల నస్వతంత్రతా జాలముల చిక్కువను టెట్లు? నేనపురాలినై యచ్చట కాలముగడపు టెట్లు? నాభర్తయేగా నాకీస్వాతంత్ర్య పాశముల నేర్పినది. పవిత్రపురాణపఠనము దనిష్టత గలుగజేసినది వారే గదా! నేను వారి యిచ్ఛానుసారము మెలగితినే. ఏమి యపరాధ మొనర్చి యుంటిని?—అని ఆలోచింప దొడగితిని. కాని నాభర్త దీనతాపూర్వదృక్కుల నన లోకించి నంత నేనేమియు చేయజాలనైతిని "ఇక్కడ మీ కేమి కష్టముగా నున్నది?" అని మాత్రమంటిని.

నాభర్త తిరుగ లేచి కూర్చుని నావైపు కఠినముగ జూచుచు, "ఈప్రశ్న నన్నడుగుటకు పూర్వము నీహృదయమునే యడిగిన బాగుండును. నేటికి మూడేండ్లక్రితము నీకుగల ప్రేమ నేడున్నదా? నీకన్న నన్నివిధముల యుత్తమునిగ తలచిన నాయెడ నీవు నేడెట్టి యనాదరణ జూపుచున్నావు? ఈయర్వాచీననాగరికత నారీజనమును సర్వనాశన మొనర్చుచున్నదని నేనిప్పుడు గ్రహింపగల్గితిని. మూడువత్సరములకు పూర్వము నే నిట్టి దశయందున్నప్పుడు నన్ను వదలి యీరీతి యిరుగు పొరుగిండ్లకు వెళ్ళెడిసాహసము నీకుండెడిదా? నేను రోగపీడితుడనై మంచముమీద బడియున్నపుడు నోరార నెవ్వరితోడనైన మాటలాడెడిబుద్ధి నీకుపోడమెనా? ఇతరుల నెన్నడేని కంట జూచితివా? స్త్రీలహృదయపేటికారత్నము ప్రేమ. ఈనవనాగరికత దాని నాశన మొనర్చుచున్నది. నాకిప్పట్టున పూర్వాచారములే పవిత్రములుగ గన్పట్టుచున్నవి. వారి జీవితోద్దేశము ఆత్మిక శారీరకాభ్యుదయము, హృదయపవిత్రత. ఈ హేయాతిహేయమగు జీవితోద్దేశము నిర్లజ్జ, స్వేచ్ఛాప్రవృత్తి, మాయవేషము —ఏమి కమలా! అట్లు చూచెదవు? నాప్రస్తావన నీకిష్టములేదా?"

నాహృదయమున వజ్రపాత మయ్యె. అందు దాగియున్న లజ్జ పునరుజ్జీవితమయ్యె. నాయంతరాత్మ నీనానాటి పవిత్రాత్మవు కావని బోధింపగడగె. ఆనాటి చాపల్యము, నేటినిర్లక్ష్యత, విలాసము, స్వార్థపరత కన్నులకు గట్టినట్లాయె! 'నీకర్తవ్యమును నీవు మరచితివి సుమా!' యను అంతరాత్మ ప్రబోధములకు మేల్కొనియు కొండొకవడి నిశ్చేష్టనై నిల్చితి.

అంత ముకుళితకరకమలనై భర్తృచరణములుశిరము సోక నేల వ్రాలితిని. కంఠావరోధమున నోట మాటరా



చిత్రము ౫. మైసూరు మహారాజావారి నగరు




అహమదాబాదులో నున్న హాతీసింగ్ సమాధి

'టైమ్సు ఆఫ్ ఇండియా' అన్యువలు నుంచి కైకొనినది.

దయ్యెను. నయనము లశ్రుధారాపూరితము లయ్యెను. నాభర్తగారు నన్ను గాఢాలింగనమున గౌరవించిరి. మాహృదయము లొక్కటియయ్యెను.

ఇట్లు జేరితిమి. మా యత్తగారి గౌరవమునకు పాత్రనైతిని. మావారు సంతుష్టహృదయులైరి. ప్రాతస్తల్పములకుస్వస్తిచెప్పిభగవద్గీతపారాయణమున, సంధ్యావందనాది పూజార్చనముల శ్రద్ధకల్గియున్నారు. నేను భారత భాగవత రామాయణాది పురాణముల మిగుల శ్రద్ధతో జదువుచున్నాను. ఈమధ్య రాట్న ప్రచారము విరివిగ జరుగుచుండుటచేసి రాట్నము త్రొల్లిటికంటె శ్రద్ధతో వడకుచున్నాను.



---

7. 2- 10

II

(అభివంద నాశీర్వాదముల తరువాత)

శి:— ఈ నడుమ మీ రేమైన వ్రాసినారా?

గు:— ఈ నడుమ నవఁగా?

శి:— భారతీ పత్రికకు వెనుక మీరారంభించిన "గురు శిష్యసంవాదము" నకుఁ బిదప నన్నమాట.

గు:— ఆ! ఏవో యొకటి రెండు. వారివలెఁ బొంగుచున్న వాఙ్మయములో నవి కణములవంటివి; పేర్కొనఁదగినవి కావు. ఏ మిట్టిప్రశ్న వేసితివి?

శి:— నా కేమియు లేదు. ఇంకొక్క "గురు శిష్యసంవాద" మీవలికి వచ్చునేమో యనువాశతో నట్లడిగినాను.

గు:— ఎట్లు రాఁగలదు నాయనా? బుద్ధి చేఁపుపోయినది.

శి:— వత్సనక్తి సంస్పర్శమువలన మరల రావచ్చును. ఏదో వార్తాపత్రిక చదువు చున్నట్లున్నారు!

గు:— ఔను, "తరుణ భారతపత్రిక — Young India." ముసలితనములో నాకది నల్లమందైనది.

శి:— నల్లమందుపట్టు పోకముందే నాలుగుమాటలు సెలవిందు మతి. అతిశ్రద్ధతో నిప్పుడు మీరు చదువుచున్న పత్రికా భాగ మేది? ఏ విషయమును గూర్చి వ్రాయఁబడినది? ఎవరిచే వ్రాయఁబడినది?

గు:— "దేశాయము — దేశదారిద్ర్యము" అను శీర్షకముతోఁ బ్రకటింపఁబడిన యొక విలేఖనము; దానిని వ్రాసి నాయన ప్రస్తుతము "ఘూర్జర విద్యాపీఠము" లోఁ బనిచేయుచున్న యొక గొప్పపండితుఁడు, అర్థశాస్త్రవేత్త; ప్రపంచ పర్యటనముచేసి వివిధ దేశ ప్రజల సుఖాసుఖములను స్వయముగాఁ జూచివచ్చిన లోకజ్ఞుఁడు. ఆయనపేరు శ్రీ కుమారప్పగారు.

శి:— సరియేకాని, దేశదారిద్ర్య మనుచున్నా రేమి కర్మము? చీమల బారులవలెఁ గ్రిందఁ బ్రాఁకుచున్న శతసంఖ్యాకములగు రెయిలు బాటలతో, తంబుఱ తీఁగలవలెఁ బైని వ్యాపించు విద్యుద్వార్తా తంత్రులతో, బహుళములైన భారతీ భవనములతో, చిత్రచిత్రవ్యాధి నివారణ పరికరములతో నిండియుండు చికిత్సాశాలలతో సస్యసమృద్ధములగు భూములతో, సమస్తసుఖసదుపాయములతో నొప్పారుచు స్వర్గతుల్యముగనుండు మనదేశము దరిద్రదేశమని యెవఁడు చెప్పఁగలఁడు? ఇప్పటి మిద్దెలు, మేడలు, కుర్చీలు, సోఫాలు, విద్యుద్దీపములు, విద్యుద్వ్యజనములు, ఏటఁజేయునగు పనులు పూటలోఁజేయు నానాద్భుత యంత్రశాలలు — ఇవన్నియు మా ముత్తాతలుగాని, తాతలుగాని యెఱుఁగుదురా?

గు:— మీ ముత్తాతలకును, తాతలకును లేని సౌకర్యము లిప్పుడనేకము లున్నవనుమాట వాస్తవమే. కాని వారి యాయురారోగ్య జవసత్వము లిప్పటివారికి లేవనుమాటయు నంతసత్యమే! దీనికిఁ గారణమేమో కనిపట్టవలెను. పూర్వకాలములతోఁ బోల్చి చూచుకొనియు, సమకాలికులగు నితర దేశ జాతులవారితోఁ బోల్చి చూచుకొనియుఁ గష్టసుఖతారతమ్య నిర్ణయము చేసికొనవలెను. పాశ్చాత్యుల యద్భుతమైన ప్రకృతిశాస్త్ర ప్రావీణ్యమువలన, దానియొక్క దినదినాభివృద్ధివలనఁ బూర్వులెఱుఁగని సౌకర్యము లనేకములు యావత్ప్రపంచమందును ప్రజ లిప్పు డనుభవించు చున్నారు. తిల్లాభములవలన గలుగు సుఖమైనను మనకంటె నితర దేశస్థులకే యెక్కువగా నున్నది. యంత్రాది నిర్మాణశక్తి మనకు లేదు; లేకపోవుటకు మనబుద్ధి మాంద్యమో కారణము, ఇతర కారణము లేమైన నున్నవో కనిపట్టవలెను. ధూమశకటాది గమన సౌకర్యముల వలనఁ బ్రజలనుండి వచ్చు రాబడి దేశాభివృద్ధికొఱకు వినియోగపడుచున్నదో, ధన సంపన్నులగు నితర దేశీయుల మఱింత శ్రీమంతులఁ

జేయుటకును, స్వాతంత్ర్యహీనులైన ప్రజలను మఱింత యస్వతంత్రులఁ జేయుటకును ఉపయోగ పడుచున్నదో —అది చూచుకొనవలెను. యంత్రములు వచ్చి చేతిపనులు చెడఁ గొట్టుటయును, ఖాద్యము జగత్ప్రసిద్ధిఁగాంచిన శిల్పాది వృత్తుల నశింపఁజేయుటయును అభ్యుదయ సూచకమో, అనర్థసూచకమో దూరదృష్టితోఁ గమనింపవలెను. ఇఁక నీవు పేర్కొన్న మేడలను మిద్దెలను, విద్యుద్దీప విద్యుద్వ్యజనాదులను దేశములో నెంతమంది కున్నవో చెప్పుము. వేయిమంది పొట్టలు చేతఁ బట్టుకొని తిరుగు లాడుచుండ నెవఁడో యొకఁడు పంచభక్ష్యపరమాన్నములు గుడుచుచుండుట దేశభాగ్యలక్షణమో, దేశాభాగ్య సూచనమో—అది న్యాయమో, బలుపో—బాగుగా నాలోచించి చెప్పుము.

శి:—ఇవన్నియు శ్రీకుమారప్పగారు పరిశీలించి చెప్పినారా యేమి?

గు:—దీనిలో నవియన్నియు లేవుగాని, ముందు పత్రికలలో రావచ్చును. ఆయన వ్రాసిన విషయము లందఱు శ్రద్ధతోఁ జదువఁదగిన వని శ్రీగాంధిమహాత్ముఁడుగారు చెప్పినారు. ఆచెప్పు సందర్భమున మన కుతూహలము దీఱుట కొకమాట చెప్పినారు.

శి:—అది యేది?

గు:—ప్రపంచములో నెల్ల ధనవత్తమమైన దేశము ఆమెరికా దేశమని యెఱుఁగుదువు గదా!

శి:—ఆ! ఎఱుఁగుదును.

గు:—మహాత్తమమైన యీదేశము తనకు వచ్చు పన్నుల మొత్తములో—సైన్యపోషణమునకును, అప్పులు దీర్చుటకును, పరిపాలన కృత్యములకును—నూటికి 48.8 వ్యయము చేసికొనునఁట; ఇఁక దరిద్రదేశమని పేరెక్కిన మనదేశము ఆ ప్రయోజనములకే నూటికి 93·7 ఖర్చు పెట్టునఁట.

శి:—ఎవరు చెప్పినారు?

గు:—కుమారప్పగారే వ్రాసినారఁట.

శి:—కాని, అయ్యా! అర్థవంతమైన అమెరికా కంటె దాదాపుగా రెండురెట్లు వెచ్చింపఁ గల మన దేశము దరిద్రదేశమని యెట్లు చెప్పఁగలము?

గు:—అట్లు వ్యయించు కొనుచుండుటచేతనే దరిద్రదేశమైనది. ఆరోగ్యాభివృద్ధికి, విద్యావ్యాప్తికి, జీవికాకల్పనములకుఁ, బ్రజాసౌఖ్యావహములగు నితర సత్ప్రయోజనములకుఁ డబ్బు చాలకున్నది. పాదులలో నున్న పాలన్నియుఁ బిదికి పైవారికే పోయుచో నిఁక దూడ త్రాగి బ్రతుకుటకుఁ బాలెక్కడనుండును? అమెరికా ఖర్చుపెట్టు 48·8%ను ఆదేశములోనే తనవారికే వినియోగ పడుచున్నది. మనహిందూదేశము ఖర్చు పెట్టు 93·7%లోను అత్యధికభాగము దేశము దాఁటి పోయి యన్యదేశీయుల పెట్టెలలోఁ బడుచున్నది. మన దేశమాత యీమహోపద్రవమునుండి విముక్తురాలైనఁ దక్క—నామెకు స్వరాజ్యసుఖముగాని, మఱి యేరాజ్య సుఖముగాని యలవడ నేరదు—అని మహాత్ముఁడు చెప్పుచున్నాఁడు.

శి:—అలాగునా? కుమారప్పగారీ యన్నియు వ్రాసినారేమి?

గు:—వ్రాసినట్టే; దేశము సుఖవంతమై భాగ్యవంతమై యుండుటకుఁ బరిపాలనాపద్ధతి ప్రాచీనసనాతన శాస్త్రసంప్రదాయములఁ బట్టి యెట్లుండవలయునో కుమారప్పగారు కొన్ని చక్కని సామాన్యసూత్రములతో నిటుఁ దెల్పినారు.

శి:—అవేవో సెలవిండు.

గు:—నీ వింగ్లీషు రానివాఁడవు గావు. ఇదిగో! పుచ్చుకొని చదువుకొనుము.

శి:—అందులకుఁ బనికట్టుకొని నే నింతదూరము మీకడకు రానేల? మీమాటలతోఁ జెప్పవలెను, నింగ్లీషు రాని యాంధ్రుల కుపయోగించునది.

గు:—అర్థశాస్త్రవాసన నాకంతగా లేదు. అయినను నీమాట త్రోసివేయఁ జాలను. కుమారప్పగారి యుపదేశముల నతిసంగ్రహముగాఁ జెప్పెదను విను.—

పన్నులనఁగాఁ బ్రజలు సత్పరిపాలనముకై రాజున కిచ్చుపారితోషికములని ప్రాచీనాభిప్రాయము; కనుకఁ బోషకస్థానమునం దుండు రాజునకును పోష్యస్థానమునందుండు ప్రజకును ఒకరీతి యొడంబడిక యున్నదన్నమాట. "ప్రతిఫలరూపముగాఁ బ్రభువు సమస్త భోగములు ననుభవింపవచ్చును, కాని ప్రజారక్షణ విషయమున బానిసీనివలెఁ బని చేయవలెను." అని నీతిశాస్త్ర కర్తయగు శుక్రాచార్యుఁడు చెప్పినాఁడఁట.

శి:—అవి, కృతయుగము నాఁటి మాటలు, పోనిండు; ప్రస్తుతకాలపుఁ బరిపాలకులఁ గూర్చి కుమారప్పగా రేమని చెప్పినారు?

గు:—అర్థశాస్త్ర వేత్తలును, ప్రజాహిత పరాయణులును అగువారే పరిపాలన కృత్యములోఁ బ్రవేశింపవలెను; అర్థశాస్త్ర జ్ఞానము దుర్వినియోగము చేయు స్వార్థపరులు ప్రభువు లగునెడలఁ బ్రజాపీడకు లగుదురు.

సత్పరిపాలకులు, తమకాలపుఁ బ్రజల క్షేమమే యాలోచింపక, భావిదేశలాభమునుగూడ మనసులోఁ బెట్టుకొని దూరదృష్టితోఁ దమ పాలనకృత్యములు నెఱవేర్చుకొందురు. దాదాపుగా ప్రపంచమందలి దేశములన్నియును ఇప్పుడు వాణిజ్యాదులచేఁ బరస్పర సంబంధములు గలిగియున్నవి గనుకఁ, దాత్కాలిక లాభమునే చూచి వ్యవహారము నడపుకొను దేశము, రాఁబోవు తనవారికే కాక యితరదేశీయ భావిప్రజావర్గమునకుఁ గూడ బాధగలిగించునదగును. ప్రస్తుతలాభమునే యపేక్షించి, అమెరికా సంయుక్తరాష్ట్రములవారు, సేద్యమునకును, రాచబాటలకును తమ పెద్దపెద్ద యడవుల నఱికి తగులఁ బెట్టుచున్నారఁట; యితరులతో వర్తకపుపోటీ పెట్టుకొని తమదేశములోనుండు ఖనిజతైల కూపములనుండి చమురు వేవేగ తోఁడి వేయుచున్నారఁట. ఇది ముందుముందా దేశమునకే కాక యన్యదేశములకుఁ గూడ మహానర్థముగాఁ బరిణమించునని కుమారప్పగారు చెప్పుచున్నారు.

శి:—అమెరికామాట మనకేల? మనహిందూదేశపు పరిపాలనగూర్చి యేమైనఁ జెప్పినారా?

శి:—నాయనా! తొందరపడకు! స్వదేశసమాచారకథనమున కుపోద్ఘాతముగా నవి యన్నియుఁ జెప్పినారు. హిందూదేశమును గూర్చి విపులముగానే వివరించినారు, విను:—

మనదేశ మిప్పుడు తానుండిన స్థితినుండి మాఱి మఱియొక స్థితిలోఁ బ్రవేశింపనున్నది. ప్రజలు కేవల కృషి జీవనము వదలి శిల్పాదివ్యాపారములలోఁ జొరఁ జూచుచున్నారు; చేతిపనులు మాని కర్మాగారములు స్థాపించి వానిని యంత్రసాహాయ్యమునఁ గావించుకొనఁ బ్రయత్నించుచున్నారు. విషమమైన యీ సంధికాలములో వేయికన్నులతోఁ జూచుచు బహుజాగరూకతతోఁ బరిపాలకు లీమహత్తరమైన ప్రజోత్సాహశక్తిని దేశక్షేమానుకూలముగాఁ ద్రిప్పి నడపవలెను.

గు:—ఈసందిగ్ధ శుష్కోపన్యాస వచనములతో నేమి ప్రయోజనము? ఎట్లు నడపవలెనో నిర్ధారకముగా నేమైనఁ జెప్పినారా?

గు:—చెప్పినారయ్యా! కొంచెమోపికపట్టుము; గ్రుక్క త్రిప్పుకొననీయవేమి గ్రహచారము? "కట్టె, కొట్టె, తెచ్చె"నని సంక్షిప్త రామాయణమువలెఁ జెప్పిన లాభములేదు గదా! ముసలివాఁడను, విషయ మనభ్యస్తము; ఆలోచన కించుక యవకాశ మీయవలెను.

శి:—క్షమించి యట్లే సావకాశముగానే సెలవిండు. ఎట్టివారికైనను ముసలితనములోఁ బూర్వవయసువడి యుండుట కష్టము.

గు:—ఏ మార్గమైనను, మంచిదగునెడలఁ, బ్రజలయొక్క పదార్థోత్పాదన శక్తి హెచ్చుచేయవలెనుగాని క్షీణింపఁ జేయఁగూడదు. కనుకఁ బ్రభుత్వము వారు నవీన వ్యాపారఫల పరీక్షణార్థము యుక్తమైన వ్యయము చేసి, పరిశీలన పర్యవసానము ప్రజల కెఱుకపడు నేర్పాటులు గావింపవలెను. అర్థబలమును, వ్యాపార నైపుణ్యమును గల పరదేశస్థులు పోటీగావచ్చి క్రొత్తగా నంకురించిన వృత్తుల నశింపఁజేయకుండఁ గఠినమైన దిగుమతి పన్నులువేసి వానిని సంరక్షింపవలెను. ప్రథమావస్థలోఁ

ప్రజాసుఖకరము లైన నూతన వ్యాపారములకుఁ జాలిన ధనసాహాయ్యము చేయుచుండవలెను. బహుముఖముగా నిట్లు పరిపాలకులు తోడ్పడుటవలన సందఱు జనులకు వారు సమానమైన యవకాశము లొసఁగిన వా రగుదురు. కాని దేశములో నెవరో యల్పసంఖ్యాకులు విత్తాఢ్యులై యుండుటగాని, యేదో యొకవృత్తి కయియే ప్రజలు ప్రభువులనుండి తోడ్పాటు పడయుటగాని దేశమునకు మంచిది గాదు.

శి:—నాకు బోధపడలేదు. ఏల మంచిదిగాదు?

గు:—మొదటి దానివలనఁ జెక్కుర కతృప్తిగలుగును; అందుచే నంతఃకలహములు పుట్టును.

శి:—అతృప్తి యేల కలుగవలెను?

గు:—సమానముగాఁ బాటుపడు ప్రజలలోఁ గొందఱకడ ధన మత్యధికముగాఁ జేరియుండుట సహజముగా నితరుల కసూయాజనకమగును.

శి:—సరియే, రెండవ దానివలన నేమిబాధ?

గు:—దేశములో నందఱుఁ గృషీవలవృత్తియే యవలంబించి జీవింపఁజూతు రనుకొనుము; ఆయొక్క వృత్తి నభివృద్ధి నొందించుటకే పరిపాలకులు ధనాది సాహాయ్యమొనర్తు రనుకొనుము. దీర్ఘానావృష్టిక్షామ బాధలు తటస్థించునెడల, నప్పుడు దేశదురవస్థ యెట్లుండునో యోజించుకొనుము.

శి:—కాలము సరిగా లేకున్నచో, నేకజీవికా వాధారము చేసికొను దేశప్రజలు బాధపడుదు రనుట నిజమే.

గు:—కాలము సరిగానున్నను ఆ యపాయము పూర్తిగాఁ బోదు. ఏఁలనఁటఁ బ్రజాభివృద్ధి యగుచుండును.

శి:—ఏమో! పుట్టుకలతోపాటు చావులు నున్నవి.

గు:—వనొక విషయమునుండి యొక విషయమున కీడ్చుచున్నావు. ప్రజాగణనముచేసి ప్రకటించు ప్రభుత్వము వారి లెక్కలను ప్రమాణముగాఁ గొనుచో, నీ కట్టిసందేహము కలుగఁ గూడదు. మనదేశములో స్త్రీలకు వివాహము లైచ్ఛికములు గావు. సంతానహీను లత్యల్పసంఖ్యాకులుగా నుందురు. అర్థలోపము కావలసినంత యున్నది గాని అపత్యలోప మెంతమాత్రము లేదు. "బీదలకు బిడ్డ లెక్కువ"యను లోకోక్తి నీవు విని యేయుందువు. ఆయుఁగురు బిడ్డలఁగని తలిదండ్రులు బిడ్డలు గతించిన, జనసంఖ్యలో మనుపటికంటెనలుగు రెక్కువగానుండరా?

శి:—ఔను, మీమాటల కడ్డురాను; సంభాషణము సాగిపోవిందు

గు:—ప్రజలు నానాఁటికి హెచ్చుచుందురు, భూమిమాత్రము యథాపూర్వముగానే యుండును, భూసారము తగ్గిపోవుచుండును. ఎన్నిక్రొత్త యెరువులువేసి సేద్యము చేసినను, తిండికిఁ జాలు సస్యముండని రోజులు రాకమానవు. కనుకఁ బరిపాలకు లీచిక్కులన్నియు నాలోచించి వ్యవసాయము, వర్తకము, శిల్పములు, నింక నితరవృత్తులు—వీని కన్నిటికి యథోచితముగా సాయపడుచుఁ బ్రజలను గాపాడవలెను. యావద్దేశప్రజావర్గములో నుండు బుద్ధిబలదేహబలములకుఁ దగు నవకాశము లిచ్చి తోడ్పడి వారు వానిని దేశాభివృద్ధికై యుపయోగించుకొనవలెను.

శి:—ఇన్నిటికి సాయపడుటకు సొమ్ముండవలెను గదా!

గు:—ఉండవలెను. అందుకయియే పన్ను లేర్పడినవి. కాని యాపన్నులు వేయుటలో రాజు ప్రజల కెంతమాత్రము బాధకలిగింపక వారు సంతోషపూర్వముగా నవి చెల్లించుకొనునట్లు చూచుకొనవలెను—అని కుమారప్పగారు చక్కని ప్రాచీన నీతోపమానములతో విశదీకరించినారు. చెట్టునకు హానికలుగకుండ బాగుగాఁ బక్వమైన పిదపఁ బండ్లు కోసికొనునట్లు, ప్రజల కావంతయైన నొప్పి కలుగకుండఁ బ్రభువు వారినుండి పన్నులు గొనవలయును—అని కౌటిల్యుఁడు చెప్పినాఁడఁట.

శి:—ఏకాత్ముఁడుగా రేమియుఁ జెప్పలేదా?

గు:—ఎరువువేసి నీరుపోసి మొక్కలను బుష్టముగా బెంచినపిదపఁ దోఁటకాఁపు పూవులను, ఫలము

లను ఎట్లు కోసికొనునో, రాజట్లే ప్రజలను సుఖపెట్టి, యనాయాసముగా పన్నులు చెల్లింపఁగల శక్తి వారికి మెట్టమొదట నిచ్చి, పిదపఁ బన్నులు పుచ్చుకొనవలెను—అని శుక్రాచార్యుఁడు కూడ నట్లే చెప్పినాఁడు. మఱియుఁ బన్నులవలనఁ బ్రజలవస్తూత్పాదనశక్తి తగ్గఁగూడదు. కత్తిరించి గొఱ్ఱెనుండి ఉన్నిఁగొనవలెను గాని వాని తొడలొలిచి తీసికొనరాదు. సుఖజీవనమునకుఁ జాలిన ధనము ప్రజలకడనుంచి, యతిరిక్తముగా నున్న విత్తము నుండియే, రాజు పన్నులు గ్రహింపవలెను. అధికారులా యమూలములను శుష్కింపఁజేసి నాశము చేయఁగూడదు. మరలఁ బుష్పించుశక్తి పుష్కలముగా మొక్కల కుంచి నిచ్చి, పుష్పవిక్రేత, యిఁక నటనున్న వాడి రాలిపోవుట కక్కఱ సహోపయోగ మేమియును వానివలన లేనప్పుడే, పూవులుకోసి యమ్ముకొనును. సరిగాఁ బ్రభు వట్లే ప్రజల నుండి పన్నులు రాఁబట్టుకొనవలయును; లేనిచో బొగ్గులకై ఫలవృక్షములను బడగొట్టి కాల్చినకాఁ డెంత బుద్ధిమంతుఁడో భూపతియు నంత బుద్ధిమంతుఁడే యగును.

శి:—నిదర్శనములు చాల హృదయంగమములుగా నున్నవి సుండీ!

గు:—బుద్ధిమంతులగు పూర్వులు తెచ్చిన దృష్టాంతము లన్యథా యుండునా? నాయనా, కుమారప్పగా రింకొక ముఖ్యమైనవిషయమునుగూర్చి చెప్పినారు విను.

శి:—చిత్తము.

గు:—కుడువఁ గూడును, కట్టబట్టయునున్నవారా, కారా? యనుసందిగ్ధ దశలో—లేమియొక్క సరిహద్దులో—నున్నవారి నుండి రాజెట్టిపన్నును గ్రహింపఁగూడదు; ఆలోటు ధనాఢ్యులనుండి కూడఁ దీసికొనవలెను. క్రేతలకు భారము గలిగించు "పరోక్షకరములు— Indirect Capaxes" జీవనమున కత్యావశ్యకములగు సామాన్యాహారపదార్థములపై వేయక, కేవల భోగపదార్థములపైనే వేయవలెను. అట్లు చేయుటవలన బీదల కిబ్బాధయు నుండదు. ధనవంతులగు భోగపరాయణు లట్టిపదార్థము లెంతడబ్బుపెట్టియైనను గొనఁగలరు. ఇట్టి యప్రత్యక్షపుఁ బన్నులవలన దేశపు టాదాయము హెచ్చగును. చివర కాపన్నులు చెల్లించువారు భోగులగు ధనికులే కనుక, వారి కవి చెల్లించుచున్నట్లే కాన్పింపదు. అది పూవు లెఱుఁగకుండఁగనే, తేఁటి పుష్పమరందముఁ గ్రోలినట్లుండునని పూర్వులు చెప్పినారు.

శి:—యథాన్యాయముగాఁ బరిపాలించుకొనఁ దలఁచు రాజు బహుజాగరూకుఁడై యుండవలె నన్నమాట.

గు:—ఔను నాయనా! అందుచేతనే "రాజ్యాంతమందు నరకము ధ్రువము" అన్నారు పెద్దలు. సామాన్యకుటుంబియగు సంసారియే, ధనార్జనములో కంటెఁ దద్వినియోగములో నెక్కువ తెలివి తేట లగపఱుపవలెనుగదా, యిఁక దేశకుటుంబియగు దేశాధిపతి యెంత తెలివి తేట లుపయోగింపవలెనో యోజించుకొనుము. పన్నురూపముగావచ్చు ప్రతిరూపాయయును ప్రజాపదార్థోత్పాదన పాటవ మెక్కువచేయుచున్నదో లేదో యతఁడు కనిపెట్టుచుండవలెను. ధనబలము గలవారినుండి విశేషముగా డబ్బులాగి బలహీనులగు దరిద్రులను బోషించుచుండవలెను; విత్తవంతులనుండి గ్రహించిన విత్తముతోఁ బామరులలో విద్యావ్యాప్తి గావింపవలెను. అంతేకాని పేదలను బాధించు పన్నులు వేసి, యవి ధనవంతులను ధనవత్తరులఁ జేయుట కుపయోగించుట యవివేకము, అధర్మము, చివర కది యాత్మవినాశ హేతువుకూడ నగును. అబ్ధినుండి యత్యధికమైన జలము ఆవిరిగాఁ బైకి బోయి వర్షరూపమునఁ గ్రిందఁ బడి యల్పజలాశయములను బుష్టము చేయుచుండుట లేదా?

పరిపాలనము బాగుగా నడపుటకైనను యుక్తవ్యయమే చేయవలయునని కుమారప్ప పండితుఁ డింకొక హితోపదేశము చేసినాఁడు.

శి:—మంత్రి బృందముల వేతనము లధికము చేసి చిన్నచిన్న యుద్యోగుల గొంతుకలు గోయుమనియా?

గు:—కాదు, పరిహాసములు కట్టిపెట్టి పండితుని వాక్యములు శ్రద్ధతో వినుము:—

రాబడిని బట్టి గృహస్థుఁడు నవుకరుల నెట్లు పెట్టుకొనునో, దేశముయొక్క ఆదాయమునుబట్టియు, దేశ

భాగ్యమును బట్టియుఁ, బన్నులు చెల్లింపఁగల ప్రజా శక్తిఁ బట్టియుఁ బ్రభుత్వ పరిపాలనపు టేర్పాటులు గావించుకొనవలయును. రాజ్యాంగ వ్యాపారము చక్కగా గడియారమువలె నడచుచున్నది గదాయని యమిత వ్యయము చేయఁగూడదు. పరిపాలనపు ఖర్చు ప్రజలు సునాయాసముగా భరించుటకై, యది దేశమునందలి మనుష్యుని సగటాదాయమున కిన్ని రెట్లుండవలయును— అని యొక్క కఠిననియమము చేసికొనుట మంచిదని కుమారప్పగారు చెప్పుచున్నారు. అట్లు చేసికొనునెడల, భిన్న దేశ ప్రజా సామర్థ్యములలోఁ గాని, భిన్న దేశ వస్తుమూల్యములలోఁగాని కన్పట్టు భేదము దానియంతట నదియే యంతరించి పోవునట. రాజ్యము విత్తవీర్య సుఖసంపన్నముగావించుట కవశ్యాలంబనీయములగు సూత్రములివ్వియని యాయన యీ పత్రికలోఁ వ్రాసినాఁడు.

శి:—అయ్యో! అప్పుడే ముగించినాఁడా?

గు:—ఇంతంతే యున్నది. మనదేశమాత మహా వైభవ మనుభవించిన చంద్రగుప్తుఁడు అశోకుఁడు మున్నగు చక్రవర్తుల కాలముమాట యెత్తుకొనక, బ్రిటిషురాజ్యమునకు సన్నిహిత పూర్వమున హిందూదేశపు టార్థికస్థితి యెట్లుండెనో సప్రమాణముగ ముందు పత్రికలోఁ బ్రకటించెదనని కుమారప్పగారు చివర వ్రాసినారు.

శి:—అటైన నింకొక గురుశిష్యసంవాదమునకు సామగ్రి యున్నది.

గు:—సామగ్రి కేమికొదవ! పనిగట్టుకొని నీవు వచ్చుచుండ వలయును, అప్పుడు నా కారోగ్యమును, తీఱికయును నుండవలయును.

శి:—శ్రమయిచ్చినందులకు క్షమించి యిఁక నాకు సెలవిండు. నమస్కారము.

గు:—శుభమస్తు! సుఖీ భవ!

ధనికవ్రాతము లోభసంక్షుభిత చేతస్సారమై దిక్కుగా
నని చందంబున సంభ్రమింపఁ, గలదానిన్ నిత్యతృప్తుండనై
ఘనులన్ వేఁడక యల్పులన్ దెగడ కేకార్పణ్యమున్ లేక మే
లొనరన్ హర్షసుధాతరంగముల నే నోలాడు టింకెన్నఁడో!

ఘనకీర్తి ప్రియులైన తోడికవు లుద్గ్రంథంబులన్ వ్రాయ నే
ప్రణుతుల్ గోరక విశ్వరూప పటుకావ్య శ్రీపరామర్శనం
బునన్ దత్కర్త మహత్త్వమున్ దెలియుచున్ ముక్త ప్రబంధుండ నై
యొనరన్ హర్షసుధాతరంగములనే నోలాడు టింకెన్నఁడో!

ఫలసంగంబు పరిత్యజించి యెది విశ్వశ్రేయమో దాని న
గ్గలికన్ సల్పుచు, సంధ్యలన్ జగదలీకత్వంబు దర్శించుచున్
వెలి సంరంభిని లోఁ బ్రశాంతుఁడనునై విశ్వైకరంగంబునం
దలఘు ప్రౌఢి నటత్వమున్ నెఱపు నాహ్లాదంబు నాకెన్నఁడో!.

శీతోష్ణంబులు, సంపదాపదలు, నాశీశ్శాపమున్ ఖ్యాత్య వి
ఖ్యాతుల్ మేనికిఁగాని, లేవు మఱినాకంచుం బ్రబుద్ధుండనై
ద్వైతాద్వైత విభేద శూన్య విమల స్వారాజ్య సింహాసనం
బాతంకం బఱనెక్కి నిర్భరతనే హర్షించు టింకెన్నఁడో!.

తను భిన్నంబగు తత్త్వమే ననుట ప్రత్యక్షంబుగాఁ దోఁప, మి
త్త్రిని మిత్త్రిమ్ముగ నిష్టబంధ విరహార్తిన్ బెన్వినోదమ్ముగాఁ
గనుచున్, బ్రాణులకెల్ల నియ్యమలవిజ్ఞానంబు చేకూర్చి, యో
ణిని నిర్వాణ సుఖైక రాజ్యమును నే నెక్కొల్పు టింకెన్నఁడో!.



దోమసాని కథ

అయ్యగారి సత్యనారాయణమూర్తి గారు, బి. ఏ.

అనగనగా దోమసాని ఒకటి ఉండేది. మంచి మొగుణ్ణి వెతుక్కుంటూ కంచికి ప్రయాణ మైంది. కంచికి వెడుతుంటే దోమసానికి ఏనుగు ఎదురైంది. ఏనుగు "దోమసానీ! దోమసానీ! ఎక్కడికి వెడుతున్నావు" అని అడిగింది దోమసానిని. దోమసా నందట "మంచిమొగుడికోసం కంచి కెడుతున్నా" నని. అంటే "నన్ను పెళ్లిచేసుకోరాదా" అని ఏనుగందట. అందుకు దోమసానందట "ఏనుగట! ఎత్తుకాళ్లట, తిన్నట, నేనట, పెళ్లాడాలట, అయ్యో! నాబ్రతుకో బ్రతుకు" అని. ఏనుగు వెళ్లిపోయింది. దోమసాని మొగుడికోసం కంచికి ఇంకా వెడుతూనేఉంది. కొంతదూరం వెళ్లిన తరువాత లొట్టిపిట్ట ఎదురుగుండా వచ్చిందట. లొట్టిపిట్ట అందట "దోమసానీ! దోమసానీ! ఎక్కడికి వెడుతున్నావు" అని. "మంచిమొగుడికోసం కంచి కెడుతున్నాను" అని దోమసాని బదులుచెప్పిందట. అంటే "నన్ను పెళ్లిచేసుకోరాదా" అని లొట్టిపిట్ట అందట. అందుకు దోమసాని "లొట్టిపిట్టట! లొవంకట, తిన్నట, నేనట, పెళ్లాడాలట. అయ్యో! నాబ్రతుకో బ్రతుకు" అని అంటట, దోమసాని యింకా వెడుతూనేఉంది. వెడుతూ ఉంటే గుఱ్ఱం ఎదురొచ్చింది; "దోమసానీ! దోమసానీ! ఎక్కడికెడుతున్నా"వని అడిగింది గుఱ్ఱం. "మంచిమొగుడికోసం కంచి కెడుతున్నా" నంది దోమసాని. అందుమీాదట "నన్ను పెళ్లిచేసుకోరాదా" అని అడిగిందట గుఱ్ఱం. అంటే "గుఱ్ఱమట! గుదికాళ్లట, తిన్నట, నేనట, పెళ్లాడాలట, అయ్యో! నాబ్రతుకో బ్రతుకు." అందట దోమసాని. దోమసాని ఇంకా వెడుతూనేఉంది. ఇంతలో కోతి ఒకటి ఎదురువచ్చింది. "దోమసానీ! దోమసానీ! ఎక్కడి కెడుతున్నావు" అని అడిగింది కోతి. దోమసాని అంది "మంచి మొగుడికోసం కంచి కెడుతున్నా" నని. కోతి అంది "నన్ను పెళ్లి చేసుకోరాదా?" అని. దోమసాని "సరే" అని ఆ కోతిముక్కులో దూరి గులగుల లాడడం మొదలుపెట్టిందట. కోతి ముక్కు నలుపుకొంటూ వడ్లవాడి ఇంటికివెళ్లి "వడ్లవాడా! వడ్లవాడా! ముద్దుల పెళ్లాం ముక్కులో దూరింది; ముక్కుచెక్కరా వడ్లవాడా" అని అడిగింది. వడ్లవాడు కోతిముక్కు చెక్కివేశాడు. అంతట దోమ తుర్రుమని ఎగిరి పోయింది.—

కథ కంచికివెళ్లింది, మనం ఇంటికి వచ్చాం.



కీ. శే. గురుజాడ వేంకటప్పారావు గారు

మిణుగురులు

(పిల్లల గీతములు)

కీ. శే. గురజాడ వెంకట అప్పారావు గారు,
బి. ఏ., ఎఫ్. యమ్. యు.

౧

మల్లెలు మొల్లలు పూచేవేళ
చల్లనిగాలులు వీచేవేళ
మేనుల గంధం బలదేవేళ
ఉరుములు మెరుపులు మెరసేవేళ
తొలకరివానలు కురిసేవేళ
మామిడిపండులు పండేవేళ
మన్మథబాణం మ్రోగేవేళ
మగువల మనసులు క్రాగేవేళ.

౨

బూరుగుచెట్టు
చిలకలతోను
ఏమని పలికింది
పండిన పండు
ఎండిన దూదై
పకపక నవ్వింది.

౩

చిలకల్లార!
చిలకల్లార!
కలవలతోను,
ఏమని పలికారు?
కలవల్లార!
కలవల్లార!
రాజు వచ్చెను,
కన్నులు విప్పండి.

కలవల్లార!
కలవల్లార!
రాజు గ్రుంకెను,
కన్నులు మూయండి.

౪

అరిటికాయబజ్జి,
మినప్పప్పు సొజ్జి,
కలసి మెలసి తిందాం,
కథలువిథలు విందాం.

౫

ఏనుగు ఎక్కి మనము
ఏవ్వూ రెళదాము?
ఏనుగు ఎక్కి మనము
ఏలూ రెళదాము.
గుఱ్ఱం ఎక్కి మనము
ఏవ్వూ రెళదాము?
గుఱ్ఱం ఎక్కి మనము
గుంటూ రెళదాము.
మోటా రెక్కి మనము
ఏవ్వూ రెళదాము?
మోటా రెక్కి మనము
మోటూ రెళదాము.
వెన్నుని ఎక్కి మనము
ఏవ్వూ రెళదాం?
వెన్నుని ఎక్కి మనము
వైయ్యాళ్ చూదాము.

ఆంధ్రుడు

భావరాజు వేంకట కృష్ణారావుగారు, బి.ఏ., బి.ఎల్.

భారతఖండములో వున్న అన్ని రాష్ట్రాలతో పాటు ఆంధ్రరాష్ట్రముకూడా అన్నివిషయాలలోనూ అన్ని ఉద్యమాలలోనూ ఏమీ లోటు రానీయకుండా ముందడుగు వేస్తూయున్నదని ఆంధ్రుడు దూరికే ఉప్పొంగి పోతూవున్నాడు. కాని ఆంధ్రదేశము అన్ని విషయాలలోనూ సరిగా ఆలోచించి చూస్తే యెంత వెనకబడియున్నదో గమనించ లేకుండా వున్నాడు. తెలుగు భూమిపేరు చెప్పితే సగంకంటె పైగా వున్న దేశం అభాగ్యస్థితిలోనే వున్నది. దేశమంతా రెండు మూడుచీలికలై కళదక్కి స్రుక్కి ఉన్నది. ఒక శీర్ణభాగం నైజాం యిలాకాలో చేరి ఉన్నది. కొంత భాగం బ్రిటిషు పరిపాలనలో వున్నా చాలావిషయాలలో వెనకబడి ఉన్నది. మూడవభాగము, ఆంధ్రుడింకా కన్ను విప్పి తేరిచూడని ఏజన్సీసీమ అయివున్నది. ఈ మహాంధ్రభూమిలో చదువను వ్రాయనూ నేర్చినవారు నూటికి సగటున ఏడ్గురుకంటె ఎక్కువమంది లేరు. అటైనా యితరరాష్ట్రాలతో పరిపోల్చి చూస్తే ఆంధ్రరాష్ట్రానికీ తీసికట్టే అని అనిపిస్తుంది. పట్టుమని నలుగురుకలసి ఒకపని చేద్దామంటే కలవడానికి తగినచోటు, ఓరాజధాని నగరము, ఓ ప్రత్యేకరాష్ట్రం, లేదు. సొంతమంటూ ఏదీ లేదు! ఇంతవఱకు మన ఆంధ్రుడికి. కాని ఎందులకో తాను చాలాగొప్పవాడననుకుంటూ, తనకేమీ లోటు లేదనుకుంటూ, మైమఱపుతో, తెలివియెఱుగని ఆనందముతో, ఆంధ్రుడు పొంగిపోతూవున్నాడు. ప్రతీదానికీ తాను తగుదునయ్యా అని ముందు కొస్తువుంటాడు. మళ్లీ అంతలోనే వెనకంజకూడా, సంకోచము లేకుండా, వేస్తుంటాడు. తన్నుతానే మోసగించుకుంటున్నాడు. పాపము అతడు ఒక్కనాటయినా తనహృదయములో తన చర్యలో తన ప్రజ్ఞను పరిశీలించుకోవడు. పరిశీలించుకోవడానికి అతనికి కావలసినంత దురభిమానము. దురభిమానముతో పాటు సోమరితనము, యేమరుపాటు సాహచర్యంగా వస్తూనేవున్నాయి. జాగ్రతగా, కన్నులు తెరచి, అన్నిసంగతులు స్వయంగానే చూచుకుని చక్కబెట్టుకుంటూవుంటేనే ఎప్పుడూ సరిగా వ్యవహారం నడువని యీనాడు ప్రపంచములో, పుట్టెడు దురభిమానముతో, అహంభావముతో, ఒడలు మరచి, "నాకేమి లోటురా!" అని అనుకుంటూ, కన్నులు మూసుకొని, పొరుగువాడి కరసాహాయ్యం చూచుకొని ముందూ వెనకా, గోతులు గట్లూ చూచుకోకుండా గొర్రెపోతులాగున తలవంచుకొని వెళ్లేవాడికి ఈ జీవితం అసలే సరిగా సాగదు. సరిగా సాగుతున్నదని భ్రమించడం శుద్ధ తెలివితక్కువ! లోపలి తెలివితక్కువని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేయడం, తన్ను తా మోసగించుకోవడమవుతున్నది. లోకంలో నిరంతరమూ ఆత్మవంచన చేసుకొని జీవించేవాళ్ల భ్రమలకు లోనై జీవితం సుఖప్రదమైనదని ఎవ్వరూ అనరు. పైగా ఎపుడో ఒకప్పుడు చేటుమూడక తప్పదు.

ఏదైనా వకవస్తువును చూచి దాన్ని తనకు కావలెనని, యిచ్చినదాకా మారాముపట్టి ఏడుస్తూవుండే బాలుడు జ్ఞాపకంవస్తాడు ఆంధ్రునిగురించి యెపుడయినా పర్యాలోచన చేసినపుడు. ఏవస్తువునిగురించి పసివాడు ఏడుస్తూవుంటాడో దాన్ని వాడికివ్వడానికి వీలు లేనప్పుడు, బిడ్డను మరపించడానికి మరొక పనికిరాని వస్తువును జూపించి తల్లి వానిదృష్టి మరలింప జేస్తువుంటుంది. అంతట బిడ్డ యేడుపు మాని కన్నీటి కండ్లతోనూ, ఆశ్చర్యముతోనూ క్రొత్తవస్తువుని పరిశీలిస్తూ, అదివరకు తనకు కావలెనని పట్టు, బట్టి ఏడుస్తువున్న వస్తువుమాట మరచిపోతాడు. ఆంధ్రు డిలాటి బాలుని వైఖరివాడవటానికి ఏమాత్రం సందేహింప నక్కరలేదు. లేకుంటే ఎన్నాళ్ల క్రితమో తనకు కావలెనని గోలపెట్టి, ఆందోళనచేసి, యిపుడు మరియొక ఆందోళన తనమనసు ఆకర్షించడంచేత తనపూర్వపు ప్రత్యేకాంధ్రరాష్ట్రోద్య

మను మాట మరచిపోవడము ఏలాగున సంభవించగలదు? శిశువుయొక్క అమాయకత్వము, ఏడ్పు మానియుండడము చూచేవాండ్లకు ఆనందదాయకమే, కాని బిడ్డకు మాత్రము అనర్థదాయకము. మన ఆంధ్రుడిట్టి పసిబిడ్డవలెనే మధ్యమధ్య మొదటి దానిసంగతి జ్ఞాపకమునకు వచ్చినపుడు ఒక్కక్షణకాలము టక్కుమొగము పెట్టి అది కావాలని అడుగుతాడు. మళ్లీ ఏదో మరపు మేఘం ఆవరించే సరికో, లేకపోతే యెవళ్లయినా కోపగించే సరికో ఇంకోదానికై ప్రాకులాడుతూ ఉంటాడు. ఆంధ్రుడికి కొంతదూరం సాగేటంత ఉత్సాహం, ధైర్యం వెన్నాడి ఉంటాయి గాని, కార్యసానుకూలం అవకుండా సంశయం, మొగమాటం, భయం ఎక్కడనుండో తనుముకొనివచ్చి ముందున్న వాటిని వెనుకకు లాగుకుంటాయి. వయసుబట్టీ, ప్రాచీనమై గౌరవప్రదమైన చరిత్రనుబట్టీ ఆంధ్రుడు చాలా ప్రాజ్ఞుడనీ, మహానుభావుడనీ లోకులంతా అనుకుంటారు. కాని అమాయకపు ఆంధ్రుడు, వయసుచేత వాటిల్లిన బుద్ధి చాపల్యముచేతనో, లేక తన పూర్వపు చరిత్రమును అంతా సంపూర్ణంగా మరచిపోవడం చేతనో, ఇప్పుడు మతిస్థిమితము చాలక, రెండవ బాల్యావస్థయందు పొరలాడుతున్నాడు. ఆంధ్రుడి క్రీడాజాలలో నిండు జవ్వనములో వుండవలసిన దేహసౌష్ఠవము, ఉత్సాహబలము, మంచి ప్రౌఢ నిర్భరవయఃపాకమున ఉండవలసిన బుద్ధిబలమూ, దేహ దారుఢ్యము కనబడడము లేదు. ఆంధ్రుడికి ఆత్మపరిశీలన లేదు. తాను బుద్ధిసంపదలో ఇతర రాష్ట్రముల వారికంటె మిన్నయని అనుకొంటున్నాడు గాని, సరిపోల్చుకొని చూచి పరిశీలించుకొనడం లేదు. నిజం ఆలోచిస్తే వారిముందట ఆంధ్రుడింకా బాల్యావస్థలోనే వున్నాడు. మనవారు ఆంధ్రుడు ప్రకటిస్తూ ఉన్న ఉత్సాహం చూచి అది నిజమైన బుద్ధిబలమువల్ల జనించిన ఉత్సాహతేజముని భ్రమసిపోతున్నారు. ఇది తెలిసీతెలియని ఆత్మవంచనము క్రింద పరిణమిస్తూ వున్నది. ఆంధ్రుడికి ధీరత్వముగాని గాంభీర్యముగాని వున్నట్లు ఎక్కడా ప్రకటితము కాలేదు. ప్రజ్ఞ చూపించడము, ప్రతిజ్ఞ చెల్లించుకోవడము ఆంధ్రుడికి ఉన్నట్లు మనలను భ్రమియింపచేయడమే గాని ఫలితార్థము అన్వేషింపవచ్చేటప్పటికి అదృశ్యమయిపోతున్నాయి. ఇది అందరికీ అనుభవైకవేద్యమే. ఉదాహరణము లనవసరము. కడచిన యీపాదశతాబ్దములోనూ ఆంధ్రుడు ధీరుడై, గాంభీర్యముతో, స్థిరచిత్తము గలిగి తనప్రతిన చెల్లించుకొని నిర్వహించిన ఘనకార్యమొకటయినా కనిపించడములేదు. మనకీ ధీరత్వము, గాంభీర్యము, స్థిరచిత్తము లేకపోవుటచేతనే దేగాని కిన్ని పాట్లు సంభవిస్తున్నాయని అనుమానం కలిగిస్తూ ఉన్నది. ప్రజ్ఞ, బుద్ధి, శీలవిషయంలో ఆంధ్రుడింకా బాలుడేయని చూపించడానికి గుప్పెడు నిదర్శనాలున్నవి. వీటిని విప్పిచెప్పితే ఆంధ్రుడికి ఎక్కడా లేని దురభిమానము పాలపొంగులా వస్తుంది.

హృదయం చీల్చి చూస్తే, నిజంగా ఆంధ్రుడికి దేశమంటేనూ, ఆంధ్రులంటేనూ ప్రేమ, గౌరవము, అభిమానము లేశమయినా లేవు. ఆంధ్రుడికి దేశం అంటే ఏమిటో కూడా అవగాహన కాలేదు. "దేశమంటే మట్టిగాదోయి! దేశమంటే మనుషులోయి!" అని తెలియడం లేదు. తెలుగుభాష మాటాడే పన్నెండు బ్రిటిషు జిల్లాలు, ఆరు నైజాంగారి జిల్లాలు కలిసి ఆంధ్రదేశం అవుతుందని తెలిస్తే తెలియవచ్చును. కాని ఆంధ్రదేశమంటేయేమిటో, ఆంధ్రప్రజ, ఆంధ్రభాష, ఆంధ్రులచరిత్ర, ఆంధ్రనాగరికత, ఆంధ్రసాంప్రదాయములు అంటే ఏమిటో, వాటిపై అభిమానం అంటే ఏమిటో నిజమైన మూలతత్వం ఇంకా ఆంధ్రునికి బోధపడినట్లు కనబడదు. నేను ఆంధ్రుడనని ఊరికే గర్వించిపోతాడు. ఎందులకో? అట్లా మురిసి గర్వించి పోతూవున్నప్పుడు హృదయంమాత్రం ఇసుమంతైనా చలించదు! ఆంధ్రుడికి ఇంతవరకు దేశం అంటే హృదయం చలించడం లేదని, ఆ విషయమై అతడు చింతన చేయడం లేదనీ ఉదాహరణ ఒక్కటి చూపిస్తాను. నెల్లూరిలో పినాకినిచెంత ఆరు నూరేండ్ల క్రిందట పుట్టి వర్ధిల్లిన కవిబ్రహ్మ తిక్కనసోమయాజి హృదయంలో ఏభావం జనించి, రగిలి, జ్వాలవలె పైకెగసి ఆపాదమస్తకమూ ఆమహానీయుణ్ణి మహాభారతము పదిహేను

పర్వాలు వ్రాసి ముగించినదాకా దహించివేసిందో ఆంధ్రు డొకసారి తెలుసుకొని గ్రహించాలి. అంతే కాదు, అనుభవంలోకి తెచ్చుకొని ఆనందించాలి. భారతరచనకు దొడగిన యాతడు అది "అనన్య సామాన్యకరణంబగు పరమ ధర్మప్రకారంబు" అని చింతించి,

ఉ. "కావున భారతామృతము
 కర్ణపుటంబుల నార గ్రోలి యాం
ధ్రావలి మోదమున్ బొరయు
 నట్లుగ సాత్యవతేయు సంస్మృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్త
 ముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్య
 ములన్ రచియించెదం గృతుల్."

అని మహోత్సాహంతో, స్థిరచిత్తముతో, దేశముపై అపరిమితమయిన అనురాగముతో, అభిమానంతో కవిబ్రహ్మ గంటం బట్టి వ్రాయడం మొదలుపెట్టినాడు. నేటిదాకా—నేటివరకు అన నేమిటికి! ఆచంద్రతారార్కం, ఆంధ్రభాష యీపృథివిపై వెలసియున్నంతవఱకు తిక్కనసోమయాజి మహాభారతకావ్యశరీరంతో కోటిసూర్యప్రభతో వెలిగిపోతూ, ఆంధ్రుల కృతజ్ఞతానమస్కారము లందుకొంటూ వుంటాడు. ఇక యీ చిత్రం చూడండి! చేతిలో అధికారము పెట్టి, మంచి జీత మిచ్చి, 'ఆంధ్రావలి మోదమున్ బొరయునట్లుగ' నిర్వహింపుమని యొక్క మహాంధ్రసంస్థను తన కొప్పగించినంతమాత్రాన మన ఆంధ్రు డేమి చేసినాడో కన్నులు విప్పి ఒకసారి పరికించండి. పాలు కుడువవచ్చిన లేగదూడల మూతులు బిగియగట్టి, వాటికి బాధాకరమగునట్లుగా గోవుతో చెలగాటము లాడి వేధించుచున్నాడు. ఆంధ్రావలి హృదయం వ్రయ్యచేస్తున్నాడు. కన్నబిడ్డ లాకటి చిచ్చుచే మ్లానముల మాడుచు అన్నమో రామచంద్రా యని యేడ్చుచు దిక్కుమాలియుండ వండిన వంటకములన్నిటిని, కలి అంబలితో సహా పొరుగింటి బాలురకు కొక్కసనుగునట్లుగా మెసవబెట్టిన యిల్లాలి నెవరు ప్రశంస చేయుదురు? అది ఔదార్య మనిపించుకొనునా, లేక హృదయదౌర్బల్య మనిపించుకొనునా, లేక ఏమనిపించుకొనును? తనకు మాలిన ధర్మము, మొదలు చెడ్డ బేరము లేదందురు. కాని అది యీనాటి ఆంధ్రులలో వ్యక్తమవుతూ వున్నది. చూడండి, మరియొక ఆంధ్రు డేమి చేయుచున్నాడో. తెనుగుభాషకు వ్యుత్పత్తిశాస్త్రమును సమగ్రముగా రచియింపగల సమర్థుడై ఉండిన్ని తన యవసానకాలము కొంచం 'ఆంధ్రావలి మోదమున్ బొరయునట్లుగ' వినియోగించక, తన ఆంధ్రభాషాపాండిత్యమును, విజ్ఞానమును చెదలుపట్టి పాడయిపోవుచున్న చిన్నకాగితపు ముక్కలపాలుచేసి, తనకంటబడకుండా వాటిని దేవదారు పెట్టెలో పెట్టి, పొరుగింటి కొంకజాతులవారి గాసటబీసట భాషకై తన జీవితశేషసర్వస్వమును జంకును గొంకును లేక ధారపోస్తున్నాడు. వీరిద్దఱహ దేశాభిమానం, ఆంధ్రప్రజపై ప్రేమ యేమయినా వున్నవా? లేక చచ్చి చెడి జీర్ణమయిపోయినవా?

ఇలాంటి పెద్దమనుష్యులను ఎందరనో ఎత్తిచూపించవచ్చును. ఆంధ్రుడికి నామాటయం దింకా విశ్వాసము పుట్టక సంశయించినట్లయితే ఉదాహరణ లెత్తి ఎన్ని చూపించినా ఇంక అట్టే ప్రయోజనం కనబడదు. వండినపదార్థము రుచిచూడడానికి అంతా భుజింపనక్కరలేదుకదా! మనఆంధ్రుని కొఱకు,

"స్వంతలాభము కొంతమానుకు(ని)

* * * *

దేశాభిమానం నాకు కద్దని
వొట్టిగొప్పలు చెప్పుకోకోయి
పూని యేదైనా ఒకమేల్
కూర్చి జనులకు చూపవోయి."

అని హృదయం నలించి దేహం పులకాంకిత మయ్యేటట్టు పాడి స్వర్గస్థు డైనాడు కవిశేఖరుడు. చెవిటివాని చెంత శంఖము పూరించిన నెంత ప్రయోజన మున్నది! ఇటువంటిపాటలు జీవం ఒలికేవి ఎన్ని, ఎంత శ్రావ్యముగా, ఎంత మనోహరముగా పాడితే నేమిప్రయోజనము! ఆంధ్రుని హృదయంమాత్రం చలించడము లేదు.

ఆంధ్రుడి దురదృష్టం కొద్దీ కాబోలు 'మరపు' ఒకటి పుట్టుకతోనే పిత్రార్జితమైన ఆస్తివలె ప్రతివానికీ సంక్రమిస్తున్నది. క్షణక్షణానికి పరాకు రావడం, తనస్థితి మరచిపోతూవుండడం కూడా మనదురదృష్టపు ఆంధ్రుడి బాల్యావస్థనే సూచిస్తు ఉన్నవి. ఆంధ్రుడు హంపీక్షేత్రం దగ్గర తుంగభద్రానది యొడ్డున పుట్టినా, లేక పినాకినీనది ప్రవహించుసీమలలో జననమొందినా, లేక నాగావళీ వంశధారానదులు పొంగి పొరలి పారే దేశంలో ఉద్భవించినా, ప్రశాంతంగా, లేక గంభీరంగా ప్రవహించే గోదావరీ సహ్యజానదులకు ఇరుపార్శ్వాల నున్న సీమలలో వెలసినా, కాక, నైజాముగారి పాలనలో వున్న త్రిలింగభూమిలో జన్మించినా, ఆంధ్రభాష మాతృభాషగా మాట్లాడుతూ, ఆంధ్రదేశంలో పుట్టిన ఆంధ్రుడే అవుతున్నాడు గాని అన్యుడు కావడంలేదు. ఈమహాంధ్రభూమిలో యేమూలపుట్టినా, ఏమూల పెరిగినా ఆంధ్రుడు ఆంధ్రుడనియే పిలుచుకొనుచున్నాడు. ప్రతి ఆంధ్రు డింటిలోనూ ఆంధ్రభాషే వినబడుతూ ఉన్నది. పూర్వకాలమున విరాజిల్లిన ఆంధ్రకీర్తికాంతుల న్నియు ఆంధ్రులరక్తములో కలిసి, ప్రాచీనఆంధ్రనాగరకత, సాంప్రదాయములు, ఆచారములు, ఆంధ్రచరిత్రలతో పాటు ప్రతి ఫలిస్తూ, యెటు చూచినా ఆంధ్రత్వమే ఆవరించి, ప్రతిక్షణము ఉత్సాహ తేజములు కలిగిస్తూ యున్నవి. ఆంధ్రు డెక్కడ పుట్టినా తాను ఆంధ్రుడనని గర్వించిపోవాలి. గంజాంలో పుట్టిన ఆంధ్రుడికి, అనంతపురంలో పుట్టిన ఆంధ్రుడికి, ఓరుగంటిసీమలో జన్మించిన ఆంధ్రుడికి మాట్లాడేభాషలో స్థానిక వ్యత్యస్తము లుంటే వుండవచ్చును, గాని అందరు ఒక్కజాతివారమే యని ఒకరినొకరు ఎరమరిక లేని స్నేహంతో, సోదర భావంతో ప్రేమించుకోవాలి. ఎన్నిమాటలు చెప్పితే నేమి ప్రయోజనము? కండ్లులేని వానికైనా దేవుడు మతి యిస్తే ఎక్కడవున్న వస్తువైనా అంతర్దృష్టికి తన తేజోమూర్తితో కనిపిస్తుంది గాని మతి లేకపోయినపుడు కన్నులు గలవాండ్లకైనా దిక్కులంతా ఆవరించి వెలుగుచున్న తేజఃపుంజము కనిపించదు. శుక్లపక్షము నాటి సప్తమచంద్రాకృతి గలిగి మనోహరమై నిగ్గులు తేరి తేట వెన్నెలలు ప్రసరింపచేసే తెలుగుభూమి తెలుగువారి ప్రభతో, ప్రాచీనగౌరవముతో వెలిగిపోవుచు, కన్నులకు మిరుమిట్లు గొలుపుచు, హృదయానికి ఆవేశము, ఆనందము కలిగిస్తూ ఉత్సాహం పోస్తువుంటే, మన తెలివి తక్కువ ఆంధ్రునికి కన్నులున్నా కనిపించక పోవడము దురదృష్టము కాక మరియేమి? ఆంధ్రదేశంయొక్క విశ్వరూపము ఆంధ్రునికి విశాలనేత్రములకు హృదయదౌర్బల్యం చేత కలిగిన అంధత్వము ఆవరించడంవలన కనబడడం లేదు. రాయప్రోలు సుబ్బారాయకవి గానము చేసినట్లు శాతవాహనుల ప్రాభవమును మాటిమాటికి స్మరణకు తెచ్చేటు కృష్ణానదీతటము, చాళుక్యుల నాగరకతా గౌరవములు తన కడుపులో దాచి గంభీరంగా ప్రవహించే గోదావరియు, పల్నాటివీరుల సాహస వీరకృత్యములను దలపునకు దెచ్చే కార్యమపూడి రంగమును, తిక్కకవి నాథుడు తిక్కచమూపతులు వెలసి ఆంధ్రవీరుల ప్రతిభా శౌర్యములు లోకమునకు చాటిన పుణ్యభూమియు, కాకతీయుల వైభవము మాటిమాటికి ఘోషించు ఓరుగంటి సీమయు, దక్షిణహిందూదేశ సురత్రాణులకు ఆటపట్టయి అలరారి మహదైశ్వర్యమును చవిచూచిన విజయనగర సీమయు తెలుగునాటిలోనివే! ప్రసిద్ధి గన్నట్టి ఒక పట్నం, ఒకపల్లె, ఒకతావు, ఒకకొండ, ఒక ఏరు, ఒకమహోదధి యెక్కడున్నా సరే, ఆంధ్రదేశంలో తెలుగు వారికందరికి అది సమానమైనహక్కు కలిగించి గౌరవము కలిగించు చున్నది. పోతన్న ఒంటిమిట్టవాడైతే నేమి, ఓరుగంటివాడైతే నేమి, వేములవాడ భీమకవి దాక్షారామవాస్తవ్యుడైతే నేమి, నైజాంమండలవాసి యైతే నేమి? దురభిమానం పెట్టుకొని నిజమైన గౌరవప్రేమ చంపుకొని ప్రవర్తిస్తాడు ఆంధ్రుడు. ఎక్కడ వుండినా, ఎక్కడ పుట్టినా, పోతన భీమకవులు ఆంధ్రదేశం అంతటికీ సమానమైన గౌరవార్హులే! ఈపిచ్చి తల యెక్కడం చేతనే కాబోలు ఆంధ్రవిశ్వవిద్యాపరిషత్తు మావూళ్లో వుండాలి, మాజిల్లాలో వుండాలి, వుంటేనే గాని సంపూర్ణమైన ఆంధ్రత్వం దానికి ప్రాపించదు అని ఆంధ్రుడు గందరగోళము చేయుచున్నాడు. అది పుట్టి ఆరేండ్లయినా పట్టుమని నిలవడానికి నీడ ఉండీ లేకుండా తిరుగుచున్న

మై, త్రిశంకు స్వర్గవైభవము ననుభవిస్తూ యున్నది. ఆంధ్రదేశాభిమానం క్షణికమైన దౌర్బల్యమునకు లొంగి పోయి ఆంధ్రుని చంచలచిత్తవృత్తికి కన్నీటితో దాస్యం చేస్తూవున్నది. మహేంద్రగిరివద్ద పుట్టిన ఆంధ్రునికి బెజవాడలో పుట్టి పెరిగిన ఆంధ్రునికి కృష్ణా అమరావతులపై ఎంత అభిమాన గౌరవ ప్రేమలు ఉంటాయో, అంతా ఉండితీరవలెను. ఆంధ్రకవితాకన్యను తొలి కాలమున వెలయింప జేసిన గోదావరీ సైకతములను తిలకించి రాజమహేంద్రపురవాసి పులకితగాత్రుడై యెంత పొంగి పొరలిపోతాడో అనంతపురం, చిత్తూరు, కృష్ణా మండలవాస్తవ్యులును అంతగా పులకాంకితులు కావాలి. ప్రతితావునందు, ప్రతి ఆంధ్రునియందు ఆంధ్రావళి యొక్క విశ్వరూపము ఆంధ్రుడు చూడగలిగిన నాడే– ఆతనికి నిజమైన దేశాభిమానం ఉన్నదన్నమాట! ఇపుడు ఆంధ్రుని కున్నదల్లా దూరదృష్టి లేని దురభిమానం, ప్రతి విషయంలోనూ చిన్నచూపు. స్వగ్రామాభిమానం స్వంతాలూకాభిమానం, స్వాభిమానం నానాటికి ప్రబలమవుతూ నిజమైన దేశాభిమానం క్రింద చెల్లుబడి అవుతున్నాయి.

తెలివితక్కువ ఆంధ్రుడీనడుమ క్రొత్త విద్య యొకటి నేర్చుకున్నాడు: ఆంధ్రంలో ఏమీ గొప్ప లేదనీ, ఆంధ్రదేశం గొప్పవీరులను కనలేదనీ, ఆంధ్రభాష నుద్ధరించడానికి మహాకవులు పుట్టలేదనీ, ఆంధ్రుడు గర్వింపదగిన పూర్వపు సచ్చారిత్రము యేమీ లేదని ఆంధ్రం అన్నదాని నెల్లా తుదవఱకు నిరసించి, హేళన చేయడం ప్రారంభించినాడు. ఈ యాంధ్రుడి దృష్టిలో నన్నయ, తిక్కనసోమయాజి, ఎఱ్ఱన, శ్రీనాథుడు, పోతన, మారకవులు కవులు గారట! పోతిరాజు, రామదాసు, వేమన, త్యాగరాజు మొదలయినవారు మహాభక్తులు గారట! జ్ఞానులు గారట! వీరిజననం వల్ల ఆంధ్రావనికి గౌరవం హెచ్చలేదట. కాని యితడు బంగాళాదేశంలో పుట్టిన చైతన్యుని స్మరించి ఉప్పొంగి పరవశుడై పోతాడు. ఠాకూరు కవిశేఖరుని, బంకించంద్రుని చూచి అంతటి మహాకవులు ఆంధ్రులలో పుట్టలేదంటాడు. కేశవచంద్రునివంటి మహాజ్ఞానిని ఆంధ్రదేశం కనడానికి నోచుకోలేదంటాడు. పరదేశములను, పెరవారి సౌభాగ్యము మెప్పుచూపులతో చూచి ఉప్పొంగి పరవశుడై, తనవారి యొక్క గొప్పదనాన్ని చిన్నచూపు చూచి, ఒక్క హైన్యమునే కనిపెట్టకలిగిన ఆంధ్రునికి నైతికమోక్షమెక్కడిది? ఇంటిలోనున్న సౌందర్యరాశిని గుర్తింపలేక ఆంధ్రుడు పరునింటనున్న సౌందర్యమునకు ప్రాకులాడుతున్నాడు. పత్రభుక్కులకు తనయింట కూడు రుచించునా? రత్నాన్వేషణాపరునకు గుణం ఎక్కడనైనా కానుపించునా?

ఇంత నిష్ఠూరముగా వ్రాసినందులకు ఆంధ్రునికి నాపై తప్పకుండా ఆగ్రహం కలుగుతుంది. పోనియ్యండి; ఇంతవఱకు తెలుగుభూమిని పుట్టిన ఉద్యమము చివరదాకా ఒక్కలాగున ఉండి వర్ధిల్లి యొక్క మహాసంస్థయై ఆంధ్రుని జీవితములో కలిసిపోయి ఆతని అభ్యున్నతికి తోడ్పడినది– ఒక్కటి వ్రేలు మడిచి చూపించండి! ప్రత్యేకాంధ్రరాష్ట్రోద్యమముతో ప్రారంభమయిన ప్రతి యుద్యమమూ ఆంధ్రదేశంలో ఒకటి తరువాత నింకొకటి నీరు కారిపోయింది. ఆంధ్రుని పట్టుదల, మనస్సంకల్పము ఇట్టిదని వేరే వ్రాయనక్కర లేకుండా, అవి క్రమక్రమంగా యేలాగున పరిణామము పొందుతూ వుంటవో వేరొక సందర్భమున పారంగు తమ్మయ్య చెప్పిన చిన్న పద్యంలో ఉదాహరింపవచ్చును. ఆంధ్రుని మనస్సంకల్పము ఆదిలో వజ్ర (పంజర) సన్నిభమై యున్నా, రానురాను,

“....................
....లోహమై
గ్రావంబై దృఢదారువై తరుణపృ
త్కుంబై ఫలప్రాయమై
పూవై తన్మకరందమై కరఁగెఁ బో
బో నీళ్లకుం బల్చనై.”

అని నిశ్చయంగా నుడువవచ్చును

అదేమి చిత్రమో గాని, ఒక ఉద్యమము సగం సాగేనఱకు మఱియొకటి అమాయకుడైన ఆంధ్రుని దృష్టిని ఆకర్షిస్తూ అతని బుద్ధిని మరలిస్తూవుండడం, దానితో మొదటిదాని పై కొంచెము వైముఖ్యం కలగడం, మొదటిలోవున్న వజ్ర సన్నిభమైన సంకల్పము కొంచెం కొంచెంగా సడలిపోవ

డం, చివరకు రెండూకూడా తిరుపతిమంగలివాని క్షౌరములాగున సగం నడిచి యెదుగుబొదుగులేకుండ ఆగిపోవడము ఆంధ్రుని ఆధునికజీవితంలో పరిపాటి అయిపోయింది. దేశంలో ఏమూలయినా క్రొత్తయుద్యమం తలయెత్తేసరికి ముందు ఆందోళన ఆంధ్రుండిది. క్రొత్తదానిని వాసనబట్టి హడావిడి చేయడమూ, తిరిగి అంతలోనే దానిని మొగమోటం ఏమీ లేకుండా జారవిడువడము ఆంధ్రునికి అలవాటైన విషయము. చూడండి! ఉదాహరణము కావలసినయెడల—వంగరాష్ట్రవిభజనోద్యమము మొదలుకొని నేటి స్వదేశీ, ఖాదీ, స్వాతంత్ర్యోద్యమముల వఱకును ఆంధ్రు డేలా వ్యవహరించినాడో! చిందులు త్రొక్కడం, నలుగురిదృష్టి ఒకసారి ఆకర్షించడం తప్ప, ఘనంగా నిలిచేకార్యము ఒకటి అయినా కొనసాగించ లేకపోయినాడు. చివరకు అన్నిటికంటె ముఖ్యంగా చెప్పవలసిన దేమిటంటే, మహాప్రయత్నం చేసి సంపాదించినదాన్ని కూడా సరిగా నిర్వాహకం చేసుకోలేకపోతూవుంటాడు. చూడండి; మనఆంధ్రుడు ఇతర రాష్ట్రీలవారి వెక్కిరింతలకు గురియైనాడు. ఆంధ్రవిశ్వవిద్యాపరిషత్తు విషయం ఒక్కటి ఆలోచించిచూస్తే, పాపం, ఆంధ్రుడేలానలుగురినోళ్లపడి నవ్వులపాలైనాడో తెలియగలదు. ఆంధ్రుడు గొఱ్ఱెపొట్టియలాగున తలవంచుకొని ఒక్కరీతిగా ముందువెనుక అని ఆలోచన లేకుండా నడచిపోతూవుండడంకంటె, పరుగు నిలిపి త్రొక్కుకుని నిలబడి ఒకమాటు కలయజూచుకుంటె తన నిజావస్థ తెలుస్తుంది. అంతటి స్తిమితం యేదీ? అంతటి జ్ఞానం యెక్కడిదీ? ఈ మహాసంఘాన్ని, ఆంధ్రావళి ప్రజ్ఞానుసారంగా నడిపించి గమ్యస్థానం చేర్చగల దక్షుడైన మహానాయకు డెవడైనా కనిపించిననాడే, ఆంధ్రుని పౌరుషము, మహిమ, ప్రతిభ వెల్లడి కాగలవు.

ఒక్కమాటు ఆంధ్రప్రపంచం అంతా సింహావలోకనం చేసి చూస్తే ఆంధ్రునికి వ్యవహారనిర్వహణదక్షత మొదలే శూన్యమేమో యని తోస్తున్నది. రాజకీయ వ్యవహారమయినా అంతే, సాంఘికవిషయమైనా అంతే. ముందు అతనికి ముఖ్యంగా వుండవలసినది, తోడివారిపై కరుణ, మిత్రభావము లేకపోవడంచేత వ్యవహారం నడిపించే దూరదృష్టికూడా లేకుండా ఉన్నది. అతనికి ధీటుని వుండే ఉత్సాహం, ధైర్యము, సాహసోక్తులు తామర తంపరగా వున్నాయి గాని నాయకుని వుండవలసిన గుణలక్షణములలో కార్యైకదీక్షావిధి, ఆలోచనానిమగ్నత, చిత్తస్థైర్యము, గంభీరమైన హృదయము, యీ మొదలయినవి ఒకటీ ఆంధ్రునియందు కాన్పించవు. అందులకే ఆంధ్రు డింకా బాల్యస్థితి దాటనివాడని మాటిమాటికి చెప్పవలసి వస్తున్నది.

రాజకీయములు అటుండినా, యితర విషయములలోనూ, ఇతర ఉద్యమములలోనూ ఆంధ్రుడు నిర్వాహకంచేసి పేరు గడించి దేశానికి ఉపకృతి చేసిం దేదయినా ఒకటీ కనిపించదు. చేయెత్తి సత్కార్యముల కొరకై దానధర్మములుచేసిన దొకటి చూపించండి. ఒక్క విద్యాసంస్థకు గాని, ఒక్క సాంఘికసంస్థకు గాని, ఒక దేశ, ప్రజాహితైకసంస్థకు గాని పట్టుమని ఒకమహాదానము చేసిన మహామతి ఆంధ్రులలో కంచుకాగడా పెట్టి వెదకినా దొరకడం లేదు. ఎంతసేపు చూచినా ఆంధ్రుడికి లోభత్వమూ, కృపణవృత్తి, నీచమైన స్వార్థపరత్వమూ కనిపించుచున్నవి గాని, కరుణ, మైత్రి, దానము ఇవి కనబడడం లేదు. ఆంధ్రుణ్ణి అయినప్పటికి కుటిలమతితోనూ, వక్రబుద్ధితోనూ నిందాశీలుడనై నేను ఈమాటలు పలకడం లేదు. ఆంధ్రుడికి మానవత్వం నశించిపోవడం చేతనూ, కేవలం పశుత్వముకన్నా నీచమైన స్థితి అవహిస్తు ఉండడంచేతనూ, దయ, దానము, దమము మొదలయిన సద్గుణములు మృగ్యమవుతూవుండడంచేతనూ యిన్ని అనర్థాలు వాటిల్లుతూ యున్నవి.

మరియొక విషయము. ఆంధ్రుడు తాను చాలా సౌందర్యపిపాస గలవాడ నంటాడు. సౌందర్యాన్ని తాను మెచ్చుకున్నట్లు, పూజించినట్లు, కలిగివున్నట్లు యితరు లెవరూ చేయడంలేదని గొప్పలు చెప్పుకుంటున్నాడు. అమరావతీ శిల్పసౌందర్యమంటాడు, సింహాచలపు జిలుగు లంటాడు. అటు జీర్ణవిజయనగరం మొదలుకొని యిటు శ్రీకూర్మక్షేత్రంవఱకు, అటు సహస్రస్తంభ దేవాలయమువఱకు అనేక చిత్రశిల్పసౌందర్యాలు చూపి

స్తాను. వాటిని తలచుకుంటూ హృదయం ఏమాత్రం కూడా చలించకుండా మురిసిపోతాడు. కనబడ్డవారితో కూడా అప్పుడప్పుడు చెబుతాడు. కాని ఆ సౌందర్యం ప్రతిఫలించే నూతనసృష్టిని ఆంధ్రుడు ఈనాటి ప్రపంచక ములో వెలయింప జేసిన దేది? అమరావతీ శిల్పచిత్రాలు, నాగార్జున కొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట శిల్ప చిత్రాలు యితరతావులకు యితరులు గొనిపోతూవుంటే కన్నులు మిటకరించి ఊరికే చూచాడు గాని పల్లెత్తు మాటాడి ఆటంకపెట్ట లేకపోతే పోయెను, అసమ్మతినైనా తెలుప లేకపోయినాడు. తన దేశంలో ఏమూలనో, ఏ కేంద్రం లోనో చిత్రవస్తుప్రదర్శనశాల కట్టించి ఉంచమని కోర లేదు. ఆంధ్రచిత్రకారుడు తాను ప్రత్యేకప్రతిభ కల వ్యక్తి నంటాడు. కాని అతని సృష్టిలో ఆంధ్రత్వమూ, నూతన సృష్టి, కల్పన, ప్రతిభ ప్రతిఫలించుటకు మారు గా అతని ప్రజ్ఞ ఏ పెద్దబెంగాలీవాడి అనుకరణమో, ఏపు రాతన గ్రీకుకళానువాదమో ప్రతిబింబించుటలో సరి పోతూవున్నది. ఇది ఆంధ్రచిత్రకళావిమర్శనమునకు తావు గాదు గాని ఆంధ్రుల నూతన జీవనము అందులో ప్రతిఫలించడము లేదని మాత్రము చెప్ప సాహసిస్తాను. ఔను. అసలు ఆంధ్రజీవనమే కృపణత్వమును పొంది శోషించి పోతూవుంటే ఆంధ్రచిత్రకళకూడా దానినే చిత్రించుతూ వున్నదని చెప్పవలెను గదా! జాతి యొక్క కోమలమైన భావసౌందర్యము, సూక్ష్మమయిన విజ్ఞాన సంపత్తి నిత్యజీవనంలో కనిపించాలి. దీనికి లలిత కళలు, కవిత్వము, వాఙ్మయము ఇవేకదా సాక్షీభూత ములు! లలితకళలో కొన్నింటిని చూచితిమిగదా! ఇక మిగిలినవి నాటకకళ, సంగీతము, నృత్యము, కవిత్వము ఎలాగున వున్నవో ఒక్కసారి పరిశీలించండి. మన నాటక కళ ఎన్నేండ్లయి పుట్టినా ఎదుగు బొదుగులు లేక మర గుజ్జువాని శరీర సౌష్ఠవముతో ప్రకాశిస్తూ యున్నది! నూతన నాటకముల సృష్టి లేదు. నాటకాభినయనము సృష్టిపొందుట లేదు. ప్రసిద్ధనటుని యాజమాన్యము క్రింద అనేక సమాజాలు వెలిసిపోతూ, ధనా కర్షణ ప్రవాహంలో బడి కొట్టుకొని పోతూ, నాటకకళను గొంతు పిసికి వేయుచున్నారు. ఇన్నాళ్లయినా ఆంధ్రు లలో మగవాడు ఆడదాన్ని అవతల వుంచి, ఆమెను ఒక చిత్రవస్తువులుగానే చూస్తున్నాడు గాని నిత్యజీవనంతో పాటు ఆమెకూడా దేశాభ్యుదయకార్యములందు తావు వున్నదని గ్రహించడం లేదు. ఈమానవలోకము ఒక పురుషునితోనే సాగడం లేదు. స్త్రీపురుష లుభయులతోటే సాగుచున్నది. స్త్రీని వెలికి త్రోసి ఆమె సాహా చర్యం లేకుండా పురుషుణ్ణిగదా అని అతానే అంతా నిర్వహింప జూస్తాడు ఆంధ్రుడు. సౌందర్యనిర్మాణానికి మగవాడెంతచేసినా ఆడదే అందాలు దిద్దాలి. ఇక కవి త్వము, సాంస్వతసృష్టి చూడండి. ఏదీ, వేలు మడచి ఘన మైనకావ్య మొకటే యీనాటిఆంధ్రుడు సృష్టించిన దొకటి చూపించండి. ఒక్క కావ్యమే కాదు, ఒక్క నాట కమే కాదు, ఒక్క నవలే కాదు. ఒక్క శాస్త్ర గ్రంథము, ఒక దేశచరిత్ర, జాతీయవికాసమునకు తోడ్పడే ఒక్క గ్రంథము, ఏదయినా ఒక్క గొప్ప గ్రంథం ఆంధ్రభాష లో వెలువడినది ఒకటి కనబడదు! ఆంధ్రభాష సంగీ తానికి అనువైన దన్న గర్వపుమాటయే గాని ఆంధ్రుడి కింకా సంగీతకళయొక్క రహస్యము, ఉపయోగము గోచరించలేదు. సంగీతకళ అభివృద్ధిపొందడం లేదు. ఆంధ్రనర్తకి యొకప్పుడు తన భక్తి శృంగార విలాస భావాభినయములలో దేశమును ఆనందపారవశ్యములో ముంచినదేమో గాని, యీనాడు జగన్మోహనమైన ఆనృ త్య మడుగంటి పోయినది. జీర్ణమయి పోవుచున్న నాట్య కళ నుద్ధరించే దక్షుడే కనబడడం లేదు. దేశంలో నాట్య కళ, నర్తన అవాచ్యమై, అగౌరవప్రదము లై పోయి నవి. కొందరి దృష్టిలో నర్తకి హేయమైన పశుజాలము కంటె అధమతరమై పోయి కంటబడుటకు గూడ అన ర్హమై, అసహ్యకరమై పోయినది. ఎవనిదీలోటు? ఈ లాగున ప్రాసివంగులకు ఆంధ్రుడు కన్ను లెఱ్ఱజేసి క్రోధా వేశమును గనబరుస్తాడు. కాని ఆ ఆవేశమునకు, క్రోధము నకు భయపడ నక్కర లేదు. చేతనైన సిగ్గుపడి ఆం ధ్రుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి; ఆత్మనందన చేసు కొనడము మాని ఉన్నసంగతి కన్నులు విప్పి చూచి గ్రహించుకోవాలి!

ఈకాలపు ఆంధ్రుని ఉత్సాహం సోడాబుడ్డిలో బంధింపబడిన గాసువంటిది. ఆగాసు కొంచెము బంధ

విహీనదశ కావడంతోనే బుస్సుమనిపొంగి యువతల పటి చల్లారిపోవుచున్నది. ఆంధ్రుడి ఉత్సాహం అంతా యీలాగే నిష్ప్రయోజనం అయిపోవుచున్నది. అది అంతటితో ఊరుకుండక తోడివాండ్లకు, తరువాత వచ్చే యువతీ యువకులకుకూడా నిరుత్సాహకర మగుచున్నది. ఉత్సాహం చచ్చి, పిరికితనం బయటపడ్డ తరువాత మనిషికి తిరిగీ ఉత్సాహం జనించదు. లేచి పడిపోయిన సముద్రపు కెరటములాగే ఉత్సాహకెరటము కూడా విరిగి పడిన తరువాత తిరిగి మొలకెత్తలేదు. చివరకు ఆంధ్రులందరిని ప్రసిద్ధుడైన గిరీశంగారి "మృదుమధుర వచనాలతో" అభినందించవలసిన దౌర్భాగ్యం కలుగుతుంది.

ఆంధ్రుడి అజ్ఞాన దౌర్భాగ్యంవల్ల లోభత్వము, లాలసలతోపాటు అసహనాంకురము మొలకరెత్తి నీటిలో నాచువలె ఆంధ్రునిజీవితసాగరమంతా చుట్టివేసుకుంటూ యున్నది. వేరుపురుగై మహోదారుడైన వాని హృదయం బద పట్టించి నమిలివేయుచున్నది. మానవత్వము చంపించి రాక్షసత్వము అలవరింపజేస్తూ ఉన్నది. మనుష్యునికి పేరాశ, లోభిత్వమే కాని రాక్షసునకు హింస కూడా ప్రీతికరమైనది. ఆంధ్రదేశంలో మానవునికి యీ రాక్షసత్వముకూడా అబ్బడముచేత హింస ప్రబలి కరుణను, మైత్రిని నాశనం చేస్తున్నది. హింసయొక్క మరో రూపము అసహనము. అది బలము కలిగినపుడు హింస యగుచున్నది, చేతగాని తన మబ్బినపుడు అసహన మనిపించుకుంటున్నది. ఈఅసహనముకూడా ఆంధ్రుని బాల్యావస్థనే మావిస్తున్నది. ఇది పూర్వము కథలో చెప్పినట్లు దాక్షారామ భీమేశులింగమువలె మింటికి ఎగసి పోవుచున్నది. దీనికి నడినెత్తిపై సరిగా చూచి శిల కొట్టగల సమర్థుడు ఆంధ్రులలో అవతరించాలి. ఈ అసహనమును శివుడు కాముణ్ణి తనచిచ్చుఱకంట కాల్చి భస్మీపటలం చేసినట్లు, జ్ఞాననేత్రంతో, దేశాభిమాన పూరితుడై, ఆంధ్రుడు దగ్ధంచేయాలి.

ఆంధ్రుడిలో మరోదుర్గుణం ఉన్నది. అతడు దురభిమానముతో స్వోత్కర్ష చేసుకోమంటే ముందు వెనుక లరయడు. తోటి ఆంధ్రుణ్ణి గొప్పవాడని మరియొకడు మెచ్చుకుంటే వాని లోపాలు వెదకి తిట్టాలని తడుముకోకుండా చెప్పి వాడి గొప్పదనాన్ని మరుగుపరచడానికి ప్రయత్నంచేస్తాడు. ఆంధ్రేతరుణ్ణి మాత్రము గొప్పవాడని చెప్పితే మెచ్చుకోడానికి సంకోచింపడు. ఎంత గొప్పవాడయినా తోటివాడు ఆంధ్రునకు దృష్టిలో స్వల్పుడే. ఎంత సామాన్యుడయినా పరదేశీయులు తమ వాడు గొప్పవాడని ప్రచురిస్తే ఆంధ్రుని దృష్టిలో సమర్థుడే! ప్రతిభాశాలియే! బ్రతికివున్నవాళ్లు ఆంధ్రుడు తనసోదరుని మహిమలు ఎన్నబోడు. చచ్చిన తరువాత కల్ల ఏడ్పు వినిపిస్తాడు. అతని హృదయంలో కరుణ అన్నది లేదు. బ్రతికివున్న రోజులలో "ఆంధ్రరత్న" యొక్క మహిమ, ప్రజ్ఞ ఎవరూ కనిపెట్టి మెచ్చుకో లేకపోయినాడు. చచ్చినతరువాత కొంత తాటియాకుల దప్పుకు చేసినాడు. మరల గాఢనిద్రావస్థలో, మైమరపులో కూలిపోయినాడు.

ఆజన్మ సంసిద్ధమైన యీ అసహన దోషంవల్ల ఆంధ్రుడు తలపెట్టినకార్యము ఒకటీ కొనసాగడం లేదు. ఈ అసహనంచేతనే పొరిగింటివాడు తలపెట్టిన మహాకార్యము కూడా నడవడంలేదు. అది జయప్రదమయ్యే మార్గాలు చూపించి, దానికి కావలసిన సహాయము చేసి ఒకదరి చేర్చుటకు మారుగా దాని నేలాగయినా విఘ్నంచేయగల ఉపాయాల నన్వేషించి, అది కడతేరి నదాకా దేవుళ్లాడి కండ్లు చల్లపఱచు కొంటున్నాడు. దీనితో హింసాప్రవేశము పూర్తిఅవుతున్నది. ఆంధ్రుని మానవత్వము క్రమంగా అసురత్వములోనికి పరిణమిస్తూ యున్నది.

ఆంధ్రుని బాల్యచాపల్యము అప్పుడప్పుడు డింభకరీతిగా కూడా పరిణమిస్తు యున్నది. దీనికి అతనిమనోదౌర్బల్యమే ప్రధానకారణము. ఈ మనోదౌర్బల్యము ఆంధ్రుని పురోభివృద్ధికి ప్రబలమైన ఆటంక మవుతూ ఉన్నది. ఆంధ్రుడు తన కేది ముఖ్యముగా ఆవశ్యకమో గ్రహింపగల్గి తీవ్రంగా ఆందోళన చేయడమే కష్టము. సక్రమంగా, స్థిరచిత్తముతో, ఏకాగ్రతతో ఉద్యమాన్ని నడిపించగల సమర్థత యింకా ఆంధ్రుడికి చేతకావడం లేదు.

అందుచేత ఆంకోళన ఆరంభించి చేస్తూఉంటున్నపుడు మరియొక సదుద్యమము, అఖిలభారత దేశానికి సంబంధించినదో మరియొకటో, బయలుదేరినపుడు మొదటియుద్యమానికి కన్నీరయినా విడువకుండా స్వస్తిచెప్పి, జీవచ్ఛవమును చేసి మహోత్సాహంతో రెండవదాన్ని పట్టుకొని దేశభక్తుడని ఊరేగుతాడు. కాని రెండింటిని సమంగా నడిపించి కార్యసాధనం చేసుకోడానికి ప్రయత్నం చేయాలి. ఒక ఉద్యమానికి మరియొక ఉద్యమం అడ్డుతగిలినపుడు ఉత్సాహం, పట్టుదల రెండింటిమీద సమంగా కనుపఱచి ప్రజ్ఞతో రెండింటిని సాధించాలి. స్వరాష్ట్ర ఉద్యమములు వెనకను అఖిలభారత రాష్ట్రోద్యమముల ముంగిటను నడిపింపరాదు. రెండవది యెంతముఖ్యమైనదో, మొదటిదికూడా అంతముఖ్యమైనదే. బాగా ఆలోచిస్తే స్వరాష్ట్రవిషయం ముందు, అఖిలభారత దేశమునకు సంబంధించిన విషయము తరువాత చూడాలి. ఇంట గెల్చిగదా రచ్చ గెలవాలన్నాడు శాస్త్రకారుడు. ఒక్కక్షేత్రమునే స్వాధీనంచేసుకొని నడిపింపలేకుండా వున్న ఆంధ్రసారథి రెండు మూడు గుఱ్ఱాలను చేర్చి రథము నడిపింపగలడా? ఏకకాలమునందు రెండు ఉద్యమములమీద ఏకాగ్రత కుదురుట కష్టతరము. ఆంధ్రుడింతవఱకు ఒక్కదానిమీదనే ఏకాగ్రత కుదిరి, నడిపింప సామర్థ్యము కనబఱుప లేనపుడు రెండింటిపై సమానముగా కనబఱచ లేకపోవడము ఆశ్చర్యకరమైన విషయము కాదు!

ఈలోపమంతా ఎందువలన కలిగినదో ఆంధ్రుడు పరుగు విడిచి నిలబడి ఒకసారి ఆలోచించాలి. ఆంధ్రావళి యిప్పుడు సేనానిలేని బలసమూహంలాగున వున్నది. ఈ ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వపు రోజులలో ప్రతివాడును సేనానీ అయియుండాలి, సైనికుడూ అయి యుండాలి. శిక్షణ పొందని సైనికుడు యూకకు జయం కూర్పుటకు మారుగా ఎట్లు చేటావహింప జేస్తాడో శిక్షణలేని ఆంధ్రుడీ కాలములో దేశంలో వ్యాపించియున్న ప్రతియుద్యమమునుకూడా ఆలాగుపాడుచేస్తున్నాడు. తనసత్తువ యెంతో తెలిసికొని ప్రవర్తించడము ఆంధ్రుడి ఆత్మగౌరవమునకు గొప్ప కళంక మవుతూఉన్నది. ప్రతి ఆంధ్రుడూ ఒళ్లు తెలియక తాను గాంధీ మహాత్ముడంతటి దేశభక్తుడని గర్వించిపోతున్నాడు. ప్రజ్ఞాబుద్ధులలో తాను యే మోతీలాలు, మహమ్మదాలీ, పట్టాభిసీతారామయ్య వంతటివాడననో భ్రమపడుతూవుంటాడు. గిరీశంగారిలాగున "మాటిమాటికి తనబుద్ధి దాల్లేస్తుంది గాని తా నంతవాడను గావా" అని అనుకుంటాడు. ఎందులో చూచినా తాను చాలా గొప్పవాడనని అనుకుని అహంభావంతో సాహసిస్తాడు. బుద్ధిశాలి యైనవాడూ, మహోదారుడయినవాడూ ఒకడు నాయకుడని అంగీకరించడం, వాని ఉపదేశానుసారం ముందకుగువేయడం దేశము, జాతి వీటియొక్క అభ్యున్నతికోసం కొంత స్వార్థత్యాగం చేయడమూ అంటే ఆంధ్రునికి కిట్టదు. అది అతని ఆత్మగౌరవానికి కళంక మవుతుంది. మనసునకు నొప్పి కలిగిస్తుంది. ఆంధ్రు డైనవా డెవడూ ఒకణ్ణి నాయకుడని అంగీకరించడు. అతని దృష్టిలో నాయకుడు కాదగినవాడు ఒకడూ కనబడడు. ఉన్నాడని చెప్పినా వినీవిననట్లు ఊరకుంటాడు. అక్కడ మహాత్ముని ఒకణ్ణి నిలవబెడితే వాడి కేదో కళంకం వెదికి పట్టుకొని వాడు నాయకుడు కాజాలడంటాడు. బ్రతికియున్న వాణ్ణి యెవణ్ణీ ఆంధ్రుడు గొప్పవాడనీ, నాయకత్వానికి యోగ్యుడనీ మెచ్చుకోవడు. ఆంధ్రు డీదురహంకారమును భస్మీపటలం చేయాలి. మంచి అన్నది ఎక్కడైనా వుంటే దాన్ని తెలుసుకొని యితరులకు ప్రకటించుకోవాలి. అన్నిటికంటె శిక్షణను పొందాలి. అహంభావము అణచుకోవాలి. సొంతలాభం కొంత మానుకొని దేశం కోసం పాటుపడి తోడి జనులకు కొంత మేలు చేసి చూపించాలి. దేశభక్తి గలవాడనని జ్ఞానంతో ఆనందం అనుభవించాలి.


భారతి చందాదారుల కొక ముఖ్యమైన విజ్ఞప్తి

ఈ దిగువ నమోదుపఱచిన సంఖ్యలుగల చందాదారుల చందాలు ఈశుక్ల మాఘమాస సంచికతో ముగియుచున్నవి. ఆయా సంఖ్యల చందాదారులు దయచేసి తిరుగ తమ తమ చందా సొమ్మును మణిఆర్డరుద్వారా పంపుట గాని, వి. పి. పంప ననుజ్ఞ ఇచ్చుట గాని కావింప ప్రార్థించుచున్నాము. అట్లు మార్చి ౧-వ తేదీ లోగా మాకు మణిఆర్డరు గాని, వి. పి. అనుమతి గాని రాకున్నచో రాబోవు సంచిక వి. పి. ద్వారా పంపగలము. చందాదారులు ఆ వి. పి. ని త్రిప్పివేయక దయతో స్వీకరింప ప్రార్థితులు.

చిరునామా మార్పులు 1-వ తేదిలోపల తెలుప ప్రార్థితులు.

1895, 1982, 2302, 2355, 2359, 3159, 3478, 3488, 3519, 3928, 3913, 3945, 3963, 4288, 4355, 4619, 4666, 4676, 4678, 4679, 4686, 4691, 4693, 4699, 4708, 4714, 4756, 4769, 5053, 5054, 5088, 5091, 5097, 5127, 5132, 5451, 5461, 5463, 5466, 5467, 5469, 5473, 5476, 5477, 5482, 5486, 5488, 5489, 5491, 5493, 5494, 5502, 5503, 5504, 5509, 5513, 5514, 5524, 5539, 5540, 5553, 5554, 5561, 5640, 5771, 5782, 5791, 5794, 5806, 5811, 5813, 5817, 5818, 5823, 5825, 5827, 5829, 5831, 5832, 5839, 5841, 5843, 5853, 5864, 5867, 5921,

మేనేజరు ' భారతి '



చిత్రము ౨



చిత్రము ౧

చూడుడు పుట ౨౮౧.

సాముద్రికం

సామినేని ముద్దుకృష్ణ గారు

ఎంత ఉన్నతస్థితిలో ఉన్న విజ్ఞానాన్నైనా తుత్తునియలుచేయడానికి ఒకవిప్లవం చాలును. ఒకవిప్లవానంతరంఅంతకన్నా దుస్తరమైన ఇంకొకవిప్లవం ప్రబలుతూ అనేక శతాబ్దాల నుంచీ చీకట్లపాలయి దారీతెన్నూ కానని దుర వస్థలో చిక్కుకున్న భారతీయవిజ్ఞానం సంగతి చెప్పనక్కరలేదు. చరిత్రసహితం తన దీర్ఘహ స్తాన్ని ఎంతచాచినా అందుకోడానికి వీలులేని నాటి భారతీయవిజ్ఞానాన్ని ఎంత కన్నులు తెరిచినా పరిశీలించలేము. ఏడవ శతాబ్దం నుంచీ విరిగిపడుతూవున్న విప్లవాలు మన ప్రస్తుతం మనపూర్వాన్ని అనుసరించకుండా చేయడం వల్ల బొత్తిగా దీనస్థితిని చేరుకున్నాము. ఈ దుర్దినాలలో మనం పోగొట్టుకున్న అనేక శాస్త్రాలలో సాముద్రికం ఒకటి. సంపూర్ణ స్వాతంత్ర్యతేజస్సులో ఆత్మాన్వేషణకు పూను కున్ననాడు తిరిగీ దేశం గొప్పవిజ్ఞానంతో కల కలలాడుతుంది.

తిరిగీ దేశం గొప్ప విజ్ఞానంతో కలకల లాడుతుంది, అనే నా ఆశకు ఆధారం ఏమిటంటే: "షీరో" అనే పాశ్చాత్య సాముద్రిక శాస్త్రవేత్త చెప్పిన ఒకకథ:

ఈయన హిందూదేశాన్ని దర్శించడానికి వచ్చినప్పుడు ఈయన అదృష్టవశాత్తు ఒక పురాతన బ్రాహ్మణ కుటుంబము తరతరాల నుంచీ జాగ్రత్తగా గుప్తంగా దాస్తూవున్న ఒకగ్రంథం చూపడం తటస్థించినది. ఆనాటి భారతవిజ్ఞానం విలువ అమితంగా పొగుడుతూ ఈయన అన్నాడు:

"ఈ అపూర్వమైన గ్రంథం మానవ్య చర్మంతో తయారు చేసినారు; అద్భుతమైన తెలివితేటలతో పేజీలు కూర్చినారు. గ్రంథం చాలాపెద్దది. దానిలో అనేకవందల పటములు నీటుగావ్రాసి, ఎప్పుడు ఏలక్షణం ఏవిధంగా ఫలించినదో చెప్పుతూ, ఆసూత్రాన్ని విశదంగా బోధించినారు. అన్నిటికన్న ఎక్కువ వింతైనసంగతి ఏమిటంటే: దానిలోని అక్షరాలు ఎర్రనిద్రవపదార్థంతో వ్రాసినారు. ఆ అక్షరాల స్ఫుటత్వాన్నిగాని, అందాన్నిగాని, ఎన్నోవందల సంవత్సరాలు పాడుజేయలేక పోయినవి. ముదరపసుపు చర్మందళాలపైన ఆ యెర్రని స్ఫుటాక్షరాలపొందిక చాలా అద్భుతంగా కనిపించినది. ఏవో మూలికలతో తయారుచేసిన పదార్థంతో పేజీలకు వార్నిషుతోవలె నిగనిగలాడే మెరుపు వున్నది. ఆ పదార్థం ఏమిటైనా అది కాలాన్ని ధిక్కరించినట్టు కనిపిస్తుంది. పైఅట్టలు మాత్రమే జీర్ణిస్తున్నట్టుగా కనపడినవి. అది మూడుభాగాలుగా విడదీసినారు; మొదటి భాగంలోని లిపి ఎంత పురాతనంఅయినదోగాని కొద్దిమంది బ్రాహ్మలే తప్పఎవ్వరూపోల్చుకుని చదవలేకపోయినారు."

—Cheiro's Language of the Hand.

ఈకథ చదివిననాటినుంచీ నాకు ఉత్సాహం ద్విగుణీకృతంకాగా ఎక్కువపట్టుదలతో సాముద్రికాన్ని పరిశీలించడం ప్రారంభించినాను. మనపూర్వవిజ్ఞానం స్మృతిగా మిగలడమే కాకుండా జాడలు అక్కడక్కడ ఉన్నట్టు కనిపిస్తూవుండడమువల్ల ఏనాటికైనా ప్రాక్సాంప్రదాయాలు సిద్ధించవా అని. కాని ఇంతవరకూ ఉపయుక్తంగావుండే శాస్త్రం ఒక్కటీ లభించలేదు. ప్రహ్లాద, నారద, వరాహమిహిరవిరచిత సంస్కృతగ్రంథాలు, లాహోరులో సంస్కృత మాతృకతోనూ, హిందీ వ్యాఖ్యతోనూ రెండు పెద్దభాగాలుగా ప్రచురించిన సాముద్రికశాస్త్రాన్ని పరిశీలించి చూడగా ఎక్కువతృప్తికరంగా తోచలేదు. అందుచేత పాశ్చాత్యశాస్త్రవేత్తలను విస్తారం అనుసరించడం తప్పినదికాదు. ఇంతకూ విజ్ఞానానికి ప్రాక్ప్రతీచీ భేదాలు నిర్ణయించడం దోషం గనుక, జ్ఞానాన్వేషకులు సహిస్తారనీ, సహృదయులైన పాఠకులు తమ తెలియబాటలో వున్న శాస్త్రజ్ఞులను తెలియజేసినా, అందుబాటులోవున్న శాస్త్రాలను 'భారతి' పత్రికాముఖమున నాకు దయతో పంపినా, కృతజ్ఞతతో అంగీకరిస్తాను గనుకనూ, పెద్దన్న మెత్తనిమాటలతో అందరి సానుభూతినీ కోరుతాను:

"వీరు వా రనగవలవ,
దనఘ! సద్విద్య యెందున్న గొనగవలయు."

ఇక సాముద్రికం గౌరవించదగిన శాస్త్రాలలో చేరుతుందా? అన్నేప్రశ్న వున్నది. స్థూలదృష్టినేకాని విశ్వసించని పాశ్చాత్యులలో, ముఖ్యంగా అమెరికనులలో, ఈ అవిశ్వాసం పూర్వం మెండుగా వుండేది. గర్భకోశంలో శిశువు నవమాసములు లేతపిడికిళ్లు పట్టివుండడమువల్ల రేకలు ఏర్పాటవుతవని వీరిలో చాలమంది విశ్వసించేవారు. పలుసంగతులు ప్రజాబాహుళ్యం గ్రహించవలెననే సదుద్దేశంతో శాస్త్రవేత్తలచేత వ్రాయించిన, 'ఎన్సైక్లోపీడియా బిటానికా!(Encyclopaedia Brita'n-nica)లో సాముద్రికాన్నిగురించి ప్రసంగిస్తూ: "వాట్లంతటఅవే ఏర్పాటగు ఈగీతలకు ఎట్టిగుహ్యమైన, మానసికమైన, రాబోయేదాన్ని సూచించగలిగిన అర్థం ఉన్నదేమో అనడం ఉత్తపిచ్చిఊహ. కొన్నిబాపతుల మనస్సులకు దీనిమీద గమ్మత్తుఆకర్షణ వున్నట్టుకనిపిస్తుంది, ఒకదాన్ని ఒకటి అనుసరించేఅర్థం దీనిలో ఏమాత్రం లేనందుచేత బుద్ధిపరిసరాలలో దీని ప్రశంస ఎత్తవీలులేదు." అని గీటునపెట్టినారు. ఇది సామాన్య పాశ్చాత్య బుద్ధిమంతుని గట్టి నమ్మకము మొన్నటివరకూ. ప్రస్తుతం ఈ నమ్మకం మారిపోయి అమెరికాలోనూ, యూరపులోనూ సాముద్రికాన్ని పెద్ద చదువుగా ఎంచుకుని జీవితం ఇందునిమిత్తం అనేక వేలమంది వెచ్చించుతూవున్నారు. ఈవిద్య సభ్యసించడానికి యూరపు, అమెరికా ఖండాలలో పెద్దపెద్దవిశ్వవిద్యాలయాలు స్థాపించి సాముద్రికాన్ని గొప్పశాస్త్రంగా పఠిస్తూవున్నారు.

పాశ్చాత్య దేశాలసంగతి అటువుంచి, బైబిలుబోధించని ప్రతిహాంశము అవిశ్వసనీయము, సైతానుప్రబోధము అనేగుడ్డినమ్మకంతో జ్యోతిషం, సాముద్రికం, నిమిత్తం మొదలయిన మనశాస్త్రాలన్నీ పిచ్చినమ్మకాలనే యేసుమత ప్రచారకుల బోధనలకు తావిచ్చినవారిని, పాశ్చాత్యవిజ్ఞానాన్నితప్ప ఇతరాన్ని మన్నించమనే ఆవేశంతో వున్నవారిని తప్పించుతే, మన దేశంలో ప్రజాబాహుళ్యం ఈ శాస్త్రం ఉత్కృష్టతను పూర్తిగా అంగీకరిస్తారు. విశ్వసించినవారి వినోదార్థం, విశ్వసించనివారి బుద్ధి ప్రేరేపించడానికి కొన్ని సంగతులు తెలియజేస్తాను.

జనవరి — ౨౯ - ౧౮౯౦ సంవత్సరం స్కాట్లండులో ఎడిన్బరో విశ్వవిద్యాలయము (Edinburgh University) వారు ప్రకటించే "ది స్టూడెంట్" (The Student) అనే పత్రికలో ఒకవైద్యవిద్యార్థి వ్రాసిన జాబు:

"కొన్ని సంవత్సరాలక్రితం నేను 'రాయల్ ఇన్ఫర్మరీ' (Royal Infirmary) ఆస్పిటల్ లో రోగులమధ్య సంచరిస్తూవుండగా, హఠాత్తుగా ఒకరోగిచేయి పరీక్షించవలెనని బుద్ధి పుట్టినది. ప్రక్కనేవున్న రోగిశరీరమేమీ పరీక్షించకుండా చేయి మాత్రం పరీక్ష చేశాను. ప్రధాన రేఖలు, వాటిలో విరుపులు క్రమాదాలను సూచిస్తవి అనేసంగతితప్ప నాకు సాముద్రికం ఏమీ తెలియదు. ఆరోగి రెండుచేతులలోనూ ఆయుష్యరేక విరిగిపోవున్నది, అదృష్టరేక ఉండవలసిన దానిలో నాల్గవవంతే ఉన్నది; దాని నడకనుఒకపెద్దక్రాసు- × -అడ్డినది. రోగిని ప్రశ్నిస్తే వయసు ఇరవైమూడు సంవత్సరాలనీ, 'థైసిస్'(Phthisis)అనేరోగం చాలాముంచిపోయినదనీ తెలుసుకున్నాను. ఆరోగి కొద్ది రోజులలో మరణించాడు. దీనినిబట్టిచూస్తే ఈ గీతలకూ, మనిషిబ్రతుకు నిర్ణయించే మెదడులోని 'గ్రే మేటర్' (Gray Matter) కూ, ఒకవిధమైన సంబంధం వున్నదని నిరూపించడానికి మీారు అంగీకరిస్తారు అనుకుంటాను."

ఇంకొకవింత. ౧౮౭3 సం. ఆగస్టునెలలో ఫ్రాన్సు దేశంలోని పేరిస్ (Paris) పట్టణంలో 'అకేడెమీా డే సైన్సస్' (Academies des-Sciences) శాస్త్రవేత్తల సభలో, ప్రత్యేకం చెవులపరీక్షవల్ల ఎన్నో సంవత్సరాల తరువాత రాబోయేపిచ్చికనిపెట్టవచ్చునని నిరూపించారు. ఇది ఏవిధంగానంటే, చెవి పైభాగము పిచ్చి బయటపడుటకు చాలా సంవత్సరాలు ముందే ఒక వింతమార్పును పొందుతుంది. ఆభాగం మొద్దెక్కి దళంకావడంవల్లగాని, లేక అక్కడ ఒకవిధమైన రక్తపుగడ్డ పెరగడంవల్లగాని తటస్థిస్తుంది. ఇది ముఖ్యంగా పిచ్చి జన్మతః వచ్చిన వారిలో కినబడుతుంది.

ఇదికాక 'సైంటుజెర్మైన్', 'పీరో' మొదలయిన సాముద్రికశాస్త్రజ్ఞులు రోగాలు చాలావరకూ గోళ్లను పరీక్షించడంవల్ల నిర్ణయించవచ్చునని స్థిరపరిచారు. ముందు ప్రకటించే వ్యాసాలలో ఈహాంశం సచిత్రంగా విశదీకరిస్తాను.

శరీరమంతలోనూ హస్తానికే యింత ప్రాముఖ్యము ఈయడానికి కారణం ఏమిటంటే: పరిణామశాస్త్రవేత్తల (Evolutionists) అభిప్రాయం ప్రకారం భూగోళం ఆయుష్యము రెండువందల కోట్లసంవత్సరాలకన్నా ఎక్కువ. భూమివేడి తగ్గిన కొన్నివేల సంవత్సరాలకు మొదట చేపలు, తరువాత పాములు, ఆతదనంతరం కొన్ని వేలసంవత్సరాలకు పక్షులు, ఈ విధంగా ప్రాణికోటులు సృష్టిలోనికి వొస్తూ, నూటయేభై వేలవత్సరాలక్రితం కోతికూపుతో మానవాకారానికి దగ్గరగా వున్న ప్రాణి వున్నట్టు నిశ్చయించారు. స్పెయిను దేశంలో దొరికిన అస్థిపంజరాలను పరీక్షిస్తే మనలను పూర్తిగా పోలిన మొదటి మానవ రూపం ముప్పై వేలసంవత్సరాలక్రితం ఏర్పాటయినట్టు తేలినది. హెచ్. జి. వెల్స్ అనే చరిత్రకారుని లెక్కప్రకారం అరవై వేల సంవత్సరాలకు పూర్వం భూమిమీద మానవాకారాన్ని పూర్తిగా పోలినజాతి వుండేది. అది రాతి ఆయుధాలను, నిప్పు, ఇతర జంతువుల చర్మాలను వాడినట్టున్నా, మనవలెనే కుడిచేతిని ఎక్కువ చాకచక్యంతో ఉపయోగించినట్టున్నా తార్కాణాలు తేలినవి. వాళ్ల బొటన వ్రేళ్లు మాత్రం చేతికి మనంత అనుకూలంగా లేవు.

"About sixty thousand years ago, there lived a creature on earth so like a man..............We have skulls and bones of it and a great accumulation of the larger implements it made and used. It made fires. It probably dressed skins and wore them. It was right-handed as men are. Their thumbs were not opposable to the fingures as mens' are."

—H. G. WELLS,
A Short History of the World, p. 33.

ఈపరిణామవాదాన్ని మనదశావతారాల వర్ణననుబట్టిచూస్తే ప్రపంచంలో ప్రాణి మొట్టమొదట జలచరావస్థనుంచి ప్రస్తుత మానవ స్థితికి చేరడానికి ఒకగొలుసు ఏర్పాటు కనబడుతుంది. జంతుజాలంకన్నా భిన్నంగా అవయవాలను ఎక్కువ ఉపయుక్తంగా వాడేది కోతి. అనగా కోతి ముందుకాళ్లను ఒక్క నడకకే కాక చేతులుగా ఉపయోగించ గలుగుతుంది. అందుచేత ఇతరజంతువులకన్నా దానిబుద్ధి విశేషంగా ప్రసరించడం కలిగినది. అంగశాస్త్రజ్ఞులు కోతిఅవయవాలకూ మనుష్యుని అవయవాలకూ విస్తారం భేదంలేదని నిర్ణయించారు. కాని కోతికీ మనిషికీ ఒక్కభేదం వున్నది. కోతి చేతులుగా ముందుకాళ్లను ఉపయోగించడంవల్ల తక్కిన జంతువులకన్నా ఉన్నత దశకు రావడం తటస్థించినది. మనిషి కోతికన్నా ఉత్తమ దశకు రావడానికి కూడా చేయిఒక్కటే కారణం. కోతిచేతిలో బొటనవ్రేలు తక్కినవ్రేళ్లకన్నా చాలా దిగువగాను, అనగా బొటనవ్రేలికొన చూపుడువ్రేలి మొదలువరకైనా అందకుండాను వంగకుండాను, నిరుపయోగంగాను వుంటుంది. తరువాత మనుష్యులఅరచేతిలో వ్రేళ్ల మొదళ్లలో

ఈశాస్త్రంలో తారాస్థానానాలని వాడే ఎత్తు ప్రదేశాలు లేవు. పుట్టుకనుంచీ మేధాశక్తిలేని జడునిచేతిలోకూడా ఇవి ఉండవు. "They do not exist in the monkey's so called hands,and are absent in the hands of the congenital idiot."

—Adrien Adolphe Desbarrolles.

ఇది గాక, ప్రొఫెసర్ మార్విన్ — (Prof. F. S. Marvin) చరిత్రకారుడు,మానవుడు కోతిజాతిలో నుంచి వేరుపడి ప్రస్తుత ఉన్నతస్థితికి రావడానికి ఒక్క బొటనవ్రేలి ప్రయోజనమే కారణ మంటాడు.

దీనినిబట్టి చూస్తే, ప్రాణి ఇన్ని వేలసంవత్సరాలనుంచీ పొందుతూవున్న మార్పులకూ, అత్యుత్తమమైన ప్రస్తుత మానవదశకు రావడానికీ చేయి చాలా ప్రధానాంగం అని తేలుతుంది. మానవాధిక్యాన్ని చేయి ఒక్కటే నిర్ణయించినప్పుడు, మానవప్రకృతిని నిర్ణయించడానికి అన్ని అంగాలకన్నా హస్తమే ఎక్కువ ఆధారం అని నిరూపించడానికి ఇంతకన్నా వాదం అవసరం లేదనుకుంటాను.

హస్తం దాని విలువ తెలుసుకున్నాము గనుక, అరచేతిలో కనిపించే తారా స్థానాలు అని ముందుచెప్పిన ఎత్తులు, రేకలనివాడేగీతలు పరిశీలించడంవల్ల స్వభావం,జీవితం ఎలా తెలియగలవు అన్నేప్రశ్న వున్నది. శరీరశాస్త్రవేత్తలు మెదడులో 'గ్రే మేటర్' (Gray Matter) అనే ఒక ద్రవపదార్థం ఉన్నదనీ, అదే ఈ మానవయంత్రాన్ని అన్నివిధాలా నడపడానికి కారణం అనీ తెలుసుకున్నారు. ఈ 'గ్రేమేటర్' నరముల ద్వారా అన్ని అవయవాలతోనూ రాయబారాలు నడుపుతూ వాటిని నడిపిస్తుంది అని చెప్పడమేగాని దాన్ని గురించి అంతకన్నా తెలిసికోలేకుండా వున్నారు. శరీరానికంతకూ ప్రధానమైన 'గ్రేమేటరూ', నరాలకు దానితో గల సంబంధమూ ఒప్పుకుంటే చేతి ప్రాముఖ్యము వెంటనే నిర్ణయించవచ్చును. మెదడునీ చేతినీ కలుపుతూవున్నన్ని నరములు ఇంక ఏ అవయవాన్నీ మెదడునీ కలపడం లేదు. 'గ్రే మేటర్'లో కదలికలేనిదే ఏ అవయవం ఉపయోగపడదు. ఈపరిస్థితులనుబట్టి చూస్తే 'గ్రే మేటర్'లోని కదలికలన్నీ చేతిలో ప్రతిబింబించడం వింతగా తోచదు. సైంట్ జెర్మెన్ అన్నట్టు: "చేతినలహాలేనిదే 'గ్రే మేటర్' ఏ పనీ చేయదు." ఇంకొక సంగతి: మెదడునుండి చేతిలోనికి ప్రవహించే నరాలు చురుకైన గ్రహణశక్తిగల 'పేసినియన్ కార్ప్యూసిల్స్' (Pacinian Corpuscles) అనే పదార్థాలుగా ౨౫౦ మొదలు 300 వరకూ అరచేతిలో ఏర్పాటవుతూవున్నవి. ఈ 'పేసినియన్ కార్ప్యూసిల్స్'వల్ల ప్రయోజనం ఏమిటంటే:—

పంచేంద్రియాలలో ముఖ్యమైన స్పర్శ చర్మంవల్ల కలుగుతుంది. ఈస్పర్శశక్తి శరీరం అంతకన్నా అరచేతిలో హెచ్చుగా వుండడానికి 'ఈపెసినియన్ కార్ప్యూసిల్సే' కారణం. దీనిని గురించి ఆ గొప్ప ఫ్రెంచిశాస్త్రజ్ఞుడు డేస్బ్రోల్లో:

“స్పర్శశక్తి చేతిలోనూ, ముఖ్యంగా వ్రేళ్ల కొనలలోనూ కేంద్రీకృతమై మిగిలిన ఇంద్రియాలకార్యాన్ని తానే ప్రత్యేకం నిర్వహించగలుగును అన్నవాదాన్ని తిరస్కరించ వీలు లేదు. గ్రుడ్డివారు, చెవిటివారు, మూగవాళ్ళు, కూడా తమతమచేతులు చక్కనిస్పర్శ గలిగి వుంటే గ్రహణశక్తిపోకుండా బాహ్యప్రపంచంతో సంబంధం కలిగివుంటారు. హస్తానికి వున్న ఈమహాశక్తిని గ్రహిస్తే ‘గ్రేమేటర్’ వాడుక ఎక్కువగా చేతిలోనే వున్నదనీ, చేతివల్లనే మెదడు ఎక్కువ ఉపయోగపడుతుందనీ తేలుతుంది. ఇదిగాక తక్కిన నాలుగు ఇంద్రియాల పలహాలనూ నిర్వర్తించేది ముఖ్యంగా చేయి.”

ఈసబబైన వాదాలనుఅనుసరించి చూస్తే హస్తంవిలువా, మానవప్రకృతిని తెలుసుకోడానికి దాని ప్రాధాన్యమూ తెలుస్తుంది. శరీరంలో ఇప్పటికి వున్నటువంటీ, ఇక రాబోయేటటువంటీ రోగాలు తెలుసుకోగలమనీ, అంతేకాక మెదడులో ఊహాలవల్ల కలుగుతూవున్న మార్పులు కూడా చేతిగీతలలో ప్రతిబింబిస్తవనీ పైవాదనలు నిరూపించినవి. మన ఊహాలే చాలావరకూ మనభవిష్యత్తుని నిర్ణయిస్తవని అంగీకరిస్తే సాముద్రికం విలువ ఒప్పుకున్నట్టే.

ఇంకొకసంగతి చెప్పి అసలు వ్యాసం ప్రారంభిస్తాను. ఇంకా నమ్మకం లేనివారు తమ జీవితంలోనూ, ఊహాలలోనూ మార్పులు కలుగుతూవున్నప్పుడుతమచేతులు పరీక్షచేస్తూవుంటే ప్రతి ఆరుమాసాలకూ క్రొత్త రేకలు ఏర్పాటవుతూవున్నట్టు కనుక్కోగలుగుతారు. ఇక, ఈ రేకలకూ ఆ మార్పులకూ సంబంధం వున్నదా? అది తెలిసికోగలమా? అంటే,—ఒకసారి శాస్త్రపరీక్షచేసి నంశయించడంన్యాయం.

మురళీధర స్తుతికరణము

కవిభూషణ, కవిరాజ, శ్రీ రాజా వత్సవాయ వేంకట నీలాద్రిరాజు గారు

సతతగతి ప్రచార సహసా పరికల్పిత లాస్యమండల
ప్రతి లతికాంతరస్థితిఁ గరంబుఁ జెలంగి మిళిందబృందముల్
శ్రుతి హిత ఝంకృతిన్ మనసు సోఁకఁగఁ జేసె వ్రజాంగనాంతరా
ళిత నిజ రాసకేళి తరళీకృతవ న్మురళీధరాకృతిన్.

హిందూదేశ ఆర్థికస్థితి

చావలి వెంకట హనుమంతరావుగారు, యమ్. ఏ.

కేంద్రరాష్ట్రప్రభుత్వముల ఆర్థికసంబంధములు

(వెనుకటి సంచిక- తరువాయి)

౪

మూడవభాగములో రాష్ట్రప్రభుత్వములకు ఆదాయమార్గము లో ముఖ్యమైనదగు భూమిపన్నును గురించి విచారించితిమి. ఆప్రభుత్వములకు ఆదాయమార్గములలో రెండవదియగు కోర్టుస్టాంపులు, కోర్టు రుసుములు మొదలగువాటినిగూర్చి ఆలోచింతము. స్టాంపులలో రెండువిధములు కలవు. ఒకటి, వర్తక వ్యాపారములకు ఉపయోగించు స్టాంపులు (Commercial Stamps). రెండు, కోర్టుఫీజుస్టాంపులు (Court fees Stamps). మొట్టమొదటిది వర్తకులు సరకుల కొనునప్పుడును, అమ్మినపుడును అగ్రీమెంట్లు వ్రాసుకొనుటకు మొదలగువాటికి ఉపయోగించబడును. రెండవది కోర్టులో వ్యాజ్యములు వేయుసందర్భములో ఉపయోగించునవి. ప్రతిసంవత్సరమును ఈరుసుములను తగ్గించవలయునని సాధారణముగ అన్నిరాష్ట్రీయశాసన సభలయందు తీర్మానములు చేయబడుచున్నవి. ప్రస్తుతము ఈమార్గమునుండి ౧౪ కోట్ల రూపాయలు ఆదాయము వచ్చుచున్నది. ఈ ఆదాయమంతయు రాష్ట్రప్రభుత్వముల ఖజానాలలోనికే పోవుచున్నది. కోర్టుఫీజుస్టాంపు రుసుములను తగ్గించవలెనని కోరుట చాల పొరపాటని మాఅభిప్రాయము. ప్రభుత్వమువారు ప్రజలకుచేయుచున్నట్టియు, చేయవలసినట్టియు సౌకర్యములలో న్యాయమును ప్రతివారికిని అందుబాటులోనుండునట్లు చేయుట ముఖ్యమైనది. అట్టి లాభకరమగు పనిచేయుచున్నప్పుడు ప్రభుత్వము దానిఖర్చుకై ప్రజలయొద్దనుండి కొంతరాబడి తీసుకొనజూచుటలో ఆశ్చర్యమేమియు నుండవలసిన పనిలేదు. మరియు, దేశమందు డబ్బును, నాగరికతయు ఎక్కువయగు కొలదిని ప్రజలు న్యాయస్థానముల నెక్కువగా ఉపయోగించుకొనుట కవకాశము లున్నవనుట సామాన్య విషయము. న్యాయస్థానములలో ప్రజలు తమసొమ్మును వ్యయముచేయుట సరియైనపనియా కాదా యను విషయము ప్రస్తుతము చర్చనీయాంశముకాదు. ఏకారణముచేతనైననేమి, వ్యాజ్యములు ఎక్కువయగుచున్నవి; దానిమూలముగ న్యాయస్థానములపై ఎక్కువ ఖర్చుపెట్టవలసిన ఆవశ్యకత కలుగుచున్నది. ఆఖర్చునకు కావలసినసొమ్ము ప్రభుత్వమువారిచేతులలో నుండినగాని లాభము లేదు. ఈవిషయమునుగూర్చి మనము స్థిరమనస్కులమైన తరువాత ఈ రాబడి ఏప్రభు

త్వమువారికి చెందవలెనను సంగతి విచారించ వచ్చును. ప్రస్తుతము ఈ రాబడియంతయు రాష్ట్రప్రభుత్వములకే చెందుచున్నదని పైన చెప్పియుంటిమి. ఆవిధముగ కాక దానిలో కొంతభాగము అనగా వ్యాపారసందర్భము లలో ఉపయోగించు స్టాంపులపై ఆదాయము సుమారు ౭ కోట్లరూపాయలు కేంద్రప్రభుత్వ మువారికి చెందునట్లు ఏర్పాటుచేయవలెనని కొందరుసూచించుచున్నారు. ఈసూచనసంస్క రణముల మొదటను కేంద్రప్రభుత్వమువారి ఆదాయములో లోటున్నప్పుడు చేయబడినదై యుండుటచే అప్పట్లో కొంత దానికి బలముండి నప్పటికిని ఇప్పుడు ఆప్రభుత్వమువారి ఆదా యము ఎక్కువయగుచున్న సందర్భములో దాని క్షేమార్థమును కారణమున్నట్లు కన్పిం చదు. కేంద్రప్రభుత్వమువారి ఖర్చుకు సరిపో వుఆదాయము ఇతరమార్గములద్వారా వచ్చు చున్నప్పుడు ఈసూచనప్రకారము రాష్ట్రప్ర భుత్వముల ఆదాయమును తగ్గించు మార్పు నకు అవసరములేదు. అయినను పరిపాలనా విధానపు దృక్పథమునుండి చూచిన ఈమా ర్పుచేయుటకు కొంతకారణము కలదేమోఅని యనుపించును. ఎందువల్లననగా వ్యాపార వర్తక సంబంధములగు స్టాంపులు సాధారణ ముగ ఎగుమతి దిగుమతులు, విదేశవ్యాపా రము, ప్రభుత్వమువారి బాండ్లు (Government Securities), అమ్మకము, మున్నగు పనులకు ఉపయోగింప బడుటచేతను, ఇండియా ప్రభు త్వము వారికే వర్తకము, విదేశవ్యాపారము మొదలగు శాఖలపై అధికార ముండుటవల నను ఆశాఖపైవచ్చు ఆదాయము వారికే చెంద వలెను. ఈవిషయమై ఆలోచించుట కేర్ప రుపబడిన అనేకసంఘములలో ఒకటియగు జాయింటుపార్లమెంటరీ కమిటీవారు వర్తకవ్యా పారముల స్టాంపులు కేంద్ర ప్రభుత్వమువారి యాజమాన్యము క్రిందనే యుండవలెననియు, కోర్టుస్టాంపులు రాష్ట్రప్రభుత్వముల క్రింద నుం డవలెననియు సూచించియుండిరి. కాని మెస్టను కమిటీ (Meston Committee)వారి రాపద్ధతికి వ్య తిరేకముగ అన్నిరకముల స్టాంపులనుండివచ్చు ఆదాయమును రాష్ట్రప్రభుత్వములకే పోవల యునని అభిప్రాయము నిచ్చియున్నారు. ఈరెం డు అభిప్రాయములలోను చివరదానితోనే మన మేకీభవింపవలసి యుండునని పైచర్చ వలన తేలుచున్నది.

రిజిస్ట్రేషన్:— రాష్ట్రప్రభుత్వములఆ దాయ మార్గములలో రిజిస్ట్రేషన్ రుసుముల (Registration fees) నుండి వచ్చు ఆదాయము కూడ ముఖ్యస్థానము నాక్రమించుచున్నది. స్టాంపులలో రెండురకము లుండినట్లే రిజిస్ట్రే షన్లోకూడ రెండువిధములున్నవి. మొద టిది దస్తావేజులు (అనగా తనఖాదస్తావేజులు, భూములు అమ్ముటకు కొనుటకు దస్తావేజులు మొదలగునవి) మున్నగువాటికి రిజిస్ట్రేషన్ చేయించుట. రెండవది కంపెనీలు, పబ్లికుసం స్థలు మున్నగువాటిని రిజిస్ట్రేషన్ చేయిం చుట. మొదటిరకములో చేరిన వాటిలో రిజి స్ట్రేషన్ ముఖ్యముగ అవసరమయినవి కొన్ని

గలవు; మరికొన్నిటికి రిజిష్టరు చేయించుటా, చేయకపోవుటాయను విషయము వాటిని వ్రాయించుకొనువారి ఇష్టానిష్టములపై ఆధారపడి యుండును. ప్రస్తుతములో ఏఆస్తిఅయినను ఒకరి చేతులనుండి ఇంకొకరి చేతులలోనికి మారునప్పుడెల్లను రిజిస్ట్రేషన్ అవసరముగు చున్నది. ఈమార్గముగా రాష్ట్రప్రభుత్వము లకు సంవత్సరమునకు ౧౩౧ లక్షలరూపా యలు ఆదాయము వచ్చుచున్నది. దానిలో సుమారు ౭౫ లక్షలు ఖర్చుక్రింద తీసివేసినను నికరాదాయము ఇంకొక ౭౫ లక్షలవరకుండు ననుటకు సందేహములేదు. ఇప్పటికన్న ఈమా ర్గమునుండి ఎక్కువ ఆదాయమును సంపాదిం చుట కవకాశములు కలవు. ఒకటి పుట్టుకలు, పెండ్లిండ్లు, చావులు రిజిస్టరు చేయబడుటకు ఏర్పాటుచేసి ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు ఒక అణావొప్పున సుంకము విధించిన సుమారు ౧౫ లక్షల రూపాయలు ఎక్కువ ఆదాయము రా గలదు. శారదాగారి బాల్యవివాహ నిషేధక చట్టము క్రింద ఇట్టి రిజిస్ట్రేషన్‌కు చాలఅవస రముకూడ కలదు. బాలికాబాలకులకు పెండ్లి సమయమందు వయస్సు నిర్ణయించవలసివచ్చి నప్పుడు ఈరిజిస్ట్రేషన్ చేయుటవలన చాలలా భముండును. ఏవిధమైనతకరారులు లేకుండ వయస్సు నిర్ణయించుటకు వీలగును. రెండవది, వ్యాపార సంబంధములగు దస్తావేజులపైనను, వాటిని ఖరీదుచేయునప్పుడును కొంతరుసుము నువిధించిన ఇంకొక ౧౦ లక్షల రూపాయిలు ఆదాయమును సంపాదించవచ్చును. ఈరెండు మార్గములును పరిశోధించుటకును, ఉపయో గములోనికి తీసికొనివచ్చుటకును ప్రయత్నము లు చేయుట ముఖ్యము.

మద్యపానముపై ఆదాయము:—మద్య పానములేక అబ్కారీశాఖ మాంటిఫర్డు సం స్కరణముల అనంతరము రాష్ట్రీయప్రభు త్వముల అధికారము క్రింద చేర్చబడినది. ఈమూలముగ రాష్ట్రప్రభుత్వములకు వచ్చు ఆదాయము ౨౦ కోట్ల రూపాయలకు దాదా పుగ నున్నది. ఈఆదాయమును వసూలుచే యుటకు ౧౫౦ లక్షల రూపాయలవఱకు ఖర్చు గునని అంచనావేసి నప్పటికిని నికరాదాయము ౧౮ కోట్ల ౫౦ లక్షలవరకును తేలును. ఈఆదా యము సందర్భములో మనదేశ సంఘసంస్క ర్తలు, రాజకీయవేత్తలు ఇతరులు అనేకవిధ ముల ప్రభుత్వము వారిని ఖండించుచున్నారు. జనులను దుర్బలులనుచేసి, వారిశారీరికమానసి కదార్ఢ్యములను నీరసింపజేసి ప్రభుత్వము వారు ఆదాయమును సంపాదింప జూచుట శోచనీయమని మన మొప్పుకొనక తప్పదు. ఈమార్గమునుండి వచ్చుఆదాయమును వీలై నంతవరకు తగ్గించవలెననియు, అవకాశము లున్న మద్యపానమును నిషేధించుచు ప్రభు త్వమువారు శాసనము చేయవలెననియు మనదేశీయులు కోరుచున్నారు. శాసనాధి కారమువలన సంఘసంస్కరణమును తీసికొని వచ్చుటకుప్రయత్నించుట తప్పనియు, ప్రజలలో ప్రబోధమువలననే అట్టి సంస్కరణము చేయు టకు ప్రయత్నించవలెననియు కొందరు చెప్పు

మాటలను ఈకాలములో ఎక్కువపాటింప వలసిన అవసరములేదు. ప్రతి సంవత్సమును ప్రతిరాష్ట్ర శాసనసభయందును మద్యపాన శాఖామంత్రులను ఈవిషయమై ప్రశ్నలు వేయుచు నిషేధక చట్టములను ప్రవేశ పెట్టవలయునని అనధికారసభ్యులు కోరుచున్నారు. కానిఅట్లు చేయుటకు కొన్ని ముఖ్యమైన అడ్డంకులను ప్రభుత్వమువారు చూపుచు అవిషయమై శ్రద్ధపుచ్చుకొనక ముందెప్పుడో అనుకూలపరిస్థితులేర్పడి నప్పుడు దానివిషయమై ఆలోచించెదమని చెప్పుట వాడుకయయినది. మద్రాసు రాష్ట్రములో ౩౦ సం॥లోపుగ మద్యపాననిషేధమును పూర్తిగ అమలులోనికి తీసుకొనిరావలసినదని శాసనసభవారు తీర్మానము చేసి యున్నారు. దానిపై ఈసంవత్సరమే మద్యపాననిషేధమును గురించి రాష్ట్రమంతటను ప్రచారము చేయుటకు ప్రభుత్వమువారు లక్షల రూపాయలను సాంక్షను చేసి పనిసాగించుచున్నారు. దీనివలన ఏమైన లాభముండునా యనునదియు, ఒకప్రక్క ప్రతిచోటను మద్యపానమునకు వీలగునట్లు క్రొత్తషాపులను తెరచుట కనుమతినిచ్చుచు, వేరొకప్రక్క మద్యపాననిషేధమును గూర్చి ప్రచారము సాగించుటవలన ప్రభుత్వమువారీవిషయమై దీక్ష గలిగి యున్నారా యనునదియు ఆలోచించ వలసిన విషయములే.

మద్యపానమువలన వచ్చు ఆదాయము తగ్గిపోయిన ఆలోటును పూడ్చుటకు ఏమైన విధానములను ప్రజాప్రతినిధులు సూచించిన మద్యపాన నిషేధమును ప్రవేశ పెట్టుటకు ఏవిధమైన అడ్డంకులు నుండవని ప్రభుత్వమువారి వాదనమై యున్నది. మఱియు మన దేశములోకూడ అమెరికా దేశములో చేసినట్లు మద్యపాననిషేధము నమలులోనికి తీసుకొని వచ్చినఆనిషేధము సరిగాసాగుచున్నదో లేదో విచారించుటకు, అది సరిగా సాగునట్లు చూచుటకు ఇప్పటి కన్న చాల ఎక్కువమంది ఉద్యోగస్థులును, ఎక్కువ ఖర్చును కావలసియుండునని కూడ వారు వాదించుచున్నారు. ఈవిషయమును గూర్చిచర్చించుటలో పరస్పర విరుద్ధములగు రెండు సంగతులు మనము జ్ఞప్తియం దుంచుకొనవలెను. ఒకటి ప్రజలమానసిక శారీరకసౌభాగ్యమునకు సంబంధించినది; రెండవది ప్రభుత్వమువారి ఆదాయమును గురించినది. మొదటిదాని వలన ప్రజలకు చాల, లాభము కలుగు ననుమాట నిజమే; రెండవది తగ్గిపోవుటవలన ప్రజలకు నష్టము కల్గునన్న మాటకూడ నిజమే.ఏలనన ప్రభుత్వాదాయము తగ్గిపోయిన ఆలోటును పూర్తి చేయుటకు ఇతరపన్నులను విధించుట అవసరమగు. దానివలన నష్టపడువారు ప్రజాసామాన్యమే యనునంగతి తేటతెల్లము. ఈవిషయము ముఖ్యముగా గమనార్హమై యున్నది. కాని క్రొత్తపన్నులనిచ్చుకొనుటవలన ప్రజలకువచ్చు నష్టమును, మద్యపాననిషేధము వలన వారికివచ్చు లాభములను సరిచూచిన రెండవదానివలన వచ్చు

నష్టమే చాలతీవ్రమైనదని ఒప్పుకొనక తీరదు. మనదేశములో ముఖ్యమైన సంస్కరణములలో ఈమద్యపాన నిషేధ మొకప్రధానమైనదని మాఉద్దేశ్యము. ఈసూత్రమును ప్రభుత్వమువారు ఆచరణలోనికి తీసుకొనివచ్చుటకు తీవ్రముగప్రయత్నము చేసిననాడు శాసనసభలు తప్పక దానివలనకల్గు ఆదాయపులోటును పూడ్చుటకు క్రొత్తపన్నులను తప్పక ఆమోదించుననుటకు సందేహములేదు.

ఈసందర్భములో కొందరు ఆర్థికశాస్త్రజ్ఞులు ఒకసూచన చేయుచున్నారు. అదిఏమన, మద్యపానముపైవచ్చు ఆదాయమును కేంద్రప్రభుత్వము వారి యాజమాన్యము క్రిందకు మార్చి ఆదాయపుపన్ను రాబడిని రాష్ట్రప్రభుత్వములు కీయవలెనని. పన్నుల విచారణ సంఘము వారుకూడ ఈసూచన నామోదించుచుతమ రిపోర్టులో వ్రాసియుండిరి. ఈసూచన (ఇంతకుముందే దీనినిగూర్చి తెల్పియుంటిమి) చాలవరకు సమంజసముగ నున్నను కొన్ని అసందర్భములుకూడ దానియందున్నవని చెప్పక తీరదు. ఆదాయపుపన్ను విధించు అధికారము రాష్ట్రములకు మార్చివేసిన దేశమందంతటను ఒకేపద్ధతిపై పన్నును విధించుటకవకాశములు తగ్గిపోవును. ఏరాష్ట్రమునకా రాష్ట్రము వేర్వేరు పద్ధతులపై ఆదాయపుపన్నును విధించు పరిస్థితు లేర్పడును. కాని ఇదివరలో చెప్పినట్లుగా ఇకముందు రాష్ట్రములుచేయవలసియుండు ఖర్చుసంగతి మనస్సునందుంచుకొని ఆలోచించిన ఆదాయపు పన్నువంటి అత్యుత్తమ ఆదాయమార్గము వాటిచేతులలో నుండుట చాలలాభమని స్పష్టమగును. ఇంక కేంద్ర ప్రభుత్వమువారి దృక్పథమునుండి ఆలోచించిన, ఇకముందు మద్యపాన నిషేధమును ప్రవేశపెట్టు భారము వారిభుజములపైపడును. దానివలన వారిఆదాయము తప్పక తగ్గిపోవును. కాని ఎగుమతి దిగుమతి సుంకములను ఎక్కువగ విధించుట వలనను, పైదేశములనుండి దిగుమతియగు త్రాగుడు మత్తుపదార్థముల (foreign liquors and intoxicants) పై నిషేధపు సుంకములను విధించుట వలనను, రైల్వేలనుండి జనరల్ రెవిన్యూలకు వచ్చు భాగమును వృద్ధిచేయుటవలనను ఈలోటును తేలికగ పూర్తిచేసుకొనవచ్చును. ఇప్పుడున్న పద్ధతి ప్రకారముకూడ ఇతర దేశములనుండిదిగుమతియగు త్రాగుడువస్తువులపై ఇండియా ప్రభుత్వమువారే పన్నులను విధించుచున్నారు. వాటిపై నెంత ఎక్కువ పన్నును విధించిన అంత లాభము; ఏలనన ఆవస్తువులను ఉపయోగించువారు ఎక్కువ డబ్బుగలవారే యగుటచే వా రెంతపన్నయినను ఇచ్చుకోకల్గినవారై యుందురు. పైనచెప్పబడిన సూచన ఆచరణ యోగ్యమై, లాభదాయకమై యుండుననుటకు సందేహము లేదు. క్రొత్తసంస్కరణములను ప్రవేశపెట్టుసమయములో దానిని మనస్సునం దుంచుకొని మనదేశ నాయకులు ఆమార్పునుచేయవలెనని కోరుట అవశ్యకము.

ఇదికాక వేరొక సూచన ఏమనగా, అబ్కారీశాఖ కేంద్రప్రభుత్వము వారికి పూ

ర్తిగ అధీనముచేసి, వారికి మద్యపాననిషేధమును ప్రవేశ పెట్టుటవలన వచ్చునష్టమును పూర్తి చేయుటకు ఆదాయపుపన్ను వలన వచ్చు ఆదాయములో సగము కేంద్ర ప్రభుత్వమునకును, సగము రాష్ట్రప్రభుత్వములకును ఈయవలయుననునది. ఈపద్ధతిలో ముఖ్యముగానున్న లోటేమన: ఆదాయము విభజనచేయుట ఈకాలములో ఆర్థికశాస్త్రతత్వమునకు వ్యతిరేకము దానివలన రెండు ప్రభుత్వములకు మధ్య పరస్పర భేదాభిప్రాయములు, తగవులాటలు కలుగుట కవకాశము లున్నవి. ౧౯౧౨ సం॥ వరకు మన దేశపు ఆర్థికవిధానము ఈపద్ధతిపై నడుపబడుచుండుటచే చాలనష్టము కలిగి యున్నది. ఈ కారణము లన్నిటిని బట్టి ఈ సూచన ఎక్కువ ఆమోదకరము కాదు.

అటవీశాఖ:—మన దేశములో ప్రభుత్వము వారికి ఆదాయ మార్గములలో అటవీశాఖకూడ ప్రాముఖ్యస్థాన మాక్రమించుచున్నది. ఈ శాఖనుండి సంవత్సరమునకు ౭ కోట్లరూపాయల వరకు ఆదాయము వచ్చుచున్నదని చెప్పిన దాని ప్రాముఖ్యము స్పష్టమగును. ఈ ఆదాయము ఏవిధ మైనపన్ను (Tax)లవలన గాక, రాయల్టీస్(Royalties), అడవులలో నుండు కలప, గడక్రలు, గడ్డి మొదలగు పదార్థములను ఉపయోగించుకొను వారిపై విధింపబడు రుసుముల (Dues) వలన వచ్చుచున్నది. (పన్నులకును, రుసుములకును కలభేదమేమన: మొదటివి ఒక శాసనసభవారు శాసనము మూలముగ విధించునవి; రెండవది ఆయా దేశభాగములో ఆయా ప్రత్యేకాధికారుల వలన విధింపబడునవి. ఇంకొకభేదము: పన్నులు అందరకును ఒకేమోస్తరుగ ఒకేవిధానమునుబట్టి విధింపబడును. రుసుము లట్లుగాక వేర్వేరు భాగములకు వేర్వేరు విధములుగ వేర్వేరువిధానములను బట్టి విధింపబడును.) మన దేశములో అడవులు చాలవరకు ప్రభుత్వమువారి స్వంత యాజమాన్యము క్రింద (Government nonopoly) నుండి, వారిచేతనే నడుపబడి దానివలనవచ్చు ఆదాయమును వారే తీసుకొనుచున్నారు. కేవలము వ్యాపార దృష్టి (commercial and business standpoint)నుండి చూచిన ఈశాఖను ప్రభుత్వమువారు సరియగు పద్ధతులపై నడిపించుచు ఇంకను పూర్తిగ అభివృద్ధి పొందక అభివృద్ధి పొందుట కవకాశములు కల అడవులను ఒక పద్ధతిపై అభివృద్ధి పొందించుట కేర్పాట్లు చేసిన, మన దేశమున కపారమగు లాభము వచ్చుటయే కాక ప్రభుత్వము వారికి ఎక్కువఆదాయము వచ్చుటకు కూడ అవకాశములు కలవు. మన దేశపు అడవులలో పెరుగుచు పరిశ్రమలకు ఉపయోగముగా నుండు వస్తువులు (Forest Produce) సుమారు ౨౮౦ కోట్ల రూపాయలు విలువకలిగి యుండునని అంచనా వేయబడినది. ఈ అడవులలోనున్న చెట్లను, ఇతర వస్తువులను శాస్త్రోక్తముగ పెంచు నేర్పాట్లుచేసిన దేశమున కుపయుక్తములగు కాగితము, అగ్గిపుల్లలు, రబ్బరు,సోపు మొదలగు పరిశ్రమలకు ఎక్కువ ప్రోత్సా

హము కలుగ చేయవచ్చును. ప్రతిసంవత్సరమును మన దేశమందు తయారగుచున్న ३०,००० టన్నుల కాగితము కాక సుమారు ८०,०००టన్నులకాగితమును మనము దిగుమతిచేయుచున్నాము. అట్లే పరదేశములనుండి ప్రతియేటను ౧౮౦లక్షలఅగ్గిపెట్టెలను మనము దిగుమతి చేయుచున్నాము. అడవులను అభివృద్ధిచేయుటవలన ఈ పరిశ్రమలకు కావలసిన కలప, గడకర్ర, గడ్డి, మంచిగంధపుచెక్క, మొదలగువస్తువుల నన్నిటిని ఈదేశమందే సేకరించుకొనవచ్చును. వీటినన్నింటిని ఉపయోగించుకొనుటకు హిందూదేశపు కంపెనీలవారికే అధికారమిచ్చిన వాటివలన వచ్చులాభమంతయు మన దేశమందే నిల్చిపోవును. ఈఅభివృద్ధి ఏర్పాట్లు చేయుటకు ప్రథమములో (Initial Expenditure) ౫౦ కోట్లరూపాయిలు అగునప్పటికిని దానిపై కొన్నాళ్లయినతరువాత ౧౦కోట్ల రూపాయిలు ఆదాయము వచ్చుననుటకు సందేహములేదు. దానిలో ౨ కోట్లు వడ్డీక్రింద తీసివేసినను నికరాదాయము ८ కోట్లవరకునుండును. అడవులశాఖ మాంటాగ్యుసంస్కరణముల ప్రకారము రాష్ట్రీయప్రభుత్వముల యాధీనము క్రింద చేర్చబడినది. ఇకముందుకూడ ఆపద్ధతియే సాగించుట నవసరము. పైన సూచించిన అభివృద్ధి ప్రణాళిక అట్టి పరిస్థితులయందు మాత్రమే సాధ్యమగును.

సీటిపన్ను:—రాష్ట్రీయ ప్రభుత్వముల ఆదాయ మార్గములలో సీటిపారుదల రుసుములు (Irrigation Dues) కూడ ముఖ్యమైనవని చెప్పియుంటిమి. ప్రభుత్వమువారు నీరునప్లయి చేసినందులకు చార్జిచేయు రుసుములలో పన్ను సంబంధ (element of taxation) మేమైన ఉన్నదా యనువిషయమునుగూర్చి భేదాభిప్రాయము లున్నవి. పన్నులవిచారణ సంఘమువారు ప్రభుత్వము వారీరుసుముల వలన లాభమును పొందజూచుటచే వాటిని గూడ పన్నులుగానే పరిగణింప బడవలెనను నభిప్రాయము నిచ్చియున్నారు. ఈరుసుములను పోస్టలుచార్జీలతో పోల్చిచూచిన ఈవిషయము స్పష్టమగును. పోస్టాఫీసు శాఖ (Postal Department) ప్రజోపయుక్తమగు శాఖగా నుండవలయుననియు, దానినుండి ప్రభుత్వమువారు లాభమును తీయుటకు ప్రయత్నించకూడదనియు ఇదివరలో చెప్పియుంటిమి. ఆసూత్రమునుబట్టి ప్రభుత్వమువారు పోస్టుకవర్ల కార్డులమొక్క ఖరీదు నిర్ణయించుటలో ప్రజలు వాటిని విరివిగా ఉపయోగించుటకందుబాటులోనుండునట్లు చూడవలెననియు కూడ ఇదివరలో చెప్పబడినది. కాని వ్యవసాయపు సీటిసప్లయిరుసుములు ఈవిధముకాక ప్రభుత్వము వారికి ఒకముఖ్యఆదాయము మార్గముగా నుండుటచే వాటిలో పన్ను సంబంధమేమియు లేదని చెప్పవీలులేదు. భూమిపై పండు పంటనుబట్టి సీటిరుసుముల నిర్ణయమును ప్రభుత్వమువారు చేయుచున్నారు. కాన నీటి సప్లయి ప్రభుత్వమువారు ప్రజలకుచేయు ఒక సేవకు ఖరీదు (cost of services rendered)

కాక ఆదాయము సంపాదించు మార్గము (source of revenue) గా నున్నది.

ఈకాలములో ప్రభుత్వమువారు వ్యవసాయాభివృద్ధికి నీటివసతుల నేర్పాటుచేయుట ఆవశ్యకమని గ్రహించి ఆపనికి ఉత్సాహముతో కడంగుచున్నారు. నీటివసతి సరిగలేక కేవలమువర్షముపై నాధారపడియుండుటవలన వ్యవసాయపరిశ్రమకు తీరనినష్టము వాటిల్లుచున్నదనియు, దేశమునందు క్షామములు పదేపదే సంభవించుచున్నవనియు స్థిరపడిన తరువాత ప్రభుత్వమువారు వ్యవసాయమునకు నీటివసతులనేర్పర్చుటకుపూనుకొనియున్నారు. పంజాబ్ రాష్ట్రము నందలి సట్లెజ్‌వాలీ ప్రాజెక్టు (Sutlej Valley Project) సింధురాష్ట్రములోనిసుక్కూరుబారేజి(Sukkur Barrage), మన రాష్ట్రములో మెట్టూర్ ప్రాజెక్టు(Mettur Project), ఇంకను ఇతరములగు వ్యవసాయపు కట్టడములు ఈపూనికయొక్క ఫలితములే యని చెప్ప వచ్చును. ఈకట్టడముల కన్నిటికిని సుమారు ౨౨ కోట్ల రూపాయలు ఖర్చగునని యు, వాటివలన సుమారు ౭౦ లక్షలయెకరముల భూమిని క్రొత్తగా సాగుబడిచేయుటకు వీలగునని యు అంచనా వేయబడినది. ఈసొమ్మంత యు ఇంగ్లండు దేశములో అప్పు చేయబడినది; దానిపై మనము వడ్డీ నిచ్చుకొనుచున్నాము. కాని వాటివలన మనకు ప్రతి ఫలము(Productive) వచ్చుచుండుటచే ఎక్కువ నష్టము లేదని చెప్ప వచ్చును.

నీటిరుసుములు వేర్వేరు రాష్ట్రములలో వేర్వేరు విధఅసుగ విధింప బడుచున్నవి. కొన్నిరాష్ట్రములలో అవి భూమి పన్నుతో కల్పియే విధింపబడుచున్నవి; కొన్నిరాష్ట్రములలో ముఖ్యముగా మనరాష్ట్రములో భూమి పన్ను వేరుగను, నీటిపన్ను వేరుగను విధింపబడుచున్నవి. నీటితీరువరేట్లుకూడ వేర్వేరు విధములుగనుండి ఒకరాష్ట్రములోనే వివిధములగు రేట్లు అమలునందున్నవి. ఇట్లే ఏసంవత్సరమున కాసంవత్సరమే రుసుములను విధించు పద్ధతి కొన్నిప్రాంతములయందును, కొన్ని సంవత్సరముల కొక్కసారియే కంట్రాక్టు పద్ధతిపై రుసుములను విధించుపద్ధతి ఇంక కొన్ని ప్రాంతములందును అమలునందున్నవి.

మనదేశమందు వ్యవసాయపు కట్టడములు (Irrigation Works) మూడు విధములుగ నున్నవి. (౧) ప్రతిఫలము నిచ్చునట్టివి(Productive Works)-అనగా ఇవి వ్యవసాయము నభివృద్ధిచేయుటకే ముఖ్యముగా కట్టబడినప్పటికిని వాటిపై ఖర్చు పెట్టబడిన సొమ్మునకు వడ్డీయే కాక పైగా లాభముకూడ వచ్చుచున్నట్టివి. (౨) వ్యవసాయపు సంరక్షణకొరకేర్పడినట్టివి - వీటినే (Productive Irrigation Works) అందురు. అనగా ఇవి క్షామము తరుచుగావచ్చు ప్రదేశములో వ్యవసాయము నీటిఇబ్బంది లేకుండ సాగుట కేర్పాటు చేయబడినవి కాని లాభము వచ్చునను ఉద్దేశ్యముతో కట్టబడినవి కావు. (3) చిన్నకట్టడములు (Minor Irrigation

Works)వీటిలో౧౦,౦౦౦రూపాయలకు ఎక్కువ కాకుండ కట్టబడిన కాలువలు, చెరువులు మొదలగున వన్నియు చేరును. వీటికన్నిటికిని సుమారు ౫౮ కోట్ల రూపాయలను ప్రభుత్వమువారు వ్యయపర్చియున్నారు. ఆసొమ్ముపై వడ్డీ సంవత్సరమునకు ౩౮౦ లక్షల రూపాయలు (౧౯౩౮-౩౯ సంవత్సరపు లెక్కల ప్రకారము) పోను నికరాదాయము ౭౦౦ లక్షలరూపాయలు మిగులుచున్నవి. ఇప్పటికన్న ఈవ్యవసాయపు కట్టడముల నెక్కువచేయవలసిన యావశ్యకత వ్యవసాయవృత్తియే ప్రధానవృత్తిగాగల మన దేశములో ఎక్కువ కలదని వేరుగ చెప్ప నక్కరలేదు.

ఈవిషయమును గురించి ఆలోచించు సందర్భములో పన్నుల విచారణసంఘమువారు వ్యవసాయ రుసుములను విధించుటనుగూర్చి చేసిన సూచనలను గమనించుట ముఖ్యము. వీలయినంతవరకు నీటిరుసుములను భూమి పన్నునుండి వేరుచేయవలెననియు, వ్యవసాయ సంరక్షణ కేర్పడిన కట్టడముల విషయములో తప్ప ఇతర సమయములందు నీటిరుసుములను విధించుటకు పూర్వము నీటిసప్లయివలన వ్యవసాయదారునకు వచ్చుచున్న లాభములో ఒక చిన్నభాగముగమాత్రమే ఆరుసుము లుండు నట్లు చూడవలెననియు వారిసూచనయొక్క సారాంశము. నీటిరుసుములు వ్యవసాయదారులకు కష్టములేకుండ ఇచ్చుకో కల్గియుండు నట్లు ఏర్పాటుచేయుట చాలముఖ్యము; అది ప్రభుత్వమువారి విధియై యున్నది. ఈవిషయమైకూడ భూమిపన్ను విధించుట కుండవలయు నట్లుగానే 'చట్ట' బద్ధమగునియమము లుండిన గాని లాభము లేదు. ప్రతిరాష్ట్రప్రభుత్వమును అట్టిచట్టములనేర్పాటుచేసివ్యవసాయదారులకు నీటిసప్లయిపై గల జన్మహక్కులను (natural rights) ను స్పష్టీకరించుట అవసరము.

ఆ మె కొ ఱ కె

పురిపండా అప్పలస్వామి గారు (కవితాసమితి)

ఆమెఱుపుకన్నె నాప్రియురాలు; ఆమె
చంచల దృగంచలమ్ముల ఛాయలందె
నే విహరింతు; ఆమెకెమ్మోవిఁ గాయు
లేఁత వెన్నెల కొఱకె యర్పింతు నా స
మస్తజీవితమును; ఆమె మధుర మధుర
భాషణమ్ముల కొఱకె నే పలవరింతు;
ఒక్క చుక్కైని లేని యీయుగ్రరాత్రి
నీమహానీరవాంధకారామనస్య
వాటికల భయంకర వజ్రపాత నిబిడ
నిస్వనమ్ముల నున్మత్త నియతి తోడ
నామె కొఱకె యన్వేషింతు నామెకొఱకె.

గ్రామగ్రంథాలయము

యస్. ఆర్. రంగనాథన్ గారు,
మదరాసు విశ్వకళా పరిషద్గ్రంథాలయాధికారి

గ్రంథాలయముకంటె ఎక్కువ లాభకారి, జాతి పురోభివృద్ధికి అవకాశాలు గలది, మానవుడు తనకై నిర్మించుకొన్న మార్గము మఱొక్కటేదీ లేదనవచ్చును. మఱొక్కటి యేదీ అంతకంటె విరివి అయిన పరిసరము, సరళమైన గంగము, విస్తృతమైన తాత్పర్యము చలాయించుకోలేదు. అయినప్పటికీ అది తన రాజ్యమును ప్రవేశించడానికీ, చేపట్టడానికీ జంకుతూ ఉంది, కొను దీస్తూ ఉంది.

చిన్నపాఠశాల మొదలు పెద్దకళాశాలలవఱకు గల విద్యాశాల లన్నిటికంటెనుకూడా సౌకర్యములోనూ, స్వాతంత్ర్యములోనూ గ్రంథాలయము మిన్న. యుక్తవిద్య (వ్యక్తులైనవారి విద్య) విషయమై అవసరానికి ఆదుకో గలిగిన సంస్థ ఇది ఒక్కటే. విద్యాప్రణాళిక, కట్టడి, వయస్సు-వీనివిషయమై కొలతలుకాని, మతము, ధర్మము, కులము-వీనివిషయమై నిర్బంధములుకాని దీనికి లేవు.

ప్రాజ్య(పల్లికు)గ్రంథాలయములలో గ్రామ గ్రంథాలయము ప్రత్యేక మొక తరహా. ప్రత్యేకము సాధించుకో వలసిన సమస్యలు దానివి దానికి ఉన్నవి. గ్రామభూములలో జనాభా చెదరి ఉండడముచేత భావైక్యము, క్రియైక్యము కష్టము. జనపదముకంటె నగరము క్రియారంభానికి ఎక్కువ ఏర్పాటుగా ఉంటుంది. కాబట్టి ఏకతానతతో ఆశయము, కార్యము సరియైనమార్గములో పెట్టడానికి ఒక సన్నాహకేంద్రము చాలా ఆవశ్యకము. ఈవిషయము సర్వవిధాలా గ్రామీణసమస్యకు ఒక అంగము. గ్రామ గ్రంథాలయాశయము నెఱవేఱవలెనంటే, ఈకేంద్రము పూచీ వహించాలి. ఆపూచీ గ్రామస్థుని చేతులలో విడిచి పుచ్చడము లాభము లేని పని.


మన రాజధానిలో గ్రామ గ్రంథాలయానికి గొప్ప ఆవశ్యకము ఉన్నది. మన గ్రామస్థునికి సమృద్ధిగా ఉన్న దేదీ అంటే తీరిక. దాదాపు అర్థసంవత్సరము తీరికే. ఆతీరిక ఏవిధముగా వినియోగించవలెనో అతనికి తెలియడము అరుదు. అదనమైన ధనమూ, శక్తి ఏలాగో, ఆలాగే అదనమైన సమయమున్నూ వ్యర్థముగా విడిచిపెట్టితే గొప్పఅనర్థం లేగలదు. గ్రామస్థుని మెండైన తీరిక సరియైనమార్గములో సంఘము ఉపయోగ పెట్టుకొనకపోతే, అతడు దానిని దూబరఖర్చు చేసి తీరుతాడు; దుష్టజీవనములో తన ఆధ్యాత్మిక సంపద వ్యర్థపుచ్చివేస్తాడు; మఱీ—తఱచుగా సంభవిస్తూనే ఉంది—వ్యాజ్యాలు పెరిగి, కాలము పంపుకొనే జ్వరములో కోర్టులవీద విరుచుకుని పడతాడు.

అటువంటి వ్యాపారము నుంచి గ్రామస్థుని కాపాడడానికి గ్రామ గ్రంథాలయము చాలా తోడ్పడక మానదు. ఇక్కడ కనపడుతుంది దీనికిగల గొప్ప అవకాశము. ఏమంటే, తీరికవలననే కదా శిక్షణ ఫలించేది; ముఖ్యముగా ఈశిక్షణకు సాధనముగానే గ్రామ గ్రంథా‍‌లయము పనిచేయవలసిఉంది.


ఇంతే కాక గ్రామస్థుడు తనగ్రామమును విడిచి పట్టణాలకు వలసపోయే దుస్సంఘటనము మాన్పడానికి కూడా ఈ గ్రామ గ్రంథాలయము సాధనముగా చేసుకోవచ్చును. ఈవలసపోకకు అనేకప్రవాహాలు కారణభూతములై యున్నవి. మొదటిది, ఆర్థికప్రవాహము. దీనిపై గ్రంథాలయానికి ప్రభావము అరుదు; ఒకవేళ ఉన్నా మారుమూల. రెండవది గ్రామజీవనపు జడత్వము వలన బయలుదేఱినది. ఆర్థికప్రవాహము గ్రామము చాలభాగము తుడిచిపెట్టినమీదట, గ్రామజీవనము నిండుగాను, వివిధముగాను, సంతోషకరముగాను చేసియుండిన అనేకపద్ధతులు వాడుక తప్పిపోయినవి; ఇక నగరసంబంధమైన అందచందాలకు, మఱి దేనికి కాక

ఆకస్మిక ఛాయాచిత్రములు

(SNAP SHOTS)



౧. ఎడతెగని పోరాటము



౧. గోదావరి సూర్యాస్తమయము

పోయినా, వ్యామోహపడి, అనేకులు గ్రామము విడిచి నగరాలలో చేరుకుంటున్నారు. ఆలాగున గ్రామమును విసర్జించడము జాతీయాభివృద్ధికి మంచిది కాదు. అది మాన్పవలెను. అది మాన్పవలెనంటే గ్రామజీవనము ఎక్కువ ఆకర్షకముగా చేసి మేధాసంపదకు దోహదము చేసే విధానములు సమకూర్చవలెను. గ్రామ గ్రంథాలయము, ముఖ్యముగా గ్రంథములు ఎత్తి వారివారికి పంపి చదివించే యేర్పాటు, ఈ ప్రయత్నము నెఱవేర్చే ముఖ్యమార్గాలలో ఒకటి.

ఈ తీరిక గలవారిలో పట్టణవాసము చేయడానికి తగిన స్తోమతు కలవారికి మాత్రమే ఉపయోగపడేటట్లు గ్రామ గ్రంథాలయము సంచారము చేయగలదని తలపరాదు. పైపెచ్చు సరియైన మార్గములో నిర్వహిస్తే, అది పల్లెటూరి పనివాని జీవితము సహితము ఎక్కువ లాభయుక్తముగా చేయగలదు. చదువుకునే యేర్పాటులు అభివృద్ధిచేసే ప్రయత్నాలు చూచి పల్లెటూరి వ్యవసాయదారుకు మొదట అనుమానము, అపనమ్మకము పడవచ్చు. మన విద్యాపద్ధతి వృత్తుల నభిమానించక, కేవలము వాఙ్మయపరాయణము కావడము దీనికి కొంత కారణము. విద్యావిధానమంటే వ్యవసాయదారునికి భయము; ఏమంటే, అది అతని పిల్లలను పొలము నుంచి లేవదీసికొని పోతుంది; అంతకంటే మంచి బ్రతుకు తెరువు ఏదీ చూపించనూ చూపించదు. మన కనుభవమే గదా: తనపొలములో నిజాయితీగా, ఆరోగ్యముగా, సంతృప్తితో బ్రతికగలిగిన వ్యవసాయదారుని కొడుకు బడి చదువు పూర్తిచేసినమీదట చేతిపని, పొలముబ్రతుకు అంటే ఒక నిరసనబుద్ధి పెంచుకుంటాడు. అంతకంటే నయమని దగ్గర పట్టణములో గుమాస్తా పని సంపాదించుకొని, దానివల్ల ఆరోగ్యం చెఱుచుకొని, అప్పులుతిన్నుతూంటే, దౌర్భాగ్యంతో బాధపడుతాడు. గ్రంథాలయముకూడా ఆలాటి వినోదాలకూ, సారస్వతానికీ సంబంధించిన పుస్తకాలుమాత్రమే సప్లయిచేస్తూవుంటే, పాఠకాలలపట్ల ఉండే నిరాదరమే దీనికీ సిద్ధించవచ్చు. ఇంగ్లాండువంటి దేశములో ఇది యథార్థముగా అనుభవగతమే. ఐనది,

ఈ అంతరాయమును దాటే విధానము 'కేంబ్రిడ్జిషైర్ గ్రామ గ్రంథాలయాధికారి' రిపోర్టునుంచి ఉట్టంకించిన ఈ క్రిందిభాగము సూచిస్తుంది:—

"స్థానిక పరిశ్రమలకు—వ్యవసాయమునకు, తోటపనికి—సంబంధించిన పుస్తకాలకోసం ఆత్రముతో ఎదురుచూస్తూ ఉంటారు. సందర్భానుసారంగా మేము అవలంబించవలసివచ్చే ఒక విధానమును నే నీయెడల తడువుతాను. ఎప్పుడూ గ్రంథాలయము త్రొక్కబోని కొందఱు మనుష్యులకు ఉపయోగించేవని మనకు తెలిసిన పుస్తక మొక్కొక్కటి తఱచుగా మనకు వస్తూ ఉంటుంది. అటువంటి సందర్భంలో చదువుతాడని తోచిన మనిషికి అది పంపుతాము,—అది ఒకసారి చూచి తనకు నచ్చినట్టయితే వారమో, రెండువారాలో అది తనవద్ద ఉంచుకోవలసిందని ఒకజాగ్రత్తో సహా. ఈవిధంగా అనేక సాంకేతిక (technical) గ్రంథములు పంచిపెట్ట గలిగినాము. అవి మరొకవిధాన చదివించడం సాధ్యపడేది కాదు. ఒకసారి పుస్తకము తిరిగిరావడం కష్టమయింది; పుచ్చుకున్న ఆసామికి అది లేనిదే పని సాగనంతటి ఉపయోగంగా కనబడింది. సాహసించి నేను పంపిన పుస్తకమునల్ల పట్ల రవానా చేసే విధమూ అదీ నేర్చుకున్న ఆ పెద్దమనిషి ఈపాటికి తక్కిన వారికంటె చాలా భాగ్యవంతుడై ఉంటాడని నా నిస్సందేహమైన నమ్మిక! ఇంకొక మిత్రుణ్ణి సంపాదించాము. ఇంకొక పాఠకుణ్ణి తయారుచేశాము. మనరైతులు, తోటమాలీలు కేవలము తమ మంచిచెడ్డలకే సంబంధించిన పుస్తకాలు పృథివిలో ఉన్నాయనే గుర్తించడం లేదని నాకు నమ్మకం కలుగుతూ ఉంది. వారి ఈయభిప్రాయం సరిదిద్దడం మాపని, మే మది చేస్తున్నామనికూడా నానమ్మకము."

గ్రామ గ్రంథాలయాలు స్థాపించడం తప్పనిసరి అనడానికి ఇంకా ఒక ముఖ్యమైన సంగతి ఉంది.

ప్రాథమికవిద్యకు,అవిద్యా నివారణానికి మన రాష్ట్రములో ప్రతిసంవత్సరము లక్షలకొలది రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రతిసంవత్సరము వందలూ వేలూ పిల్లలు మన ప్రాథమిక విద్యాలయాలలో నుండి ఉత్తీ

ర్ణులై పోతున్నారు. గడిచినకొద్దీ ఈసంఖ్యలు కొన్నిరెట్లు పెరుగుతాయి, తప్పదు. అంత ఖర్చుపెట్టి నేర్పిన విద్య నిలకట్టుకోవడానికి ఎందుకు విద్యార్థులకు సౌకర్యాలు లభిస్తున్నాయి? ఈవిధంగా కట్టుకవచ్చిన విద్య నిలబెట్టుకోవడానికి గాను కనీసం నూటికి ఐదువంతులైనా మినహాయించడం అవసరం అని సామాన్యబుద్ధికి గూడా తోచుతుందిగదా! పబ్లిక్ వర్క్సు శాఖవారు కట్టడాలకు ఖర్చుపెట్టేటప్పుడు సంవత్సరం వారీ మరామత్తుకు నూటికి ఇంతా అని యేర్పాటు చేసితీరుతారు. ఆర్థికముగా అది ఒక అవసరం. పబ్లిక్ ఇన్స్ట్రక్షన్ (ప్రాజ్ఞ విద్యా)శాఖ విషయంలో మాత్రము అది అంతటి అవసరమూ కాదా?

తయారైన కట్టడాన్ని సరియైనస్థితిలో ఉంచడం ఎంతముఖ్యమో చదువుకున్న వాళ్లని సరియైనస్థితిలో ఉంచడం అంతముఖ్యం. ప్రస్తుత సంవత్సరం* ప్రాథమిక విద్యనిమిత్తం ఒకకోటీ ముప్పైలక్షల రూపాయలు అందనా వేసుకున్నాము. గ్రామ గ్రంథాలయాలను పోషించడానికి అన్నుం ఆరులక్షలైనా వినియోగించకపోతే, ఆపెట్టుబడిసొమ్ములో చాలాభాగం వ్యర్థం అయిపోదా? గ్రంథాలయాలే కదా. మరి పిల్లల్ని తిరిగి అవిద్యలో పడిపోకుండా కాపాడేసాధనం! ‘పల్లెటూళ్ళ గ్రంథాలయాలకు ఆరులక్షలా!’ అనవచ్చు ఎవరైనా. కాని ఆ కోటీ ముప్పైలక్షలు జాతికి నిలబెట్టడానికే ఈ ఆరులక్షలు కావలసినది- అని మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి.

గ్రామ గ్రంథాలయం ఒక పబ్లిక్ ఇన్స్ట్రక్షను (విద్యా) శాఖతోనే కాక యింకా పెక్కు ప్రభుత్వశాఖలతో ఇటువంటిసంబంధము కలిగి ఉంటుంది. ఉదాహరణానికి, ఆరోగ్యశాఖ చూడండి. రోగనివారణనిమిత్తం అది సాలుకి ౪౬ లక్షలు ఖర్చుపెట్టుతుంది. ప్రజలు హృదయపూర్వకంగా సహకారం చూపకపోతే రోగనివారణానికి ఏపద్ధతి అవలంబించినా బూడిదలో పోసినపన్నీరే. ప్రజల నాగరికబుద్ధి పరిణతం చేసి నిత్యమూ పదును పెట్టతూ ఉంటేనే తప్ప, ఈసహకారం చేకూరుతుందా? అలాగు చెయ్యాలంటే తగినఏర్పాట్లతో, తగినమనుష్యులతో కూడుకున్న ప్రాజ్ఞగ్రంథాలయము సాయము లేకుండా ఏవిధానమూ నిర్వాహకం చెయ్యలేదు. ప్రాజ్యారోగ్యమంత్రిగణము ప్రయత్నమువల్ల ఫలించిన ఆంగ్లేయుని సగటు సుమారు జీవనములోని గొప్ప పెరుగుదల ఆంగ్ల దేశంలోని ప్రాజ్ఞగ్రంథాలయ విధానంయొక్క అభివృద్ధినిబట్టియే, అభివృద్ధితో పాటే వర్తించింది అంటే, అది దైవాత్తు సంభవించింది కాదు; దానిలో సార్థకత ఉంది. ౪౬ లక్షలు ఆరోగ్యానికి ఖర్చుపెట్టి ఆరులక్షలు గ్రంథాలయానికి ఖర్చుపెట్టడానికి వెనుదీయడం శుద్ధ- తెలివితక్కువ. ఆరోగ్యానికి ఖర్చుపెట్టే ప్రతిరూపాయకీ వచ్చేప్రతిఫలం గ్రంథాలయానికి సరిగా ఖర్చుపెట్టిన ప్రతిరూపాయువల్లా పదింతలు కాక తప్పదు.

ఇంకొక ప్రభుత్వశాఖ తీసుకొందాము- వ్యవసాయశాఖ గ్రామానికి ఇంతకంటె ఆదరపాత్రము కావగినశాఖ మరిఒకటి లేదనవచ్చును. దీని సంవత్సరం వారీ అంచన ౩౯ లక్షలదాకా ఉంటుంది. రైతును విశేషమూ ఆకర్షించే విషయాలలో విలువైన పరిశోధన చాలా జరగడానికి ఇది యేర్పాటు చేస్తుంది. కాని, దీనిప్రకటనలు, చరిత్రలు, వివరణాలు, అవి గ్రామస్థులు పదిమందీ తెలుసుకోగలేటట్టు చెయ్యకపోయిన తర్వాత, ఏమిలాభం? ‘రీడింగ్’ అనేచోట ఒకగ్రంథాలయంలో మాకోయంబుత్తూరు, పూసా ప్రచురణలు రైతులెంతో శ్రద్ధతో అధ్యయనం చెయ్యడంచూచి నాకు ఆశ్చర్యం అయింది. మనరైతులు అవి చదువుతారా? చదవరు. చదవకపోవడానికి ఒకకారణం ఏమంటే, రైతులకూ, ఆప్రచురణలకూ కావలసిన మంచిసంసర్గం కుదిర్చే గ్రంథాలయం లేదు ఇక్కడ. ‘రీడింగు’లో ఉంది అలాటి గ్రంథాలయం. సరియైన పుస్తకముతో, సరియైన మనిషికి, సరియైనరీతి సంసర్గం కలకొల్పడం ఒకకళ అని జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇదే గ్రంథాలయంయొక్క ప్రత్యేక రంగం. కొన్నియేళ్ళ క్రిందట ఉంటూవచ్చిన ప్రచురణ కార్యాలయం (Publi-

* ఈవ్యాసం మొదట ప్రకటించిన తేది ౨౪-౫-౧౯౨౭.

city Office) ఆ ప్రచురణలను పోస్టుద్వారా అవిమర్శముగా గ్రామస్థుల నెత్తిని రుద్దడం, పై చెప్పిన ప్రధాన కర్తవ్యాన్ని విస్మరించడంచేతనే జరిగింది. గ్రామస్థునికి పబ్లిసిటీ ఆఫీసు ఏమీ కదులు పుట్టించ లేదంటే, అది అవలంబించిన మార్గం తప్పు కనుకనే.

ఈమధ్య గ్రామాలలో వ్యావసాయిక సభా సన్నాహాలు (Agricultural Demonstrations) జరుగుతూ ఉన్నట్టు తెలుస్తూఉంది. అవి చాలా అవసరమే అనడం, కాని అవి చాలవు. సభా సన్నాహాలు క్షణికోత్సాహం కేవలం కలిగిస్తాయి. కాని యీ ఉత్సాహం చావనీయక, గ్రామస్థు లధికవిజ్ఞానం సంపాదించి శాశ్వతానక్తి పెంచుకొనే లాగు దానిని శ్రద్ధతో పట్టి నడపకపోతే, ఈ సన్నాహాలకైన వ్యయమంతా చివరకి నిష్ఫలమైపోతుంది. చక్కగా ఏర్పడిన గ్రామగ్రంథాలయసేవా విధి కాక ఈపని చెయ్యడానికి తగిన సాధనం ఏముంది?

ఉత్సాహపూరితులైన సంఘ సేవాపరులతో నింపె మంచి పద్ధతులపైని గ్రామ గ్రంథాలయాలు పడుగు పేకలు చేస్తే, అవి ఆనైమిత్తిక సన్నాహాల పనిని ఒక్క కంజాయింపులో శాశ్వతరీతిని సాగించ గలుగుతాయి. అటువంటి గ్రంథాలయాలు ఆసరాగా, వ్యవసాయశాఖ వారి పని ఎక్కువ స్తుతిపాత్రమై ప్రజలకు ఎక్కువ ఉపయోగపడుతుంది. కనుక గ్రామస్థుని శిక్షణావశ్యకతలు ఆలోచించినా, గ్రామము జాగ్రత్తపెట్టుకొనే విషయము ఆలోచించినా, రైతుకు మంచివిద్యా, ఆరోగ్యతా చేకూర్చుకొనే అవసరం ఆలోచించినా, ప్రభుత్వశాఖలు పెక్కింటిలో ఒకవిధముగా వృధా విపోయే పెద్ద నష్టాన్ని తగ్గించుకోవలసినస్థితి ఆలోచించినా, అన్నింటికి ఒక్కటే పర్యవసానం—మన రాష్ట్రములో గ్రామ గ్రంథాలయాలు పడుగు పేకలు అల్లడానికి ఏమాత్రమూ జాగుచెయ్యరాదని తేలుతుంది.

[అనువాదకుడు: కొం. జ.]

ధర్మపత్ని

శ్రీమతి రాజేశ్వరి గారు

(ఆంధ్ర గీర్వాణ సాహిత్య సమ్మేళనము)

మాతాపితృభ్యాం హృదయేశ్వరస్య
నాథాయ సద్విప్ర గురూత్తమేభ్యః,
నమస్కరో త్యంబుజలోచనా యా
సా ధర్మపత్నీతి పరిస్తుతా స్యాత్.

మిథ్యాం మా వద, సత్యమేవ వద, దుర్భావం న సంభావయ
ధర్మం పాలయచైవ, చింతయ పరప్రాణావనాదిక్రియాః,
కామక్రోధమదాది శత్రువిజయం కాంతౌ విముక్త్యా కురు
పుత్రి! త్వం భవ తావకాత్మ విభుసేవాయత్తచిత్తా సదా.

సంప్రదాయకుటుంబ సంజాతవని మెచ్చఁ, గన్నవారింటికి వన్నె తెమ్మ
పతిపాదపద్మషట్పద మీమె యని పల్క, సాధ్వీమణులలోఁ బ్రశస్తిఁగాంచు

మత్తమామల యాజ్ఞ కడుగు దాఁట దటంచు, మేదిని జనులలో మెప్పుఁ గొనుము
ఆనంద సంధాయకానసలక్ష్మివై, హృదయేశు హృదయానఁ గుదురుఁ గనుము
సేవలో దాసివై, యూహఁ జెప్ప మంత్రి-వై స్వరూపమునకు లక్ష్మివై, భరింప
ధరణివై, భోజనపువేళఁ దల్లివై, శ-యించువేళల రంభవై మెపఁగు మమ్మ.

బంధు ర్భర్తా హితో భర్తా, గురు ర్భర్తా న సంశయః,
న ఏవ సర్వదా సర్వం, సతీనా మితి చింతయ.

కనుపాప నీభర్త; కాంచు శక్తివి నీవు; ఆతని కనుసన్న కమరవలయు.
శిరసు నీభర్త; భాషించు శక్తివి నీవు; తలలోని నాల్కవై మెలఁగవలయు.

హారంబు నీభర్త; యందు దారమ వీవు; మనసులో మనసువై మనఁగవలయు.
అబ్దంబు నీభర్త; యందు వృష్టివి నీవు; పతిదేహకల్పవై పరఁగవలయు.

జగతిఁ గులధర్మపత్నినాఁ బాగడికఁ గను-భాగ్య మీభారతావని ప్రజలకె కద!
యట్టి పుణ్యభూమిని నీవు పుట్టు కెల్ల-చిరపతివ్రతాకీర్తిఁ బోషింపఁ గాదె!

ఆశావ్యాప్త పరీమళం, విమల దివ్యామోద రాగోదయం,
మాధుర్యామృత పూరితం, వరదయాసారైక సంవర్ధితమ్,
నిత్యస్నిగ్ధ వికస్వరం, సువికసన్నిర్మాయిక శ్రీమయం,
లాలిత్యం మృదుళంచ కల్పకసుమం, సాధ్వీమణీ మానసమ్.

వాగర్థముల విధంబున-నాగౌరీ శంకరులకు నవినాభావ
శ్రీ గల్గె ననెడు సుకవివ-చో గుంభనలో పతిత్వ సూక్తిని గనుమా.

మమ తనయే! చర నిరతం, పతివాక్పరిపాలనా సమాసక్తా,
పతిహితకార్యా చరణా, ప్రవర్తతే జిహ్వికా యథా శిరసి.

ఏ తరుణమున వివాహిత-వైతివో, యానాఁడె మాకు న్నాత్రము దీరెన్
పూత చరితవై మెలఁగుము-'నాతల్లీ! కులవధూజనమతల్లిక వై.'



పునర్విమర్శనము

ఉత్తరరామచరిత రసవిచార ప్రశంస

౧

బ్రహ్మశ్రీ కొంపెల్ల సుబ్బారాయశాస్త్రి గారు

ఉత్తర రామచరిత నాటక రసవిచార మను వ్యాస రాజమును భారతి — ఆషాఢ శ్రావణ సంచికలలోఁ బ్రకటితము చేసిరి. దానిమీఁద బ్ర. శ్రీ. పల్లాది రామమూర్తి శాస్త్రిగారు ఒక వ్యాసమును, శ్రీయుత మన్నంగి లక్ష్మీ నరసింహశర్మ గారు ఒక వ్యాసమును ఆశ్వయుజమాస భారతి సంచికలోఁ బ్రకటితము గావించిరి. రసవిచార మందు నాకును గొంత యభిలాష నుండుటం జేసి యిందేది న్యాయమైన వ్యాసము, ఎవరిది ఉత్తమపక్ష మను నంశమున నా యభిప్రాయము వివరింపఁదలఁచి యీ మూఁడు వ్యాసములను నేను కలిపి చదివితిని. బ్ర. శ్రీ. రామమూర్తిశాస్త్రిగారి వ్యాసముఁ జదువఁగనే వ్యాస కర్తయొక్క అసూయాజనకమైన వ్యాసధాటికి నాకు నవ్వువచ్చినది.

ఆపాతతః వెదచల్లుట

రామమూర్తిశాస్త్రిగారు తమ వ్యాసము నుపక్ర మించుటయందు శ్రీ సుబ్బారాయశాస్త్రులవారి వ్యాస "మందలి విషయములు, పూర్వపక్షములు, సిద్ధాంతములు, సర్వతోముఖములుగా నుండి శ్రీశాస్త్రులవారి సాహిత్య పటిమను ఆపాతతః వెదచల్లుచున్నవి" అని ఋజువు చూపకుండ తీర్మానించిరి. శ్రీ సుబ్బారాయశాస్త్రుల వారి సాహిత్యపటిమ సులభముగాఁ బడిపోవునదికాదని యెఱింగిన నాకు రామమూర్తిశాస్త్రులవారి యీ వ్రాఁత విలువయైనదిగాఁ దోఁచుటలేదు. ఇక్కడ శ్రీశాస్త్రుల వారి సిద్ధాంతములు మన్ననువని సర్వతోముఖములై యుండియును వారి సాహిత్యపటిమను ఆపాతతః వెద చల్లుచున్నవనుటలో శ్రీ శాస్త్రులవారి సాహిత్యపటిమ వాదములోఁ బడిపోవునన్న యభిప్రాయమే తప్ప "ఆపాతతః" అనుటకు ఇంకొక యర్థమును రామమూర్తి శాస్త్రిగారు చెప్పఁబూన రని నాతలంపు. అట్లయినచో నేది? రామమూర్తిశాస్త్రిగారు తమ ప్రాగల్భ్యమును జూపి శ్రీసుబ్బారాయశాస్త్రులవారివాదమును అపాత్రము చేయుటకుఁ దగిన యుక్తులను బైకిఁ దెచ్చి శ్రీ సుబ్బా రాయశాస్త్రులవారిచే సవరణ వ్రాయించుటకై వ్యాస లేఖనమునకు సాహసించిన దానిని బలపఱచుకొనుటకు ఇంకొకసారి పూనుకొని తమ ధీశక్తిని ప్రదర్శింపవలెను. లేదా "ఆపాతతః" అనుమాటనైనను ఉపసంహరించు కొనవలెను.

ఎవరిది పరమ సాహసము ?

"ఈవ్యాసమునందలి విషయమునంతను శ్రీశాస్త్రి గారు తమ స్వంతబుద్ధితో నాలోచించినారట. ఎంత ఆశ్చర్యము! నిజముగా నిదియంతయు శ్రీశాస్త్రిగారి ప్రతిభచేతనే వ్రాయఁబడినచో వారు జగద్వంద్యులే కాని శ్రీ శాస్త్రిగారి పరమ సాహసము గాని, యిందు వీరి ప్రతిభాలేశముగూడ కానంబడుటలేదని నేను తెలి యజేయుచుంటిని" — అని రామమూర్తిశాస్త్రిగారు వ్రాసిరి. ఇది పరమసాహసమయిన వ్రాఁత! శ్రీ కుమార తాతాచార్యులవారివాదమునే శ్రీసుబ్బారాయ

శాస్త్రులవారుగూడ సాగించినపుడు రసచర్చకు సంబంధించిన లాక్షణికగ్రంథపరికరమును, లక్ష్యమునకై ఉత్తర రామచరితమునుండి ఉద్గ్రహింపఁబడవలసిన ఆయాఘట్టములును, పారిభాషికపదములును, ఉపక్రమోపసంహారాదులును ఒకదాని నొకటి పోలియుండుట సహజము. ఈసారస్య మెఱుంగక శ్రీ శాస్త్రులవారి ప్రతిభాలేశము గూడ లేదని తృణీకరించి వ్రాయుటచూచేఁగా రామమూర్తిశాస్త్రిగారు పరమసాహసముచే నిట్లు వ్రాసిరని తలంచుచున్నాను.

తు, చాలలోగూడ భేదము లేదా?

రామమూర్తిశాస్త్రిగా రిట్లు వ్రాసిరి:

“శ్రీ కుమార తాతాచార్యవిరచితంబయిన “కల” యను వ్యాఖ్యానముతో ఉత్తరరామచరిత నాటకము ౧౯౦౬ సంవత్సరమున ఆనందముద్రణాలయమున చెన్నపురిలో ముద్రింపఁబడియున్నది. కాని యీ గ్రంథము పునర్ముద్రితము కాకుండుటచే ప్రస్తుతమున విరళప్రచారముగలిగియున్నది. ఆవ్యాఖ్యాత యీ నాటకమందలి రసమును “ఏకోరసః కరుణఏవ”యను శ్లోకవ్యాఖ్యానమున విపులముగా చర్చించినాడు. అందలి విషయముల నే తు, చాలలోగూడ భేదములేకుండ శ్రీ సుబ్బారాయ శాస్త్రిగారు అంగీకరించినారు”—

ఈవ్రాఁత పరమ సాహసమయిన వ్రాఁతయని పదింబదిగఁ జెప్పఁదగియున్నది. ఈ యంశములు చెప్పునపుడు శ్రీ సుబ్బారాయశాస్త్రులవారి రసవిచారమంతయు తు, చాలు తప్పకుండ శ్రీ కుమారతాతాచార్య వాఙ్మయమే తప్ప నితర మేద్దియును లేదనుటకు రామమూర్తిశాస్త్రిగారు తగునిదర్శనము లిచ్చి నిరూపించుకోఁదగియున్నారు. లేదేని వారివ్రాఁత దూషితేనివ్రాఁతయగును. శ్రీకుమారతాతాచార్యునివాదభాగముల నాంగీకరించి అవ్వానికి శ్రీసుబ్బారాయశాస్త్రులవారు తమ పరిశోధనమం దితరత్ర లభించిన వాదసామగ్రిని చేర్చి అందుకుఁ దోడుగా నుత్తరరామచరితమందలి ఆయాఘట్టములను లక్ష్యముగా సమకూర్చిరి. విప్రలంభశృంగార వాదమును శ్రీకుమారతాతాచార్యుని కంటె ఎక్కువ పరికరముతో శ్రీసుబ్బారాయ శాస్త్రులవారు సుసాధించిరి. విరళప్రచారమందియున్న శ్రీకుమార తాతాచార్యుని ‘కల’ ఆంధ్రపాఠకులకు దుర్లభ్యమయియుండఁగా దాని యందలి విప్రలంభవాదమును—ఆవ్యాఖ్యాత సమకూర్చుకొనియుండని గోవర్ధనాచార్యాదులను, అమరసింహుని, కాళిదాసుని, పండితరాయలను, సింగభూపాలుని, భోజభూపాలుని ఉద్ఘాటించుచు రసతరంగిణి, కావ్యప్రకాశబాలబోధినీవ్యాఖ్య మున్నగు గ్రంథపరికరముతో శ్రీసుబ్బారాయశాస్త్రులవారు మఱింత ప్రకాశమునకుఁ దెచ్చిరి. శాస్త్రమును చేతఁబట్టుకొని వాదింపఁదగిన యంశములందు లక్షణగ్రంథములందలివాక్యములను, లాక్షణిక సూత్రావళిని, లక్ష్యసామగ్రిని, పరిభాషను విడిచి ఎవ్వరును సభకెక్కరు. అన్నిటిని విడిచి సభకెక్కినచో ఆవాదము శాస్త్రవాద మనఁబడదు. శ్రీసుబ్బారాయశాస్త్రులవారు “ఇట్లింతవఱకు”—“అని యిట్లు” పూర్వవాదములను ప్రకాశపరచుచువీరరసవాదులను, శుద్ధకరుణవాదులను, విప్రలంభవాదులను గూడ ఎదుటికిఁ దెచ్చుచు “నాబుద్ధికోలఁది విచారింపఁగా”అని ఉపసంహారముచేయఁ బూనిరే కాని వేఱుకాదు. ఇట్టి స్థితిలో “విషయమునంతను శ్రీశాస్త్రిగారు తమ స్వంత బుద్ధితో నాలోచించినారట. ఎంత ఆశ్చర్యము!” అని రామమూర్తిశాస్త్రిగారు లిఖించిరి. పరికరమంతయు నెదుటికిఁ దెచ్చి “యీ పరికరమునుబట్టి నాబుద్ధికిఁ దోఁచిన దేమనఁగా”అను నర్థముగల వాక్యములకుఁగూడ రామమూర్తిశాస్త్రిగారి కింత ఖేదమేలకో?

నామ స్పర్శనము

ఆహా! తెలిసినది. వీరిఖేదకారణములలో నీక్రిందిది యొకటి! “సాహిత్యచక్రవర్తియగు తాతాచార్యుని గ్రంథమునంతను భాషాంతరీకరించి యవ్వాని నామమునైనను స్పృశింపక యిదియంతయు” నాబుద్ధికోలది విచారణ యని వ్రాయుచుండిన శ్రీశాస్త్రిగారి స్వంతము సాహసముగాక ప్రతిభయగునా? తాతాచార్యవ్యాఖ్యయందలి ఒక్కొక్క సంస్కృతవాక్యమునే తీసి యాంధ్రభాషలోనికి తర్జుమాచేసినచో శ్రీశాస్త్రిగారి వ్యాసము

ను, చాలుతప్పునండా తయారగును. * * * *
ఇటుల సాహసించుట అన్యాయమనియు, పండితద్రోహ
మనియు శ్రీశాస్త్రిగారికి తెలియజేయుచు నాయభిప్రా
యములను నంగీకరించి మహాపండిత తాతాచార్యునికి
కృతజ్ఞులై, "నాబుద్ధికొలందిని" అని విడిచి "తాతార్య
వ్యాఖ్యానుసారము వ్రాసితిని" అని శ్రీసుబ్బారాయ
శాస్త్రిగారు స్వయముగా తమవ్యాసమును భారతిలో
సవరింపజేయవలె" ననిరి. అంగీకరణముగా వాదపరి
కరము నేర్పఱచుకొనుటకు సాహస మెట్లగునో, అన్యాయ
మెట్లగునో, పండితద్రోహ మెట్లగునో తాతార్యుని, నాటక
కర్తయగు భవభూతిని ఘనశ్యామవీరరాఘవ ప్రముఖులగు
నితరవ్యాఖ్యాతలను, ఉత్తరరామచరితము నాంధ్రీకరిం
చిన కవులను, లక్షణవేత్తలగు భరత, గోవర్ధనాచార్యా
దులను, ఇంకను పెక్కాంగ్ల గ్రంథములను వాదమునకుఁ
దెచ్చినపుడు వానిపై "నా బుద్ధి కొలందిని" అనుమాట
యెట్లు విరుద్ధమగునో ఇన్నిటిని విచారించినమీఁదట నా
బుద్ధికొలందిని అనుటకూడ రామమూర్తిశాస్త్రిగా రధి
క్షేపింపఁ జెల్లునేమో పాఠకులు నిర్ణయింపఁ గలరు.
అందఱి వాదములను బైటికిఁ దెచ్చినప్పుడు కేవలము
"తాతార్యవ్యాఖ్యానుసారము వ్రాసితిని" అని యేల
సవరింపవలెనో నాకు బోధపడుట లేదు. మఱియు
రామమూర్తిశాస్త్రిగారు అనూయాజనకమైన దృష్టితో
శ్రీ సుబ్బారాయశాస్త్రిగారి వ్యాసమును సరిగాఁ
జదువ లేకపోయిరి కాఁబోలు! "నేను వ్రాసినంతవఱకుఁ
బ్రాచీననవీన సహృదయసమ్మతమునే వ్రాసినాఁడనుగాని
యిందు స్వకపోలకల్పిత మెద్దియును లేదు"—అని శ్రీ
సుబ్బారాయ శాస్త్రులవారు స్పష్టముగా లిఖించి
యుండిరి. ఇంకను గనుఁడు!—"వ్యాఖ్యాత లందఱు
మనకు మహోపకారులు. వారి వ్యాఖ్యానములం జూచి
కొంత పరిజ్ఞానము సంపాదించుటచేతనే యిట్టి విమర్శ
ముల జేయఁగలుగుచున్నారము. కావున వారియెడ
మనము కృతజ్ఞులమై యుండకతీఱదు"—అని శ్రీసుబ్బా
రాయశాస్త్రులవారి వ్యాసమందు కలదు. మఱియు "ఈ
నాటకమునకు మఱి కొందఱు కుమారతాతాచార్య
ప్రభృతులు విప్రలంభ శృంగారమే ప్రధానమని వ్యాఖ్యా
నము లొనరించిరి"—అని పైరీతిగా పూర్వవ్యాఖ్యాతల
పయి అత్యంతము కృతజ్ఞబుద్ధిగల శ్రీ సుబ్బారాయ
శాస్త్రులవారిపయి—ఇంకను విశదముగా స్వకపోలకల్పిత
మెద్దియును లేదని తెలుపుచున్న విబుధవిధేయులగు శ్రీ
శాస్త్రులవారిపయి-పయిరీతిగా ద్రోహ మాపాదించి పరమ
సాహసమనియు, నామసంస్పర్శమైనను జేయ లేదనియు,
అన్యాయమనియు, పండిత ద్రోహమనియు కఠోరము
లాడుటయేకాక కావ్యవిషయికమయిన విపులహృదయా
భియోగమున దానందించుటకు సమర్థత లేకుండుటచేతనే
రామమూర్తిశాస్త్రిగారికి ఇట్టి ఖేదహేతువు గల్గినదని
విస్పష్టము.

> గుణదోషగవేషణా జనానాం
> విహితా యద్యపి కాలవైభవేన,
> క్వచి దస్తి సచేతసాం నివాసో
> విపులాయా మితి సార్థక శ్శ్రమో నః.
>
> —సద్రూపకప్రశంసా.

కాలవైభవముచే గుణదోషవిచారముచేయు సహృదయుల
సంఖ్య తగ్గినను కొందఱయినను లేకపోలేదు. కావున
సరి యగువారి వ్రాతె నిరర్థక మెన్నటికిని గాదన్నసారాం
శమే రామమూర్తిశాస్త్రిగారివంటివారిని కొందఱను
విడిచి శ్రీసుబ్బారాయశాస్త్రులవారి లేఖిని రసవిచార
పరతంత్రులగు సాహిత్యజ్ఞులనుదృప్తిపఱచఁదగియున్నది.
ఈసారాంశము—సద్రూపక ప్రశంసనుండి యెత్తి శ్రీ
సుబ్బారాయశాస్త్రులవారు రసవిచారపరిసమాప్తియందు
శ్రీకుమారతాతాచార్యుని మనసా స్మరించుచు సగౌరవ
ముగా ఉల్లేఖించిరి.

౨

శ్రీయుత మున్నంగి లక్ష్మీనరసింహశర్మగారిది
యిందుపై రెండవ వ్యాసము. రామమూర్తిశాస్త్రిగారి
వలెగాక శ్రీశర్మగారివాదము కొంత సహేతుకమయి
నదిగాఁదోఁచును. కావునవారివాదమువందలి కొన్ని యంశ
ములను సావకాశముగాఁ జూడ నభిలషించెదను. బ్రహ్మశ్రీ
కళాప్రపూర్ణులగు వేదము వేంకటరాయశాస్త్రులవారిని

శ్రీసుబ్బారాయ శాస్త్రిలవారనుకరించి యావ్యాఖ్యను వ్రాసి నారనియుఁ, జూడలేదనుట నమ్మఁ బల్కుట యనియు వ్రాయుచు సంశయచిత్తమును పాఠకులలో వ్యాపింపఁజేయుచున్నది, శ్రీ శర్మగారి లేఖిని. శ్రీ సుబ్బారాయశాస్త్రిలవారి భావాశయవ్యాపనము, రస భావాదులపైఁ గావించు హేతువాద సామర్థ్యమును తెలిసినవారి నెవ్వరినైనను శ్రీశర్మగారిలేఖిని సంశయచిత్తులను నేరీతిగనైనను చేయఁజాలదు. బ్ర. శ్రీ. కళాప్రపూర్ణులగు వేదం వేంకటరాయశాస్త్రిగారు భానుమిశ్రుని రసమంజరి కనువాదకులు—శ్రీ సుబ్బారాయశాస్త్రిలవారన్నచో భానుమిశ్రుని రసతరంగిణి కనువాదకులు. ఉభయులును వారివారి స్వాభిమానశాస్త్రములందు నాలంకృతప్రజ్ఞ గలవారు. అయితే కీర్తివ్యాపించుటలోను మఱికొన్ని యితరపరిస్థితులందును తారతమ్యము ఉండినది. అందులకు హేతువులు మనకుఁ బనిలేదు. ఇత్తఱి రసవిచారవ్యాససందర్భమున నమ్మఁబల్కినట్టి సంశయచారిత్రమును శ్రీసుబ్బారాయశాస్త్రిలవారిపయి సమన్వయము చేయఁబూనిన శ్రీ శర్మగారికి నదుత్తర మొసఁగుట అప్రస్తుతముకాదు. "ప్రతియోగి ప్రమితిం వినా నిషేధానుపపత్తిః" —అను న్యాయముచేత శ్రీ శర్మగారు చేయఁబట్టిన శ్రీ కళాప్రపూర్ణుల గ్రంథము నాకింకను లభ్యముకానందున వారివాదముపై జవాబునకుఁ దొందరపడితినో యానిషేధము చెల్లఁదగి యుండదు గనుక కళాప్రపూర్ణుల గ్రంథమును సంపాదించిచూచి శ్రీ శర్మగారి యాక్షేపములకు జవాబిచ్చెదను — గడువు కావలెను.

దువ్వూరి జగన్నాథశర్మ


రహస్సఖి.

కొల్లూరు ధర్మారాయకవిగారు, బి. యే., అం. గీ. సా. ప.

ఏలే వెన్నెలరేల నొంటరిగ నీ వేతెంచుచో నీదు పా
దాలన్ జిందులువాఱు కుచ్చెళుల యూతల్ ప్రేమదూతల్ బలెన్
నాలాతామ్రారుణ లోచనంబులకు నానందంబుగూర్పన్ నిశీ
థీ లీలావతి! చేతమే యుడిగి సుప్తిన్ గాంతు రాబొమ్మనై.

నిదురయొడిన్ మెయిన్ విడచి నే నెవో స్వాప్నికసీమలందు బో
యెదను, మధుప్రమత్తత యొకించుక పట్టు సడల్పుదాక; నం
త దనుక నాదుమ్రోడు బడదన్ భరియింపుము నీయురస్స్థలీ
సదనమునందె యోచెలియ! సాంద్రతమఃప్రతిసీరచాటునన్.

ఏ శుభవేళ నొండొరుల కీమధురాత్రి జనించె నప్డె యా
కాశము పెండ్లిపందిళులఁ గల్పన చేసెను రిక్కమల్లెలన్;
లేశము వెల్గుమచ్చయును లేని నిశాకుహరాన ప్రేమమూ
ర్తీ! శిరసుల్ స్పృశింప నిదురింతము వేకువలేని నిద్దురన్.



సంచుల యల్లిక-౧

కొ. నరసింహాచారి గారు

పిడులు


ఈ కాలమున ప్రతివారును అంగడికి పోవునపుడు వస్తువులను వేసికొనివచ్చుటకును, పాఠశాలకు బోవునపుడు బిడ్డలు తమపుస్తకములను వేసికొనుటకును నూలుసంచుల నుపయోగించుట యందఱకు దెలియును. నూలుసంచులను క్రయమునకు దీసికొనెడల నొక్కొక్కటి అయిదారణాలగును. నూలునుమాత్రము కొని సంచులను మనమే యల్లుకొనగలిగినయెడల మూడణాలలోనే సంచి రాగలదు. ఈ సంచుల నల్లుట బహుసులభము. సులభసాధ్యములగు వస్తువులను మనమే స్వయముగ జేయ నేర్చుకొనినయెడల లాభము మాత్రమే కాక పనియందుత్సాహమును, బుద్ధికుశలతయు హెచ్చును.

సంచుల నల్లుటకు ముందు రెండుపిడుల నల్లుకొనవలెను. పిడులు రెండుమూడు విధములు. ఒక్కొక్క సంచియొక్క పిడులు రెండును సమానమగు నిడివి కలిగి యుండవలెను. కాన రెండు నూలుత్రాళ్లను ఒకేకొలతకు కోసికొనవలెను. ఒక్కొక్కత్రాడు సుమారు మూడు లేక నాలుగుగజముల నిడివి యుండవలెను.

పిడి నల్లురీతి

ఒకనూలుత్రాటిని దీసికొని దానికొనలను జేర్చి ముడివేయవలెను. మొదట దానికొనలలో నొకదానిని (క, చిత్రము ౧.) రెండవకొన గ పైన ఉంచవలెను. పిమ్మట చిత్రము ౨ నందువలె ముడివేయవలెను. మొట్టమొదట పైతట్టు పెట్టిన క ముడివేసిన తర్వాత గూడ పైకి వచ్చును. మరల క ను పైకిని, గ ను క్రిందికిని ఉండునట్లు చిత్రము ౩ నందువలె పెట్టి, చిత్రము ౪ నందువలె రెండవముడిని వేసి, బిగించి లాగినయెడల చిత్రము ౫ నందు వలె ముడి యేర్పడును. ఈరీతిని ముడివేసినయెడల నూలు నెంత లాగినను వీడిగాదు. మొదట పైకి వచ్చిన కను రెండవమారు క్రిందుగా పోనిచ్చి ముడివేసినయెడల, బిగించి లాగినపుడు ముడి వీడివచ్చును. ముడివేసిన పిమ్మట నాలుగు గజముల నూలంతయు నొక వలయము లేక చుట్టుగా నేర్పడును. దానిని కాలి బొటనవ్రేలికిగాని, మఱేయాధారమునకు గాని తగిలించి దానినుండి సుమారు ౧౫ అంగుళముల దూరమున చిత్రము ౬ నందువలె ఎడమచేతి చూపుడు వ్రేలిపైన బట్టుకొని త్రాటి నంతయు నాలుగు చిన్నచుట్లుగా చుట్టుకొనవలెను. ఈ నాలుగు చుట్లును సమముగా నుండునట్లు చేసికొనిన పిమ్మట వ్రేలినుండి నాలుగంగుళముల దూరమున నొక సాధారణమగు కట్టును కట్టవలెను (చిత్రము ౭). పిమ్మట బొటనవ్రేలిపైనుండి చుట్లనన్నిటిని దీసి యందలి నాలుగు చుట్లను చిత్రము ౮ యందువలె వేర్వేరుగా నాలుగు

పై పుల విడదీయవలెను. ఈనాలుగుచుట్లును చిత్రము ౮ యందు ట, ఠ, డ, ఢ అని గుర్తింపబడియున్నవి. ఇందలి చుట్టునొకదానిని (ట) దీసికొని దాని ప్రక్కన నుండు ఠ పైన నుంచవలెను. పిమ్మట ఠ ను డ పైనను, డ ను ఢ పైనను వేసి కడపట ఢ మొదటి దగు ట ను వంచుటవలన గలిగిన వంపులో నుండి దూర్చవలెను (చిత్రము ౧౧). ఇట్లు దూర్చినపిమ్మట ట, ఠ, డ, ఢ లను కొంచెము కొంచెము లాగుచు బిగించిన యెడల చిత్రము ౧౨ నందువలె మధ్య నొక యల్లిక యేర్పడును. మరల పూర్వమువలెనే యొకచుట్టును దీసికొని



దాని ప్రక్క నుండు దానిపైనను, రెండవదానిని మూడవదాని పైనను, మూడవదానిని నాలుగవ దానిపైనను వేసి, నాలుగవ దానిని మొదటిదాని యొక్క వంపులోనుండి దూర్చవలెను. అప్పుడు మొదటి రీతిగనే మధ్య నొకయల్లిక యేర్పడును. అల్లికను బిగించు నప్పుడు నూలులను మెలికలు పడనీయక సమాంతరము (parallel) గా నుండునట్లు చూడవలెను. ఇట్లొకటి రెండల్లిక లేర్పడిన పిమ్మట మొదట కట్టిన సాధారణపు కట్టును విప్పివేయవచ్చును. ఈరకపుపిడికి చుట్లు మూడింటికి తగ్గక యెన్నియైన నుండవచ్చును. ఈరీతిగా నల్లుచు రెండవకొననుండి, మొదటవిడిచినట్లు నాలుగంగుళముల దూరము మిగులునంతవరకు వచ్చి యల్లికను చాలించవలెను. అప్పుడల్లిక చిత్రము ౧౨ నందువలె నేర్పడును.

రెండవరకపు పిడి

ఈరకపు పిడి యల్లినతర్వాత చిత్రము ౧౫ నందువలె నుండును. మొదటిరకపుపిడిని అల్లుచు మధ్య నెట్టి స్థితియందైనను విడిచినయెడల పిడి చెడిపోజాలదు. రెండవరకము మధ్య విడిచిపెట్టినయెడల చిక్కుపడును. కావ పిడిపూర్తి కానిది లేవరాదు. దీనియందు అల్లిక భాగమున కిరుప్రక్కల చిత్రము ౧౫ నందు ల, వ లవలె కట్లు కట్టి, వాటి నట్లే యుంచవలెను.

కట్లను కట్టురీతి


చిత్రమునందు జూపబడిన కట్లు ముడులు లేక యేర్పడినవి. రెండుపిడులకును నాలుగుకట్లు కావలెను. కట్లు సమముగా నుండిన బాగుండును కాన నాలుగు కట్లకును సమానమగు నిడుపుగల నూలు తునుకలను త్రెంపుకొనవలెను. ఒక తునుక ఆయిదాఅంగుళము లుండిన జాలును. చిత్రము ౬ నందు జూపబడిన చుట్లను చేర్చి పట్టుకొని, ఒక కొననుండి నాలుగంగుళముల దూరమున, పై తునుకలలో నొక దానియొక్క యొక కొనను చుట్లయొక్క నిడివి భాగముపైపు చూచునట్లు చుట్లతో చేర్చిపెట్టవలెను. (చిత్రము ౯, చ). ఇది కాక మ అను మఱియొక నూలును మడిచి దాని మడతవంపుగూడ నదే ప్రక్కకు చూచునట్లు పెట్టి, పై నూలు తునుకను పీటిపన్నిటి చుట్టును బిగించి చుట్టుచు రావలెను (చిత్రము ౯). ఇట్లు నూలుతునుకలలో నొకయంగుళముమాత్రము మిగులునంతవఱకు చుట్టి దాని రెండవకొనయగు జ ను మడిచిన నూలుయొక్క మడతయగు మ యందు దూర్చి, మడిచిన నూలును లాగినయెడల జ అను కొనలోపలనే నిలిచిపోవును (చిత్రము ౧౦).

పిడి నల్లు రీతి


ఇట్టిపిడికిగలచుట్లు బేసి సంఖ్యగలవిగానుండవలెను. దీని నల్లుటకు వ్రేళ్లన్నిటితోను చుట్లను పట్టుకొనవలసియున్నది. కావున చేతులందలి బొట్టనవ్రేళ్లు కాక గల యెనిమిదివ్రేళ్ళయందును బేసియగు ఏడువ్రేళ్లకును ఏడు చుట్లుండవలెను. లేనియెడల అయిదుగాని, మూడుగాని చుట్లుండవచ్చును. చిత్రము ౧౦ యందువలె నొక ప్రక్క కట్టిన పిదప ఒక్కొక్కచుట్టు నొక్కొక వ్రేలికి దగిలించవలెను. ప్రస్తుతము వర్ణింపబడు పిడికి ఏడు చుట్లు గలవనుకొందము. చిత్రము ౧౩ నందు జూపిన రీతిని కుడిచేతి వ్రేళ్లలో చూపుడువ్రేలు(చూ), నడిమివ్రేలు (న), ఉంగరపువ్రేలు (ఉ) వీటిపై నొక్కొక్క చుట్టును ఎడమచేతిలోని నాలుగువ్రేళ్లకును నాలుగుచుట్లును తగిలింపవలెను. లేక కుడిచేతికి నాలుగుచుట్లును, ఎడమచేతికి మూడుచుట్లునుగా గూడ నుండవచ్చును. మూడుచుట్లు మాత్ర ముండు చేతియందు అనుగున నుండు చిటికినవ్రేలు విడిగా నుండవలెను. ఇట్లు వ్రేళ్లపై చుట్లనన్నిటిని తగిలించినపుడు ప్రతిచుట్టునందును వ్రేలికి పైతట్టుగా నొకభుజమును, క్రిందితట్టుగా నొకభుజమును వచ్చియుండుటను గమనింపవలెను. వ్రేళ్లకు పైపైపుగా వచ్చియుండు భాగములకు చిత్రము ౧౩ నందు ౧ అనియు, క్రిందివైపుగా వచ్చియుండు భాగములకు ౨ అనియు గుర్తింపబడియున్నవి.

కుడిచేతియందు విడిగా నుండు చిటికెనవ్రేలిని ఎడమచేతియందలి చుట్లయొక్క ౧ భాగములకు క్రిం


చుగాను, ఎడమచేతి చిటికెనవ్రేలినుండి వరుసగా నడిమివ్రేలి చుట్టువరకును మార్చుచు పోవలెను. పిమ్మట మాపుడువ్రేలిపైనుండుచుట్టును కుడిచిటికెనవ్రేలికి మార్చుకొని, మరల తక్కినచుట్లుగుండా వెలుపలికి లాగుకొనవలెను. ఇప్పుడు కుడిచేతివ్రేళ్లన్నియు చుట్లను కలిగి యుండును. ఎడమచేతి మాపుడువ్రేలియొక్క చుట్లు కుడిచిటికెనవ్రేలికి పోయినందున నది విడిగా నిలిచినది. ఎల్లప్పుడును వ్రేళ్లన్నిటిలోను అడుగున నుండు చిటికెనవ్రేలే విడిగా నుండవలెను. కాన యెడమచేతియందు నడిమివ్రేలిచుట్టును మాపుడువ్రేలికిని, ఉంగరపువ్రేలిను



11



12



13



14 ముడత రకపు జడ




15 గుండ్ర రకపు జడ

ట్టును నడిమి వ్రేలికిని, చిటికెన వ్రేలిచుట్టును ఉంగరపు వ్రేలికిని మార్చుకొనవలెను. అప్పుడు ఎడమచిటికెన వ్రేలు విడిగా నిలుచును.

ఇప్పుడు ఎడమ చిటికెన వ్రేలిని కుడిచేతి చిటికెన వ్రేలు, ఉంగరపు వ్రేలు, నడి వ్రేలు-వీటిపైనుండు చుట్లయొక్క ౧ భాగముల క్రిందుగా మార్చి, ఆచేతి మాపుడు వ్రేలిపైనుండుచుట్టును తనపైకి మార్చుకొని ఆచిటికెన వ్రేలిని బయటికి తీసికొనవలెను. ఇపుడు మరల కుడిమాపుడు వ్రేలువిడిగా నుండును. పూర్వపురీతిని ఆ చేతిలోని చిటికెన వ్రేలు, ఉంగరపు వ్రేలు, నడిమి వ్రేళ్లపై నుండు చుట్లను పైకి మార్చుకొని చిటికెన వ్రేలిని విడిగా పెట్టుకొనవలెను. ఈ రీతిగా మార్చుచు అల్లుచు వచ్చునపుడు చక్కగా లాగుచు వచ్చినయెడల పిడియొక్క యల్లిక యందముగా నుండి బలము కలిగియుండును. రెండవ ప్రక్కనుండి నాలుగంగుళముల దూర ముండునటుల అల్లి అచ్చట పూర్వపురీతి మరల నొకకట్టు కట్టవలెను. ఇదే రీతిని రెండవ పిడినిగూడ నల్లుకొనవలెను.


మూ డ వ ర క పు పి డి

ఈ రకపు పిడి యంత కష్టమయినది కాదు. దీని యందు అల్లికభాగ మేదియు లేదు. మొదటి రెండు విధముల పిడులకువలెనే మనయిష్టమువచ్చినన్ని చుట్లు చేసికొని, వాటిపైన చిత్రము ౧౦ యందు జూపిన రీతిని కట్టవలెను. కాని యీరీతిని కట్టునట్టినూలు చాల పొడవైకడవలెకును చుట్టుటకు దగియుండవలెను. చుట్టుపద్ధతి మాత్రము చిత్రము ౧౦ యందు జూపిన రీతిగ చేయుండును. ఇట్లు పిడులను చేసికొన్న పిదప పంచుల నల్లుటకు నేర్చుకొనవలెను. ఇందును గురించి మఱియొక వ్యాసమున వివరింపబడును.



రాటపు పాటలు

కుర్రా వెంకటసుబ్బారావు చౌదరి గారు



౧

శ్రీకృష్ణరాయుడు చిటికె వేసితే
కనక యావుల మంద కదలి వచ్చేను
ఆవుల్ల మందకి పేరుపడ్డాడు
అన్న రాటమరాజు పాపసైదోడు.

౨

భూమేలె వారింట పుట్టింది పట్టి
జగ మేలె చంద్రుడా చేసుకోవయ్యా.

౩

పూరికి బోకన్న పుండు బోకన్నా
పుదోృగ పరమంత అబ్బినదాక
చేసికి బోకన్న చెప్పబోకన్నా
చెప్పరాని పుట్లు పండినాదాక
ఆలి మంచిదని అడుగబోకన్నా
అది వచ్చి కాపురము చేసిన్నదాక.

౪

నిమ్మచె ట్టద్దమ్మ నీలమేఘమ్మ
అన్న నీగుర్రమ్మ చంద్రమేఘమ్మ.

౫

జనపనార పగ్గాలు జముజడ్డిగాలు
వెన్నెట మాగొర్రు వెదబెట్టి వచ్చు
గోగునార మోకులు కొనజడ్డిగాలు
కోటిపాల మొల్లుట్ల కోమలు దున్నేరు.

౬

యీపూరి పేరేమి యిందర పేరేమి
యీరచ్చ గూర్చున్న రాజు పేరేమి
యీపూరు మాదమ్మ యింతపని మాది
దంతపు తలుపుల్లు దరవాజులు మావి
యీరచ్చగూర్చున్న రాజు మాఅయ్య.

౭

నిండుకుం డెదురాయె నిత్య మెదురాయె
జనకుడికి సీతమ్మ సత్య మెదురాయె
నిండు కుండనీళ్లు తొణక దోనమ్మ
నీళ్లాపు నిందలు కట్ట దోనమ్మ.

౮

ప్రాణమ్ము వుంటేను బలుసు తినవచ్చు
పగవారి పంచల్ల పడియుండరాదు.

౯

నిప్పు చేతా బడితె నీరుబుగ్గాయె
నిజ మాయె మా తాత వెంకయ్య చావు
వాయ్కుంఠ మెళ్లేటి ఓ పక్షులార
అక్కడ మా తాత యెక్క డెదురాయె
వెల్లాది గుర్రమ్ము వెండికళ్లెమ్ము
వైకుంఠ మెళ్లేటి వాకి టెదురాయె.

౧౦

కట్టమీద నిమ్మ కాయల్ల నిమ్మ
కాయ కొంచెమైన కల్పవృక్షమ్ము
నిమ్మ కొంచెమైన నీడ చల్లన్న.

౧౧

ఆదివారపు పాలు అనుకున్న పొంగు
అలంకరించా గౌరి తనలోనె పొంగు
ఆదివారపు లక్ష్మి మాయింటి కొస్తే
అచ్చమల్లెల దండ గుచ్చి మెడ నేతు
శుక్రవారపు లక్ష్మి మాయింటి కొస్తే
సున్నాన తాంబూలం చుట్టి నే నిస్తా
మంగళారపు లక్ష్మి మాయింటి కొస్తే
మరువక నే నిస్తె మంగళారతులు.

౧౨

అలసంద పప్పొండి ఆవునెయి కాచి
అమ్మ సీతమ్మల్ని యేపేర పిలుతు
శంభులింగము లెమ్మి జపమూర్తి లెమ్మి
నంది కేశవ లెమ్మి నా ప్రాణవిభుడా.

౧౩

వచ్చేవు పొయ్యేవు వాలేవు చిలకా
వకరతో పుట్టింట వారత లేమి
పెద్దకొడుకూ పెండ్లి పెరుమాళ్ల సేవ
ఆడబిడ్డసమర్త అల్లుడు మనుగుడుపు.

౧౪

యెంత దొడ్డారాజు బిడ్డవో గాని
యెప్పుడు నాతోను యెదురాడవమ్మ.

౧౫

ఆవులకి లేగలకి దొడ్డి రాలుండు
అక్క మా రామయ్యకి అంకరా లుండు.

౧౬

రామన్న నీ అడివి రాకాసు లడివి
పిట్టలు గూయంగ భీ తెందు లేదు.

౧౭

చెరువు కట్టలమీద కొంగల్ని జూచి
చెరువుచేప లన్ని చెల్లాట లాడె
మందకట్టల మీద అన్నల్ని జూచి
మచ్చికలు వేసేరు మామకూతుళ్లు.

౧౮

మద్దినా లప్పుడు మాయ జంగమ్ము
బిచ్చాని కొచ్చేడు బిరుదు వేసుకొని
అమ్మ బిచ్చమ్మని అడుగ జాలాడు
తల్లి బిచ్చమ్మని తలక నేరాడు.

౧౯

యెన్నడు యెరుగమ్మ యింతసోద్యమ్ము
చుక్కలకు సూరేడు పొడయుందినట్లు.

౨౦

సూరేడు పెండ్లాయె శుభలగ్నమాయె
యోగేష్డు పెండ్లాయె వడక లగ్గమ్ము.

అఖిలభారత మితవాదమహాసభ

ప్రతివాదిభయంకర రంగాచార్యులుగారు

కడచిన డిసెంబరునెల 29,30,31, తేదీలలో అఖిల భారతమితవాద మహాసభ పంౘదెంవవ సమావేశము మద రాసునగరమున జరిగినది. ఆసమావేశము నలంకరించిన పెద్ద లలో శ్రీయుతులు శ్రీనివాసశాస్త్రి, సప్రూ, సెతల్వాడ్ శివస్వామిఅయ్యర్, చింతామణి, రామచంద్రరావు మున్నగు ప్రముఖులు గలరు.

మొత్తము ప్రతినిధులందరును గలిసి ౨౦౧ మంది యుండిరి. పెద్దలలో శంకరనాథముదలి, జతీంద్రనాథవసు మున్నగు నే యిద్దరుముగ్గురో తప్ప మిగిలినవారందరును సూట్లతోనే సభాభవనము నలంకరించిరి. ఇది మిక్కిలి విచారకరమగు సంగతి. విదేశవస్తువులను, విదేశవస్త్రములను ఉపయోగించుట నష్టమైనచో-బహుశః మిత వాదులీ సిద్ధాంతము నొప్పుకొనరు-విదేశీయమగు జీవిత విధానము ననుసరించుట అంతకుమించిన నష్టము. మొదటిది కేవలము భౌతికము: విదేశవస్తువులను దీసి పార వైచుట సాధ్యము. కాని రెండవది ఆచరణము మానవుని జీవితమును శాసింపదగిన మానసికస్వాతంత్ర్యమునకు సంబంధించినది. మొదటిది భౌతికదాస్యము, రెండవది నైతికదాస్యము. భౌతికదాస్యముకన్న నైతికదాస్యము నూరురెట్లు భయంకరము. మనము ఆంగ్లదేశమున, ఆంగ్లేయుల సంఘములో, నిరంతరము తిరుగుచుండు నవసరములలో వారి వేషభాషలనే పూర్తిగ స్వీకరించుట యవసరమైన నగుగాక. కాని భారతదేశములో, భారతీయులనడుమ, భారతజాతీయతను చాటుచు, భారతీయుల స్వాతంత్ర్యపరత్వమును ఢంకాఘోషించి ప్రపంచమునకు ప్రకటింపవలసిన యిట్టిసందర్భములలో యువకులకు మార్గదర్శకులుగ నుండవలసిన పెద్దలు భౌతికముగ, నైతికముగ విదేశీయదాస్యమునే ప్రకటించుకొనుటకు సంసిద్ధపడినచో ప్రపంచము మనలను ఏదృష్టితో గ్రహించునో ధీమంతు లూహించుకొందురు గాక. వీన నిది అధ్యక్షులు, ఆహ్వానసంఘాధ్యక్షులు, తమ యుపన్యాసములలో సూచించిన మితవాదుల 'ఆధునికనాగరకతావిశ్వాసము'నకు 'ఆధునికవిజ్ఞానవిశ్వాసము'నకు నిదర్శనమైనచో, నది మిక్కిలి శోచనీయ మగునవస్థ.

సహజముగ, సమావేశము మూడుదివసములలోను, చాలభాగము నాక్రమించినవి, తీరుమానముల వరుసలో గూడ చాలభాగము నాక్రమించినవి (తీరుమానములు వ్యాసము చివరనీయబడినవి.) లండన్ సభనుగూర్చిన నిర్ణయములు. ఇదికాక మరిరెండుపెద్ద తీరుమానములు గలవు. అందొకటి తూర్పుఆఫ్రికా భారతీయులకు సంబంధించినది. రెండవది స్వదేశసంస్థానములకు జెందిన తీరుమానము. ఇదియు చాలభాగము ఏదోవిధముగ లండన్ సభకు సంబంధించినదే. ఈసందర్భమున గమనింపవలసిన యంశ మెంకటి కలదు: సంస్థానములసమస్య మిక్కిలి క్లిష్టమైనది. సాంఘికసమస్యతో పాటుగ హిందూదేశపు స్వరాజ్యప్రాప్తికి నిరంతరముగ నడ్డు దగులుచున్న ప్రబలనిరోధములలో ప్రధానమైన దిది. ఇట్టి ప్రధానాంశమునకు సంబంధించిన తీరుమానము, చర్చకుపాలగుట కనట భేదాభిప్రాయమే లేకపోయినను, అధమపక్షము, నాయకుల వ్యాఖ్యానము నక్కైన పూర్తిగ తెలియుండెను. ఇట్లయ్యు, సప్రూ, చింతామణి, రామచంద్రరావు మున్నగు ప్రముఖులు, విషయము బాగుగ దెలిసిన నాయకు, లచటనుండియు దానిని రవ్వంతయు వివరించి చెప్పకపోయిరి. మామూలు ప్రతినిధులకిది యొక గొప్పనష్టము. ఇంక ఉపన్యాసముల నాక్రమించినది ఇర్విన్ ప్రకటనము ఈయుపన్యాసములలో గూడ చాలభాగము కాంగ్రెసును దూషించుటతో ముగిసినది.

అధ్యక్షులగు శ్రీయుత ఫిరోజ్ సెత్నాగారు చెప్పినట్లు ఈప్రముఖులలో చాలమంది, ఇంతకుముందు, ఏదో ఒకవిధముగ ప్రభుత్వాంగముతో ప్రత్యక్షసంబంధము గలిగియుండినవారు. శ్రీయుత శ్రీనివాసశాస్త్రి గారు సెలవిచ్చినట్లు ఇప్పటి పరిస్థితుల క్లిష్టత్వము అసాధారణము; సాటిలేనిది. ఇట్టియీ సందర్భమున మితవాదులు తమ బాధ్యత నెంతవరకు నిర్వహించినదియు తెలిసికొనుట అవసరము.

మితవాదుల కార్యక్రమమునుగూర్చి పర్యాలోచించునపుడు మనము రెండు సంగతులను మాత్రము గట్టిగ జ్ఞాపకముంచుకొనవలయును. మొదటిది అధినివేశప్రతిపత్తి (Dominion Status); రెండవది శాసనబద్ధమైన ఆందోళనము. మొదటిది ఆదర్శము; రెండవది ఆదర్శమార్గము. అధినివేశ ప్రతిపత్తితప్ప భారతదేశమునకు ఆశపడదగిన రాజకీయౌన్నత్యము వారిదృష్టికి కనబడదు; వారియభిప్రాయము ప్రకారము ఆంగ్ల భారత దేశముల యీస్నేహము, బ్రిటిషుసామ్రాజ్యముతోడి సంబంధము భారతీయుల మహాభాగ్యమువలన లభించినవి. ఇట్టి యీ సంబంధమును వదలుకొనుట యాత్మద్రోహము. మనము గట్టిగ వాదించినచో ఇంగ్లీషువారు మనకు అధినివేశప్రతిపత్తి నిచ్చితీరెదరు. అందుచేత ఈ అధినివేశ ప్రతిపత్తిని సంపాదించుటకు గూడ మనకున్నది ఒక్కటే సాధనము. అది శాసనబద్ధమగు నాందోళనము. ఐన, శాసనబద్ధము అనుపదమున కర్థముమాత్ర మింతవరకెవరును స్పష్టముగ వివరింపలేదు. మితవాదుల యభిప్రాయము ననుసరించి ప్రభుత్వములో పదవుల నంగీకరించుట మొదలు సైమనుకమిషను బహిష్కారము వరకు శాసనబద్ధమగు విధానము; కాని గాంధిమహాత్ముని అసహాయోద్యమము మాత్రమట్లు కాదు! ఎట్లయిననేమి, మనకిప్పట కావలసినది మితవాదుల ఆశయము; దానిసాధనము. అసహాయోద్యమము శాసనబద్ధమా కాదా యను చర్చ యిచట ననవసరము. పైన చెప్పినట్లు వారియాశయము బ్రిటిషు సామ్రాజ్యమునకు లోబడిన స్వాతంత్ర్యము; దానికిసాధనము శాసనబద్ధమయిన ఆందోళనము. ఈరెంటిపై నాధారపడియే నేటి వరకు వారికార్యక్రమము నడిచినది. దీని ననుసరించియే మొన్నటి పండ్రెండవ మితవాద మహాసభ కార్యక్రమము గూడ సాగినది. అధ్యక్షుని యొక్కయు, ఆహ్వానసంఘాధ్యక్షునియొక్కయు నుపన్యాసములును, సభవారి తీరుమానములును పైసంగతులను స్పష్టముగ జాటినవి.

"అధినివేశప్రతిపత్తి మనకీయరాదని ఇంగ్లండు దేశము తలచినను ఈయకతప్పదు; అట్లీయకుండుట సాధ్యమైనను, అట్టికోరిక ఇంగ్లండునకు ఉండదు. ఇది మాగట్టినమ్మకము. కావుననే మాలక్ష్యము అధినివేశప్రతిపత్తి." (అధ్యక్షుడు: సర్ సెత్నా)

"కావున, బ్రిటిషు సామ్రాజ్యాంతర్గతమైన, సంపూర్ణమగు స్వాతంత్ర్యము మాపక్షముయొక్క ఆశయముగ నున్నంతకాలము, వాదబలము, శాసనబద్ధమగు ప్రతిఘటనము (Constitutional Oppositoni), శాసనబద్ధమగు సహకారము (Constitutional Co-operation) పై యాశయమునకు సాధనములుగ నున్నంతకాలము మాపక్షముయొక్క కాని, దేశముయొక్కగాని భవిష్యత్తును గూర్చి మేము భయపడవలసిన యవసరమేమియును లేదు."

(ఆ. సం. అధ్యక్షులు: సర్. సి. పి. రామస్వామి అయ్యరుగారు.)

వీరిరువురి యుపన్యాసములును హిందూదేశము నేడే అధినివేశప్రతిపత్తికి తగియున్నదని నిర్ధారించు ప్రబలవాదములు. రామస్వామి అయ్యరుగారు తమరాజకీయ పరిజ్ఞానము నంతను వినియోగించి, ఏదేశములో నైనను రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినమీదటనే యభివృద్ధి సాధ్యమైనదని చక్కగ నిరూపించిరి. సెత్నాగారు తమ యుపన్యాసమున చాలభాగము ఇర్విన్ ప్రభువుగారి 'రౌండ్ టేబిల్ సమావేశమును' గూర్చిన ప్రకటన భారతీయు లంగీకరించి తీరవలయునను వాదమునకు వినియోగించిరి. వారి యభిప్రాయము ప్రకారము దాని నంగీకరింపకున్నచో "హిందూదేశము మిక్కిలి గొప్ప తప్పు చేసిన దగును." కాని, ౧౯౧౯ సం. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టముయొక్క * ఉపోద్ఘాతములోని యంశములలో మార్పేమియు నుండదని పార్లమెంటులో ప్రభుత్వము ప్రకటించినదికదా. అట్టిచో మన సహకారమునకవకాశమెక్కడ? అను సందేహము ప్రజల

* హిందూదేశమునకు బాధ్యతాయుత ప్రభుత్వము, ఒక్కసారిగ గాక, క్రమక్రమముగ నొసంగబడుననుటయు, ఇట్లు క్రమముగ నెప్పటికప్పుడెంతెంతయభివృద్ధిని పొందవలయునో ఆ పరిమాణమును నిర్ణయించు నధికారము పార్లమెంటుకే కలదనుటయు ఈ యుపోద్ఘాతముయొక్క సారాంశము.



౩. సంతృప్తి

(మొదటి బహుమానము) ౧-౩ శ్రీయుత యం. కె. రంగస్వామి అయ్యంగారి చిత్రములు.




౪. కణ్వనదీస్నానఘట్టము-అంగరవద్ద

(మూడవ బహుమానము) శ్రీయుత యం. నాగేశ్వరరావుగారి చిత్రము



౫. 'మల్లేలమ్మా మల్లేలు యీ తల్లీ సత్యం చూడండి' !

శ్రీయుత కె. ఆర్. రాజరత్నముగారి చిత్రము.



౬. సముద్రప్రాంత ప్రకృతి-విశాఖపట్టణం

(రెండవ బహుమానము)

శ్రీయుత వి. తెన్నేటిగారి చిత్రము.

కుండవచ్చును. ఐన నట్టి సందేహమును పార్లమెంటువారి వలనయు నని వారి యభిప్రాయము. వారు తలచినట్లు సందేహము లేకుండ చేసికొనుటకు దగు ప్రబలకారణము లేవియు లేవన్నను, ఆ యనుమానము ప్రబలుటకే తగుకారణము లగపడుచున్నను, మనము సైమను గారి యాహ్వానము నంగీకరించియే తీరవలయును. ఇందుకు వారికిగల కారణ మొక్కటియే వారికే కాదు, మితవాదులందరికి గూడ ప్రకటనము నంగీకరించుట కదియే కారణము. "ప్రస్తుత స్థితిగతులలో ఆనిర్బంధములు, ఆపగతులు ఉండెనని వాగ్దానము చేయుటకు ప్రభుత్వమునకు కేవలము అసాధ్య మైపోయినది. కాని అంతమాత్రమునచే పార్లమెంటు అవసరమైనచో, వానిని తొలగించదని భావింపకూడదు" అని వారి గాథము. ఇట్లు మనమందరము నమ్ముటకు, మితవాదులు నమ్ముచున్నారు గదా యన్నదితప్ప మరి యొక కారణ మేదియు గానరాదు.

ఎట్లయిన నేమి, సైమనుగారి యాహ్వానము ననుసరించి, లండనులో జరుగబోవు సభ రౌండ్ టేబల్ సమావేశమనియు, నచ్చట చర్చింపఁబడు విషయము అధినివేశప్రతిపత్తివిధానమే యనియు ఒకనమ్మకము దేశములోని రాజకీయనాయకులను, చాలమంది, నావహించినది. కాంగ్రెసులో నే నాలమందియట్లు తలచువారున్నప్పుడు మితవాదులమాట యింక చెప్పవలసినదేమి? మొత్తము మీద నీగడబిడ, యీతొందర చాలవిచిత్రముగ మాత్ర మున్నది. ఇర్విను గారి ప్రకటనములో నెచ్చటను, రౌండ్ టేబల్ సమావేశము అనుమాట లేదు. ప్రతిపత్తినిర్ణయమునుగూర్చిన వాగ్దానముగాని, సూచనగాని యెందును గానబడదు. సభనుగూర్చి ప్రకటనమున నిట్లున్నది:

"అందుచే, సైమను కమిషను వారున, సెంట్రల్ కమిటీ వారును తమనిర్ణయములను ప్రకటించిన తరువాతను, బ్రిటిషు ప్రభుత్వము వారికి, ఇండియా ప్రభుత్వముతో సంప్రతించి, ఉన్న సాధ్యమునుబట్టి పైనిర్ణయములను సమాలోచించుటకు అవకాశము గలిగినమీదటను, వారు (బ్రిటిషు ప్రభుత్వము వారు) బ్రిటిషు ఇండియా ప్రతినిధులను, స్వదేశసంస్థానముల ప్రతినిధులను ఆయా సందర్భము లనుబట్టి, కలిసికాని, లేక వేరువేరుగాగాని తమ్ము గలిసికొని, భారతదేశసమస్యలనుగూర్చిన సమాలోచనము సాగించుటకై యాహ్వానించెదరు. ఈపద్ధతివలన ఈక్లిష్టసమస్యలపై, సాధారణముగ, ఏకీభావముతో గూడుకొన్న నిర్ణయములను పార్లమెంటువారియెదుట నుంచుటకు వీలగునని వారియాశ."

ఇందెచ్చటను రౌండ్ టేబల్ అనుపదము రాలేదు. 'సమాలోచనములను సాగించుటకై' అన్నచోటమాత్రము (For the puruose of Conference and discussion)అనుమాటలుపయోగింపబడినవి. ఇందలి కాన్ఫరెన్సు (Conference) అనుపదమే 'రౌండ్ టేబల్ కాన్ఫరెన్సు' తీర్మానముల కాధారమై యుండవచ్చును.

ఇంక, అధినివేశప్రతిపత్తిని గూర్చి యిట్లుకలదు:

"...కాలపరిపక్వతనుబట్టి హిందూదేశము సామ్రాజ్యములోని తక్కిన డొమినియనులతో సమానమగు ప్రతిపత్తిని బడయుటయే బ్రిటిషు ప్రభుత్వమువారి కోరిక యని బ్రిటిషు మంత్రులు పెక్కుసారులు బహిరంగముగ ప్రకటించియే యున్నారు. కాని ౧౯౧౭వ సంవత్సరపు చట్టమును అనుసరించుటలో ప్రభుత్వమువారికిగల యభిప్రాయములనుగూర్చి హిందూదేశములోను, ఇంగ్లండులోనుగూడ సందేహములు కలిగినవి. అందుచేత, ౧౯౧౭వ సం॥పు ప్రకటన ప్రకారము, హిందూదేశము యొక్క శాసనబద్ధమైన అభివృద్ధికి సహజలక్ష్యము అధినివేశప్రతిపత్తియే యను సంగతి దానిలోనే గర్భితమైయున్నదని స్పష్టముగ ప్రకటించుటకు బ్రిటిషు ప్రభుత్వమువారు, తమపక్షమున, నన్ను నియోగించి యున్నారు."

కాలము పరిపక్వమైనప్పుడు డొమినియను ప్రతిపత్తిని అనుభవించుటను గూర్చియు, మనరాజకీయాభివృద్ధికి సహజమైన లక్ష్యము డొమినియన్ ప్రతిపత్తి యగుటనుగూర్చియు ప్రభుత్వముగాని, దానికి సంబంధించిన యేవ్యక్తిగాని, యెన్నడును, ప్రతికూలాభిప్రాయము ప్రకటించి యుండలేదు. నెహ్రూరిపోర్టులో ఇంచుమించు సగముభాగ మాక్రమించిన సర్ మాల్కం హెయిలీగారు

కూడ పైసంగతిని ప్రసిద్ధముగ తన * ఉపన్యాసములో ఒప్పుకొనియేయున్నారు. ఇట్టిచో, మనకు కావలసినది లక్ష్యము డొమినియన్ పదవియే యను నధికారినిర్ణయము కాదు. ౧౯౧౯ సం॥ చట్టముప్రకారము హిందూదేశపు డొమినియను ప్రతిపత్తికి కాలము పరిపక్వమైనదా లేదా యని నిర్ణయించు నధికారము పూర్తిగ బ్రిటిషుపార్లమెంటు చేతిలో నున్నది. ఆయధికారమును లాగికొనుటయే మన మిప్పుడు చేయవలసినపని. ఆయధికారమును సంపాదించుటయే మనకు గావలసినది. ఇట్టిమార్పునకు అవకాశమిచ్చునప్పుడే వైస్రాయిగారి లండన్ సభ, రౌండ్ టేబిల్ సమావేశమగును. కాని యట్టి యధికారపరివర్తనమును గూర్చిన సూచన రవ్వంతయు ప్రకటనలో గన్పింపదు. కాబట్టియే గాంధిమహాత్ముడు ౨౩ డిసెంబరు నాటి ఢిల్లీసమావేశమున 'సభసమావేశము డొమినియన్ ప్రతిపత్తిని నిర్ణయించుటకే' యని ప్రభుత్వమువారు వాగ్దానము నీయవలయునని పట్టుబట్టినాడు. లండన్ సభకు రౌండ్ టేబిల్ తత్వమును సమకూర్చుటయే దీని యభిప్రాయము. మరియు, మితవాదులకైనను డొమినియన్ ప్రతిపత్తి వెంటనే కావలయును. ఎన్నడో కాలము పరిపక్వము కావలెనను నభిప్రాయమును వారంగీకరింపరు. ఈవిషయమున సెత్నాగారు తమయభిప్రాయము నిట్లు వెల్లడించినారు.

"వెంటనే అధినివేశప్రతిపత్తిని స్థాపించుటను గూర్చిన సమస్య చర్చనీయాంశములనుండి తొలగింపబడినచో, మేముసభలో (లండన్ సభలో) పాల్గొనుట కంగీకరింపజాలము."

(అధ్యక్షోపన్యాసము.)

లండన్ సభయందు పాల్గొనవలయునను తీరుమానము నుపపాదించుచు, సప్రూగారిట్లు చెప్పిరి.

"డొమినియన్ ప్రతిపత్తి సిద్ధాంతము నను, దాని తత్క్షణ ప్రాప్తికిని సంబంధించినంతవరకు మితవాదులు ఇప్పటగాని, దేశమునగాని ఉత్తమముగ పోరాటము సాగించెదరు."

ఈవిధముగ, లిబరల్ పక్షమువారికి గావలసినది, వెంటనే డొమినియన్ ప్రతిపత్తిని స్థాపించుటయే. ఇంతకన్న తక్కువ వారికైనను అక్కరలేదు. కాంగ్రెసు కూడ దానితో తృప్తి జెందును. అ. ప. సభవారిచే వామోదింపబడిన నెహ్రూరిపోర్టుకూడ దాని నంగీకరించుచునే యున్నది. - నెహ్రూరిపోర్టును మితవాదులు సంపూర్ణముగ వామోదించియుండిరి. ఇంతయైనను, వైస్రాయిగారి ప్రకటనము పైసంగతినిగూర్చి మౌనముదాల్చినది. తుదినిర్ణయము జేయు నధికారమును పార్లమెంటుకే యిచ్చినది. "ఈసందర్భమున ప్రతి బ్రిటిషుపక్షమునకును తన యిష్టమువచ్చినట్లు ప్రవర్తించుటకు సంపూర్ణముగ నధికారము గలదు" అని కూడచెప్పుచున్నది.

ఈవిధముగ, నెట్లుచూచినను, వైస్రాయిగారి లండన్ సభలో రౌండ్ టేబిల్ తత్వము రవ్వంతయు కనబడకపోయినను, ఈలోపము దెలిసియుండియు, బ్రిటిషుప్రభుత్వమువారు, బుద్ధిపూర్వకముగ, దానిని సవరించుకొనుట మానివైచినను, ఇప్పటి రాజకీయపక్షములన్నియు నేకగ్రీవముగ నంగీకరించిన డొమినియన్ ప్రతిపత్తికి లండన్ సభతో నెట్టి సంబంధము లేకపోయినను, అంతియే కాక, దానినితిరస్కరించు సూచనలు ఎన్నియో స్పష్టముగ గనబడుచున్నను, లిబరల్ పక్షమువారు వైస్రాయిగారియాహ్వానము నంగీకరింపవలయునని తీర్మానించిరి. మూడుదినములు కాంగ్రెసును దూషించుటతో కాలక్షేపము చేసిరి. పైపెచ్చు, కాంగ్రెసువారు కల్పించుదుఃస్థితినుండి దేశమును రక్షించుట తమ విధి యని తమ

* ఇది 1924 సం॥లో సర్ మాల్కం హెయిలీగారు హోంమెంబరుగ నున్నప్పుడు భారతశాసనసభలో నొసంగిన యుపన్యాసము. ఇందు వారు, 1917 సం॥నాటి ప్రకటనలో సూచింపబడిన బాధ్యతాయుతప్రభుత్వము డొమినియన్ ప్రతిపత్తి కాదనియు, బ్రిటిషురాజ్యాంగవేత్తలు ఆలోచించి బుద్ధిపూర్వకముగనే అప్పుడామాట నుపయోగించిరనియు జెప్పిరి. ఇప్పటి రాజకీయనాయకులు మాత్రము అది డొమినియను ప్రతిపత్తియేయని తలచుచుండిరి. అందుచేత హెయిలీగారి వ్యాఖ్యానము వారిని కలవరపరిచినది. తమవాదమును సమర్థించుకొనుచు నావిషయమును నెహ్రూరిపోర్టులోచాలసారము చర్చించియున్నారు.

కరుణామయత్వము ప్రకటించి, రొుకవిధముగ, నిటుపై నవతరింపబోవు ప్రభుత్వమువారి నిర్బంధవిధానమునకు ఆహ్వాన మంపిరి. వింటర్టన్ ప్రభువులకు, ఓడ్వాయర్లకు ప్రోత్సాహమెుసంగిరి.

ఇంగ్లీషుపత్రికలు, ఆంగ్లోఇండియన్ పత్రికలు నప్పుడే నిర్బంధవిధానమును ప్రోత్సహించు చున్నవి. భారతదేశపు శత్రువులు భారతీయ నాయకుల నిర్బంధమును సూచింప మొదలిడినారు.

టైమ్సుపత్రిక ప్రతినిధి డిల్లీనుండి యిట్లువ్రాయుచున్నాడు.

"న్యాయశాసనము నమలుజరుపుటతో ఇండియా ప్రభుత్వమువారి నూతనవత్సర మారంభించును. హింసాపద్ధతులకు, మామూలు నేరములకు, సమిష్టిశాసనోల్లంఘనమునకు జెందిన సంస్థలకునేగాక, ప్రజలను నేరములకు బురికొల్పు ఉపన్యాసములకు గూడ నీశాసనము వర్తించును."

వింటర్టన్‌ప్రభువు గాంధిమహాత్ముని నిర్బంధమును సూచించుచున్నాడు.

ఇట్టివ్రాతలకు, సూచనలకు మితవాదుల యాశాంతిరతమగు 'బాధ్యతలు, విధులు' నెట్లు దోహద మొసంగునో తమ ప్రతికూలప్రచారము నీపద్ధతిని సాగినచో, దేశ మేస్థితికి వచ్చునో, 'బాధ్యతలను' ప్రకటించు సెతల్వాడ్, సెత్నా మున్నగు మితవాదనాయకులు, కొంచె మూహించుకొనియున్న బాగుండెడిది. ఈసందర్భమున, ఆహ్వానసంఘాధ్యక్షులగు రామస్వామి అయ్యరుగారు తమ యుపన్యాసమున జెప్పినమాటలు గమనింపదగినవి. "మరియు, ప్రజాక్షేమమునకై, స్వార్థత్యాగులు, నిష్కల్మష దేశభక్తులునగు వారిచే నడిపింపబడినదియు, ఇంచుమించుగ మా పక్షసభ్యులందరిచే ననుసరింపబడినదియు నగు భారతదేశీయమహాసభవంటి మహాసంస్థల పలుకుబడిని క్షీణింపజేయగోరువా రెవ్వరు నుండరు."

మితవాదనాయకులు పైవాక్యమున గర్భితమైయున్న భావమును పూర్తిగ తోణపరచుకొనుట యేయుక్తము. రామస్వామి అయ్యరుగారు తమ యీయభిప్రాయమును పూర్తిగ నమలుపరిచెదరనియే, తోడి మితవాదులచే అమలుపరిపించెదరనియే నమ్మెదము.

తీరుమానములు

౧. వైస్రాయిగారి రైలుబండిని భగ్నముచేయుటకై కావింపబడిన ఘోరప్రయత్నమును తీవ్రముగఖండించుచు, భగవదనుగ్రహమున, వైస్రాయిగారును, వారి భార్యయు సపరివారముగ తప్పించుకొన్నందుకు వారి నీసభవారభినందించుచున్నారు. భారతీయులజీవితమునకు, విజ్ఞానమునకు పూర్తిగ విరుద్ధమైన యీ నేరము హేయమని యీసభవారు నిర్ణయించుచున్నారు.

ఈతీరుమానమును టెలిగ్రాముద్వారా వైస్రాయిగారి కందజేయుటకు ఈసభవా రధ్యక్షున కధికారమిచ్చుచున్నారు.

౨. మితవాదపక్షసభ్యులలో ప్రముఖులుగ నుండిన శ్రీయుత నారాయణవిష్ణుగోఖలే, సర్ గంగాధర చిట్నవీస్, గోకర్ణనాథ్ మిశ్రా గారల మరణమువలన దేశమునకు గలిగిననష్టమును ఈసభవారు గుర్తించుచున్నారు.

3. 1929 సం॥ అక్టోబరు 31 తేదీనాడు వైస్రాయిగారు గావించినప్రకటన, 1917 సం. పు ప్రకటన ప్రకారము, భారతదేశమునకు రావలసినది డొమినియన్ ప్రతిపత్తియే యని సాధికారముగ స్థిరపరచుచున్నది; బ్రిటిష్ఇండియాయును, స్వదేశసంస్థానములును గలిసి ఏకమై యుండవలయు ననుటను స్పష్టముగ నంగీకరించు చున్నది; రాబోవు రాజ్యాంగవిధానము ననుసరించి తాను బ్రిటిషుప్రభుత్వముతో సమానప్రతిపత్తిని గలిగియుండవలయు నను భారతదేశపు హక్కును ఒప్పుకొనుచున్నది. అందుచేత ఇండియన్ నేషనల్ లిబరల్ ఫెడరేషన్ వారు పైప్రకటనమునకు హృదయపూర్వకముగ స్వాగత మొసంగుచున్నారు.

మరియు, పైప్రకటనలో సూచింపబడిన సభయందు లిబరల్ పక్షము పాల్గొనవలయునని యీసభవారు నిర్ణయించుచున్నారు. ౧౯౩౦ వ సంవత్సరములో, సాధ్యమైనంత శీఘ్రముగ, రౌండ్ టేబిల్ సభ సమావేశము

జరుగవలెననియు, దేశములోని అభివృద్ధిపరములగు నభిప్రాయముల కందు ఎక్కువ ప్రాతినిధ్య ముండవలయునని యీసభవారు గట్టిగ హెచ్చరించుచున్నారు.

౪. ఈనడుమ వెలువడిన వైస్రాయిగారి ప్రకటనము హృదయపూర్వకముగ నంగీకరించుచు, అది వెంటనే సంపూర్ణముగ, ఫలవంతమగునట్లు చేయుటకు సిద్ధముగనున్న పక్షములన్నియు నేకమై * పరివర్తనకాలమునకు సరిపడు మినహాయింపులతో కూడుకొని, డొమినియన్ ప్రతిపత్తిపై నాధారపడియుండు నొక రాజ్యాంగప్రణాళికను తయారుచేయవలయునని యీసభవారు హెచ్చరించుచున్నారు.

౫. (క) వైస్రాయిగారి ప్రకటనమును ప్రముఖులగు భారతీయ సంస్థానాధిపతు లంగీకరించినందుకు సంతృప్తి దెలుపుచు, ఇటుపై డొమినియన్ ప్రతిపత్తిమీద నాధారపడియుండు భారతదేశముయొక్క ఏ ప్రభుత్వవిధానము నందైనను, సంస్థానముల ఆంతరిక స్వాతంత్ర్యమునకు జెందిన వారిహక్కులును, విధులును కొనసాగునట్లు తగు హామీ ఉండవలయుననుసంగతి ఈసభవారు అంగీకరించుచున్నారు.

(ఖ) సంస్థానాధీశులు బ్రిటిష్ఇండియాలో అమలునందున్న పరిపాలనపద్ధతులతో సమానముగ నుండునట్లు తమతమ సంస్థానములలోని పరిపాలనవిధానమును తామే సవరింతురని యీసభవారు నమ్ముచున్నారు.

౬. యూరపియన్ సంఘపు ప్రతినిధుల సంఖ్యను ఎక్కువచేయుటకుగాను సర్ విల్సన్ సామ్యూల్ గారి నివేదికలో సూచింపబడిన సలహా కెన్యాలోని దేశీయప్రజలకును, భారతీయులకును ఎక్కువనష్టము గలిగించునని యీసభవారు అభిప్రాయ పడుచున్నారు. సామాన్య నియోజక వర్గములలో (Common Electorate), సామాన్య నియోజనధికారము (Common Franchise) ప్రకారము, తగురీతిని, ప్రాతినిధ్యము వహించుటకు అప్పటి దేశీయప్రజలు అర్హులగువరకు, తూర్పు ఆఫ్రికా కాలనీలలో నెప్పటను రాజ్యాంగవిధానమునపై మెట్టును అంగీకార మీయబడరాదని యీసభవారి దృఢవిశ్వాసము. అందుచేత, ప్రస్తుతమున్న ప్రత్యేకనియోజకవర్గములకు బదులుగ, సామాన్య నియోజకవర్గములను స్థాపింపవలయునను హిల్టన్‌యంగ్ కమీషనువారి సలహా నంగీకరించుచు, భారతీయుల స్వాస్థ్యమునకేకాక, మొత్తము మీద, కాలనీ అంతటి స్వాస్థ్యమునకుగాను, సామాన్య నియోజకవర్గమును స్థాపించుటకై విచారణ కొనసాగింపవలయునని యీసభవారు సామ్రాజ్యప్రభుత్వము వారిని కోరుచున్నారు.

౭. ఈసభవారు ౧౯౩౦ సం॥నకు సర్ సి. పి. రామస్వామి అయ్యర్ కె. సి. ఐ. ఇ; అనరబుల్ రావు బహద్దరు జి. ఏ. నటేశన్‌గార్లను ఇండియన్ నేషనల్ లిబరల్ ఫెడరేషనుకు సంయుక్త కార్యదర్శులుగ నియమించుచున్నారు.

౮. ప్రస్తుతస్థితిగతులను బాగుపరచుటకై తగు చర్య దీసికొనవలయుననియు, తమ కార్యక్రమమును శీఘ్రము ముగింపవలయుననియు విట్లీకమీషనువారిని ప్రభుత్వమువారు కోరవలయునని యీసభవారు నిర్ణయించుచున్నారు.

౯. సాక్ష్యమునంతను ప్రోగుచేసి డొమినియన్ ప్రతిపత్తికి గావలసిన వాదమును తయారుచేయుటకు ఈసభవారొక సంఘమును నియమించుచున్నారు. దానికిగలయు ద్రవ్యమును సంస్థకు జెందిన నిధినుండి తీసి వ్యయపరచుటకు అధ్యక్షునికి అధికార మొసంగుచున్నారు.

సంఘసభ్యుల పేర్లు

౧. సర్. పి. యస్. శివస్వామిఅయ్యర్
౨. సర్. సి. పి. రామస్వామి అయ్యర్
౩. దివాన్‌బహద్దర్, టి. రంగాచార్యర్
౪. సి. వై. చింతామణి.
౫. సర్. మోరోపంత్ జోషీ
౬. సర్. చిమన్లాల్ సెతల్వాడ్.
౭. సర్. శంకరరావు చిట్నవీస్
౮. సర్. తేజ్ బహదూర్ సప్రూ (సమావేశకర్త)

* కాని యీ పరివర్తనకాలముయొక్క పరిమితిని నిర్ణయించు నధికార మెవ్వరిది? బ్రిటిషువారిదా? భారతీయులదా?

నలుబదినాలుగవ అఖిలభారత జాతీయమహాసభ, లాహోరు.

తీర్మానములు

౧

భారత కాంగ్రెసుస్థాయిసంఘమునకు వెనుక కార్యదర్శిగా నుండిన పండిత గోకర్ణనాథ మిశ్రీగారు, ప్రొఫెసరు బి. ఎమ్. పరంజపిగారును శ్రీయుత వి. భక్తవత్సల నాయుడుగారును, రోహిణీ కాంతగారును, ఆర్. కె. లాహిరీగారును, బి. చక్రవర్తిగారును దివంగతులైనందుల కీ మహాసభవారు సంతాపమును వెల్లడించుచున్నారు.

౨

జతీంద్రనాథ విజయులు గావించిన మహాత్యాగము నీసభవారు శ్లాఘించుచు వారికుటుంబమునకు సానుభూతి తెల్పుచున్నారు. మరియు భారతదేశమున గల విదేశీయ ప్రభుత్వమే వీరిట్లాత్మ సమర్పణ కావించుటకు కారణమని అభిప్రాయ పడుచున్నారు.

3

ఈ సభవారు వయిస్రాయి బండిమీదీ గావింపబడిన బాంబు ప్రయోగమును నిరసించుచు, ఇట్టి చర్యలు కాంగ్రెసు సిద్ధాంతమునకు వ్యతిరేకమనియు, జాతీయ సమరమునకు నష్టకరమనియు తమకు గల యభిప్రాయమును తిరుగ దృఢపరచుచున్నారు. మరియు దైవవశమున ఇర్విన్ దంపతులు, వారిపరివారము ప్రాణోపద్రవము లేకుండ తప్పించుకొనగలిగినందులకు వారి నభినందించుచున్నారు.

౪

ఈ సభవారు అక్టోబరు ౩౧ వ తేదీని రాజప్రతినిధి గావించిన ప్రకటన సందర్భములో కాంగ్రెసువాదులతో సహా వివిధ పక్ష నాయకులు సంతకములు చేసి గావించిన ప్రకటన విషయమై కాంగ్రెసువారు గావించిన చర్య నమమతించుచూ, స్వరాజ్యమునకై గావింపబడుచున్న జాతీయోద్యమమును రాజీగా పరిష్కరించుటకై వయిస్రాయిపడిన శ్రమ కభినందించుచున్నారు. మోతీలాల్ నెహ్రూ మున్నగు నాయకులు వయిస్రాయితో సంప్రతించుటవలన కలిగిన ఫలితముల గమనించి ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెసు రౌండు టేబిల్ సమావేశమందు పాల్గొని లాభములేదని యీసభవారు తలంచుచున్నారు.

మరియు, గత సంవత్సరము కలకత్తా కాంగ్రెసులో గావింపబడిన తీర్మానము ననుసరించి ఈ కాంగ్రెసు వారిప్పుడు కాంగ్రెసు ఆదర్శమందలి 'స్వరాజ్య' పదమునకు 'సంపూర్ణస్వాతంత్ర్యము' అను అర్థము నిర్వచించుచున్నారు. కావున అధినివేశ ప్రతిపత్తికిగా నిర్మింపబడిన నెహ్రూప్రణాళిక ఇంతటితో రద్దయినదని ప్రకటించుచున్నారు. మరియు కాంగ్రెసునందలి సర్వపక్షములవారు తమయావచ్ఛక్తుల సంపూర్ణస్వాతంత్ర్య సంపాదనకై వినియోగింప గలరనియు, నెహ్రూరిపోర్టులో సూచింపబడిన తాత్కాలిక, సాంఘిక వివాదపరిష్కార సాధనముల మూలమున కాంగ్రెసునుండి ఎడతొలంగవలసిన లేక కాంగ్రెసునందు చేరుటకు వీలుగాని, ప్రముఖులును, నేడు మరల కాంగ్రెసునందు చేరి ఎల్లరకు సంబంధించిన ఈ ఆదర్శమును సాధించుటకు తీవ్రకృషి సలుపుదురనియు నమ్ముచున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యసమరము సాగించుటకు సన్నాహమొనర్చ మొదటి మెట్టుగాను, కాంగ్రెసు విధానము ఆదర్శము మార్చినందుల కనుగుణ్యముగ నుండుటకుగాను రాష్ట్రకేంద్ర శాసన సభలను బహిష్కరింపవలయునని ప్రకటించుచు, ఇకపయి ప్రత్యక్షముగ గాని, పరోక్షముగ గాని ఈశాసనసభలతో జోక్యము కల్పించుకొనరాదనియు, ప్రస్తుతము శాసనసభలందు సభ్యులుగా

నున్నవారు తత్క్షణమే రాజీనామా నిచ్చివేయవలయుననియు కాంగ్రెసువాదులను కోరుచున్నారు. మరియు, దేశీయులు తమయావచ్ఛక్తుల నిర్మాణ కార్యక్రమము నిర్వహించుటకయి వినియోగింప వలయునని కోరుచు, తయారుగానున్నట్లుతోచినపుడు అవసరమైన అన్ని జాగ్రత్తలతోటి కొన్ని ప్రత్యేకస్థలములోగాని, సమిష్టిగాగాని పన్నుల నిరాకరణముతో సహా శాసనోల్లంఘనము ప్రారంభించుటకు అఖిలభారతకాంగ్రెసు సంఘమునకు ఈసభవా రధికారమిచ్చుచున్నారు.

౫

తూర్పు-ఆఫ్రికాయందు భారతీయులు పట్టుదలతోనుండి తమజాతీయభావమును ప్రకటించినందుకు వారి స్వసౌఖ్యమునయిన త్యజించి యీ మధ్యనే ఆ దేశమునకు వెడలివచ్చిన శ్రీమతి సరోజినీనాయుడు గారిని కాంగ్రెసుసభ అభినందించుచున్నది. సాంఘిక ప్రాతినిధ్యములను, ఆస్తి గల భారతీయులనుకూడ ఓటింగు అధికారమియ్యక అనవసర భేదములు పాటించు నిర్మాణవిధానమెట్టిదికూడ భారతీయులకు సంతృప్తికరముగ నుండజాలదని యీసభవారు తలంచుచున్నారు.

౬

శ్రీ సాపూర్జి సక్లత్వాలాగారును పార్లమెంటు మహాసభ్యుడును ఇంగ్లాండులోను, యితర విదేశములందున్న యితర భారతీయులను తిరిగి స్వదేశమునకు రాగోరినపుడు అనుమతిపత్రముల నివ్వకుండుటను యీ సభవారు నిరసించుచున్నారు.

౭

కాంగ్రెసులో చేరువారును, సామాన్యజనమును ఎక్కువ ప్రాతినిధ్యము వహింపవలసి యున్నందునను, డిసెంబరు ఆఖరున సభ జరిగినచో పేదవారి చలి నుండి సంరక్షించుకొనుటకు ఎక్కువ వస్త్రములు మున్నగు వానికొరకయి చాల వెచ్చింపవలసి యున్నందునను, యింక ననేకవిధములవారికి అసౌకర్యముగ నుండుటచేతను, కాంగ్రెసుసభ యికముందు ఫిబ్రవరి లేక మార్చిమాసములలో జరుపుటకు సభను, ఆహ్వానించు రాష్ట్రసంఘములతో సంప్రతించి వర్కింగు కమిటీవారు నిర్ణయించవలెను.

౮

విదేశీయ పరిపాలకులచే ప్రత్యక్షముగా గాని, పరోక్షముగాగాని భారతదేశముపయి మోపబడిన ఋణబాధ స్వతంత్ర భారతదేశము సహింపజాలదు.

౧౯౨౨ వ సంవత్సరములో గయా కాంగ్రెసు మహాసభవారిచే నామోదింపబడిన తీర్మానము నీ మహాసభవారు స్థిరపరుచుచు, ప్రస్తుత ప్రభుత్వమునుండి సంక్రమించిన బాధ్యతలును, సౌకర్యములును, స్వతంత్రభారతదేశమునందు స్వతంత్రమగు నొకవిచారణ సంఘమువారిచే పరీక్షింపబడుట ఈసభవారి యుద్దేశమని తెలిసికొనదగినవా రందరకు నిందుమూలముగా నీసభవారు ప్రకటించుచున్నారు.

౯

దేశీయ సంస్థానమునందలి ప్రజలకు సంస్థానాధీశులకు బాధ్యతాయుత ప్రభుత్వమొసంగతగుసమయముచేరునది- కావున ప్రజలవాక్స్వాతంత్ర్యము, సభలుచేసికొను అధికారము, ప్రాణధనసంరక్షణము మున్నగునవి యొసంగుచు చట్టముగావింపవలెనని యీసభవారు సంస్థానాధీశులను కోరుచున్నారు.

౧౦

నెహ్రూ నివేదిక రద్దయినందువలన, స్వాతంత్ర్య ప్రభుత్వమునందు సాంఘికసమస్యల పట్ల కాంగ్రెసు విధానము వేరుగ ప్రకటింప నవసరము లేదు. కాని నెహ్రూ నివేదికయందు సూచింపబడిన సాంఘిక సమస్యా పరిష్కార విధానముపట్ల సిక్కులును, మహమ్మదీయులు మరికొన్ని అల్పసంఖ్యాకవర్గములు అసంతృప్తి వెలిపుచ్చినందున, యికముందేదయిననిర్మాణ విధానము సూచింపబడునప్పుడు అందుకు సంబంధించిన సంఘములవారికి సంతృప్తికరముగ నుండనిచో కాంగ్రెస్ సంస్థ యంగీకరింపదని యీ సభవారు నమ్మకముగ తెల్పుచున్నారు.

౧౧

రాబోవు కాంగ్రెసు మహాసభ కరాచిలో జరుగుటకును; ౧. పండిత మోతిలాలు నెహ్రూ, ౨. మహాత్మ గాంధి, 3. జె. యం. సేనగుప్త, ౪. మౌలానా అబ్దుల్ కలాం అజాదు, ౫. సర్దారువల్ల భాయిపటేలు, ౬. సర్దారు శార్దూలసింగు, ౭. డాక్టరు సత్యపాలు, ౮. డాక్టరు పట్టాభి సీతారామయ్య, ౯. సి. రాజగోపాలాచారి, ౧౦. జయరామదాసు దౌలతరాం గార్లు సభ్యులుగను, డాక్టరు సయ్యద్ మహమ్మదు (బీహారు), శ్రీప్రకాశ (కాశీ)గార్లు కార్యదర్శులుగను, జమ్నాలాల్ బజాజ్, శివప్రసాదగుప్తాగార్లు కోశాధిపతులుగను నుండుటకు ఈ మహాసభవారు తీర్మానించుచున్నారు.

కుంతివిచారము

శ్రీ వేంకట కాళిదాస కవులు
(ఆంధ్ర గీర్వాణ సాహిత్య సమ్మేళనము)

దుర్వాసమౌనిచంద్రుఁడు పుత్రలాభమంత్రోపదేశముఁ జేసియుండ నేల?
కన్య నయ్యుఁ దనూజకాంక్ష, మంత్రముఁ బరీక్షింప, సూర్యుని నుపాసింప నేల?
సౌమ్యరూపముఁ దాల్చి సవితృదేవత నాకుఁ బ్రత్యక్షముగఁ గానఁబడఁగ నేల?
పొమ్మంచుఁ బ్రార్థింపఁ బోకుండ నాకు నీదివ్య పుత్త్రునిఁ బ్రసాదింప నేల?
కటకటా! యేమి యొనరింపఁగలుగుదాన?-నెవరితోఁడ నేమని వచియింపుదాన?
ఏమహాత్ముని దూషింప నెంచుదాన?-నెటులు లోలోన నీరీతి నేడ్చుదాన?

శా. నాకుం గల్గిన నాకుమారకుని చందం బింక నేరీతిగా
సాకల్యంబుగఁ దల్లిదండ్రులకుఁ బ్రస్తావించి వాక్రుచ్చెదన్?
లోకుల్ దీని నెఱుంగఁ జాలినయెడన్ లోలోపలన్ నవ్వరే?
యీకన్యన్ నిరసింపరే? కటకటా! యిం కేమి నేఁ జేసెదన్?

ఉ. కన్నియ యేడ! సుందరవికాస విభాసురుఁడైన నందనుం
గన్నవిచిత్ర మేడ! యిది కల్పనయా? యనృతంబ? సత్యమా?
యెన్నఁడు నిట్టివింత విననేనియు లేదని లోకు లెల్లరున్
నన్నుగుఱించి చెప్పుకొన నల్వురి లోన నెటుల్ చరించెదన్?

చ. కనుక మహాపకీర్తి జనకమ్ముగ నెవ్వరికైనఁ గాని నీ
జననరహస్యముం దెలుప శక్యమె?—యట్లని నిత్యదుఃఖభా
జనముగ నీపవిత్రతరశైవలినీహృదయాంతరంబునన్
నినుఁ గడుపారఁ గన్నసుతు నిర్దయతన్ విడువంగ శక్యమే?

మ. సహజంబై లసమానసత్త్వకలనా సౌందర్య సంపూర్ణమై
మహితంబై యసమాన పావనకళామాధుర్యసంయుక్తమై

మహనీయోజ్జ్వలమై కర్ణమ్ము లలరు యుష్మద్దివ్య తేజస్సమా
వహలావణ్యాంచితమూర్తి విడువఁగ స్వాంతంబు నా కొప్పునే?

తే. వింతయగు దివ్యకాంతితో వెలిఁగి సహజ-కవచకుండలంబులతోడ నవతరించి
నట్టి సూర్యనారాయణుఁ డనఁగ నొప్పు, నిన్ను విడనాడి యేరీతి నిల్పుదాన?

చ. కటకట! యీయమాయికపుఁగన్నియ కన్నులనుండి మెల్లనం
బొటబొటఁ గారు బాష్పకణముల్ పడ, నార్ద్రవికాసభావవి
స్ఫుట మగునట్టి నీమధురమోహన దివ్యముఖంబులోని నీ
చటులవిలోకనప్రభలు స్వాంతము నెన్నటికేనిఁ బాయునే?

ఉ. నీనునుపాలబుగ్గల వినిర్మల పావనభావ మొప్ప ము
ద్దేనియుఁ బెట్టలేనిది సుమీ! నినుఁ గాంచిన కుంతి యీమె, వి
జ్ఞానవిహీనఁ, గన్న సుతు శైవలినీ జలమందుఁ ద్రోయఁగా
నూనిన పాపచిత్త, భయదా! యిఁక నెంచకు మోయి తల్లిగా!

చ. కలుషములైన మత్కరయుగంబునఁ గన్నులు మూసె దేల? ని
ర్మలతర నిమ్నగాంచిత తరంగచయధ్వని యెల్ల జోలపా
టలగతి నీదువీనులఁ బడఁగ నిదురించెద; వింక నీవు తే
నెలఁ దులకించు వీక్షణము నిల్పుము నాపయి, ముద్దనందనా!


సీ. ఏ చాన పున్నెంబు లాచరించెనొ, నిన్నుఁ బ్రీతితోఁ బాలిచ్చి పెంచుకొఱకు
ఏ తన్వి నోముల నెన్ని నోచెనొ, నిన్ను ముద్దాడు భాగ్యంబుఁ బొందుకొఱకు
ఏ సాధ్వి వ్రతములం జేసియుండెనొ, నిన్ను గని సదానందంబుఁ గాంచుకొఱకు
ఏ యంగన తపంబు నెలమిఁ జేసెనొ, నిన్ను భవ్యనందనునిగాఁ బడయుకొఱకు
ఎవతె భగవంతుదయ గడియించెనొ కద?-నిన్నుఁ బోషించుమాత్రమై నెగడుకొఱకు
ఆపతివ్రత యెందు భాగ్యంబు నొంద-నక్కటా నోచనైతిఁగదా! కుమార!

చ. అమల పయఃప్రపూరిత మహాతటినీ! యిదిగో! త్వదీయ మ
ధ్యమున మదీయనందనుని నక్కట పేటికలోన నుంచి పా
పమనక యెంతయుం గఠినభావమునం బడఁద్రోయుచుంటిఁ; బ్రే
మముఁ గొని యింక నీపసికుమారునిఁ బ్రోచుభరంబు నీదె యౌ.

శా. ఓ గంభీరతరంగిణీ! వినయసంయుక్తైక చిత్తంబునన్
నీ గర్భంబున నియ్యెడన్ విడుచుచుంటిన్; వత్సలత్వంబుతో
నీ గారాబు కుమారునిం గొనుచు నిం కేరీతి రక్షించి నా
పైఁ గారుణ్యముఁ జూపెదో?—త్రిజగదంబాయై నమస్తే నమః.



౭. తిరుచినాపల్లి-కొండపైనుండి




౮. మాతృభూతేశ్వర దేవాలయము-తెప్పకోనేరు-తిరుచినాపల్లి ౯-కొండపైనుండి

౭-౧౦ శ్రీయుత జే. సుబ్రహ్మణ్యంగారి చిత్రములు



౯. కొల్లడపు; క్రొత్తవంతెన-జంబుకేశ్వరమువద్ద



౧౦. ప్రపంచమంతా



జన్మనిరోధము

డిశంబరు మాసపు 'స్ఫియరు' పత్రికలో 'లేడీ బ్రమ్మండుహేం' అనునామె జన్మనిరోధమును గురించి యిట్లు వ్రాయుచున్నది.

బ్రిటన్ దేశము మితిలేని జనసంఖ్యచేత నిండియున్నది. ప్రతి దేశములోను ఆదేశముయొక్క పాడిపంటల యోజించుకొని దాని కనుగుణ్యముగ జనసంఖ్యమితి మీరకుండునట్లు జాగ్రతపడవలసిన దినములు వచ్చుచున్నవని బర్మింగ్‌హాము బిషప్ గారు చెప్పినమాట సత్యేతరము కాజాలదు. మతాచార ప్రవక్తలైన బిషప్ గారు ధైర్యముచేసి దేశమతాచార విరుద్ధమైన యీసంగతిని వెల్లడించినందులకు నేను వారిని ప్రశంసించు చున్నాను.

ప్రపంచము యావత్తు అనంతకోటి మానవులతో నిండియున్నది. అధికజనసంఖ్య, దానివలన కలుగు సాధక బాధకములు ప్రస్తుత దేశావస్థలకు మూలకారణము లగుచున్నవి. మనోవ్యసనము, రోగము, దీనత్వము, బుద్ధిహీనత, ఆత్మహత్య మొదలగు కీడులన్నియూ నీ అధిక జనసంఖ్యవలననే కలుగుచున్నవి. విశాలహృదయముతో పరీక్షించిన ప్రపంచములో కెల్ల నేడొక్క ఐరోపాఖండమునందు మాత్రమే అచ్చటిపాడి పంటలకు తగిన జనసంఖ్య కనబడుచున్నది.

ఈ విషయములో ఫ్రాన్సుదేశము ప్రథమగణ్యమై యున్నది. ప్రపంచ మహాయుద్ధము జరిగిన పదునాలుగు సంవత్సరముల పిమ్మట ఐరోపాఖండ మంతటిలోను యుద్ధమువలన కష్టనష్టములకు పాలుగాక విజృంభించుచున్న దొక్క ఫ్రాన్సుదేశమే. సైన్యాధిక్యము మొదలగు విషయములందుకూడ దీనిదే ముందడుగు. ఈదేశమునందు నిరుద్యోగ సమస్య లేనేలేదు. ఆదేశమునందు కలిగిన పాడి పంటలకు విస్తీర్ణతకు సరిపోయిన జనసంఖ్య మాత్రమే యుండుట దీనికికారణము. ఇదిగాక ఫ్రాన్సుదేశముయొక్క జనాభా మామూలు సంఖ్యకంటె తక్కువగా కూడ ఉన్నది.

దీనితరువాత వచ్చు దేశములు స్వీడను, నార్వే, స్విట్జర్లాండు. ఇటీవల స్విట్జర్లాండులో కూడ జనసంఖ్య అధికమగుచున్నట్లు తెలియుచున్నది. హాలెండు దేశస్థులను మాత్రము మూడువేలమైళ్ల విస్తీర్ణముగల యీస్టిండీస్ దీవులు వలసపోవుట కనుకూలమై పెన్నిధివలె గాపాడుచున్నవి.

తరువాత జనసంఖ్యచేత బాధపడుచున్న దేశములను గురించి ఆలోచించుటలో ఐరోపాఖండము లోనెల్ల ఇంగ్లాండు మొదటిదిగ కనబడుచున్నది. నిరుద్యోగము, భరింపరాని పన్నులు, జనబాహుళ్యము మొదలగు దుర్భర కష్టములకు లోనై పీడింపబడుచున్న దీదేశము. ఇందలి జనసంఖ్య (15,00,000) పదిహేను లక్షలకు మించియున్నది.

తరువాత జర్మనీదేశము. ఇందున పదిహేనులక్షల జనసంఖ్య కలిగి మిక్కిలియిక్కట్టుల పాలగుచున్నారు. ఆస్ట్రియా దేశము గూడ అరువదిరెండు లక్షల జనసమూహముతో నిండి ఉద్యోగము, కూడు, గుడ్డ దొరకక

బాధపడుచున్నారు. పైరీతినే ఇటలీదేశము గూడ అనేక లక్షలమంది జనసమూహముచే దుర్భర కష్టముల నందుచున్నది. ఇందు ప్రతిసంవత్సరము నాలుగు లక్షలకు తక్కువగాని జన సంఖ్య పెరుగుచున్నది

జపాను దేశములోగూడ వృత్తివ్యాపకములు లేక అనేకమంది జనులన్నాతురులై బాధపడుచున్నారు. ఈదేశపు జనాభా సంవత్సరమునకు 8½ లక్షలకు తక్కువగాకుండ వృద్ధిజెందుచున్నది. అనతికాలములోనే యీ సంఖ్య మించవచ్చును. ఇటులయినచో నపటి సం॥ నకు పదిలక్షలకుగూడ జనసంఖ్య మితిమీరగలదు. ఈపరిస్థితుల నాలోచించి టోకియో పట్టణపు మ్యునిసిపలు సంఘమువారు జన్మనిరోధ పద్ధతులను వ్యాప్తిజేసి ప్రజాక్షేమమునకు దోడ్పడ ప్రయత్నింపగా ఆపట్టణ రాజకీయోద్యోగులు, పోలీసువారు, అయ్యది శాసనోల్లంఘనమని ఆపుజేయించిరి.

ఒకప్పుడు పరిశ్రమలో ముందంజ వేయగలిగిన ప్రజా సామర్థ్యమున కీ నవీన నాగరికతా యంత్రసాధనములు ఒకవిధముగ తీరరాని నష్టమును గల్పించినవని చెప్పనగును. ఈకర్మాగారములలో సమూహముతో గలసి పనిచేయుట కలవాటుపడిన ప్రజలు దూరదేశములకు వలసపోవుటకుగాని, ఒంటరితనమునకు గాని, స్వస్థల వియోగమునకు గాని ఓర్వలేక బాధపడుచుండుట వాస్తవము. దేశశాంతియు,ప్రజాక్షేమమును కోరిన యేరాజకీయ నిర్వాహకుడుగాని యీవలస పంపించు టొకనిమాయకముగ జేసి, జనబాహుళ్యముచేత బాధపడుచున్న జర్మనీ, ఆస్ట్రియా, యిటలీదేశములలోని ప్రజలను తక్కువజన సంఖ్య కలిగి ఎక్కువ ధనసమృద్ధి గలిగిన దక్షిణాఫ్రికా ప్రాంతములకు పంపుటుచితము. జపాను దేశముగూడ తనజనసంఖ్య తగ్గించుకొని భాగ్యాభివృద్ధి నందుట కేదే నొకమార్గ మవలంబింపక తీరనిమాట సత్యము. ప్రస్తుత వైద్యశాస్త్ర ప్రాబల్యము, ఆరోగ్యశాస్త్రము, గృహ పారిశుధ్యము ప్రజలను మృత్యువునకు దూరముచేసి జన సంఖ్య పెరుగుటకు సాయము చేయుచున్నవి. నిజమున కివి కొంతకాలములో మరికొన్ని రెట్లజనసంఖ్యావృద్ధి చేయగలవు.

ఏ కెల్లాగుసట్టము (Kelloge Pact) గాని, ఏ అంతర్జాతీయ సమస్యలు(League of Nations) గాని ప్రకృతి తత్వమును మార్పజాలవు.

చివరకు జన్మనిరోధ మవలంబించుటయే ధర్మమా? వలస పంపించు టగత్యమా? లేక యుద్ధమే శరణ్యమా?

పి. అన్నాజీ శర్మ.

హైదరాబాదు సంస్థానమునందలి పురాతన గ్రంథాలయములు

(వెయ్యి సంవత్సరములకు పూర్వము)

హైదరాబాదు పరిశోధనసంఘమువారు ఈమధ్య ప్రచురించిన నాగాయ్‌జీ శాసనములవల్ల హిందూదేశమున అనేకవందల సంవత్సరములకు పూర్వము కొన్ని వేల గ్రంథాలయములు కలవనియు, అందును ముఖ్యముగా నైజాం సంస్థానము నందుండెడివనియు నిర్ధారణ చేయబడినది. ఈ శాసనములవల్ల నాగాయ్‌జీ అనునది నైజాం సంస్థానమునందు వాడీకి దగ్గరనున్న ఒక పట్టణమనియు, అక్కడ ౧౦౫౮ క్రీ. శ. ఒక దేవాలయ ముండి యుండెననియు, చాళుక్యవంశీయులకు చెందిన మధుసూదనుడను అనురాజు అచ్చట ఒకపాఠశాలను, గ్రంథాలయమును స్థాపించెననియు తెలియుచున్నది. పాఠశాలలో వేదములను బోధించువారు ముగ్గురును, కళలను నేర్పువారు ముగ్గురును గ్రంథాలయమునందలి ఆరువిభాగములను చూచుటకు గ్రంథాలయాధికారులు (లైబ్రేరియనులు) ఆర్గురును ఏర్పాటు చేయబడియుండిరని తెలియుచున్నది. దీనినిబట్టి ఈగ్రంథాలయము ఎంత గొప్పదైయుండెనో తెలిసికొనవచ్చును. కళాధ్యాపకులకును, తత్వశాస్త్రాధ్యాపకులకును ఇచ్చువేతనమే గ్రంథాలయాధికారులకును ఇచ్చుచుండెడివారనికూడ తెలుచున్నది. ఇట్టిస్థితిలో గ్రంథాలయములఅభివృద్ధిపట్ల సానుభూతినిచూపుట ప్రభుత్వమునకు యుక్తముగా తోపకపోవుట శోచనీయము.

(తెలుగు సమాచార్ నవంబరు డిసెంబరు సంచికనుండి)

ఇండియన్ పిక్టోరియల్ ఎడ్యుకేషన్‌లోని చిత్రముల వివరము

చిత్రము ౧:— ఈకమాను మైసూరు సంస్థానమున శ్రీరంగపట్టణములోనున్న యొక్క సుందరదృశ్యము,

చిత్రము ౨:— టిప్పుసుల్తాను సమాధి శ్రీరంగపట్టణములో లాలుబాగునందున్నది. ఇది నలుచదరముగ నున్నది. దీని నాలుగుమూలలను పైన నాలుగు శిఖరములు గలవు. చుట్టుగల వసారాలో రాతికంబములు నున్నగ మెరుగెక్కింపబడినవి. దంతపుతాపటముగల మహెత తలుపు లున్నవి.

చిత్రము ౩:— యమునానదిపై నంతెన. ఇది భారతదేశమందలి పెద్దరైలువంతెనలలో ఒకటి. కామ్పూరు నుండి రైళ్లు అనుదినము పెక్కురు ప్రయాణీకులను, బరువైన సామానులను గొని పోవుచుండును. ఈకామ్పూరు గొప్పవర్తకస్థానము. ఇచ్చట అయిదురైళ్ల శాఖలు కలియును.

చిత్రము ౪:— ఈకోట మైసూరు సంస్థానమందలి శ్రీరంగపట్టణమున నున్నది. టిప్పుసుల్తాను కాలమున బ్రిటిషుసైన్యములు దీనిని పెక్కుమారులు ముట్టడించుట చరిత్ర ప్రసిద్ధము. మొదటిముట్టడి 1791 వ సం॥ మేనెలలో జరిగినది. రెండవముట్టడి 1799 సం॥ ఏప్రిల్ 17 వ తేదీ నాడు ప్రారంభమై మేనెల 4 వ తేదీనా డంతమొందినది. అప్పుడు టిప్పుసుల్తానుకు గాయము తగిలినది. అతడు కోట దిడ్డిదోవవద్ద కడలమెదల జాలక పడియుండగా శత్రుసేవలో నొకడు ఆతని రత్నఖచితమైన దట్టీని ఊడదీసికొనివచ్చి సుల్తానుచే దెబ్బతిని అతనిని కాల్చివైచెను.

చిత్రము ౫:— ఈనగళ్లు హిందూశిల్ప విధానము ననుసరించి నిర్మింపబడినది. ఇందలి దర్బారుసభామంటపము మిగుల సుందరమయిన వేలకొలది జనులు కూర్చుండుటకు అనుకూలముగా వుండును.

ముద్రితలోకము

శ్రీ లెనిన్. సి. మార్షల్ గారు "మానవాభివృద్ధి కథనము" నందు క్రిందియంకెల నుదాహరించిరని ౧౯౨౯ సం॥ ఆగష్టునెల ౨౨వ తేదీ వెలువడిన "The World's Press News" నందు దుల్లేఖింపబడెను.

అమెరికాఖండము నందలి యునైటెడ్ స్టేట్సునందు

౩౦౧ పత్రికలు విద్యలకు,

౮౦౦ పత్రికలు కృషికులకు,

౨౫,౦౦౧ దినవార్తా పత్రికలు,

౧౫,౦౦౦ క్రొత్తపుస్తకములు ప్రతిసంవత్సరమును,

౪౦,౦౧౦,౦౦౦ ప్రతిదినమువార్తాపత్రికలు,

౨౦,౦౦౦,౦౦౦ (పీరియాడికల్స్) పత్రికలు,


౫౫,౦౦౦,౦౦౦ వారపత్రిక (మ్యాగజీన్)లు,

ప్రకటింపబడు చుండును.

౧,౧౦౦,౦౧౦ టన్నుల కాకితము పుస్తకముద్రణమునకు,

౧,౫౧౧,౦౦౦ టన్నుల కాగితము వార్తాపత్రికా ముద్రణమునకు నుపయోగింపబడుచుండును.

వా. గో. కృష్ణయ్య



హిందూ చిత్రకళాభ్యుదయము!

కజిన్సుమహాశయుని ప్రపంచయాత్ర

ఆర్యావర్త మన్నిదైపులమండియు సమకూర్చిన చిత్తరువులలో యిప్పటి యిరువదినలుగురు ప్రఖ్యాతకళాకుశలుల అరువది చిత్రములను—హిందూదేశప్రత్యేకవ్యక్తిత్వమును చూపువానిని ఏరి—కజిన్సుపండితుడు మొదట జపానువారియందలికళాసంఘమునకు హిందూదేశప్రతినిధిగబోయి ప్రపంచయాత్రచేసి గతమాసమున తన నిజదేశముగ జేసికొనిన భారతదేశమునకు తిరిగివచ్చెను. బిసెంటు, ఆండ్రూసు మొదలుగాగల వారలవలె హిందూదేశమునకై పాటుబడుచున్నవారిలో కజిన్సుదంపతులు ముఖ్యులు.

లండను నందలి విఖ్యాతమగు ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్సు (faculty of arts, Piccadilly) లో యీచిత్రసముదాయము ప్రదర్శింపబడెను. అమెరికాయందలి న్యూయార్కు టైమ్సు' (New York Times) యొక్క లండను విలేఖరి యీప్రదర్శనమును గూర్చి తన పత్రికకిటుల తంతినంపెను. The marvellous contribution of India's art to world's art.) మరియు 'యిలస్ట్రేటెడులండను న్యూసు యింగ్లండు' (Illustrated London News) సంపాదకుడు ప్రత్యేకవ్యక్తిత్వమును చూపు అయిదు చిత్తరువుల (ఢిల్లీ, కలకత్తా, మద్రాసు) నేరికొని, శ్రీకజిన్సుపండితునిచే యొకవ్యాసమును వ్రాయించికొని యీమాసములో వచ్చిన సంవత్సరాది సంచికలో ప్రచురించెను. ప్రాశ్చాత్యదేశముల ప్రసిద్ధిగన్న యీపత్రిక హిందూచిత్తరువుల మొదటిసారి ప్రచురించినది. ఇది చాలా గొప్పవిషయమట!

తన యభిప్రాయమును సంపాదకు డిటుల వ్రాయుచున్నాడు:— 1914వ సంవత్సరమున హిందూకళాభ్యుదయము మొదలిడిన నాటి నేటివరకు క్లుప్తముగ కథ, హిందూ చిత్రకళయొక్క— యున్నతస్థానమును చూపు యిప్పటి చిత్రకారుల చిత్తరువులు అయిదు ప్రచురింపబడినవి. పాశ్చాత్యకళనుండి హిందూకళ ఎంతయు ప్రత్యేకత చూపుచున్నదనుట కీచిత్తరువులే నిదర్శనము. ప్రాచ్యులు పాశ్చాత్యులవలన కళావిషయమున నేర్చికొనవలసినది, నేర్చికొనినది ఆవంతయు లేదు అనుట స్పష్టము.


తరువాత కజిన్సుపండితుడు తనవ్యాసము నీవిధముగ మొదలిడెను:—

"When Rabindranath Tagore, in 1912 fled from the distractions of literary popularity in his native Bengal to find peace in obscurity in London, and got it in the form of an English translation of his poetry, a British knighthood and Nobel Prize ! he achieved much more than a personal success. To Europ^, Tagore was something new. In India he was something old in his expression of an ancient tradition, albeit in modern moods and forms, and something established among the high triumphs of a a vividly national culture. The recognition of Tagore by Europe became a recognition of India and gave assurance particularly to the then young effort to restore the almost lost art of Indian Painting."

తన స్వదేశమగు వంగరాష్ట్రమున రవీంద్రనాథ టాగూరుగారికి కలిగిన అపారవిఖ్యాతి ప్రసిద్ధులవలన

వారికి కలిగెడి బుద్ధిచాంచల్యమును దరిచేరనీయకుండ తప్పించుకొనుటకై, ౧౯౧౨ వ సం॥న వారు లండను నగరమునకుపోయి మారుమూల ప్రశాంతముగా కాలము గడుపదలంచిరి. వారదివరకు రచించియుండిన కావ్యముల నే ఆంగ్లములోనికి కవులనేకుండగా అనువదించిరి. తద్ద్వారా నోబెల్ ప్రైజు, సర్ బిరుదముపొందిరి. ఇది వారికి ఒక విజయము. యూరోపుఖండవాసులకు టాగూరుగా రొక క్రొత్తవింతగా నుండిరి. కాని భారతదేశమునందు చిరకాలానుగత ప్రాచీన సాంప్రదాయసిద్ధమగు భావప్రకటనమే వారు చేసిరి. అయితే యిట్టి భావములు వారిచే నూతనాకారములతో, నూతనలక్షణములతో ప్రకటింపబడిన మాట వాస్తవమే! జీవకళ ఉట్టిపడు విశిష్ట భారతజాతీయ విజ్ఞానముయొక్క మహోన్నత ప్రాచీన ప్రావీణ్యమునందే టాగూరుగారి భావప్రపంచ మిమిడియున్నది. కావున టాగూరుగారి ప్రతిభను యూరపువాసులు గౌరవించి పరిగణించుటవల్ల భారతజాతినే గౌరవించినట్లగుచున్నది. అందులను ముఖ్యముగా ప్రస్తుత ప్రాచీనభారత చిత్రకళా పునరుద్ధరణమునకై పాటుపడుచున్న యీనాటి యువోత్సాహమున కీగౌరవాదరణ మెంతయు యభయహస్తమువలె పరిణమించినది.

ఈ అయిదింటిలో 'గోవులకాపరి గోపాలుడు' (శ్రీ కవుతా ఆనందమోహన శాస్త్రీగారు, మద్రాసు)అను



శ్రీ కవుతా ఆనందమోహనశాస్త్రీగారు

చిత్తరువునకు మొదటిస్థాన మివ్వబడినది. దీనినిగూర్చి— "The shepherd of souls; And his consort Radha is never away" అని కజిన్సుగారు విశదీకరించిరి. రెండు ఉకీలు (డిల్లీ) గారివి. ప్రమోదచటర్జీగారిది 'ఉషః కన్య'. ఉకీలుగారిచే రచింపబడినవి కాలమేఘుడు, వర్షము, తుపాను అనునవి. ఈ అయిదింటి యొక్క మూలములు (originals) అమెరికా, ఇటలీ, ఇంగ్లాండు దేశములలో ప్రవాస మున్నవి.

అమెరికా చికాగో విశ్వవిద్యాలయమందు యివి ప్రదర్శింపబడినపుడు అచ్చటి 'ఏషియా' అను సచిత్ర మాసపత్రిక శ్రీ కజిన్సుగారికి రమారమి ౫౦౦ రూపాయల నిచ్చి ఒక సచిత్రవ్యాసమును వ్రాయించి ప్రచురించెను. వీటిలో ప్రఖ్యాతశిల్పి వెంకటప్పగారి శివరాత్రి కూడ నొకటి.

శ్రీ కజిన్సు పండితుడు తన అమెరికను ప్రయాణములోని వింత అనుభవములనుకొన్ని మాతో నీటులు చెప్పెను:—అమెరికా దేశమునకు వెళ్లిన తర్వాత మేయో హిందూదేశమునకు చేసిన అపకృతి స్పష్టముగ కానుపించెను. ౧౬ ఏండ్ల ప్రాయముగల ఒక కళోపాసకుడు రెండవసారి చెప్పిన ప్రదర్శనమునకు వచ్చి ఒక భూతఅద్దముతో చిత్తరువుల పరీక్షించి, ముగ్ధుడయి నాదగ్గరకు వెడలికొనుచువచ్చి యీచిత్తరువులు నిశ్చయముగ హిందూదేశస్థులు రచించినవేనా! హిందూదేశము అనాగరకదేశము అడవిదేశము అని మేము మావిద్యాలయములలో నేర్పబడితిమి. కాని యీచిత్తరువులు అనాదినుండివచ్చు నాగరికతను ఎంతగాచూపుచున్నవి అనెను. ఇట్లు ఆశ్చర్యపడిన అనేక వేలమందిలో నితడొకడు. ఈపుత్రవాడు ముఖాముఖిని స్పష్టముగ హిందూదేశ మెంత గొప్పనాగరికతగల దేశమో చూపిన తరువాత తన"జన్మము ఒకనిముసమయి నను మేయోలాంటివారల అసత్యదూరములను గాథల నమ్మనా!" అని చెప్పెను.

అమెరికాయందలి సుప్రసిద్ధ కళానిపుణుడు జే. టర్బిలు అనునాయన ఆనందమోహన శాస్త్రీగారి యొక్క చిత్తరువులో వర్ణసంయోగ లాలిత్యముల కచ్చెరు వంది

తాను కొనుక్కొనెనని చెప్పుట కెంతయు సంతసమగుచున్నది.

శ్రీ జే. కజిన్సు పండితునియొక్క అమెరికాలో ఫిలడెల్ఫియా ముఖ్యస్థానములో ఈచిత్రకళా ప్రదర్శనము గూర్చి 'Philadelphia Enquirer' అనుపత్రిక ప్రదర్శనమునుగూర్చి యిట్లు వ్రాసెను.

"That a vigorous and enthusiastic, artistic renaissance is now in progress in India, seems to be amply proved by the remarkable collection of Indian Paintings....

"No occidental influence whatever is observable in these beautifully composed and wonderfully coloured pictures....

"Here are nomenclature and terminology with which we occidentals are only vaguely familiar, but the pictorial interpretations of such ideas are of such supreme beauty as to be acceptable by any eye sensitive to aesthetic impressions....

"What a pity this fascinating exhibition, could not have remained longer in Philadelphia.

ఈప్రశస్త భారతీయ చిత్రరచనా సంపుటివల్ల నొక్కవిషయము పూర్తిగా రుజువగుచున్నది. భారతదేశములోని కళాప్రపంచమునందొక నూతనవిజ్ఞానోద్యమము ప్రచండరూపమునగాఢాభినివేశముతో నావిర్భవించినదని రుజువగుచున్నది. రమ్యముగా రచింపబడిన యీ యద్భుత చిత్రరచనలందు పాశ్చాత్య సంపర్కమేమియు కానబడదు. పాశ్చాత్యులమైన మనకు పరిచితములైన శబ్దప్రయోగములు నామములు యిందుకలవు. కాని అట్టిభావములను సచిత్రముగా ప్రదర్శించుట అత్యంత సుందరముగానున్నది. రసోచితభావప్రకటనమును గ్రహింపగలవారికందరకును ఇవి ఆదరణీయములే యనునంత సొంపుగానున్నవి.

ఇట్టి మనోరంజకమైన చిత్రప్రదర్శనము ఫిలడెల్ఫియా నగరములలో కొలదిదినములే యుంట ఎంతయు మనదురదృష్టము. యూరపునందలి అనేక ముఖ్యసంస్థలయొక్కయు, విశ్వవిద్యాలయములయొక్కయు ఆహ్వానముపైని కజిన్సు మహాశయుడు తిరిగి ఏప్రియలు మాసమున యూరపున కేగనున్నారు. వీరికి భగవంతుడు ఆయురారోగ్యముల నిచ్చుగాక!



ఆంధ్రవాఙ్మయ సూచిక

ఆంధ్రగ్రంథమాలలో ౧౧ వ గ్రంథము

క్రౌను నాల్గుపుటల సైజు ౬౧౪ పుటలు. వెల రు. ౩ లు. ప్రకాశకులు మేనేజరు ఆంధ్రగ్రంథమాల ౬, ౭, తంబుసెట్టి వీథి, చెన్నపురి.

'దేశభాషలందు, దెలుఁగు లెస్స' యని ప్రాగ్దత్తమ బడసిన యాంధ్రవాఙ్మయ మహోదధియం దాదినుండి వెలువడిన గ్రంథరత్నముల నన్నింటిని ౧౦ సంవత్సరముల నిరంతర పరిశ్రమము చేసి ఇట్లు గ్రంథరూపమున ప్రకాశకులు ప్రచురించి యాంధ్రభాషా జిజ్ఞాసువులకు మహోపకార మొనర్చిరి.

ఈ సూచిక ముద్రితాముద్రిత గ్రంథముల పట్టికలని రెండు భాగములుగ విభజింప బడినది.

ఇందు మొదటిభాగమున మొదటి పుటనుండి ౫౭౬ వ పుటవఱకు గ్రంథము, గ్రంథకర్త, విషయము, ఆగ్రంథము ముద్రితమయిన సంవత్సరము, విశేషములు అనుశీర్షికలక్రింద నకారాదిగ ముద్రితాంధ్రగ్రంథముల సమగ్రపరిచయము కలిగింపబడెను. దాదాపు ౧౫,౦౧౦ గ్రంథము లుదాహృతములు. పుట ౫౭౯ నుండి ౩౩౭ వఱకు గ్రంథకర్తల పేరు, యింటిపేరు వానిక్రింద వరుసగా, నకారాదిగ వారిచే రచియింపబడిన గ్రంథములు నుదాహృతములు. పుట ౩౩౮ నుండి ౩౯౧ వఱకు విషయములక్రింద విభాగించి యాయా విషయమునకుచెందిన గ్రంథముల నామశీర్షికల క్రింద వఱుసగ నకారాదిగ నుదాహరింపబడెను.

ఈ మొదటిభాగమున "అనుబంధము" అను పేరిట ౧౯౨౧ సం. అక్టోబరు నెల మొదలు ౧౯౨౫ సం. డిసెంబరు నెల వఱకును, "అనుబంధము(అ)" యను పేరిట ౧౯౨౬ వ సం. జనవరి మొదలు ౧౯౩౭ సెప్టెంబరు నెలవఱకు ప్రచురింపబడిన ముద్రితగ్రంథములు. విషయ విభాగము క్రింద విడదీసి ఆయావిభాగమున గ్రంథములు గ్రంథకర్తలపేర్లతో నకారాదిగ గలవు.

ఇఁక రెండవభాగము. ఇందు గల గ్రంథములన్నియు నిప్పటికి నముద్రితములు. విషయ విభాగశీర్షికల క్రింద గ్రంథము, గ్రంథకర్త, రచనము, పరిమితి, విశేషములు అకారాది పట్టికలుగా వరుసగా కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్ పుస్తకభాండాగారము, తంజావూరు సరస్వతీ పుస్తకభాండారము, చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములలోని లిఖితగ్రంథముల పట్టికలు విడివిడిగా గలవు. ఈ రెండవభాగము ౫౬ పుటలు మాత్రమే. ఇందు విశేషములను శీర్షికక్రింద ప్రతులసంఖ్య, నామాంతరములు మొదలగు విశేషము లుదాహృతములు.

ఈ సూచిక ప్రారంభమున సూచికా ప్రకాశకులగు శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు రచించిన ౧౧౪ పుటలు గల పీఠిక కలదు. ఈ పీఠికయందు వేదకాలమునుండి నేటివఱకు జరిగిన ఆంధ్రభాషా స్వరూప పరిణామ నిరూపణమును సవిమర్శముగ, విపులముగ గావించిరి. ఈ పీఠిక కేవల మొక వాఙ్మయచరిత్ర మనదగినది. ఇది ఈ సూచికతో చేరి యుండుటవలన దీని విలువ పెంపునొందుచున్నది.

ఇది ప్రతిగ్రంథాలయమునను, ప్రతిభాషాభిమాని కడను, విమర్శకునివద్దను, ప్రతియాంధ్రుని హస్తమునను ఉండి తీరవలసిన గ్రంథరత్నము. గ్రంథాలయాధిపతులకు ముఖ్యము.

వా. గో. కృష్ణయ్య

శంభుతో నొకనాటి సహవాసము (ఆంగ్లము:)

A day with Sambhu.

చిన్న సైజు పుస్తకము. ముద్దులుమూట గట్టుచున్నది.

వెల రు. 1-0-0

సుప్రసిద్ధాంగ్ల గ్రంథకర్తలగు శ్రీ. యస్. వెంకటరమణి అయ్యరుగారు రచించిన యీచిన్నిపొత్తము, కౌమారదశయందుండు విద్యార్థు లనుసరింపవలసిన జీవితక్రమమును ముద్దులు మూటగట్టు చేటిమాటలతో బోధించుచున్నది. రామేశ్వరయాత్రకు బోవుచున్న యొకసాధువు మార్గమధ్యమున నొకయారి సత్రములో శంభుడను నొకబాలుని గలసికొని యనేక నీతులతనికి జేర్పును. వేకువజామున మేల్కొని రాత్రి శయనించువరకు బాలు రెట్లు నడచుకొనిన పరిపూర్ణశరీర మనోవికాసముల నొంది, ఆయురారోగ్య భాగ్యముల కునికిపట్టులై తమకును లోకమునకును మేలొనరింప వచ్చునో రసవంతముగా నిందు వర్ణింపఁ బడినది. కాఫీ మొదలగు మాదకపానీయముల యనర్థముల గూర్చి సాధువు శంభునకుజేసిన యీ క్రింది మహోపదేశము బాలురేకాక తల్లిదండ్రులును గమనింప దగినది.

"నీతల్లి నీకు కాఫీనిచ్చుచో, నీ కది వలదని మెల్లగా జెప్పుము. మనదేశమునకు కాఫీ క్రొత్త వస్తువు. దీనిని తఱచుగా త్రాగుటవలన నిత్యమును త్రాగుచుండవలసిన చెడ్డయలవాటు పట్టువడును. ఇది యొకవ్యాధియే కాని, యెదుగుచున్న నీ లేతశరీరమునకు పుష్టినిచ్చు నాహారము కాదు."

ఇట్టి యమూల్య నీతిరత్నములతో నొప్పుచున్న యీయాంగ్ల గ్రంథము దేశభాషలలో ననువదింపబడినచో బాలుర కెంతో యుపయుక్తము గా నుండుననుటకు సందేహ మానంత్రయు లేదు.

వలయువారు మదరాసు, మైలాపురం, శ్వేతారణ్యాశ్రమమునకు గ్రంథకర్తగారికి వ్రాసికొన వచ్చును.

వె. వేం. కృ.

పొట్టికథ

గ్రంథకర్త: కవికొండల వేంకటరావుగారు క్రౌను సైజు, మెరుగు కాగితములు, ౬౬ పుటలు, కాగితపుసైడు. వెల ౦-౮-౦. ౧౯౩౯ సం.

ఇదియొక చిన్న వినోదకథల సంపుటి. పిల్లలకొరకు వ్రాయబడినది. మన యెరికలోనున్న అనేక అల్పవిషయములిందు విచిత్రముగా రచింపబడి బాలబాలికలకు, ఆనందమును, జ్ఞానమును చేకూర్చునట్టివిగా యున్నవి.

ఉదా:—పంచ భూతములు, చతురంగబలము, మొదలైనవి. మరికొన్నికథలు కేవలము కల్పితములు. ఉదా:—సర్కసు మర్కటము, కామధేనువు, కోడ మూడ మొదలైనవి.

పురాణకథలందువలె పక్షులు, జంతువులు, చెట్లు నిర్జీవవస్తువులు మొదలైనవాటిచే మాట్లాడించి, చర్యలు చేయించి పసివాండ్రకు కౌతూహల మొదవునట్లుగా రచింపబడినది. కావ్యవిషయములు బాలురమనసు రంజించునట్టివిగా యున్నవి.

శైలి:— గ్రాంథికవ్యావహారికముల మిశ్రము. సమాస ఘట్టములందొకప్పుడు గ్రాంథికమును ఒకప్పుడు గ్రామ్యము నుపయోగింపబడుటచే సరళముగా లేదు. కేవలము వ్యావహారిక భాషలో వ్రాసియుండిన మెరుగుగానుండెడిది. ఏదైనను గ్రంథకర్త గద్యశైలి పద్యశైలివలె పక్వస్థితిలో లేదు. భాష సులభముగను, జాతీయములతో కూడినదిగ ఉన్నది.

చే. కా.

చిట్టికథ

గ్రంథకర్త: కవికొండల వెంకటరావుగారు. క్రౌను సైజు, ౩౦ పుటలు, మెరుగు కాగితములు, కాగితపు సైండు. వెల ౦-౬-౦

ఈచిన్న పద్యగ్రంథము బాలబాలికలకు పఠనీయ గ్రంథముగా నుపయోగపడు నిమిత్తమై వ్రాయబడినది. ఇట్టిరచనలలో నట్టిపసివారికి పద్యములలోగల యతిప్రాసలవల్లను, గణవనియమములవల్లను, అక్షరధ్వనుల కలయిక

వల్లను గలుగు, బాహ్యాంతర్జ్ఞానములచే నాకర్షించి కొన్ని కొన్ని స్వల్పవిషయములను నేర్పుటయే ఆశయముగ నుండును. కావున సులభముగను, ఆకర్షకములుగను ఉండు సామాన్యవిషయములు అనగా, దేశచరిత్రకథలు, కథలు మొదలగువాటిని గూర్చి వ్రాసి వారికి వాఙ్మయములోగల గొప్పవిషయములను పరిచయము చేయుటయు, చిన్న చిన్న నీతులను నేర్పుటయు నిందు గలదు. ఇట్టిరచనలు పసివాండ్రకు కవిత్వమునం దభిరుచి గలుగజేయుట కొక మెట్టుగాకూడ నుండును. పై ఆశయముల సాధనకై వ్రాయబడిన యీకవితయందు కృతక మధికముగా నుండుట తప్పదు. అనగా ఈరచనలు స్ఫురణచేతను, ఉద్దీపనము (Inspiration) చేతను, 'మనోహరభావము కందళించుటచేతను వ్రాయబడినవిగా నుండవు. సహజకవిత్వమున నుండవలసిన లక్షణము లుండవు. గణబద్ధమై (Versification) అసహజ కవిత్వమును గలిగియుండును. బాలబాలికలకుగల నిసర్గములను (Instincts) ప్రేరేపించి వాటిని తృప్తిపరచి సంతోషపెట్టుట యిట్టికవితలో ముఖ్యముగా గానబడును.

శైలి, భాష సులభము. భావము దుర్గ్రాహ్యముగా లేదు. వృత్తము లవసరముగా వాడబడియున్నవి. కవిత్వము కొంత ధారాళముగానే యున్నది. కావ్యవస్తు విషయములు చిన్నపిల్లల- ఊహల కతీతముగా లేవు.

కే. కా.

చదువులదుత్త

గ్రంథకర్త:— కవికొండల వేంకటరావుగారు. క్రౌను సైజు ౨౮ పేజీలు, మెరుగుకాగితములు, కాగితపుబైండు, వెల ౦-౪-౦.

ఈచిన్నపుస్తకమందు గ్రాంథికలక్షణములు, జానపదలక్షణములుగల ఖండకావ్యములు గలవు. ఈగ్రంథము కూడ పిల్లలకొరకు వ్రాయబడినదే. కావ్యవిషయములు పిల్లలకు పనికివచ్చునట్లుగా సులభముగా నున్నవి. కవిత్వము సహజముగా నున్నది. స్ఫురణవల్లను, ఉద్దీపనవల్లను రచియింపబడినది. వీరి 'చిట్టిశతి' యందువలె అసహజ కవిత్వ మిందు లేదు. బాలబాలికలకు నిజముగా జ్ఞానమును, సంతోషమును ఇచ్చునదిగా నున్నది. ఇది పొగడదగిన గ్రంథము.

ఈగ్రంథమందు చరణపు విరుపులు గలవు. వీటిని గుఱించి 'ఆగడపలు' అను గ్రంథముయొక్క విమర్శనలో చెప్పబడును. శైలి వ్యావహారిక భాషలో రసవంతముగ, సులభముగ నున్నది.

కే. కా.

దేవకీనందన శతకము

క్రౌన్ సైజు ౨౦ పుటలు. వెల తెలియదు, పేపరుబైండు.

దీనియందు "కృష్ణా దేవకీనందనా!" అను మకుటముతో ౧౦౮ పద్యములు గలవు. ఈగ్రంథరాజమును రచించిన కవిశ్రేష్ఠుని నామధేయ మీయాంధ్ర ప్రపంచమున కేఁటివఱకు బయలుపడుటలేదు. కాని, ఈశతకములోని

మ. చతురంభోధి పరీతభూవలయ రాజన్యైకకోటీర రం
జిత మాణిక్యవిరాజమాన పదరాజీవుండు ధర్మాత్మజుం
డతికార్పణ్యముతోడ మత్స్యపతిఁ దా నాశింపఁ జేతావకా
యతకారుణ్యము గల్గునంతకును కృష్ణా దేవకీనందనా."

అనుపద్యము అప్పకవీయము మూఁడవ యాశ్వాసమున నించుక మార్పుచేఁ గాన్పించుచున్నది. అందుచే నీకవిచంద్రుఁడు అప్పకవికంటెఁ బ్రాచీనుఁడని మాత్రము చెప్పవచ్చును.

నామమాత్రావశిష్టమై యింతవఱకును మఱుఁగుపడియున్న యీగ్రంథము శ్రీశ్రీశ్రీ గద్వాలసంస్థాన పుస్తకభాండారమునఁ దాళపత్ర లిఖితమయియుండుటఁ జూచి శ్రీమంతమహారాజ్ఞిగారు ముద్రింపించి ప్రకటించి లోకోపకార మొనర్చిరి. అట్టి శ్రీశ్రీశ్రీ గద్వాల మహారాజ్ఞిగారి ఔదార్యము, భాషాభిమానము ఈయాంధ్ర ప్రపంచమునఁ జిరస్థాయియై వెలయుఁగాక.

కవనము ద్రాక్షాపాకముచేతను, వైదర్భీరీతిచేతను బండితపామరహృదయంగమమయి మాధుర్యము గుల్కుచున్నది. పద్యములు భక్తిభరితములయి యనేక నీతుల

నుకోర్తించుచున్నవి. సామాన్యముగా నీ పద్యములలో నపూర్వములగు దృష్టాంతములు పురాణగాథలు, చూపఁ బడుచునే యున్నవి.

శా. పాత్రాపాత్రవివేకముల్ సమసెపా
పం బెచ్చెఁ బుణ్యంబు లే
మిత్రఘ్నత్వము కల్లలాడుటలు స్వా
మిద్రోహముల్ కొండెముల్
ధాత్రిం బూజ్యములయ్యె సాధువుల నం
దం బెట్లు రక్షించెదో
సత్రాజిత్తనయామనోరమణకృష్ణా,
దేవకీనందనా.

శా. అందెల్ చిన్నిపసిండి గజ్జెలును మ్రో
యన్ మేఖలాఘంటికల్
క్రందై తోఁపఁగ రావిరేక నుదుటన్
గన్పింప గోపాంగనా
నందం బొందఁగ వెన్నముద్దలకునై
నర్తించు నీ బాల్యపున్
చందం బాదివిజుల్ నుతింపఁదగుఁ గృష్ణా,
దేవకీనందనా.

శా. నీడల్ దేరెడు చెక్కుటద్దములతో
నిద్దంపు నెమ్మోముతో
కూడీకూడని చిప్పకూఁకటులతో
గోపాళక శ్రేణితో
వ్రీడాశూన్య కటీరమండలముతో
రేపల్లెలో నీవు నాఁ
డాడే శైశవమూర్తినే తలఁతుఁ గృష్ణా
దేవకీనందనా.

మ. అమరుల్ పద్మజువ్రాఁత దాఁట రెవఁడో
క్కబ్దంబు వెడరొయ్యను
ర్దమకోర్దండ పటుప్రతాపనిజసం
రంభామరానీక వి
క్రమదుర్వారగజాసురప్రళయమిం
కం జేసిన త్రేశ్వరున్
సమరక్షోణి జయించు నర్జునుఁడు కృష్ణా
దేవకీనందనా.

ఉభయభాషాప్రవీణ బులుసు నరసింహశాస్త్రి.

సముచితాహారము

(Thoughts on Diet)

క్రౌను సైజు పుటలు ౮౮. వెల రు. ౦-౮-౦

గౌ. న్యాయమూర్తి సర్ వేపా రామేశం పంతులుగారిచే, ఆంగ్లభాషలో వ్రాయబడిన యమూల్యగ్రంథమున పంతులుగారు ఆహారవిషయమునందును, సంతాన నిరోధవిషయమునందును చాల కృషి సలుపుచున్నారు. వీనిలో ఆహారవిషయము అఖిలజనోపయుక్తమగుట కెట్టి సంశయమును లేదు. ఈవిషయమున వీరు ప్రామాణికులలో నొకరని చెప్పుటగూడ సాహసోక్తి కాజాలదు. వీరీవిషయమున అనుష్ఠానపూర్వకముగనే బోధించుచున్నారు. పాశ్చాత్యులీ విషయమున వ్రాసిన గ్రంథముల నెన్నిటినో వీరు చదివియున్నారు. తెల్లచక్కెర, ఫాక్టరీ లేక మరబియ్యము లేక మిలు రైసు, మెరుగుబియ్యము లేక పాలిష్డురైసు, అమితాహారము, ఉపవాసము లేక నిరాహారము, విటమినులు, అల్యూమినముపాత్రలు, సంగ్రహము అను ప్రకరణముల క్రింద నీగ్రంథము విడదీయబడినది. సంగ్రహమునందు గ్రాహ్యములును, వర్జనీయములును స్పష్టపరుపబడెను. ఏయే విటమినులు ఏయే పదార్థములలో ఏయే పరిమితులలో నుండునదియును తెలుపునట్టిపట్టికగూడ నిందు కలదు. దీనిని బెజవాడలో ప్రకృతిచికిత్సాసంఘమువారు ప్రకటించిరి. వలయువారిటుల వ్రాయవలెను: మేనేజరు, ది ఇండియను నేచరోపతిక అసోసియేషను, బెజవాడ.

వెదురుమూడి శేషగిరిరావు.

ది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ దెన్ అండ్ నౌ

(The Indian National Congress Then & Now)

గ్రంథకర్త: శ్రీయుతయస్. భీమశంకరరావుగారు, బి. ఏ., ఫస్టుగ్రేడు ప్లీడరు, రాజమండ్రి. క్రౌను సైజు, ౯౦ పుటలు, వెల రు. ౧-౦-౦.

ఇది భారతజాతీయమహాసభ సంక్షిప్తచరిత్ర. దేశమునందలి రాజకీయపక్షములన్నియు కాంగ్రెసువేదిక పై నేకము గావలయుననియు, కాంగ్రెసుసంస్థయొక్కటియే యిట్టి యైకమత్యమున కవకాశ మీయగల అఖిల భారత రాజకీయసంస్థ యనియు గ్రంథకర్తగారి యభిప్రాయము. ఈయభిప్రాయమును గాదనుట కెవ్వరు నుండరు. ఇట్టి యైకమత్యమును సాధించుటకు మితవాదుల కార్యవిధానము నవలంబించుట యొక్కటియే సాధనమని వీరు తలంచుచున్నారు. తాము మితవాదులగుటచే మితవాదనాయకుల కార్యక్రమములను భీమశంకరరావుగారు పొగడుటయు నంత ఆశ్చర్యకరము కాదు. కాని తమ పక్షపాతమును మితిమీర సాగించి నేటి కాంగ్రెసునాయకులగు మహాత్మగాంధి, మోతీలాల్ నెహ్రూ, జవహర్లాల్ నెహ్రూ మున్నగు ప్రముఖులను అపవిత్రహస్తులనియు, కాంగ్రెసువంటి పవిత్రసంస్థ యట్టి వారి చేతులలో నుండరాదనియు వీరు నిందించుట కేవల మసభ్యముగ నున్నది. సర్ సి. పి. రామస్వామి అయ్యర్ గారిని బోలు మితవాది ప్రముఖులకే కాంగ్రెసునాయకులు, అకలంక దేశభక్తులు, స్వార్థత్యాగులు నైనప్పుడు, రావుగారికి వా రపవిత్రహస్తులుగ గానవచ్చుట మిక్కిలి ఆశ్చర్యము గల్గించుచున్నది.

ఇంక గ్రంథకర్తగారు ఐకమత్యమునకు మార్గము లేవో తమపుస్తకములో నెందును స్పష్టముగ వివరించియుండలేదు. మితవాదనాయకుల డొమినియన్ స్టేటసువలెనే వీరియైకమత్యవాదముకూడ గాలిలో మేడగ నున్నది. డొమినియన్ స్టేటసును సంపాదించుటకు దగిన ప్రబల సాధనములను మితవాదు లెన్నడును సూచింపరు. అట్లే ఐకమత్యమునకు వలయు సాధనము లేవో వీరును సూచింపరు. ఏమైననేమి, వీరియభిప్రాయమున మనదేశమునందలి రాజకీయపక్షములలో నైకమత్యము లేనందుకు నేటి కాంగ్రెసువాదుల నిరంకుశత్వమే కారణము. తక్కిన పక్షములవారిని అసహాయవాదులు కాంగ్రెసునుండి తరిమివైచుచున్నారట. ఐన వీరియైకమత్యమెట్టిదో గమనింతము. మొత్తముమీద వీరివాదముయొక్క సార మిది. "కాంగ్రెసు ప్రత్యేకముగ నే రాజకీయపక్షము చేతులలోను ఉండకూడదు. అందు అన్నిపక్షములవారికిని, స్వాతంత్ర్యపక్షమువారికికూడ స్థాన ముండవలయును. కాంగ్రెసులో చేరినంతమాత్రమున ఏపక్షమును దానిలో పూర్తిగ నంతరించిపోయి తన వ్యక్తిత్వమును గోల్పోవ నక్కరలేదు." ఇదియొక విలక్షణవాదము. కాంగ్రెసు నిజముగ నొక రాజకీయకార్యవిధానము గలిగిన సంస్థయై యుండవలసినచో, భీమశంకర రావుగారు సూచించిన ఐకమత్యముకన్న ఎక్కువగ కాంగ్రెసును నిర్జీవముగనొనరింపజాలు పద్ధతి మరియొకటి యుండదు. కార్యనిర్వాహకవర్గము లెప్పుడును ప్రధానపక్షమువారి స్వాధీనమున నుండుటయే ప్రజాపరిపాలన సంస్థల ప్రధానలక్షణము. ఇంక, అసలు, కాంగ్రెసులో చేరుటకే వీలు లేకున్నదన్నచో నీవాదముగూడ దుర్బలమే. ఇందుకు వీరికారణములు మూడు: దుష్టుల నిర్బంధము, శాసనోల్లంఘనము, సంపూర్ణ స్వరాజ్యాదర్శము. ఆర్థిక రాజకీయ సమస్యలు సంపూర్ణముగ నొకదానిలో నొకటి కలిసిపోయియున్న యీకాలమున స్వదేశీ నియమమును విడిచిపెట్టుటకన్న కాంగ్రెసు ఆత్మహత్యకు ప్రబలోపాయము మరియొకటి యుండదు. ఇది మితవాదులకు తెలియని సంగతి కాదు. మనమందరమును తక్షణమే కావలయునని కోరుచున్న డొమినియన్ ప్రతిపత్తిని పార్లమెంటువా రీయకున్న ఇచ్చెదరనుటకు సాక్ష్య మొక్కటియు గానరాదు. మన కప్పుడు శాసనోల్లంఘన మొక్కటియే మిగిలినమార్గము. అది హింసారహితమే కావచ్చును, హింసాసహితమే కావచ్చును. అట్టిచో కాంగ్రెసు పక్షము శాసనోల్లంఘన విధానము నవలంబింపక తప్పదు. ఇంక సంపూర్ణ స్వాతంత్ర్యవాదులకుగూడ కాంగ్రెసులో స్థాన ముండవలసినప్పుడు సంపూర్ణస్వాతంత్ర్యము తప్ప మరియొక తక్కువ యాదర్శమును కాంగ్రెసు ఎట్లు అవలంబింపగలదో మాకు బోధపడుటలేదు.

ఈవిధముగ వీరుసూచించిన మూడు నిర్బంధములును నిజమునకు నిర్బంధములు కావు. [illegible], ఆరు సం॥ల నాటి స్వరాజ్యపక్షమును, నేటి రెస్పాన్సివు కో ఆపరేషన్ పక్షమును అనుసరించి, మితవాదులుగూడ కాంగ్రెసులోనే యుండి తమయాశయములకై పోరాడుట యొక్కటియే ప్రస్తుతమునగల ఐకమత్యసాధనము.

అదియే అతివాదులను, మితవాదులను ఒకవేదికపై చేర్చుట కుపాయము. దీనిని గమనించి భీమశంకర రావుగారు తక్కినపక్షములను కాంగ్రెసులో చేరుటకు పురికొల్పిన బాగుండెడిది. అందుకు బదులుగ వారు నిందను కాంగ్రెసు నెత్తిపై ద్రోయుట యన్యాయము.

సైమన్‌కమిషను బహిష్కారమును గూర్చియు, వైస్రాయిగారి ప్రకటనము గూర్చియుగూడ వీరు కొంత వరకు చర్చించిరి. ఈభాగములందు ఐకమత్యమునుగూర్చిన వాదమువలెనే అసంబద్ధములగు నభిప్రాయములతో నిండి యున్నవి. ఇంకొక ముఖ్యమైన సంగతి: పుస్తక శీర్షికలోని 'అప్పుడు ఇప్పుడు' అనుపదముల యర్థమును గ్రంథకర్త యెందును వివరింపలేదు. ప్ర. రం.

దీనచింతామణి అను తత్వవివేచనము.

క్రౌనుసైజున 19 పుటలు. ఇందు 109 పద్యములు గలవు. పేపరుబైండు.

గ్రంథకర్త:—అమ్మనబ్రోలు వెంకటసుబ్బారాయ శర్మగారు. ఇది దీనచింతామణీ అను మకుటము గల వృత్త శతకము. ఇందలి కవనము సరసమయి మృదుమధుర శైలి నొప్పారుచున్నది. శతకము పండిత జనాస్వాదనీయ మగుటయే గాక విశేషించి వేదాంత శాస్త్రజ్ఞులు చదువదగియున్నది. ఆయాతావుల నద్వైత వేదాంత సిద్ధాంతము లద్దమునఁ బ్రతిబింబమురీతిని సులభముగాఁ జూపఁబడియున్నవి. అట్టి సిద్ధాంతము తెలిసికొనుటకు నందు ప్రతిపాదితము లయిన యమూల్యములగు దృష్టాంతములే యాధారములు. మచ్చునకు రెండు పద్యములు:

శా. పాపం బెక్కడ పుణ్యమెక్కడ పర
బ్రహ్మంబునందుం గుణ
వ్యాపారంబులు కర్తృభోక్తృవిధి స
ర్వంబుం వృథాకల్పితం
బై పొల్చుం శశశృంగధారియయి వం
ధ్యాపుత్రుఁ డున్నాఁడటం
చాపాదించుట విశ్వముండుట రా
మా దీన చింతామణీ!

శా. ఆకాశం బవకాశ మిచ్చునది శూ
న్యంబయ్యు నీలత్వమే
యాకారంబుగ లోక మెంచుచు మహీ
జాలిం ధరిత్రీస్థలిం
పోకం ద్రాలిన యట్టు లుండు నటనో
శోధింపఁ దద్వర్ణమే
యాకారంబును లేదు మాయ యిది రా
మా దీనచింతామణీ.

గ్రంథము వెల రు. 0-4-0 అణాలు. వలయువారు గ్రంథకర్త పేర కృష్ణాజిల్లా భీమవరంతాలూకా గణపవరమునకు వ్రాసినఁ బడయుఁగలరు.

ఉభయభాషాప్రవీణ బులుసు నరసింహశాస్త్రి.

విజ్ఞాన కందశతకము

గ్రంథకర్త: మద్రాసు రాజారావుగారు. వేగుఁజుక్క గ్రంథమాలవారిచేఁ బ్రకటితము. డిమ్మి ౧౬ సైజున ౩౧ పుటలు.

ఇయ్యది "శౌరీ" అను మకుటముగల శతకము. ఇందు ౧౧౫ కందపద్యములు సులభమైనశైలిని గలవు.

ఇందులో గ్రంథకర్తగారి దైవప్రార్థన తప్ప ఎట్టి విజ్ఞానమును, నీతియును గానరాదు. మచ్చునకు కొన్నిపద్యములు చూపఁబడుచున్నవి:

క. పరమాత్మా! వరదా! యని
పరమార్గముఁ గోరి నిన్ను భక్తవరేణ్యుల్,
పరమప్రీతిన్ గొలువఁగ
పరికింపక యుంట నీకు భావ్యమె శౌరీ!

క. గర్వం బుండిన దానిం
సర్వంబు నణంచుశక్తి సామర్థ్యకళా
ధూర్వహుఁడవు గద వినత సు
పర్వా! నినుఁ గొల్చుదిదము సర్వము శౌరీ!.

గ్రంథమువెల ౦-౩-౦. ఒకసారి ౫ ప్రతులు కొనువారు తపాలాఖర్చు భరింపఁ బనిలేదు. వలయువారు మేనేజరు: వేగుఁజుక్క గ్రంథమాల, పూడిపెద్దివారివీధి, బరంపురం, గంజాముజిల్లా, అని వ్రాసినఁ బడయఁ గలరు.

ఉభయభాషాప్రవీణ బులుసు నరసింహశాస్త్రి.

అన్నపూర్ణాదేవి జీవితము

గ్రంథకర్త్రి:—శ్రీమతి అట్లూరి వెంకటసీతమ్మ గారు. ౮౨ పుటలు, సాదా కాగితములు, కాగితపు రైండు, క్రౌన్ సైజు, వెల ౧-౭-౦, ౧౯౩౯ సం. శ్రీ అన్నపూర్ణాదేవి గ్రంథమాల, ద్వితీయపుష్పము.

జీవితచరిత్రలు మన భాషయందు బహుకొద్ది. దానికి కారణము మనకు ప్రాపంచిక విషయములందుగల అశ్రద్ధయే. ఇటీవల యీరకమగు వేదాంతమును కొంచెము కట్టిపెట్టి లౌకిక్యవిషయములందు శ్రద్ధవహించి బహోపకారుల భాషాపరిణామమును, జీవితపరిణామమును తెల్పు జీవితచరిత్రల వ్రాసి ప్రజలకు నూతనాదర్శముల బోధించి దేశోన్నతికి తోడ్పడుచున్నాము.

శ్రీమతి అట్లూరి వెంకటసీతమ్మగారి అనుగ్రహము వల్ల మనకు శ్రీఅన్నపూర్ణాదేవి జీవితచరిత్ర లభించినది.

అన్నపూర్ణాదేవిగారు బ్రహ్మసమాజావలంబకులగు రామస్వామి చౌదరిగారి పుత్రిక. చౌదరిగారు మతసంఘదాస్యములనుండి విముక్తిగాంచినవారు. వీరు 'ఆడవారికి వంటచేయుటగాక మరొకటేల' అను వట్టి తరగతి ప్రజకు సంబంధించిన వారు గారు. వారును వారిభార్యయగు పిచ్చమ్మగారును అనేక కష్టములకోర్చి అన్నపూర్ణమ్మకు కలకత్తాయందు (ఆంధ్రదేశమందు స్త్రీలకున్నత కళాశాలలు లేవుగాన) ఉన్నతవిద్య నభ్యసింప నవకాశ మిచ్చిరి. తల్లిదండ్రు లిట్లు దృఢసంకల్పులైనచో బిడ్డలు విద్యావంతులుగారా!

అన్నపూర్ణమ్మయు కన్నవారికి కీర్తి తెచ్చు కుమార్తెగాన స్వసంపాదనపై నాధారపడవలెనను ఉద్దేశ్యముతో గ్రంథరచన ప్రారంభించి నిర్వహించినది.

ఈమె భర్తయగు 'ప్రియమైన నీడు' గారిని గురించి వేరే చెప్పవలసినది లేదు. వారియొక్క ఉదార స్వభావము, విశాలహృదయమే అన్నపూర్ణమ్మకు పెక్కు ఘనకార్యములు చేయుట కవకాశ మిచ్చినవి.

మనదేశము రెండువిధములగు దాస్యమునబడి తన్నుకొనుచు కుమిలిపోవుచున్నది. ఒకటి మతసంఘదాస్యము, రెండవది దేశ ప్రభుత్వదాస్యము. ఈరెంటిలో మన మేయొక్కటి జయించినను లాభము లేదు. ఏలయన రెండవది మనలను మారుమాటాడక ధ్వంసము చేయును. కావున మన మీ రెండురకములగు దాస్యములనుండియు పరిపూర్ణముగా విముక్తులము గావలెను. అట్లైనగాని మనప్రజలు సుఖపడరు, మనదేశ మౌన్నత్యమునకు రాదు.

అన్నపూర్ణాదేవి తండ్రిగారి కాలముననే వారి కుటుంబము సంఘమత దాస్యములనుండి విముక్తిగాంచినది. అన్నపూర్ణాదేవి తనకాలమున దేశమును ప్రభుత్వదాస్యమునుండి విడిపించుటకై గాంధీమహాత్ముని ప్రియపుత్రికయై ఆతని ఆజ్ఞలను శిరసావహించి దేశసేవకై తన జీవితమంతను ధారవోయ నడుముకట్టి పెక్కుసంవత్సరముల పాటు తనదీక్షను, దృఢసంకల్పమును వెల్లడిచేసెను. మనయొక్క అభాగ్యమువల్ల అత్యల్పవయస్సుననే మనలను విడనాడి (౧౯౦౦-౧౯౩౬) తన కార్యభారము మనకు ఒప్పగించినది. ఆ ఉన్న అల్పకాలమును సర్వదా అనారోగ్యవతియైయుండి తా జేయగలిగినంత చేయజాలకపోయినది. ఈమె తనజీవితములో నెరవేర్చుకొనవలచిన వేమన: ౧. స్త్రీలకొక కళాశాల (అన్నపూర్ణాదేవి పాఠశాలయే కళాశాలయగుగాక): ౨. మోహనదాస్ పత్రికాలయ మభివృద్ధిపఱచుట. ఈరెంటిని ఆంధ్రస్త్రీలు నెరవేర్తురుగాక.

శ్రీ అన్నపూర్ణాదేవి జీవితము నాదర్శముగా నిడికొని ఆంధ్రస్త్రీలు సంఘమత దాస్యమునుండియు, ప్రభుత్వదాస్యమునుండియు విడిపడెదరని వేరే చెప్పనవసరము లేదు. గ్రంథశైలి అధికగ్రాంథికముగా నున్నది. భాష యింకనూ కొంతసులభముగా నుండవలెను. శైలి రసవంతముగ నున్నది.

ఈ గ్రంథమాలాధికార్లు అన్నపూర్ణాదేవి జీవితచరిత్రను ప్రచురించినట్లే ఆమె జాబులనుకూడ ప్రకటించెదరని తలచుచున్నాను.

దొరకు వారు—శ్రీ అన్నపూర్ణాదేవి గ్రంథమాల, బ్రాడీపేట, గుంటూరు అని వ్రాయవలెను.

టేకుమళ్ల కామేశ్వరరావు.

బాల్యవివాహ తత్త్వసారము

“డెమ్మీ పెజి. 116 పుటలు. వెల రు. 1-0-0. అచ్యుతుని వేంకటాచలపతిరావు గారు. ప్రకాశకులు: మేనేజరు, స్వధర్మప్రకాశిని, కీలుపాకు, మద్రాసు.

“బాల్య వివాహములవల్లనే దేశము క్షీణించుచున్న” దనియును, “అట్టి దంపతులకుఁ బుట్టిన శిశువులు, దుర్బలులు, బుద్ధిహీనులు, పిరికిపందలు నగుచున్నారు” అనియును, మఱియు “నీబాల్యవివాహములవల్లనే యకాలశిశు మాతృమరణములు సంభవించుచున్న” వనియును, “సంఘశుద్ధి చెడుచున్న” దనియును, అను నీ మొదలగు బాల్యవివాహనిషేధశాసన ప్రతిపాదకసంస్కర్తల యాక్షేపణములు గ్రంథకర్త యీగ్రంథమున మున్ముందుచూపి, వానిని యుక్తియుక్తములును, సప్రమాణములును నగు సమాధానములచే బిమ్మట ఖండించిరి.

బాల్యవివాహములు, మహమ్మదీయులు మనదేశమును పాలించుకాలమునుండి యారంభమయినవి కాని, ఇవి ప్రాచీనములుగావను నాశయమును, వేదకాలమునుండియును బాల్యవివాహములు జరుగుచున్నట్టును, సీతాదేవికి ఒకటవసంవత్సరముననే వివాహము జరిగినట్టును, రాముఁడప్పటికి 16 సంవత్సరముల వాఁడయినట్టును అను నీమొదలగు హేతువులు చూపి ఖండించిరి. బాల్యవివాహములు జరుగుచున్న కాలములలోనే, బుద్ధిమంతులు, ధైర్యవంతులు, బలవంతులు నగు సంతానము విశేషముగా నున్నట్లు సహేతుకముగాను, సప్రమాణముగాను రుజువుచేసిరి. బాల్యవివాహములు విడనాడి ప్రౌఢావివాహములు తఱుచుగా జేసికొనువారి దేశములలోనే సంస్కర్తలు బాల్యవివాహముల కంటగట్టిన చిక్కులు సంభవించుచున్నట్లు తేటపఱచిరి. అకాలశిశుమరణాదులు, బాల్యవివాహములు జరుగుచున్న సంఘములలోగాక తదితరులలోనే విస్తారమున్నట్లు వ్యక్తపఱచిరి. సంఘశుద్ధి ప్రౌఢావివాహములు చేసుకొనువారి దేశములలో లేశమయినను లేనట్టును, బాల్యవివాహములు జరుగుచున్న దేశములలో బాగుగ నున్నట్టును తెలియఁబఱచిరి. బాల్యవివాహములులేని దేశములలో వారు దుర్భరదుఃఖములకాస్పదులయి వాని నాదరింప మొదలిడుచున్నట్లు పాశ్చాత్యప్రముఖుల వాక్యములనే ప్రమాణములు చూపిరి. “ఎస్కిమోలు” పిల్ల పుట్టిన తరువాతగాని తత్పూర్వముగాని పిల్లతండ్రిని వివాహమునకయి యొడంబరచుకొనునట్లును, “ఆస్ట్రేలియా” దేశమువారును, న్యూజీలండువారును, న్యూగినియావారును పిల్లలు పుట్టినవెంటనే వెల్లి వివాహముచేసికొనునట్లును ప్రమాణములను చూపిరి. ఇంగ్లాండుదేశమున 16 వ శతాబ్దివఱకును బాల్యవివాహములు జరుగుచుండెడి వనుటకు నిదర్శనములు చూపిరి. నిష్కపటమును, పరమ పవిత్రమును నగు దంపతుల ప్రేమకు బాల్యవివాహమే మూలకారణ మయినట్టు సహేతుకముగా రుజువుచేసిరి. బాల్యవివాహము విద్యార్థులకు మేలొనరింప లేదనువిషయము కల్లయనియు, అట్టివివాహము చేసికొనినవారలు సకల విద్యాపారంగతులయి ఎల్లవిధముల సంఘమునకు మహత్ప్రయోజన కారకులయిరనియు దృష్టాంతములు చూపి ఖండించిరి. బాల్యవివాహములు లేని దేశములలో వారుపడుచున్న దుఃఖములను చూపిరి. హిందూమతమును, హిందూదంపతుల పవిత్రప్రేమను, వివేకసాహసాదులను పాశ్చాత్యమహాశయులు వేనోళ్లఁ బొగడి రన్నందులకు నిదర్శనములు చూపించిరి. పాశ్చాత్యవిద్యవలన హిందువులు స్వకులాచారధర్మములను విడనాడి స్వకీయమతమునకు కళంక మాపాదించుచుండుటను పాశ్చాత్యుల గ్రంథములనుండి ప్రమాణముల నుద్ధరించి తెలియఁ జెప్పిరి. మతవిషయములలో దొరతనమువారు జోక్యముచేసికొనఁగూడదని చెప్పిరి. శారదాచట్టము విషయమై శాసనసభాదులలో ప్రతికూలుర సంఖ్య హెచ్చుగానున్నట్టును, అనుకూలురు తక్కువైనట్టును రుజువుచేసిరి. మఱియును ననేకవిషయములను జూపి ప్రౌఢా వివాహములు అనాదిసిద్ధములు కావనియును, ప్రమాదభూయిష్ఠము లనియును, విదేశవిద్యనేర్చుకొనుటచే మనవా రీదేశమునకు ఈముప్పును దెచ్చిపెట్టుచున్నా రనియును పర్యవసానము తేల్చిరి. అట్టి బాల్యవివాహములు చేయఁగూడదనియును, శారదాచట్టమును రద్దుచేయించుటకు మనము ప్రయత్నింప వలయుననియును రూఢముగాఁ దేట

పంచిరి. అట్టియీ గ్రంథమును సావధానముగాఁ బ్రతి యాంధ్రుఁడును జదివి తత్ఫలమును బడయఁగలుగునేని గ్రంథకర్త పరిశ్రమము సఫలముగాఁగలదు. పాశ్చాత్య విద్యావ్యామోహ ప్రోద్బలములవలన హిందూమతమున బ్రవేశింపనున్న యీ క్రొత్త సంస్కారము మూలమున కలుగనున్న బాగోలు కాలమువలన అనుభవమువలన తేల గలవు. కీడే కలుగనున్నను ప్రతిఘటన మింతలో జరుగక పోవచ్చును; కాని కలిగినపుడుమాత్రము తప్పక ప్రతిఘటనము జరుగకపోదు.

గ్రంథస్థవిషయము లన్నియు పండిత పామరజన సుబోధముగ నుండునట్లు సులభశైలి నున్నవి. ప్రచారము నుద్దేశించిన గ్రంథము లిట్టులే యుండదగినవి.

ఉభయ భాషాప్రవీణ బులుసు నరసింహశాస్త్రి.

పువ్వులతోఁట

గ్రంథకర్త: సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారు, తెలుఁగు పండితులు, మహబూబ్ కాలేజి, సికింద్రాబాదు. క్రౌనుసైజు, ౧౧౩ పుటలు. వెల ౮అ.

ఇది వివిధవస్తువులు గల ఏఁబది ఖండకావ్యముల సంపుటము. ఇందు 'కవి—అభినవస్వర్గము,' 'భావకవి' అను కావ్యములనుబట్టి ఈకవి కవితా సంభావన, తదభిరుచి వ్యక్తతరముగ తెలిసికోవచ్చును. సత్యమూలము లేని వర్ణనలకు పాత్రమగు, సత్యముతో మాత్రబంధమేని లేని అవాస్తవ వస్తుజాలముతోడిది వీరి 'అభినవ స్వర్గము' జ్ఞానపిపాసువులై విద్యయందు రమించు మర్త్యలోకవాసులకు, కవిజనమునకు మఱియు, అంతగా సమ్మతముకాదు. వీరికావ్యములందు వ్యక్తీకరించిన అభిరుచి వీరి కవితలో నిరూఢమై కన్పట్టెడిని. కాని వీరు 'భావకవి' యెడ వెలిపుచ్చిన అభిప్రాయములలో అర్థము ఒక్కటి తమకే ఒప్పగించుకోవచ్చును: "శక్తి నార్జించి వ్రాయఁగా" నింకను యత్నింపఁజనును వీరు.

"ప్రకృతి దృశ్యము"లో వీరు పైఁడి మేడలనుండి భూకాంతులనుపిలిచి, వెండి బంగారములు లెక్కించు "కుబేరుల"ను పిలిచి, "ప్రభుత్వఁ బ్రకటించు నధికారిసభ్యుల"ను బిలిచి, "సర్వకాలంబు సౌధజాలమందె" కడపక,

"ప్రకృతి దృశ్యంబులను జూడవచ్చు వీరు
రండు! మా గ్రామవటీకుటీరముల వైపుఁ
గనుఁడి"

అని యెచ్చరించి,

"ముక్కుతోఁ బట్టి సన్నని పుడక యొకటి
యాకసమునందుఁ బరువెత్తుకాకి యదిగో!

* * * * *

యమునివలె దున్నపై నెక్కి యరుగుచుండె
గొల్లకాఁపఱివాఁ డదుగో యొకండు!"

అనుచు నిట్లు సెలయేళ్లు, జంతువులు, పక్షులు, జనవిశేషములు మున్నగువానిని "అదిగో, అదిగో, రండు కనుఁడు" అనుచు చూపిచూపి,

"ఇంక నెన్నేని గనుడోయి కింపు నింపు
దృశ్యములు గానఁబడుచుండు నిచట మీకు;
విలువ గట్టుఁడు మీసౌధములకు మాదు
గుడిసెలకుఁ బక్షపాతంబుఁ గొనక మీరు"

అని వదలినారు. పిలుపులో ఆకర్షణ లేకున్నను, కవి కాఁబోలు పిలుచుచున్నాఁడను సద్భావముతో వారు విని వచ్చి (చూడనే వచ్చినచో కవి ప్రభావము గణనకు రాదుగా), మెచ్చక వెడలిపోయినచో, వారిని విరసులనుటకు వీలు లేదు. ఆశాభంగమునకై ప్రకృతితోపాటు వారును సానుభూతి పాత్రులుకాదగును.

'ప్రభాతము'నవలె, ఒక విషయమై భావనాప్రసారము వెలివడుట కాక,—అది తప్పక—అనావశ్యకమగు కథనము, "కాల్యకృత్యముల్ తీర్చి, భాస్కరునకర్ఘ్య మిచ్చి మరలితి"నను నట్టివి, కావ్యమును విరూపమొనర్చును. 'సుందరి,' 'సౌందర్య లుబ్ధుఁడు' మున్నగు కావ్యములు కొంత అభిరుచి నిమ్నతను సూచించును. 'వామనః ప్రవర్తి' వంటి వానిలో భావములు ఇంపుగూర్చుచున్నవి. వచనములో చెప్పుటకైనను విశేషము లేని భావసామగ్రి యిందు మెండు. భావకవితకు అవస్థాద్యోతన మున్నఁజాలదు; ఆ అవస్థ ఆకర్షించుకొన్న భావన,—నుడికీరిలో మెలఁగి,— కావ్యమునకు గౌరవపరి

మాణము నిర్ణయించును. లలితమును, కవిశ్వాసమ్మతమును భావవిన్యాసము వీరికవితలో ఇంకను చాలను వివిధవస్తు సంతతితో మాటాడ నుత్సహించును వీరిమనస్సు; నిష్ఠతో నిగ్గుతేలి రుచితేగించు పూనిక, కళ పెంపొంద వలెను.

'పంచవన్నెల చిలుక,' 'తృణకణములు'లో కొన్ని భాగములు లోనగునవి చక్కగ నున్నవి. శైలి ధారాళము; సుబోధము. భాష నిర్దుష్టము. కొం. జ.

కమలావాచకములు

ఈవాచకములలో రెండవది భారతి ఆరవసంపుటము పదునొకొండవసంచికయందు విమర్శింపబడినది. ఇపుడు తరువాతి వాచకములు విమర్శింపబడును.

ఈ వాచకములశైలి యొడుదొడుకుగ నున్నది. భాష గ్రాంథికముగాని, వ్యావహారికముగాని కాక సంకరమయియున్నది. అన్వక్రమము, సాంధిక చాలకొఱత పడినది. ఇందువలన చదివినవెంటనే భావము గోచరించుట కష్టము. చిన్నపిల్లల పుస్తకములయందు విషయము చేతనొలిచిపెట్టిన యరటిపండువలె సులభగ్రాహ్యముగ నుండుటావశ్యకము. ఈ వాచకములయందలి పాఠములు చాలవరకట్టివి కావు. ఆమూలాగ్ర మిని సంస్కారమును గాంచనిచో వీనిని చదువువారికి లాభము గలుగజాలదనుట సాహసముకాదు.

నేడు బాలబాలికలకొరకు పుట్టుచున్న పుస్తకములలో నూటిలో తొంబదివిటికి నీగతియేపట్టినది. దీనికి జరుగని సామాన్య విద్యావంతులు, అసంస్కారులు గ్రంథరచనమునకు దొడంగుట యిందుకు కారణము. వీని వలన గ్రంథకర్తలకు, పాఠకులకు లాభము అల్పమాత్రమే— అనగా వీనికయి ప్రకాశకులవలన గ్రంథకర్తలకు లభించు సొమ్మును, వీనిని చదువుటవలన బాలబాలికలకు లభించు జ్ఞానమును తక్కువ యనుట. ఇక వీనిని బోధించు నుపాధ్యాయులపాట్లు చెప్పతరము కానివి. ఇన్నియుపద్రవములను పాఠ్యగ్రంథ నిర్ణయసంఘము తప్పింపవచ్చును. కాని అందలి సభ్యులు వాచకపుస్తకముల గుణదోషముల నిశ్చయింపగల సామర్థ్యము, శ్రద్ధ, పసిపాపల విద్యాభివృద్ధి పట్ల సానుభూతి గలవారు కానంతవఱకు నదిసాధ్యము కాదు. నిర్దిష్టములగు అనుమజాతి పఠ్యగ్రంథములను బట్టి చూడ సభ్యులు ఏవంగుణ విశేషగుణవిష్టులు కారేమోయని సంశయింపవలసి యున్నది. ఈముప్పు తప్పుటకయి బాలబాలికల పోషకులు తీవ్రముగా ప్రయత్నింపవలయునని వెనుకటివలెనే ఇపుడును కావించుచున్న యీ హెచ్చరికను వ్యర్థపరుపక కర్తవ్యమునకు బూనుకొందురుగాక!

ఇకవీనియందు స్థూలముగ గోచరించు నసంగతములు గొన్నిటి నీక్రింద జూడదగును.

మూడవవాచకము

"దీని(వేపచెట్టు) యాకులకు ఏడు మొదలు తొమ్మిది వఱకు చిలుకపత్రములుండును" పుట. 7. ఇక్కడ వివరముగా చెప్పక వృక్షశాస్త్రపాండిత్యము చూపుట వలన లాభము లేదు.

"సామాన్యముగా మనము భుజించు నాహారపదార్థములన్నియు వండుకొని తినవలసినవిగనే యుండును." పు. 24.

"ఈ గది మంటిదిగా నుండుటయే మంచిది." పు. 25.

" మీరు రెండవ తరగతిలో వారములను గూర్చి నేర్చుకొంటిరి. నాలుగు వారములు కలిసిన రోజుల నొక మాసమగును. ('వారములు' అనుపదములకు రెండుచోట్ల నొకటే యర్థమా?) దీనినే నెలయని కూడ అందురు. నెలకు ముప్పది దినములు." పుట 43. పై లెక్క ప్రకారము ముప్పది దినములెట్లు? వారమునకు $7\frac{1}{2}$ దినములందురా?

" ఇంగ్లీషు మాసములందు తిథులకు బదులుగా తేదీలను వాడుదురు. మాసము నందున్న విన్నియును తేదీలగును." పు. 44.

"(చంద్రుడు) దినమునకు రెండేసి గడియల చొప్పున వృద్ధిపొందుచు ...... పూర్ణిమనాటికి రాత్రి యంతయు వెన్నెల ప్రకాశించును." పు. 44.

ప్రకాశించు ధాతువు అకర్మకము. సకర్మకము కాదు.

"(చంద్రుఁడు) బహుళవిదియనాఁడు పాడ్యమి నాటికంటె మఱికొంచెము క్షీణించి * * * * ప్రకాశించును." పు 44. కొంచెమనిన ఎంతయని?

ఉత్తరము, జలాశయములు అను పాఠములు చాల ఎగుడు దిగుడుగనుండి వింతను గొలుపుచున్నవి. 'మేరీరాణి పాఠమున—" "ఈమె టెక్ ప్రభువునకు జనించెను" అని మరల "ఈమె ప్రభుకుటుంబములోనిది" అనికలదు. ఇచట పునరుక్తి.

"ఒకప్పుడు చిత్తూరు పట్టణమునుండి యొక్క మనుజుఁడు బండితోలుకొని పొరుగూరికి పోవుచుండెను" పు 55. అని ప్రారంభించి మరల రా బంతులతరువాత దీనిని మఱచిపోయి "ఆ రెండును ఈ స్థితిలోనుండగా బండివాఁడొకఁడు చూచెను" అని ఇంకొకని కొనివచ్చినారు.

ఇట్టివి ఎన్నియయినను చూపవచ్చును. 'నీతిగల గాడిద' 'ఏసుక్రీస్తు ఎరూషలేము ప్రవేశించుట' మొదలయిన పాఠములకంటె మంచివి దొరకకపోయినవి కాబోలు! ఇది పోనిండు.

అపశబ్దములు చూడుడు:

తక్షణము, ఉడత, దీవెన, యవ్వనవతి, పిండి, చక్కలము మొదలయినవి.

అర్థవివేచనమును గనుడు: వలచిన=కోరిన (పు. 4.) ఇక్కడ ప్రేమించిన యనుట తగును.

ముద్దినుసు=మూడు+దినుసులు = అనేకరకములు (పు. 16)

దురాశ=ఎక్కువ ఆశ (పు. 24) అగునా?

ఆనందము=సంతోషము, ఉత్సాహము = సంతోషము. (పు. 42.) రెండు పదములకు నొక్క యర్థమెట్లు పొసగును.

మాతృభావ=తల్లి భావ పు. 51. స్వభావకదా!

వ్యాకరణాంశములలో 'ఎ ఏ'లు తప్పతక్కిన అచ్చులు మొదటగల పదములను వరుసగా చెప్పి 'ఈ పదముల మొదటి అక్షరములు అచ్చులు' అనిరి. 'ఎ ఏ'లు అచ్చులు కావనుకొన్నారో; లేక, ఇంకొకవాచకమున వానిని చెప్పదలచుకొని మీఁదు పెట్టినారో?

ఇక వీరి పద్యకవిత్వమును పాఠకులు కొంచెము చవిచూడదగును. "బరువుగల ఫలములచె వంగుతరులతోడ; జనులకింపొడగూర్చు వసంత మహహా" (పు. 37.)

నాలవవాచకము

అసంగతములను చిత్తగింపుఁడు: రంగు "ముదురగనో లేక లేలికగనో" 14 పు.=ముదురురంగు లేతరంగు అనుట తెనుగు జాతీయము. "ఆ ఋతువులలో వచ్చు పుష్పములు" పు. 18. పూచు పుష్పములని కాబోలు!

"దీనిని (తులసిని) పెంచువారిని పవిత్రులనియు (ఇంతవరకు బాగున్నది) మర్యాదగల వారనియు పెంచుచున్నారు" పు 23. తులసిని పెంచకున్న మర్యాదలేదా?

"యంత్రసహాయమున గుట్టుట చేతఁబడెనేని" పు. 26. చేతనగునేని అని కాబోలు భావము.

సుకన్య సంయాతి పుత్రికయట. పు. 19. శర్యాతిపుత్రికగాని సంయాతి పుత్రిక కాదు. "గోమయమున గుమ్మరిబూడిద కలిపి యలుకవలెను" పు. 39. కుమ్మరి ఆవమునందలి బూడిద అని కాబోలు అర్థము. కాకున్న కుమ్మరినే బూడిదచేయవలసివచ్చును! "పెంకుముక్కలు నలుగగొట్టి మెత్తని బూడిదగజేసి" పు. 39. పెంకులను నలుగగొట్టితే బూడిద అగునా? ఇది వింతగా ఉన్నది.

శ్రీమహావిష్ణువుంగూర్చి తపస్సుచేయగా కృష్ణుడు ప్రసన్నుడైనాడట. పు. 52.

"తోడికోడండ్రిద్దరు నిజమయిన అక్కచెల్లెండ్రవలె." పు. 66.

"ముందు కుంతీదేవికి ధర్మరాజుపుట్టెను. (పు. 66.) అని చెప్పి మరల (పు. 67 లో) "కుంతికి క్రమముగా ధర్మజ (పునరుక్తి) అర్జున నకుల సహదేవులను నైదుగురు కుమాళ్లు పుట్టిరి. వారిని కౌంతేయులనియు, పాండవులనియు పిలిచిరి," అనిరి. కుంతికి తక్కినవారి

తోపాటు నకుల సహదేవులు కూడ పుట్టిరట! అందరు కొంతేయులట!

మురాసురుడు నరకాసురునికి తమ్ముడట! (పు. 51.)

" మేఘములు- వర్షము, వాయువు, నీటిని పరిశుభ్రముచేయుట- మొదలయిన పాఠము లిందున్నరీతిని పిల్లల తలకెక్కజాలనివి. మరియు వాక్యరచన ఒకపురుషమునుండి ఇంకొకపురుషములోనికి దాటుచుండును. (చూ. 8 పాఠము.)

వింతసమాసములు వింతపదములు చూడుడు:

పూలహారము (పు. 2); మనస్ఫూర్తిగ, భార్యాబిడ్డలు (పు. 19.), పడిసెభారము (పు. 24), సొంతి (పు. 25), ఉపయోగపర్చుకొందురు (పు. 26), ఘాటు (పు. 26), సులభసరలము (పు. 27), ఊహాపోహలు (పు. 28), వ్యయప్రయాసలు (పు. 28), అశ్వినీదేవతలు (పు. 22), వదనా (పు. 36), ఉదయాస్థమయములు (పు. 37), నొక్కిరాసి (పు. 39), అర్జునుడు (పు. 41), మణిచటికోజము (పు. 58), సకల కోరికలు (పు. 58.), ఇత్యాదులు.

అర్థసారస్యములను దిలకింపుడు: అవమానము=సిగ్గ (పు. 4.) నిరసనభావము=నీఛపుచూపు (పు 14) కారి=చేయునది. (పు 25). ఈ వింతపదము ఇందే కనిపించుచున్నది. ఇట్టివి పెక్కులు. ఎన్నియని పేర్కొనవచ్చును! ఇక దీనిలోని పద్యకవిత్వమును చిత్తగింపుడు.

" దాహమని బాటసారులు దల్లడిలుచు, బసువులెల్లను నీటికై పరుగులిడుచు, వెదకి చలిపందిరినిగాంచి వేడ్కనొంది, చలువకై యేగు నటుసు గ్రీష్మంబునందు.

చలిని జనులెల్లఁ దిట్టుకొలమై యిఫుడు, వలయునందును గీర్తింపఁబడుచునుండు, గ్రీష్మమందలి వేడికి త్రేగలేక, నీలగిరికేగి యచ్చట నీడగంత్రు. (పు. 50)

తరుణాలివాచకముమాట తరువాత.—భారతి.

ప్రణయ సౌరభము.

రాయల్ సైజు. పుటలు 62. వెల 0-12-0

రచయితలు-కొండపల్లి గోపాలరావు, హరిరామలింగశాస్త్రిగార్లు, కలవపాములు, కాటూరుపోస్టు, కృష్ణాజిల్లా.

"ప్రణయ సౌరభము" నాలుగు వీచికలుగా విభజింపబడిన పద్యకావ్యము. ఇందు కథాచిత్రణమున నైపుణ్యము కానరాకపోయినా కథనములో శైలథ్యము గోచరిస్తుంది. రచనలో ఉత్సాహమున్నంత పటిష్ఠత కనిపించదు. తమకవిత్వానికి మేలుబంతి పూర్వులదని నయిత్రలు 'విజ్ఞప్తిలో'

'ఎందున లేవు పూర్వకవు లేగని త్రోవలు సత్కవిత్వని, ష్యంది మరందధారలు రసావహముల్ త్రిపురాసురారి మా, కిందుకలాభివ్యక్తము లహీనము లయ్యెవి, లేమి కావ్యముల్, సెందుసె లోకమాన్యత, రుచించును కావ్యరసజ్ఞపాళికిన్'

అని తెలియచేసినారు. కాని ఇందుపూర్వుల ఉత్కృష్టతలు ప్రతిఫలింపక పోయినవి.

'మాతులుంగలవంగ మాకంద జంబీర ఖర్జూరకదళికా క్రముకచయము.'

వంటివి వీరే తొలుత వ్రాయలేదు. ప్రకృతి వర్ణనలలో ప్రయత్నము లే పొడకట్టుతూ ఉన్నవి. ఈ పుస్తకములో కానవచ్చునవి ఇంతకంటే మంచి నిర్వాహణపు వాగ్దానములు. శైలికి ఉదాహరణగా మీది ఉత్పలము ఉపకరిస్తుంది. క్వచిత్తుగా వచనముంచడానికి ఇష్టములేనట్లు వ్రాయబడినట్లున్న

'అనుచుఁ జెద్దయుఁ దపవారీతిమిగుల, బతిమాలుకొనుటకు ప్రత్యుత్తరంబు, నొసగంగఁ దరిలీపు నొనరించునట్టి, యాపె నుద్దేశించి యంటి నిటు సఖి.'

వంటిపద్యా లెక్కడో గోచరిస్తవి కాని మొత్తానపద్యాలన్నీ బాగులేకపోలేదు; వినుగుపొందక పాఠకుడు చదువుకో గలిగినవి. శ్రీ. శ్రీ.

౧ శివానందలహరీస్తోత్రము

(నాగరి లిపి)

చిన్న సైజు, పుటలు ౩౨. వెల రు ౦-౩-౦.

ఇందు శంకరాచార్యకృత శివానందలహరీస్తోత్ర శివాపరాధ క్షమాపణ స్తోత్రములు, శ్రీధర వేంకటేశ్వ రాచార్య విరచిత ఆర్తిహారాష్టకము నున్నవి.

౨ ఇంద్రాక్షీ స్తోత్రమ్

(నాగరి లిపి)

చిన్న సైజు, పుటలు ౩౪. వెల ౦-౩-౦.

ఇందు ఇంద్రాక్షీస్తోత్రము, శ్రీశంకరభగవత్పాది కృత దేవీనవరత్నమాలికా స్తోత్ర, దేవీభుజంగస్తోత్ర, అర్ధనారీశ్వరస్తోత్రములు, మార్కండేయకృతమృత్యుంజయ స్తోత్రము నున్నవి. ఈరెండుపుస్తకములను ప్రకాశకులు చక్కగా పరిశోధించి, నిర్దుష్టముగా ప్రకటించినారు.

పైరెండు గ్రంథముల ప్రకాశకులు: కడలంగుడి బ్రహ్మశ్రీ నటేశశాస్త్రిలుగారు, ౭౨ బిగ్ స్ట్రీటు, తిరువల్లిక్కేణి, చెన్నపురి.

---

౧. శ్రీవైష్ణవ తిరుమాళిగ

క్రౌను ౨౧ పుటలు, వెల ౨ అణాలు

౨. ఆండాళ్ తిరుక్కళ్యాణము

[శ్రీవ్రతము (తిరుప్పావు) తులసీప్రాజ] క్రౌను. ౭౦ పుటలు. వెల ౪ అణాలు.

ఈ పైరెండు చిన్నపుస్తకములను విద్వాన్ నారాయణవనము కూరత్తాళ్వారయ్యంగారు రచించినవి.

విలాసము: యస్. క. వకుళాభరణం, ౨౨ పచ్చయప్ప మొదలివీధి, కోమలీశ్వరన్ పేట, చెన్నపట్టణము.

పేరులవలననే యివి వైష్ణవ సంప్రదాయ గ్రంథములని తెలియుచున్నది. మొదటిదానియందు గృహస్థుల దినచర్య, భక్తిజీవనముగూర్చిన విషయములు గలవు. రెండవది ఆండాళు జీవితకథ, ఆమెవ్రాసిన తిరుప్పావునకు పద్యానువాదమును గలది. ఇందు వైకుంఠ్యము సంసార ఆధ్యాత్మ అనుభవముల గూర్చిన బోధనలు కలవు.

జ. బ్ర.

దాంపత్యము

ఇది దంపతులకు మిగుల నుపయుక్తమైన గ్రంథము. వాత్స్యాయనుని కామసూత్రములు, కొక్కోకము, కళాశాస్త్రము, చరకసుశ్రుతాది వైద్య గ్రంథములు, మహాభారతాదినీతిగ్రంథములు, మొదలయినవానినుండి దాంపత్య ధర్మములనే గూర్చి వ్రాయబడిన కొన్ని ముఖ్యవిషయము లిందుచెప్పబడినవి. "పెక్కు గ్రంథములు పరిశోధించి అశ్లీలమునకు దావులేకుండ శాస్త్రసమ్మతముగ క్లుప్తముగ సతీపతుల శారీరక మానసిక కోల్లాసముల కనువగునట్లు దీనిని వ్రాసితి" నని గ్రంథకర్తగారు పీఠికయందు చెప్పుకొనిరి. కామపురుషార్థ సంబంధమున సదుపదేశము లొసంగు గ్రంథమొక్కటియైన భాషయందు గానరాదనియు, తామా కొఱతదీర్ప నీ గంగ్రమును రచించితిమనియు వారు సూచించిరి. కామశాస్త్ర బోధనమని పేరు పెట్టి కొంద అనేకకొన్నిగ్రంథముల మిగుల పచ్చిగా వ్రాసిరనుట వాస్తవమేకాని కామశాస్త్ర విషయిక గ్రంథములన్నియు నట్టివనుట సాహసము. కొంద లేవిషయముల జాలవిస్పష్టముగా వ్రాయవలయుననియు, కొందఱు దంపతులకెల్ల నిట్టి రహస్యవిషయిక జ్ఞానము స్వాభావికముగా యౌవనాగమముతో నెవ్వరి ప్రబోధము లేకుండ నభివృద్ధిచెందుననియు, అశ్లీలగుటచేత నట్టి రహస్యవిషయికమైన గ్రంథరచన నట్టిమనర్థదాయక మనియు వాదింతురు. ప్రథమాధ్యాయమున గ్రంథకర్త యీ వాదములను కొంతవిమర్శించి కామశాస్త్రోత్పత్తియు, దాని యావశ్యకతయు నిరూపింప బ్రయత్నించెను. పచ్చిగా చెప్పబడిన కామశాస్త్రీయగ్రంథములు కామోన్మత్తులగు పామరులను, బాలకులను దుర్వికారములకును, దురవస్థలకును పాలుసేయును. సర్కారువారిట్టి గ్రంథముల నిషేధించుటయు నత్యవసరము. "ఒక స్త్రీగాని, ఒక పురుషుడుగాని తమ శీలమును బుగ్గిగలపి స్వేచ్ఛగా విహరించిన జాతియంతయు చెడిపోవుచున్నదని తలంపవలయును. ఏ జాతి తనయందలి స్త్రీనిగౌరవించునో ఆ

జాతి చిరస్థాయిగా వర్ధిల్లి కృతార్థత గాంచగలదు. స్త్రీ మాతృదేవతయొక్క ప్రతిబింబము. ఏనాడు స్త్రీ నిజపతిని దైవముగా భావించి అన్యపురుషుల సోదరులవలె జూచునో, ఆనాడే స్వాతంత్ర్య లక్ష్మి మనయింట దాస్య మొనరింపగలదు? మానవుని యౌన్నత్యనీచములు, గౌరవా గౌరవములు, ధర్మాధర్మములు, స్త్రీలపవిత్రశీలముపై నాధారపడి యుండును." అని యీ గ్రంథమున బలుతావులను ఘోషించుట చాల ముదావహముగనున్నది. ఈ గ్రంథము కామశాస్త్ర విషయికమగు మర్మముల వెల్లడించునదైనను ఎచ్చట నసభ్యముకాని, అశ్లీలముకాని కానరాదు. దంపతులకు కామసంతృప్తి, పరస్పర సైహిత్యము, తన్నివారణోపాయములు, వంధ్యాత్వము, సంతాననిరోధము, సుఖరోగములు, వానిచికిత్స, కన్యావిస్రంభణము, ఉపచారవిధులు, సంయమావశ్యకత మున్నగు విషయము లీగ్రంథమున వర్ణింపబడినవి.

పాశ్చాత్య విద్వాంసుల గ్రంథములనుండియు, ప్రబంధములనుండియు దాంపత్య ధర్మములతో సంబంధమున్న కొన్ని విషయము లీగ్రంథమునం దుద్ధృతములైనవి మాదిరికి, కొన్ని యుదాహరణములు:—

మను చరిత్రమునుండి:

ఎవ్వాడు మీఁదెఱుంగక యధేచ్ఛ సుఖైకరతిం జరింపఁగా, నవ్వుల వంశహాని ప్రతిహాని యశోధనహాని పుట్టుఁదా, నవ్వడఁగ మ్మనుష్యపశువ య్యవివేకి చెడుఁ జగంబునన్, నవ్వఁగఁబోలు రౌరవమునన్ బడఁబోలును నిందపాలునై.

మహాభారతమునుండి:

శ్లో. అపత్యోత్పాదనార్థంచ తీవ్రం నియమమాస్థితః ;
కాలేనియమితాహారో బ్రహ్మచారీ జితేంద్రియః ।

ఉద్ధృతభాగములలో నర్థముల తప్పులను, వాక్య సమన్వయదోషములును కొన్ని పొడకట్టుచున్నవి. విష యావబోధమున కివి అడ్డుఅగును.

గ్రంథము 105 పుటలు. వెల ఒక రూపాయి. వలయువారు దొంతిశెట్టి నాగేశ్వరరావు, 2, రామానుజ కూటంవీథి, పాతచాకలపేట, మదరాసు. అని వ్రాసిన బడయగలరు.

దివాకర్ల సోమసుందర రావు.

South Indian Music Series

Book II. (Stage III.)

(మేళకర్త రాగములపట్టికతోను, రెండు అను బంధములతోను సహా.) గ్రంథకర్త: పి. సాంబమూర్తి గారు, బి. ఏ., బి. యల్., లెక్చరర్ ఇన్ ఇండియన్ మ్యూజిక్, క్వీన్ మేరీస్ కాలేజ్, మద్రాసు. క్రౌను సైజు ౧౫ పుటలు. వెల ౧ా అ.

ఈ గ్రంథకర్త మిక్కిలి అనుభవముతోను, పరి జ్ఞానముతోను వ్రాసిన ప్రాథమిక సంగీత బోధినులు మూటిలో నిది చివరది.

ఇందు ముఖ్యముగ రాగములనుగూర్చి యిచ్చిన వివరములు మిక్కిలి ప్రశస్యముగనున్నవి. ద్వాదశ చక్రములలో పూర్వోత్తర మేళకర్తలు 72 ను స్వరూపములతో ననుకూలముగ కూర్పబడినవి. శుద్ధమధ్యమ ప్రతి మధ్యమములు పూర్వ-ఉత్తర మేళకర్తలకు సర్వసాగా ఆయాయి ఋషభగాంధార ధైవతనిషాదభేదములు ఏయే చక్రములందు వచ్చునో ఒక పద్ధతిగ వివరింపబడినది. జన్యరాగములలో వక్రావక్ర భేదములు, వాని అవాంతరభేదములు, వర్జావర్జములు, ఉపాంగ భాషాంగములు, నిషాదాంత్య ధైవతాంత్య పంచమాంత్యములు, ఇవికాక ప్రాచీనవిభాగము లగు శుద్ధరాగ, ఛాయాలగ (సలగ) రాగ, సంకీర్ణ (సంక్రమ; మిశ్ర) రాగములు-వీనినైనను తెలుపబడినవి. స్వరముల వాది, సంవాది, వివాది, అనువాది భేదములు, గ్రహ, న్యాస, అంశభేదములు వివరింపబడినవి. ౧౩ రాగముల సమగ్ర, లక్షణములు ప్రామాణికములగు కొన్ని రాగచరిత్రములతోను, సంచారాది విశేషములతోను ఈయబడినవి. ఇటు ఘన, నయ (రక్తి), దేశీయరాగ విభేదవివరణము కలదు. తుదను స్వరజ్ఞానా

భ్యాసములును, ౧౭౦ జన్యరాగముల మేళ స్వరూపములును రెండు అనుబంధములుగా కూర్చబడినవి. రాగసంచారములను బాగుగ చూపు తానవర్ణములు మూడు చేర్చబడినవి. శాస్త్రీయ గేయరచనయందు వర్ణముల ఔత్కృష్ట్య మిట వివరింపబడినది.

వివిధపారిభాషికపదవివరణము తొలుతనే కలదు. కృతులు, వర్ణములు మున్నగు గేయరచనల చర్చించుట యందును, వివిధయంత్రవాద్యములఁగూర్చిన ప్రకరణము నను, జనసామాన్యము వాడుకగా పాడుకొను పాటల రకములను వేలుపఱిచి చూపుటయందును పొందికైన భోగట్టా యెంతయో కలదు.

సప్తతాళములు జతిభేదములచే ౩౫ గను, పిదప గతిభేదములచే నవి ౧౭౫ గను ఏర్పడుట దీని వెనుకటి గ్రంథములలో వివరించియుండలేదట. ఇచట దేశాది, మధ్యాది, చాపు భేదములు తెలుపబడినవి. గ్రంథము తుదను ౫౫ ప్రశ్నములున్నవి. మంచిశాస్త్రజ్ఞత, ప్రామాణికత, విద్యార్థులకవి యుపయోగపడురీతి ప్రయోగించు సామర్థ్యము, రచనయందు పొందిక ఈ గ్రంథమునకు ప్రాముఖ్యము నిడుచున్నవి.

ఈ వరుస మూడు గ్రంథములను ఒక్కసంపుటము గా 'Elements of Karnatic Music' అనుపేర ప్రకాశకులు (The Indian Music Publishing House, G. T., Madras.) ప్రకటించినారట.

కొం. జ.

స్వీకారము

ఆంగ్లదేశచరిత్ర సంగ్రహము. ప్రథమభాగము క్రౌనుసైజు, పేజీలు 115 వెల రు 0-10-0.

ద్వితీయ భాగము. క్రౌనుసైజు, పేజీలు 88, వెల 0-8-0 గ్రంథకర్త: భాస్కరసుబ్బయ్యగారు, బి.ఏ., యల్.టి., సహాయ చారిత్రకోపాధ్యాయుడు, బసవరాజా హైస్కూలు, పుంగనూరు.

దొరకుచోటు: వి. రమణా అండ్ కో,
వేపేరి; మద్రాసు.

గుంటూరుజిల్లాలో గోలిఅను గ్రామము వద్దనున్న స్తూపమునందలి బౌద్ధశిల్పము:

(Bulletin of the Madras Government Museum)

ఆంగ్లము: డిమ్మీసైజు, ఫుటలు 44 ఆర్టు కాగితము. పెక్కు శిల్పచిత్రము లున్నవి. వెల రు 2-12-0 1929 సం.

గ్రంథకర్త శ్రీ టి. యన్. రామచంద్రన్ గారు, యమ్. ఏ., ఆర్కియాలజి అసిస్టెంటు; ప్రకాశకులు: సూపరింటెండెంటు, గవర్నమెంటు మ్యూజియం, చెన్నపురి.

ఆంధ్రమేఘసందేశము

క్రౌను, ౭౮ ఫుటలు. మేలికాగితము. అందమయిన అచ్చు. వెల రు ౦-౧౨-౦.

గ్రంథకర్త: గుఱ్ఱము వేంకటసుబ్బరామయ్యగారు, యం. ఏ., ఆంగ్లోపన్యాసకులు, వేంకటగిరిరాజా గారి కళాశాల, నెల్లూరు.

శ్రీరాఘవేంద్రస్తోత్రము.

(సంస్కృతము-సటీక)

క్రౌను ౮౨ ఫుటలు, మనుపుకాగితము. వెల రు. ౦-౮-౦. ౧౯౩౦. సం.

టీకాకారుడు: ప్రొద్దుటూరి నరసింగరావుగారు, బి. ఏ., గురుప్రసాద, (లచ్చిరాజువీథి) సూర్యారావుపేట, కాకినాడ.

హోమియో వైద్య చికిత్సాసారము

మూలికారహస్యము భా ౧

క్రౌను ౧౪౯ పుటలు. సమపుకాగితము. వెల రు ౨-౭-౦, ౧౯౩౦. సం.

గ్రంథకర్త:—డాక్టరు బి. శ్రీరాములుగారు హోమియోపతిస్టు, బయో-కెమిస్టు, విజయనగరము.

పాతపాటలు

క్రౌను ౨౧ పుటలు. సమపు కాకితము, అందమైన ముద్రణము. వెల అ. ౨. ౧౯౩౦. సం.

సంపాదకులు: శేషమళ్ళ కామేశ్వరరావుగారు, బి.ఏ.

పుష్పాంజలి

(కావ్యములు) సంపుటము ౧

డిమ్మి ౧౭౭ పుటలు. రఫ్ కాగితము. వెల రు. ౧-౪-౦. ౧౯౨౯. సం.

గ్రంథకర్త: కల్లూరి వేంకటనారాయణ రావుగారు, బి. ఏ., యల్. టి.

ప్రకాశకులు: కల్లూరు యజమాన సుబ్బారావుగారు, ఆత్మకూరు, అనంతపురంజిల్లా.

శ్రీమద్రామాయణతత్త్వజిజ్ఞాస

(ఆదిశైవ గ్రంథమాల ౭) డిమ్మి ౩౯ పుటలు. రఫ్ కాగితము. వెల అ. ౪. ౧౯౨౯సం. శ్రీగురుకులాశ్రమము. చిలువూరు, అనంతవరముపోస్టు, గుంటూరుజిల్లా.

గ్రంథకర్త: పొన్నలూరి సూర్యనారాయణ శర్మగారు.

ముకుందమాల

(అనువాదము)

క్రౌను ౧౦ పుటలు. రఫ్ కాగితములు. వెల అ. ౨ లు. మచిలీపట్టణమున సత్యసాధనీ ముద్రాక్షరశాలయందు ముద్రితము.

అనువాదకులు: చెలుకూరి కాళహస్తీశ్వర శర్మగారు.

ప్రకాశకులు: కోన ఆదినారాయణ శర్మగారు, సత్యసాధని ప్రెస్సు, బందరు.

పశు వైద్యవస్తుగుణదీపిక

(చతుర్థపుష్పము) క్రౌను ౨౬౨ పుటలు. మంచి కాగితము. పేపరుబైండు. వెల రు. ౨. ౧౯౨౯ సం.

గ్రంథకర్త: యేజెళ్ళ శ్రీరాములుచౌదరిగారు, అంగలూరు, కృష్ణాజిల్లా.

ఆంధ్రాధ్యాత్మరామాయణము

రాయల్ సైజు, ౪౫౦ పుటలు. సమపుకాగితము. అందమైన ముద్రణము. క్యాలికోబైండు. వెల రు. ౩ లు. ౧౯౨౯ సం.

అనువాదకుడు: పిసుపాటి నారాయణ శాస్త్రిగారు, పొన్నూరు, గుంటూరుజిల్లా.

Kampili and Vijayanagaram

(ఆంగ్లము) క్రౌనుసైజు ౩౭ పుటలు. వెదురు గుజ్జుకాగితము. అట్టబైండు. వెల తెలియదు.

రచయిత: యన్. వెంకటరమణయ్యగారు యమ్. ఏ., పి. హెచ్. డి. చారిత్రకోపన్యాసకులు. క్రైస్తవ కళాశాల, చెన్నపురి.

హిందీ మొదటి పాఠపుస్తకము భా. ౨

క్రౌను ౩౬ పుటలు. సమపుకాగితము. వెల అ. ౩. ౧౯౨౯ సం.

రచయిత: కూచిమంచి సుబ్బారావుగారు, గ్రేజరుపేట, కాకినాడ.

శ్రీ అల్లిపుర వేంకటేశ్వర స్తోత్రరత్నములు

దండకము: డిమ్మి చిన్నసైజు, ౭ పుటలు. వెల అర్థణా. ౧౯౩౦ సం.

రచయిత: వక్కలంక శ్రీనివాసరావుగారు.

ప్రకాశకులు: అందే కృష్ణమూర్తి బ్రదర్సు, ౪౪ కొట్లు, బజారువీథి, విశాఖపట్టణము.

(Moonbeams)

(ఖండకావ్యముల సంపుటి.)

ఆంగ్లము. క్రౌను ౩౮ పుటలు. వెదురుగజ్జుకాగితము. అందమైన బైండు. వెల తెలియదు. ౧౯౩౨ సం॥

ప్రకాశకులు: యూత్ ఆఫ్ ఏషియా సొసైటీ, మచిలీపట్నము.

గ్రంథకర్త: వి. యస్. భూషణ్ గారు,

---

౧. వావిళ్ల వాచక పుస్తకము

మొదటి తరగతి:

పుట ౭౬　　వెల రు. ౦ ౩ ౦

రెండవ తరగతి:

పుట ౯౨　　,, ౦ ౩ ౦

మూడవ తరగతి:

పుట ౧౧౬　　,, ౦ ౪ ౬

నాల్గవ తరగతి:

పుట ౧౨౦　　,, ౦ ౫ ౦

పుస్తకము తీరు, అచ్చు, అందముగా నున్నది. ౧౯౩౨.

గ్రంథకర్త: జయంతి గంగన్నగారు,

బి. ఏ., యల్. టి.,

వీరేశలింగం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు,

రాజమహేంద్రవరము.

౨. సులభగణితము, భా. ౧.

నాల్గవ తరగతి:

పుట ౧౬౮　　వెల రు. ౦ ౭ ౧

గ్రంథకర్త: శ్రీకంఠం కృష్ణారావుగారు,

బి. ఏ., యల్. టి.,

బోర్డుహైస్కూలు, కావలి. ౧౯౩౨.

---

3. శ్రీ ప్రమోదూతనామ సంవత్సర పంచాఙ్గమ్

తిరుమల కొండూరు వేంకటతిరుమలాచార్య సిద్ధాంతిగారు గణించినది. వెల రు. ౦-౨-౦.

పై మాటికి ప్రకాశకులు:

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్,

చెన్నపురి.

పత్రిక

ఆనందవాహిని

సంపుటము ౧. సంచిక ౧.

౧౯౩౧ సంవత్సరం జనవరి నెలలో ప్రారంభమయిన పత్రిక—సంవత్సరం చందా రు. ౧-౦-౦.

ప్రకాశకులు: యస్. యస్. వాసన్ గారు,

244, టంకసాల వీథి, మదరాసు.

Rənasent India (ఆంగ్లము)

క్రౌను ౧౦౫ పుటలు. మేలుకాగితము అందమయిన బైండు; వెల రు. ౧-౦-౦. రెండవకూర్పు.

గ్రంథకర్త: కే. యస్. వెంకటరమణిగారు, విలాసము: శ్వేతారణ్యాశ్రమము, మైలాపూరు, చెన్నపురి.

పుష్పాంజలి

డిమ్మిసైజు. సంపుటము ౧. సంచిక ౧. ఈ పుష్యమాసములో ప్రారంభమయినది. సంవత్సర చందా రు. ౧-౧౨-౦. సంపాదకుడు: శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్యగారు. ప్రకాశకులు: కర్పగం అండ్ కంపెని, ౮, వీరాస్వామిపిళ్లె వీథి, మదరాసు.





బ్రహ్మశ్రీ ఈమని అచ్యుతరామశాస్త్రిగారు

వీరు గోదావరి మండలములోని రామచంద్రపురం తాలూకా ద్రాక్షారామ గ్రామ నివాసులు. వీణాగాన ప్రవీణులు. వీరి తండ్రిగారగు బ్రహ్మశ్రీ సుబ్బారాయ శాస్త్రిగారు వైణికవతంసులై విజయనగరప్రభువులును, అభినవాంధ్రభోజులును నగు శ్రీమదానందగజపతి మహారాజావారి యాస్థానగాయక శిఖామణులలో నొక్కరై ప్రసిద్ధి కెక్కినవారు.

అచ్యుత రామశాస్త్రిగారు తండ్రిగారివద్దనే విద్య నభ్యసించుచు దీక్షతో గొప్ప కృషి చేయుటయేకాక దక్షిణదేశ సంచారముచేసి అచ్చట గొప్పవిద్వాంసుల బాణీలన్నియు జూచి మెళుకువలను గ్రహించి వచ్చి బహువిధము లగు సాధనలు చేసి యారితేరిరి.

వీరు విద్వత్తునందు మాత్రమేగాక మంద్రమధ్యమ తారాది స్వరములయందలి నైపుణ్యమును జూపి సుఖ బాణీలచే సభ్యులను సంతోషపరవశులను గావించి యానందింపజేయుటలో బహుసమర్థులు.

వీ రిదివరకు దేవరకోట, దక్షిణవల్లూరు సంస్థానములయందు చాలకాలము విద్వాంసులుగా నుండి ప్రస్తుతము స్వగ్రామ పరిసరమునను గల వేగాయమ్మపేట సంస్థానమున తదాస్థానప్రభువుల యాదర గౌరవములకు పాత్రులై యున్నారు. ఆంధ్రపత్రిక.

భారతీయ మహిళామండలి



శ్రీమతి షానో దేవిగారు

ఈమె జలంధరునందలి కన్యామహావిద్యాలయపు ప్రధానోపాధ్యాయిని. తూర్పు ఆఫ్రికాకువెళ్లి యీమె ఈ విద్యాలయమునకు లక్షరూపాయలను సంపాదించి తెచ్చెను. ఇంకను ధనమును సమకూర్చుటకు ముందు దక్షిణాఫ్రికాకు వెళ్లనున్నది.



శ్రీమతి చిన్నలక్ష్మమ్మగారు

ఈమె అనంతపురము విద్యాసంఘసభ్యురాలుగా నియమింపబడిరి.



శ్రీమతి జి. ఆనందరావు సతిగారు

ప్రభుత్వమువారీమెను నెల్లూరు మునిసిపలు కౌన్సిలు సభ్యురాలుగా నియమించిరి.



శ్రీమతి బి. వి. సుబ్బమ్మగారు

నెల్లూరు జిల్లాబోర్డు సభ్యురాలుగా నియమింపబడిరి. ఇదివర కీమె నెల్లూరుజిల్లా విద్యా సంఘమునను, నెల్లూరు మునిసిపలు సంఘమునను సభ్యురాలుగా నుండిరి.

చమత్కార చంద్రిక

తాడూరి లక్ష్మీనరసింహారావు గారు

మూలము

అపూర్వేయం ధనుర్విద్యా
భవతః శిక్షితా కుతః;
మార్గణౌఘః సమాయాంతి
గుణో యాతి దిగంతరమ్.

తెనుఁగు పద్యము

తే. ఇట్టి నీదైన విలువిద్య యెందు నేర్చి
తివి యపూర్వంబు దీని పెంపేమొ కాని
మార్గణాళిని రాఁదీసి మక్కువమున
గుణము వదలెడు దిక్కుదిక్కులకుఁ బాఱ.

వివరణము

ఇందు దాతయగు రాజునుగూర్చి యొక కవి చెప్పుచున్నాఁడు. మార్గణశబ్దమునకు బాణమనియును యాచకుఁడనియు నర్థములు గలవు. గుణశబ్దమునకు వింటినారియనియు, దాతృత్వాదిసద్గుణమనియు నర్థములు గలవు. లోకములో విలువిద్య నేర్చినవాఁడు తన చెవిదాఁకను గుణము [నారి] లాగి మార్గణము [బాణము] వదిలిపెట్టును. ఇందుఁ జెప్పిన రాజు మార్గణ [యాచక] సమూహములను దనయొద్దకు లాగికొని గుణము [దాతృత్వగుణము]ను దేశము నలుదెసలకును వ్యాపింపఁజేయుచున్నాఁడు. ఇది యపూర్వమైన విలువిద్య.

సాభిప్రాయ విశేషములు

ప్రపంచపరిణామమునందు ఘటనాఘటన నిర్ణయము దుస్తరము. ఒకకాలమునందు ఘటనమునకు సాధనము వేరొక సమయమందు దఘటనరూపమును బొందుచుండును. ఆరంభమునందు దఘటనరూపమునను గనుపడెడి విషయము కాలాంతరమున ఘటనరూపమును దాల్చుచుండును. ఘటనాఘటన యోగములు రెండును పురోభివృద్ధికి సాధనము లగుచున్నవి. సృష్టియందు విలయము, విలయమునందు నవీనసృష్టియు ప్రపంచప్రవృత్తికి సహజావస్థలు. ప్రవృత్తికి సహజమైన విలయావస్థ మహాయోగులను సైతము విషాదపరవశులను జేయుచుండును. ధనుర్ధారియైనను విజయుడు కురుక్షేత్ర మందువలెనే విశ్వరూపసందర్శనమందును విషాదయోగపరవశుడై ధర్మనిరీక్షణమును జేయజాలకపోయెను. ధర్మలక్ష్యరహితమైన ప్రపంచప్రవృత్తి యంతయు భయభ్రాంతులను గలుగజేయుచు ప్రజ్ఞావాదనమునకు సాధనమగుచున్నది. ధర్మలక్ష్యసహితమైన ప్రపంచప్రవృత్తి పురుషార్థమునకు సాధనమగుచున్నది. ప్రపంచప్రవృత్తిని ప్రజ్ఞావాదనతో గాక ధర్మలక్ష్యముతో జూచునపుడు అన్ని సంశయములును పోయి ధర్మనిర్వహణము సాధ్యమగును. వర్తమానకాలమునందు ప్రజ్ఞావాదనమునకు గల ప్రాబల్యము ధర్మలక్ష్యమునకు గలుగకున్నది. పరివర్తన సమయమునందు సకలరంగములందును ప్రజ్ఞావాదదక్షులైన నాయకులు బయలుదేరి ప్రజాహృదయమునందు మహాసంక్షోభమును గలుగజేయుచున్న విధము ప్రపంచప్రవృత్తి అనంతముఖముల విశదము చేయుచున్నది. నాయకుల గంభీరోపన్యాసములు ప్రజలను సంశయపరాయణులను జేయుచు కార్యవిముఖులను జేయుచున్నవి. అనధికారులైన నాయకులు గలుగజేయుచున్న మహాసంక్షోభము ప్రపంచపరిణామమునకు సాధనభూతమైనను, భయభ్రాంతులను గలిగించుచున్నది. ప్రపంచావృతమైన మహాపరివర్తనము భరతవర్షమునందును మహాసంక్షోభమును గలుగజేయుచున్నది. పాలక పాలిత జాతిభేదము, హిందూమహమ్మదీయ భేదము, కులభేదములు, మతభేదములు గల విశాలమైన భరతఖండమునందు పరివర్తన పరిణామము భయంకరరూపమును దాల్చుట సహజము. పాలక పాలితులకు, హిందూ మహమ్మదీయులకు, జాతీయ స్వాతంత్ర్యవాదులకు పరస్పర విశ్వాసము లేనపుడు ధర్మలక్ష్యనిర్వహణము దుర్లభమై పరివర్తన ప్రయోజనము భయసంభ్రమములను గలుగజేయుచున్నది. స్వాతంత్ర్య సంరంభమునందు గాంధి మహాత్ముడు నిర్వహించుచున్న ధర్మలక్ష్యము సయితము ప్రజ్ఞావాదమునకు బలి

యగుచున్న విధమును లాహోరు కాంగ్రెసు వ్యవహారములు విశదము చేయుచున్నవి.

* * * *

నాయకరాజప్రతినిధుల సమావేశము

భారత స్వాతంత్ర్య సంరంభమునందు 1929 డిసంబరు 23-వ తేది మహాముహూర్తముగను పరిణమించినది. ఢిల్లీ నగరమునందు ఇర్విను ప్రభువునకును, గాంధి నెహ్రూ సప్రు జిన్నాగార్లకును జరిగిన సమావేశము గోప్యమైనను దూరాధిగూఢముగను బరిణమించినది. ఆ సమావేశమునందు నడిచిన వ్యవహారములు రాజ్యతంత్రమునకును, ధర్మనిర్వహణమునకును గల భేదమును విశదము చేసినవి. ఢిల్లీ సమావేశమునందు త్రికోణ సంరంభము వ్యక్తమైనది. లండను నగరమునందు గూడ వలసిన వివిధపక్షసమావేశమునకు మూలాధారము అధినివేశస్వపరిపాలనము. రాజప్రతినిధియును, జిన్నా సప్రుగార్లును వారిదృష్టిని వివిధపక్షసమావేశమునందు లగ్నము చేసినటులు అధినివేశస్వపరిపాలనమునందు లగ్నము చేయలేదని గాంధిమహాత్ముని లాహోరు ప్రసంగములు, నవజీవనపత్రికలోని వ్యాసములు, రాజప్రతినిధి సామ్రాజ్యశాసనసభయందు జనవరి 25-వ తేదిని జేసిన ప్రసంగము విశదము చేసినవి. వివిధపక్ష సమావేశము చేసిన నిర్ణయములను బ్రిటీషు ప్రభుత్వము సమర్థించుటకు బూనుకొననపుడా నిర్ణయములు కార్యరూపము దాల్చకను కాగితపు నిర్ణయములుగానె యుండును. నిర్ణయములను బ్రిటీషుప్రభుత్వము నిరాకరించినను ఇర్విను ప్రభువైనను సమర్థించుటకు బూనుకొననపుడు వివిధపక్ష సమావేశమువలనను స్వరాజ్య నిర్ణయమునకు ప్రయోజనము గలుగదని విశదమైనది. పేరంటమునకు వలెను సమావేశమునకుబోవుటకు సప్రు జిన్నాగారు లంగీకరించినను గాంధిమహాత్ముడు నిరాకరించి మాతృదేశమునకు మహోపకారమును జేయగలిగెను. స్వరాజ్యప్రయోజనములేని వివిధపక్ష సమావేశమును కాంగ్రెసు నిరాకరించుట ధర్మము గాని ఆమోదించుట ధర్మము గాదు. స్వరాజ్యలక్ష్యములేని సమావేశమును నిరాకరించిన గాంధిమహాత్ముడు ప్రశంసలకు పాత్రుడు గాని నిందలకు పాత్రుడుగాడు. అధినివేశస్వపరిపాలనమును సంపాదింపగల నాయకులు లండను నగరమునకు పోయి స్వపరిపాలనమును సంపాదించిన యెడలను కాంగ్రెసు కృతజ్ఞతతో స్వీకరింపగలదు.

రాజప్రతినిధి సామ్రాజ్యశాసనసభయందు జేసిన సంభాషణము తరువాతనైనను ప్రతికూలాభిప్రాయమును వెల్లడిచేసినవారు వారి యభిప్రాయములను మార్చుకొనుట ధర్మము. ఢిల్లీసమావేశమునందు ఇర్వినుప్రభువు చూపిన రాజ్యనీతి బ్రిటీషుప్రభుత్వమునకు సహజమైనను లాహోరు కాంగ్రెసు నిర్ణయములకు సాధనభూతమైనది.

* * * *

లాహోరు కాంగ్రెసు

భారతస్వాతంత్ర్య సంరంభమునందు లాహోరు కాంగ్రెసు పరంజ్యోతివలెను ప్రకాశింపగలదు. కాంగ్రెసు గమ్యస్థానము పూర్ణ స్వరాజ్యమని (Complete Independence) గాంధిమహాత్ముడు ప్రతిపాదించిన తీర్మానమును కాంగ్రెసు ఆమోదించినది. గాంధిమహాత్ముడు కలకత్తా కాంగ్రెసునందు జేసిన ప్రతిజ్ఞను లాహోరు కాంగ్రెసునందు పాలింపగలిగెను. ఇర్విన్ప్రభువు అధినివేశస్వపరిపాలనమును సమకూర్చుటకు గాకపోయినను సమర్థించుటకు నయితము నిరాకరించినపుడు పూర్ణస్వాతంత్ర్య లక్ష్యమును ప్రతిపాదింపవలసిన బాధ్యత గాంధిమహాత్మునకు గలిగినది. దేశభక్తుడును, సత్యప్రియుడును నైన గాంధిమహాత్మునకు మార్గాంతరము లేదని మహాత్ముని తీర్మానము, వారిప్రసంగము విశదము చేసినవి. డిశంబరు 31-వ తేది రాత్రి 12 గంటలకు కాంగ్రెసు పూర్ణస్వరాజ్యతీర్మానమును పరమోత్సాహముతో నామోదించినది. ఆసమయమునందు కాంగ్రెసుప్రతినిధులు చూపిన యుత్సాహము ప్రజాహృదయము నావరించుచున్న స్వాతంత్ర్యేచ్ఛను వ్యక్తము చేసినది.

"ఈ సభవారు అక్టోబరు 31వ తేదీని రాజప్రతినిధి గావించిన ప్రకటన సందర్భములో కాంగ్రెసువాదులతో సహా వివిధ పక్ష నాయకులు సంతకములు చేసి కావించిన ప్రకటన విషయమై కాంగ్రెసువారు గావించిన చర్య ననుమతించుచు, స్వరాజ్యమునకై కావింపబడుచున్న జాతీయోద్యమమును రాజీగా పరిష్కరించుటకై వయిస్రాయిపడిన శ్రమ వర్ణించుచున్నారు. మోతీలాల్ నెహ్రూ మున్నగు నాయకులు వయిస్రాయితో సంప్రతించుటవలన కలిగిన ఫలితముల గమనించి ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెసు రౌండుటేబిల్ సమావేశమునందు పాల్గొని లాభము లేదని యీసభవారు తలంచుచున్నారు.

మరియు, గత సంవత్సరము కలకత్తా కాంగ్రెసులో గావింపబడిన తీర్మానము ననుసరించి ఈ కాంగ్రెసువారిపుడు కాంగ్రెసు ఆదర్శమందలి 'స్వరాజ్య' పదమునకు 'సంపూర్ణస్వాతంత్ర్యము' అను అర్థము నిర్వచించుచున్నారు. కావున అధినివేశ ప్రతిపత్తికిగా నిర్మింపబడిన నెహ్రూప్రణాళిక ఇంతటితో రద్దయినదని ప్రకటించుచున్నారు. మరియు కాంగ్రెసునందలి సర్వపక్షములవారు తమయావచ్ఛక్తుల సంపూర్ణస్వాతంత్ర్య సంపాదనకై వినియోగింప గలరనియు, నెహ్రూరిపోర్టులో సూచింపబడిన తాత్కాలిక సాంఘిక వివాదపరిష్కార సాధనముల మూలమున కాంగ్రెసునుండి ఎడతొలంగవలసిన, లేక కాంగ్రెసునందు చేరుటకు వీలుగాని, ప్రముఖులను చేకు మరల కాంగ్రెసునందు చేరి ఎల్లరకు సంబంధించిన ఈ ఆదర్శమును సాధించుటకు తీవ్రకృషి సలుపుదురనియు నమ్ముచున్నారు.

సంపూర్ణస్వాతంత్ర్యసమరము సాగించుటకు సన్నాహ మొనర్ప మొదటిమెట్టుగాను, కాంగ్రెసు విధానము, ఆదర్శము మార్చినందుల కనుగుణ్యముగ నుండుటకుగాను రాష్ట్రకేంద్ర శాసన సభలను బహిష్కరింపవలయునని ప్రకటించుచు, ఇకపయి ప్రత్యక్షముగ గాని, పరోక్షముగ గాని ఈశాసనసభలతో జోక్యము కల్పించుకొన రాదనియు, ప్రస్తుతము శాసనసభలందు సభ్యులుగానున్న వారు తత్క్షణమే రాజీనామా నిచ్చివేయవలయుననియు కాంగ్రెసువాదులను కోరుచున్నారు. మరియు, దేశీయులు తమయావచ్ఛక్తుల నిర్మాణ కార్యక్రమము నిర్వహించుటకయి వినియోగింప వలయునని కోరుచు, తయారుగా నున్నట్లు తోచినపుడు అవసరమైన అన్ని జాగ్రత్తలతోటి కొన్ని ప్రత్యేకస్థలములలో గాని, సమష్టిగాగాని పన్నుల నిరాకరణముతో సహా శాసనోల్లంఘ

నము ప్రారంభించుటకు అఖిలభారతకాంగ్రెసు సంఘమునకు ఈసభవా రధికార మిచ్చుచున్నారు.

విదేశీయ పరిపాలకులచే ప్రత్యక్షముగా గాని, పరోక్షముగాగాని భారతదేశముపయి మోపబడిన ఋణబాధ స్వతంత్ర భారతదేశము సహింపజాలదు.

౧౯౨౨ సంవత్సరములో గయా కాంగ్రెసు మహాసభవారిచే నామోదింపబడిన తీర్మానము నీ మహాసభవారు స్థిరపరుచుచు, ప్రస్తుత ప్రభుత్వమునుండి సంక్రమించిన బాధ్యతలును, సౌకర్యములును స్వతంత్రభారతదేశమునందు స్వతంత్రమగు నొకవిచారణ సంఘమువారిచే పరీక్షింపబడుట ఈసభవారి యుద్దేశమని తెలిసికొనదగినవా రందరకు నిందుమూలముగా నీసభవారు ప్రకటించు చున్నారు."

పూర్ణస్వాతంత్ర్యము సకలజాతులకును జన్మస్వత్వము. భారతీయులకు స్వీయజన్మస్వత్వమును బడయుటకు శక్తిసామర్థ్యము లున్నను లేకపోయినను, జన్మస్వత్వమునందు విశ్వాసమును గలిగియుండుట స్వత్వప్రాప్తికి మూలాధారము. ప్రవృత్తియం దసహజస్థితి నెంత పోషించినను స్వతస్సిద్ధముగ నది యంతరించుటయును, సహజస్థితి వికసించుటయును సహజము. హస్తినాపురమునందలి జీర్ణములైన ఢిల్లీనగరములు సురాజ్యము లసహజములనియును, స్వరాజ్యమె సహజమనియును విస్పష్టముచేయుచున్నది. లాహోరు కాంగ్రెసు సహజమైన యీస్థితినె ప్రతిపాదించినది. కార్యసిద్ధికి సంకల్పము బీజమైనటులు సాధనము బీజము గాదు. సంకల్పము దృఢమైనపుడు సాధనలు సహజముగను సంప్రాప్తము లగుచున్నవి. పూర్ణస్వాతంత్ర్యమును సంపాదించుటకు స్వరాజ్యసంపాదనమునకు నిర్ణయించిన శాంతి సాధనములనే అవలంబించుటకు కాంగ్రెస్ నిర్ణయించినది. అసాధారణమైన కాంగ్రెసు నిర్ణయము సత్యాగ్రహసంస్కారములేని పాశ్చాత్యులకు వలెనే పాశ్చాత్యసంస్కారజాతులైన ప్రాచ్యవిద్యాసంభవులకును సత్యాగ్రహసాధనమందు విశ్వాసము గలుగుట దుర్లభము. సత్యాగ్రహసాధనమందు గాంధీమహాత్మునకు గల విశ్వాసము లాహోరు కాంగ్రెసునందు విజయమును బొందినది. అహింసాసిద్ధాంతములందు విశ్వాసములేని యువజనవర్గము సహితము మహాత్ముడు ప్రతిపాదించిన తీర్మానము నామోదింపవలసిన యవసరము గలిగినది. నిత్యనైమిత్తికధర్మములందు నిత్యధర్మమునకు గల ప్రతిష్ఠ నైమిత్తికధర్మమునకు లేదని ప్రపంచప్రవృత్తి విశదముచేయుచున్నది. నైమిత్తికధర్మము ప్రబలియున్న వర్తమానయుగమునందు నిత్యధర్మమును వ్యాపింపజేయుటకు పూనుకొనిన గాంధీమహాత్ముని ప్రయత్నములు కాంగ్రెసునందు విజయమును పొందుట భారతసంస్కారవిజయమునకు చిహ్నముగ నున్నది. స్వాతంత్ర్యసంపాదనకు అనిత్యములైన బాహ్యసాధనములను విడిచి నిత్యమైన ఆత్మసాధనము నారాధించుట పరమధర్మమని కాంగ్రెసు తీర్మానము ప్రతిపాదించినది. ఇతరులు ప్రతిపాదించినసవరణలను గాంధీమహాత్ముడు నిరాకరించి సత్యాగ్రహస్వరూపస్వభావములను పాలకపాలితులకు సువ్యక్తము చేసెను. ప్రపంచప్రవృత్తియందు విజయమును సమకూర్చుటకు ఆత్మత్యాగమునకుగలసామర్థ్యము పరపీడనకు లేదు.

స్వాతంత్ర్యసంపాదన సాధనము

లాహోరు కాంగ్రెసు స్వాతంత్ర్యసంపాదనకు ప్రపంచమునకు పరిపాటియైన దౌర్జన్య సాధనములను నిరసించినది. దుర్మార్గులు ఐర్విను ప్రభువుపైన ప్రయోగించిన బాంబు సాధనమును నిరసించినది. బాంబుప్రయోగ నిరసనమును కాంగ్రెసు ఆమోదించి దౌర్జన్య రహితమైన అసహాయయోగమునందు కాంగ్రెసునకుగల విశ్వాసమును వ్యక్తము చేసినది. కాంగ్రెసునందును, దేశమునందును దౌర్జన్య సాధనములందు విశ్వాసముగల దేశాభిమానులు గలరని దేశవ్యవహారములు విశదము చేయుచున్నవి. దేశమునందు దౌర్జన్యసాధనములు వ్యాప్తిని బొందుటకు నిరంకుశాధికారులును బాధ్యులని దేశవ్యవహారములు విశదముచేయుచున్నవి. ప్రేమవలనను ప్రేమయును, ద్వేషమువలనను ద్వేషమును, స్వార్థమువలనను స్వార్థము, త్యాగమువలనను త్యాగమును గలుగుచున్నవి. స్వపరిపాలనమునకు పరితపించుచున్న హృదయమునందు నిర్బంధాస్త్రప్రయోగము హృదయవేదన నభివృద్ధి చేయును గాని ఉపశమింపజేయదు. రాజద్రోహాభియోగములు యువజన హృదయమునందు స్వాతంత్ర్య జ్వాలలను ప్రజ్వలింపజేయుచున్నవి. ప్రజ్వలితమైన స్వాతంత్ర్యజ్వాలల ఫలమును నిర్ణయించుట దుస్తరము. స్వాతంత్ర్యసమరమును శాంతియుతముగ జేయుటకు గాంధిమహాత్ముడు కంకణమును గట్టుకొనియున్నాడు. లాహోరు కాంగ్రెసు వ్యవహారములు, దేశావృతమైన యశాంతి శాంతిమార్గసాధనములందు ప్రజావిశ్వాసము సన్నగిలుచున్న విధమును విశదము జేయుచున్నవి. శ్రీయుత బులుసు సాంబమూర్తి, సుబాసుబాబు, కిరణశంకరరాయి గారులు మొదలగు దేశభక్తుల నిర్బంధములు ప్రజాహృదయమునందు రోషావేశములను గలుగజేయుచున్నవి. నిరంకుశాధికారవర్గము శాంతిసంరక్షణమునకు శాంతిసాధనముల నుపయోగించుట ప్రయోజనకరము గాని నిర్బంధ సాధనములను ప్రయోగించుట ప్రయోజనకరము గాదు. ప్రపంచచరిత్రము సహస్రముఖములను బోధించుచున్న గుణపాఠమును బ్రిటీషు నిరంకుశాధికారవర్గము మననము చేయుట సకలజనుల శ్రేయస్సునకును సాధనము గాగలదు. లాహోరు కాంగ్రెసు నిర్ణయించిన స్వాతంత్ర్యప్రస్తావము స్వార్థపరులకును, సంశయాత్ములకును, జోహుకుమువాలాలకును కోపావేశమును, భయభ్రాంతులను గలుగజేసినను, యథార్థముగను శాంతిస్థాపనమునకు సాధనంబని ధర్మస్వాతంత్ర్యప్రియులు గ్రహింపగలరు. శాంతియుతమైన స్వాతంత్ర్యసంరంభమునకు శాసనసభల బహిష్కారము, శాసనోల్లంఘనము, పన్నులనిరాకరణము మొదలగు సాధనములు నిరూపింపబడినవి. ఆ సాధనములను సఫలముచేయవలసిన బాధ్యత స్వాతంత్ర్య ప్రియులమీదను, ముఖ్యముగాను కాంగ్రెసు ప్రియులమీదను గలదు.

*   *   *   *

శాసనసభా బహిష్కారము

సహాయనిరాకరణ యోగప్రయోగమునకు శాసనసభలు సులభమైన రంగములుగ నున్నవి. భారతజాతికి పారతంత్ర్యపాశములు శాసనసభలయందు సృష్టింపబడుచున్నవి. పారతంత్ర్యపాశములను సృష్టించుటయందు భారతీయులు ప్రమేయమును కల్పించుకొనునపుడు భారతీయులకు ధర్మబలము గలుగుచున్నది. సహాయనిరాకరణయోగమున కంగములైన బిరుదములను, న్యాయస్థానములను, పాఠశాలలను, ఉద్యోగములను నిరాకరించుట యుచితమైనను శాసనసభాబహిష్కారమువలెను సుకరమును, సాధ్యమును గాదు. వందలమంది మాత్రమే శాసనసభలను బహిష్కరింపవలసియుందురు. ముఖ్యముగాను కాంగ్రెసుపేరు చెప్పుకొని శాసనసభలయందు కాంగ్రెసు ప్రతిజ్ఞలను గాపాడుటకు ప్రవేశించిన సభ్యులు వెంటనే శాసనసభలను బహిష్కరించుట పరమధర్మమై యున్నది. లాహోరు కాంగ్రెసు చేసిన తీర్మానమును పాలించుచు వారిసభ్యత్వమును చాలించుకొనిన కాంగ్రెసుసభ్యులు ప్రశంసనీయులు. సభ్యత్వమును వదలుకొనని వారును, వదలుకొనియును తిరిగి వెంటనే అభ్యర్థులుగ నుండగోరెడివారును ఆత్మగౌరవమును గోల్పోవుచున్నారు. శ్రీయుత ప్రకాశము పంతులుగారు, మొదలగు నాంధ్ర నాయకులు శాసనసభలను సంపూర్ణముగను బహిష్కరించి కాంగ్రెసు ప్రతిష్ఠను గాపాడుదురుగాత!

* * * *

శాసనోల్లంఘన ప్రస్థానము

గాంధీమహాత్ముడు శాసనోల్లంఘనప్రస్థానమును నిర్ణయించుటకు యోచించుచున్న విషయమును వారివ్యాసములు, ప్రసంగములు విశదము చేయుచున్నవి. స్వాతంత్ర్యప్రకటన విషయము భావమునందువలెను కార్యమునందు ప్రజాసామాన్యము నాకర్షించుట దుర్లభము. బర్డోలి సత్యాగ్రహము ప్రత్యేకముగను బర్డోలిప్రజల నాకర్షించినవిధమున నితరప్రాంతవాసుల నాకర్షింపజాలదు. శాసనోల్లంఘనప్రస్థానము సమష్టిపరమైనను వ్యష్టిపరమైనను, శాంతివాతావరణము, శిక్షణము, కాంగ్రెసుసభ్యత్వము మూలసాధనములుగ నున్నవి. దేశమునందంతట నవీనసిద్ధాంతము నంగీకరించిన కాంగ్రెసుసభ్యులను చేర్చుటయును, కాంగ్రెసుసంఘములను స్థాపించుటయును నవసరము. సుశిక్షితులైన శాంతిసేవకులను సమకూర్పవలసియున్నది. స్వాతంత్ర్యప్రియులందరును సీఘ్రయత్నములందు నిమగ్నులై కాంగ్రెసు నిర్ణయములను సఫలము చేయుదురుగాక! కార్యనిర్వాహకసంఘము నిర్ణయించిన స్వాతంత్ర్యప్రకటనము దేశీయుల స్వాతంత్ర్యదృఢసంకల్పమును విశదముచేయుచున్నది.

* * * *

సంపూర్ణ స్వాతంత్ర్య ప్రకటన

"ప్రపంచములోని తక్కిన అన్నిజాతులవలెనే, భారతీయులుకూడ స్వాతంత్ర్యమును బొంది తమ కష్టార్జితమును తా మనుభవించుచు, జీవయాత్ర కావశ్యకములగు అన్నవస్త్రాదులను బడసి, జాతీయాభ్యుదయమునకు వల

యు పరిపూర్ణావకాశములను కలిగియుండవలయుననియు, ఈ విషయములలో వారి హక్కు అప్రతిహత మనియు మా విశ్వాసము. ఏ ప్రభుత్వమైనను, ప్రజలకుండే ఈహక్కులను హరించి వారిని పీడించేయెడల ఆప్రభుత్వమును మార్పుచేయుటకు గాని, మాపుచేయుటకు గాని ఆ ప్రజలకు గూడ హక్కు ఉన్నదని మా నమ్మకము. భారతదేశములోని బ్రిటిష్‌ప్రభుత్వము భారతజాతియొక్క స్వాతంత్ర్యమును హరించుటయే కాక, భారతీయప్రజాసామాన్యమును తనస్వప్రయోజనమునకు వినియోగించుట వల్లనే నశిల్లును, భారతదేశపుభాగ్యభోగ్యములను, రాజకీయస్వాతంత్ర్యమును, విజ్ఞానసంపత్తిని, స్వధర్మమును నశింపచేసినది. (కావున) భారతదేశము బ్రిటిష్‌వారి సంబంధమును విడగొట్టుకొని 'పూర్ణస్వరాజ్యము'ను అనగా 'సంపూర్ణస్వాతంత్ర్యము'ను సంపాదింపవలె నని మా ఆశయము.

భారతదేశపుభాగ్యము నాశనముచేయబడినది. ప్రజలు 'గ్ద వసూలుచేయుచున్న పన్నులు వారి ఆదాయముతో నెట్టిసంబంధమును లేకుండా మితిమీరియున్నవి. మనదేశములో సగటున మనిషికి దినమునకు అణాముక్కానిమాత్రమే నిత్యాదాయము. మనము చెల్లించే దుర్భరమైన పన్నుల భారములో నూటికి ౨౦ వంతులు రైతు లిచ్చుకొనే భూమిశిస్తు, నూటికి ౩ వంతులు బీదలను పీడించేఉప్పుపన్ను. రాటముతో నూలు వడుకుట మొదలగు గ్రామపరిశ్రమలన్నియు ధ్వంసముచేయబడినవి. అందుచే రైతులు కనీసము ఏడాదిలో నాలుగునెలలు నిర్వ్యాపారులై చేతిపను లేమియు లేక బుద్ధిమాంద్యముతో వృథాకాలక్షేపము చేయుచున్నారు. నాశనము చేయబడిన చేతిపరిశ్రమలకు ప్రత్యామ్నాయముగ నితరదేశములలోవలె నిట నేరెద్దియు నెలకొల్పబడియుండలేదు. నాణెముల చలామణి, సరకులరవాణాపై పన్నులు, వీని విషయములలో చూపు హస్తలాఘవమువలన రైతుల నెత్తిపై నింకను భారము పడినది. మన దిగుమతిసరుకులు విస్తారముగ బ్రిటిష్‌వారు తయారుచేయు వస్తుసామగ్రియే. రవాణాపన్నులు చూచినచో, బ్రిటిష్‌వారు తయారుచేయు సరకులపట్ల చూపు పక్షపాతము విశదమగును. ఇట్టి ఆదాయమును ప్రజలపన్నుల భారమును తగ్గించుటకు గాక, అమితవ్యయముతో గూడిన ఈ ప్రభుత్వమును నిలువబెట్టుకొనుటకే ఉపయోగించుకొనుచున్నారు. నాణెముల చలామణి నిర్ణయముతో గూడ వారిచిత్తము వచ్చినట్లు వ్యవహరించుటచే కోట్లకొలది ధనప్రవాహము దేశాంతరములకు తరలిపోవుచున్నది.

రాజకీయముగ జూచిన భారతదేశస్థితి బ్రిటిష్‌వారి హయాములో దిగనంత అధోగతి కెన్నడును వచ్చియుండలేదు. ఏరాజకీయసంస్కరణములవల్లను ప్రజలకు నిజమైన అధికారము లభింపలేదు. మనలో మహామహులు సహితము విదేశీయాధికారమునెదుట తలలొగ్గవలసియున్నది. స్వేచ్ఛగా మన అభిప్రాయముల ప్రకటించుటకును, సమావేశమగుటకును మన కుండదగుహక్కులు నిరాకరింపబడినవి. మనదేశీయులు చాలమంది విదేశములలో ప్రవాస మనుభవించుచున్నారు. వారు మాతృదేశమును తిరిగి సందర్శించుటకు ప్రాప్తము లేకుండనున్నది. మనదేశీయుల పరిపాలనాదక్షత రూపుమాపబడినది. ప్రజలు గ్రామనౌకరీలతోను, గుమాస్తాగిరీలతోను తృప్తిపడి యుండవలసివచ్చినది.

ఇక విజ్ఞానసంపత్తి చూతమన్న, ఇప్పటి విద్యావిధానము మన పూర్వసంప్రదాయ తంతువులను ఛేదించివైచినది. మనము పొందిన శిక్షణమువలన మనల నిర్బంధించు సంకెళ్లే మనకు మరిపెము లైపోయినవి.

స్వధర్మరీత్యా యోచించిన, నిర్బంధముగ మనల నిరాయుధులను చేయుటచేత మనకు మగసిరి అంతరించినది. మనదేశము నాక్రమించుకొన్న విదేశీయ సైన్యము మన నిరోధకశక్తి నతిదారుణముగ నణచివేయుటకు వినియమింపబడి, మనలను మనము జాగ్రత్తపరచుకొనజాలమనియు, ఈవిదేశీయులదాడి నరికట్టజాలమనియు, దొంగాతోడుబోతులవల్ల అపాయము లేకుండా మన ఇల్లువాకిళ్లను, భార్యాబిడ్డలను సంరక్షించుకోజాలమనియు తలంపజేయుచున్నది.

మనదేశము నిట్లు, చతుర్విధముల విపత్తుపాల్చేసిన ఈపరిపాలనకు ఇంకేమాత్రమును లొంగియుండుట దైవద్రోహమనియు, మానవద్రోహమనియు మా యభిప్రాయ

ము. ఐనను, మనస్వాతంత్ర్యమును స్థాపించుటకు, ప్రబల తమసామహాలమార్గము కత్తిగట్టుట కాదని గుర్తించుచున్నాము. కావున, బ్రిటిష్ ప్రభుత్వముతో మాకుగల ఐచ్ఛికసంబంధముకంతను సాధ్యమైనంతవరకువదలుకొని, పన్నులనిరాకరణముసహా, శాసనోల్లంఘనమునకు సన్నాహముగావించెదము. మేము స్వేచ్ఛాపూర్వకముగ గావించుసహాకారము మానివేసి, ఎంత రెచ్చగొట్టినను దౌర్జన్యమునకు దిగకుండ పన్నులను నిరాకరింపగల్గుచో ఈ యమానుషపాలన మంతరించుట రూఢియని మాకు నచ్చినది. కాన, 'పూర్ణస్వరాజ్యము'ను స్థాపించుటకుగాను ఎప్పటికప్పుడు కాంగ్రెసువారిచ్చు ఆదేశముల నెరవేర్చెదమని ఇందుమూలమున ప్రమాణపూర్వకముగ నిశ్చయించుకొనుచున్నాము. వందేమాతరమ్."

జనవరి 26-వ తేదిని దేశమునందంతటను స్వాతంత్ర్యప్రకటనమును చేయుటయందా బాలగోపాలము చూపిన సాహసధైర్యములు, ప్రశాంతస్వభావము, పరమోత్సాహము ప్రజాహృదయమునందు సుప్రతిష్ఠితమగుచున్న స్వాతంత్ర్యేచ్ఛను విశదము చేయుచున్నది. అధికారుల ప్రవర్తనము ప్రశంసనీయము. బ్రిటీషుప్రభుత్వము కాలప్రభావమును గ్రహించి స్వధర్మనిర్వహణమును జేయుటకు భగవదనుగ్రహమును బడయుగాత!

Printed and Published by K Nageswara Rao, at the Andhra Patrika Press, No.7, ThambuChetty St., Madras.